
# నీలీ-ఆకుపచ్చ

డా॥ చిత్తర్వుమధు



# నీలీ - ఆకుపచ్చ

**(భూమికి పునరాగమనం)**

ఆంగ్ల మూలం, తెలుగు సేత:

**డా. చిత్తర్వు మధు**

అనువాద సహకారం:

**కొల్లూరి సోమ శంకర్**

**జె.వి. పబ్లికేషన్స్**

హైదరాబాద్

**Neli Akupaccha**

By
Dr. Chittaruvu Madhu

First Published: August, 2015

© Author

Dr. Chittaruvu Madhu
98480 44126

Cover Design: ....

DTP & Type Setting
**K. Ravi Prabha**
Cell: 96666 08835

Copies: 500

Rs. 140 /-

*Published by:*
**J.V. Publishers**
Hyderabad.
Cell: 80963 10140

*Printed at:*

*for Copies:*
All Major Book Shops

# నా మాట

**తె**లుగులో సైన్స్ ఫిక్షన్ రాయాలని నాకు చాలా ఆసక్తి. మెడికల్ థ్రిల్లర్‌లు నవలాత్రయంగా 'ఐసిసియు', 'బై బై పొలోనియా', 'ఎపిడెమిక్' నవలలు 'ఆంధ్రప్రభ' వారపత్రికలోను, 'నవ్య' వారపత్రికలోను సీరియల్‌గా వచ్చి పాఠకుల ఆదరం పొందాయి. ఆనాటి ఆంధ్రప్రభ సంపాదకులు వాకాటి పాండురంగా రావుగారు,ఆ తరవాత నవ్య సంపాదకులు జగన్నాథశర్మగారు వీటిని ప్రచురించి నన్ను ప్రోత్సహించారు. వారికి నేను ఎప్పటికీ కృతజ్ఞుడనై ఉంటాను. ఇంకా అంతరిక్ష సాహిత్యం రాయాలని నాకు ఆసక్తి ఉండేది. ఇంగ్లీష్‌లో నేను రాసిన 'వార్ ఫర్ మార్స్', 'బ్లూ అండ్ గ్రీన్' అనే నవలలని సంపర్క్ కలకత్తా వారు పుస్తక రూపంలో ప్రచురించడం జరిగింది. ఆ తరవాత 'వార్ ఫర్ మార్స్' నవలని నేనే తెలుగులోకి అనువదించితే 'రచన' సంపాదకులు శాయిగారు 'రచన' మాసపత్రికలో సీరియల్‌గా ప్రచురించి ప్రోత్సహించారు. భవిష్యత్‌లో సాగే 'స్పేస్ ఓపెరా' భారతీయ నేపథ్యంతో రాయాలనే నా తపనతో దీని కొనసాగింపు 'బ్లూ అండ్ గ్రీన్' నవలని మంచి రచయిత అనువాదకుడు కొల్లూరి సోమశంకర్ సహాయంతో మళ్ళీ త్వరగా అనువదించగలిగాను. అతనికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సంవత్సరం మొదటి ఆరు నెలలు 'కినిగే' అంతర్జాల పత్రికలో సీరియల్‌గా ప్రచురించిన సంపాదకులు మెహెర్ చావా కిరణ్ గారికి ధన్యవాదాలు.

తెలుగులో సైన్స్ ఫిక్షన్ తక్కువ. సైన్స్ ఫిక్షన్ చదవరని ప్రచురణకి ఒప్పుకోని సంపాదకులు పబ్లిషర్స్ ఎక్కువ. అలాంటి సమయంలో ఈ నవలని పుస్తక రూపంలో తీసుకువస్తున్న జ్యోతివలబోజుగారికి నా ధన్యవాదాలు.

ఈ పరిస్థితి మారాలని కోరుకొనే వాళ్ళలో నేను మొదటివాడిని. కొంత విజ్ఞానం కొంత వినోదం ఇస్తూ సైన్స్ ఆధారంగా కొత్త సాహిత్యం సృష్టించాలని నాకు ఎప్పుడూ ఆసక్తి. మూఢనమ్మకాలు ప్రోత్స హించకుండానే సైన్స్

నేపథ్యంలో ఆసక్తి కలిగించే సాహిత్యం, జనరంజకం అయిన సాహిత్యం సృష్టించవచ్చు అని నేను నమ్ముతాను. ఈ నవలలు ఆంగ్ల సాహిత్యంలోని 'స్పేస్ ఓపెరా' సీక్వెల్ నవలల స్ఫూర్తితో రాసినవే కాని దేనికి అనుకరణ కాదు. భవిష్యతులో విశ్వశక్తి అనే కొత్త శక్తితో మాయలు, మంత్రాలు చేయచ్చు అనేది ఒక ఊహ. కాల ప్రయాణం అంతర్‌గ్రహ ప్రయాణాలు, గ్రహాంతర కాలనీలు ఒక ఊహ. ఎంత పురోగతి సాధించినా మంచికీ, చెడుకీ మధ్య జరిగే ఘర్షణనీ ఉన్నత మానవత్వ విలువలనీ చిత్రించడం నా లక్ష్యం. మీరు చదివి ఆనందిస్తారని ఆశిస్తున్నాను.

**- డాక్టర్ చిత్తర్వు మధు**

# పరిచయం

**భ**విష్యత్తులో సాగే కథనం... నాల్గో సహస్రాబ్ది... "కుజుడి కోసం" నవలకిది కొనసాగింపు (సీక్వెల్)!

అంగారక యాత్ర ముగించుకుని హనీ ఆమ్రపాలి భూమికి తిరిగొచ్చాడు. అసలు కుజగ్రహానికి ఎందుకు వెళ్ళాడో తెలుసా? ఒక కలని నిజం చేసుకోవాలని. ఎన్నో సంవత్సరాల నుంచి స్వప్నాలలో ప్రత్యక్షమై అతన్ని ఆకర్షించి, శాసించి కుజగ్రహానికి రప్పించుకుంది అందాలరాశి అయిన 'సయోనీ'. ఆమెపై మోజుతో అక్కడికి వెళ్ళిన హనీ భ్రమలు తొలగిపోతాయి, అరుణ భూముల చక్రవర్తి సమూరా చేతిలో బందీ అవుతాడు. కుజుడి మీద ఉన్న ఒలింపస్ శిఖరం మీద దాచబడి ఉన్న అమరత్వం ప్రసాదించే ఔషధాన్ని తెచ్చి తనకివ్వాలని ఒత్తిడి చేస్తాడు సమూరా. ఎలాగోలా దాన్ని తెచ్చిస్తాడు హనీ. ఆ తరువాత మానవ కాలనీకి, మాంత్రిక రాజ్యం అరుణ భూములకి మధ్య ఎప్పట్నించో ఉన్న వైరం అకస్మాత్తుగా యుద్ధ రూపంలోకి మారడంతో, హనీ ఆ యుద్ధంలో పాలుపంచుకుంటాడు. కుజగ్రహపు మాంత్రికుల వద్ద శిక్షణ పొంది విశ్వశక్తిని కరతలామలకం చేసుకుంటాడు హనీ. ఈ క్రమంలో తనలో జన్యుసంబంధమైన ప్రత్యేక శక్తి వుందని, అది తనకి పుట్టుకతోనే లభించిందని తెలుసుకుంటాడు. అమృత ఔషధం తాగితే శక్తులు నశిస్తాయన్న నిజాన్ని దాచిపెట్టి, సమూరా ఆ ఔషధాన్ని సేవించేలా చేస్తాడు హనీ. దాంతో విశ్వాన్ని జయించాలన్న తన ఆశయం నెరవేరకపోయేసరికి హనీ మీద పగ పడతాడు సమూరా. కుజుడి మీద మానవులకి, అరుణ భూముల పాలకులకి మధ్య సంధి కుదిర్చి, అరుణ భూములకు తన స్నేహితుడు మీరోస్‌ని ప్రభువుగా చేస్తాడు హనీ. కుజగ్రహంమీద మానవులు హనీని సత్కరిస్తారు.. కాని చివరికి వాళ్ళు కూడా హనీని అనుమానించి వెంటాడుతారు. గురుడి ఉపగ్రహం

గ్యానిమెడ్ నుంచి వచ్చిన ఏనిమాయిడ్‌ని మానవ సైనికాధికారి జనరల్ గ్యానీ అశ్వశాలనుంచి రక్షించే క్రమంలో మానవులకీ శత్రువవుతాడు. ఎలాగోలా తప్పించుకుని భూమికి చేరుతాడు.

తిరిగొచ్చాకా, ఇండికా సెంట్రల్ యూనివర్సిటీలో బయోమెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా తన ఉద్యోగంలో కొనసాగుతూంటాడు. అయినా గ్రహాంతర దుష్ట మాంత్రికులు అతనిని వెంటాడడం ఆపరు. అతని గదిలో దొంగతనం జరుగుతుంది, అతని జీవితమే ప్రమాదంలో పడుతుంది. గ్రహాంతర దుష్ట మాంత్రికులే కాకుండా, ఎర్త్ కౌన్సిల్ కూడా హనీ ఆమ్రపాలికి అడ్డు తగులుతూనే ఉంటుంది.. భూమి మీద విశ్వశక్తిని ప్రయోగించడం నిషేధించిన కారణంగా ఎర్త్ కౌన్సిల్ హనీని ఓ కంట కనిపెడుతూ ఉంటుంది.

“కుజుడి కోసం” నవలకిది అద్భుతమైన కొనసాగింపు. కథాస్థలం ఈసారి భూగ్రహం! హానీని వెంటాడి వేధించి పాపిష్టి పనులకు వాడుకోవాలని చూస్తారు కుజగ్రహపు దుష్ట మాంత్రికులు. అయితే ఇప్పుడు కూడా హనీదే గెలుపు..

చదవండి... మరో లోకాలకి తీసుకెళ్ళే ఈ సైన్స్ ఫిక్షన్‌ని!

❋ ❋ ❋

# 1. పీడకల

**నే**ను అరిచిన అరుపు నాకే వినపడుతోంది... ప్రాణభయంతోనూ, వినాశనం తప్పదనే భీతితోనూ బొంగురు గొంతుతో చేసిన ఆర్తనాదం అది. పరిగెత్తి పారిపోవాలని ప్రయత్నించాను, కాని కదల్లేకపోయాను. ఎలాగోలా పరిగెత్తాను.. కానీ ఉన్నచోటనే ఉన్నాను. మంత్రోచ్చారణతో వాటిని నిలువరించాలనుకున్నాను.... కానీ నోరు పెగలడం లేదు. అవి భయంకరమైన జీవులు. ఒళ్ళంతా నల్లటి జూలు... నాలుగు కాళ్ళతో పరిగెడుతున్నాయి. వాటి కాలి వేళ్ళకి పదునైన పంజాలు, కోరపళ్ళు ఉన్న నోటి వెంట చొంగ.. ఎర్రటి కళ్ళలో పగ! ఈ జంతువులు భూలోకానివి కావు... వాటిని చూడగానే అర్థమైంది అవి నా అంతు చూడడానికే పంపబడ్డాయని.

ఆ పరిసరాలన్నీ నాకు మునుపే తెలిసున్నట్లు అనిపిస్తోంది.. పెద్ద పెద్ద బండరాళ్ళు, ఎర్రటి దుమ్మూ ధూళితో నిండిన లోతైన లోయలూ ఉన్న ఎర్రటి నేలలు...  వివర్ణమైన, అంధకారమైన ఆకాశం.. చెట్లు చేమలు లేని నేల.. దూరంగా ఉన్న ఎర్రని కొండల పైభాగంలో అక్కడక్కడా ఆకుపచ్చని పాచి మాత్రం కనబడుతోంది. నేను పరిగెడుతున్నాను... పరిగెడుతూనే ఉన్నాను... రొప్పుతున్నాను, మూలుగు మాత్రం నోట్లోంచి బయటకి రావడం లేదు. ఆ జంతువులు నా మీద పడి నన్ను చీల్చుకు తిన్నాయి.. లేదా అవి నన్ను చీల్చేసాయని నాకు అనిపించిందో... వెంటనే నేను ఓ శక్తివంతమైన మంత్రాన్ని.. ఓ పరాయి భాషలో... పలికాను.

“నిశ్చలో భవ!... మరణం ప్రాప్తిరస్తు...” అనే అర్థంలో!

అది వాటి పాలిట మృత్యుశాపం. పలికానని నేననుకున్న పదాలు గల గలమనే సవ్వడితో నా గొంతులోనే ఉండిపోయాయి. ఉన్నట్లుండి -  నల్లటి పొడవాటి దుస్తులు ధరించిన, ముడతలు పడిన ఎర్రని ముఖం కలిగిన ఓ

ముసలి మాంత్రికుడు ప్రత్యక్షమయ్యాడు.

చిన్నచిన్న కళ్ళతో, తెల్లటి పిలకతో, ప్రాచ్య ప్రాంతీయుల ముఖకవళికలతో ఉన్న ఆ మాంత్రికుడు వికటంగా నవ్వాడు.

"చావు. హనీ... చావు. ఈసారి నువ్వు తప్పించుకోలేవు..." అంటూ పై భాగంలో క్రమిదం పూత పూసిన ముదురు ఎరుపు రంగు మంత్రదండాన్ని నాకేసి ఊపాడు.

అంతే.. నా మీదకి నిప్పురవ్వలు దూసుకొచ్చాయి. మరణం ఆసన్నమైందని అర్థమైంది. గట్టిగా ఏడవసాగాను. ఛాతిలో భరించలేని నొప్పి, గుండె అత్యంత వేగంగా కొట్టుకుంటోంది.

బాధ తట్టుకోలేక, "ఓ విశ్వశక్తీ! నన్ను కాపాడు.." అంటూ బిగ్గరగా అరిచాను.

"మాస్టర్! మాస్టర్..! లే.. మేలుకో!" అంటూ మెల్లగా నన్ను నిద్ర లేపు తున్నారు.

రోబో యురేకస్ 7776 యాంత్రిక స్వరమది. ప్రశాంతమైన ఆ పిలుపు నా చెవులకు చేరగానే నాకు భరోసా కలిగింది. ధైర్యమొచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే... అదంతా ఓ కల అని అర్థమైంది. నేను భూమి మీదే, మా యూనివర్సిటీ లోని ఫాకల్టీల హాస్టల్‌లో నా గదిలో నా మంచం మీదే ఉన్నాను. కాని నిద్ర లేచే సరికి నాకు విపరీతమైన తలనొప్పి, గుండెదడ.

"మీకు క్లాసుకు ఆలస్యమవుతోంది. మాస్టర్! లేవండి. లేచి త్వరగా సిద్ధం కండి. ఇంకో పీడకల ఏదైనా వచ్చిందా? కలల్ని కనిపెట్టే సెన్సార్‌లేవీ నాకు లేవుగా. నిద్ర లేవండి. అప్పుడే ఎనిమిది గంటలవుతోంది. వేడివేడిగా ఓ కప్పు కాఫీ తాగండి. అదంతా ఓ కల! అచేతనావస్థలోని మీ భయాలు, గతానుభవాలు కలగలిసి ఓ అధివాస్తవ పద్ధతిలో కలగా కనిపించాయి. అంతే..."

రోబో యాంటినా మీద ఓ వెండి ట్రేలో వేడి వేడి పొగలు కక్కుతున్న కాఫీ కప్పు ఉంది. "శుభోదయం మాస్టర్! భూమి మీద మీ బోధనావృత్తిని తిరిగి ప్రారంభించబోతున్న సందర్భంగా మీకు అభినందనలు. ఎంతైనా మీరు జీవవైద్య శాస్త్రంలో ప్రొఫెసర్ కదా. కుజగ్రహపు పీడకలలు ముగిసాయి. నన్ను నమ్మండి..." అంది యురేకస్.

❄ ❄ ❄

# 2. మాములు జీవితంలోకి...

"నిన్ను నమ్ముతాను, యురేకస్.." అంటూ నెమ్మదిగా గొణిగాను.

కుజగ్రహం నుంచి తిరిగొచ్చి నెలవుతోంది. అక్కడ సంభవించిన వింతైన, అనూహ్యమైన సంఘటనలని ఇంకా మరిచిపోలేకపోతున్నాను. నాకున్న రహస్య శక్తులు నాకు తెలిసాయి, ఇవేవీ నమ్మశక్యం కావనుకుంటే, నా ఎదురుగానే ఉన్న ఈ రోబో యురేకస్ నిజమే కదా. సర్వశక్తిమంతమూ, విజ్ఞానదాయనియైన ఈ మరమనిషి కల్పన కాదు కదా. కుజగ్రహంలోని అరుణ భూముల చక్రవర్తి మీరోస్ తన జ్ఞాపకంగా నాకు ఇచ్చిన కానుక ఈ రోబో. దీనికి అన్నీ తెలుసు!

మా అధిపతి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అయిన మిస్టర్ 'శాన్ లీ'కి ఈ రోబో భలేగా నచ్చేసింది. "కుజుడి నుంచి ఓ అద్భుతమైన యంత్రాన్ని తెచ్చావోయ్" అంటూ మెచ్చుకున్నాడు. "అక్కడికి వెళ్ళినప్పుడు నేను కూడా ఇలాంటి పరికరాన్నొకదాన్ని కొనుక్కుని తెచ్చుకుంటాను. బాగా పనికొస్తుంది.." అన్నాడు.

కుజగ్రహంమీద ఏదో ఒక ఎలక్ట్రానిక్ షాప్‌లోంచి దాన్ని కొని తెచ్చాననే అనుకుంటున్నాడింకా. నిజానికి నేను భూమి మీద ఫ్లోరిడాలో దిగీ దిగగానే భూమిని పాలించే "ఎర్త్ కౌన్సిల్" రక్షణ అధికారులు నన్ను కూలంకుషంగా ప్రశ్నించి, అన్ని వివరాలు తెలుసుకున్నారు. నా స్టేట్‌మెంట్ నమోదు చేసారు.

"మిస్టర్ హనీ! నువ్వు విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివి అనేది సుస్పష్టం. ఆ విషయమూ నీకూ బాగా తెలుసు. సురక్షాపరమైన కారణాల వల్ల - మాంత్రికుడు/మంత్రగత్తె, బాణామతి/చేతబడి లాంటి పదాలను భూమి మీద నిషేధించాం. కుజగ్రహం మీద నీకు ఎదురైన సంఘటనలు, అనుభవాల గురించి భూమి మీద నువ్వు ఎవరికీ చెప్పకూడదు. విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివి (Person with Capacity to Use Force -PCUF) నువ్వు. విశ్వశక్తిని చెడు ప్రయోజనాల కోసం ఉపయోగించే దుష్టుల గురించే మా ఆందోళన. మన

నాగరికతని నాశనం చేస్తారేమోనని భయపడుతూంటాం. మాంత్రికుల పర్యవేక్షణా కేంద్రం (Wizard Monitoring Cell) ఇప్పటికే నీ వివరాలను నమోదు చేసింది. వాళ్ళు నిన్ను గమనిస్తూ, నీతో సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉంటారు. యూనివర్సిటీలో నీ సహసిబ్బందికి ఎవరికీ నీ శక్తుల గురించి చెప్పకూడదు. నీకేదైనా సమస్యలు ఎదురైతే, ఎర్త్ కౌన్సిల్‌కి మాత్రమే నివేదించాలి, వాళ్ళే నీకు సహాయం చేస్తారు. అవసరమైతే, మాంత్రికుల పర్యవేక్షణా కేంద్రం కూడా నీకు సాయపడుతుంది. అటువంటి క్లిష్ట సమయాల్లో నువ్వు వాళ్ళని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. నీ మంత్రవిద్యలని ఇక్కడ సాధన చేయద్దు. ఒకవేళ అలా చేస్తే దుష్ట మాంత్రికులకు నీ ఉనికి తెలిసిపోతుంది. వాళ్ళు క్రమక్రమంగా భూమిని ఆక్రమించుకోవాలనుకుంటున్నారు. కయ్యానికి కాలుదువ్వుతున్న ఈ దుష్టులతో ఇప్పటికే ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. వాళ్ళని ఎలాగైనా నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నాం. సురక్షాపరమైన కారణాల వల్ల ఈ వివరాలన్నీ రహస్యంగా ఉంచబడ్డాయి. ఎవరైనా పత్రికలలో ఇటువంటి విషయాలు రాస్తే మనం నవ్వుకుని, వాటిని తోసిపుచ్చుతాం. అయితే ఇవన్నీ సమీప కాలంలో జరగబోయే ఘటనలే. త్వరలోనే బహిరంగమవుతాయి, అప్పుడు వీటిని గుర్తించక తప్పదు... కాబట్టి దయచేసి మాతో సహకరించు. నీ క్షేమం కూడా అందులోనే ఇమిడి ఉంది. మా సూచనలు, సలహాలు పాటించకపోతే.. నిన్ను అడ్డు తొలగించుకుంటాం లేదా నీకు జైలుశిక్ష విధించబడుతుంది. సరేనా?''

''కానీ, సర్, నేను నా తల్లిదండ్రుల గురించి తెలుసుకోవాలి. నన్ను నేను కాపాడుకోవాలి. స్పేస్ ప్లాట్‌ఫారం లా టెర్ వద్ద నా మీద దాడి జరిగిందని మీకు తెలుసు. ఆ దుష్టమాంత్రికుడు సమూరా అనుచరులు నన్ను అసహ్యించు కుంటున్నారు, వాళ్ళ శాపాలకు వ్యతిరేకంగా మంత్రవిద్యతో నన్ను నేను రక్షించుకోకపోతే, నన్ను చంపేస్తారు...''

''దాని గురించి మేం చూసుకుంటాం. మంత్రగాళ్ళందరిని, ముఖ్యంగా సమూరాని, అతని అనుచరుల్ని పట్టుకుని బంధించడానికి రహస్యంగా వెదుకు తున్నాం. విశ్వశక్తిని ఉపయోగించడంలో శిక్షణ పొందిన ఏజంట్లతో కూడిన ఓ రహస్య బృందం ఉంది, అదీ కాక, సుశిక్షితులైన సాయుధులైన సైనిక పటాలం వారి కార్యకలాపాలని గమనిస్తూ ఉంటుంది. అవసరమైతే నీ సాయం కోరుతాం. అర్థమైందా? మా సలహా పాటించక, నువ్వేదైనా శిక్షకి గురయితే

మమ్మల్ని నిందించద్దు. ఇది ఇప్పటికీ స్వేచ్ఛ ఉన్న గ్రహమే. ఇది మా వినతి మాత్రమే, ఆజ్ఞ కాదు. ఎర్త్ కౌన్సిల్ అధ్యక్షుడు హిజ్ ఎక్సలెన్సీ చెన్ లీ స్వయంగా నీకీ విన్నపం చేసారు..''

ఇదీ జరిగినది. భూమి మీద అత్యంత శక్తిమంతుడైన వ్యక్తి సంతకం చేసిన ఉత్తరం నా లాకర్‌లో భద్రంగా ఉంది. అయితే ఇదేమీ నాకంత గొప్పగా అనిపించలేదు. ఎందుకంటే కుజుడి మీద ఇంతకంటే శక్తిమంతులైన విచిత్ర వ్యక్తులను, వారి సామర్థ్యాన్ని చూసాను. ఈ సౌరవ్యవస్థలో అటువంటి వ్యక్తులు, వారి అనుచరులు ఇంకెంతమంది ఉన్నారో ఆ పరమాత్మకే తెలుసు. అందుకే మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంటుకి గానీ, నా తోటి సైంటిస్టులకి కానీ నేనేమీ చెప్పలేదు. పాఠాలు చెప్పడం మళ్ళీ మొదలుపెట్టాను. నా పరిశోధనలను ప్రారంభించాను, కాని సంశయంతోనే. పుస్తకాలలో చదివేదానికన్నా విశ్వంలో ఇంకా ఎంతో ఎక్కువ ఉంది. అందుకే నేనేదో సెలవలు గడపడానికి కుజుడి మీదకు వెళ్ళానని, వచ్చేడప్పుడో బొమ్మని తెచ్చుకున్నానని నా అధికారి భావిస్తూంటాడు. నిజానికి ఆయన ఊహించగలిగేదానికన్నా చాలా ఎక్కువే ఉంది.

నా మటుకు నాకు చేయాల్సిన పనులెన్నో ఉన్నాయి. ధరణి మావయ్య ఇచ్చిన డివిడిలను చూడాలి, అవి లాకర్లో ఉన్నాయి. కాలజ్ఞానపు డివిడిలు..! ఆమ్రపాలి.... ఎన్నాళ్ళో నుంచో వెళ్ళాలనుకుంటూ వాయిదా వేస్తున్న ప్రయాణం. చాలా కాలం క్రితం దుష్టశక్తుల చేతిలో మరణించిన నా తల్లిదండ్రుల హత్యా రహస్యం... ఎర్త్ కౌన్సిల్ అధికారులు భయపడుతున్న ఆ ప్రమాదం ఏమిటో? దుష్టశక్తులు భూమి మీద దాడి చేయడానికి ఇప్పటికే భూమి మీదకి చేరి దాక్కొని ఉన్నారా? అయ్యుండచ్చు. సమూరా, సయోనీలను, కుజుడి మీద యుద్ధాలను, విశ్వశక్తిని ఉపయోగించగల గ్రహాంతరవాసులను (Interplanetary PUCFs) చూసిన తర్వాత ఇది సంభవమేనని తోస్తోంది. భూమి ఏ మాత్రం సురక్షితం కాదు. నమ్మాలి మరి.

''సరే యురేకస్. తయారై క్లాసుకి వెడతాను. నన్ను నిద్ర లేపినందుకు ధన్యవాదాలు. అయితే వచ్చే వారాంతంలో మనం ఆమ్రపాలికి వెళ్ళడానికి ప్రణాళికలు తయారుచెయ్. ఈ లోపు నేను ధరణి మావయ్య ఇచ్చిన డివిడిలు చూస్తాను, కాలజ్ఞానాన్ని పరిశీలిస్తాను. అందుకు సరైన సమయం వచ్చేసింది....'' అన్నాను.

❄ ❄ ❄

# 3. మిస్టర్ శాన్

**మి**స్టర్ శాన్ మంచి వ్యక్తి. అతను నా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్. వయసు బహుశా 100 నుంచి 125 సంవత్సరాలు ఉంటుందేమో. ఎర్రగా, పొట్టిగా ఉంటాడు, చిన్న కళ్ళు. మాట్లాడుతున్నప్పుడు అవి మనలోకి చొచ్చుకు వస్తాయి... ఖచ్చితంగా అతని పూర్వీకులు చైనాకి చెందినవాళ్ళే అయ్యుంటారు, ఇప్పుడంటే దేశాలేవీ లేవు, భూమి అంతా ఒకే ఒక మహా ఆవాసం. విజ్ఞానం, ప్రతిభ మాత్రమే ముఖ్యం, మిగతావన్నీ అప్రధానమైనవే. అతనెంతో విజ్ఞానం కలవాడు, ఉన్నత విలువలున్న వాడు.

“మిస్టర్ హనీ, మీరు మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు తీసుకోవాలి, రెండో సంవత్సరం పిల్లలకి ప్రాజెక్టు వర్క్‌లో గైడ్ చేయాలి...” చెప్పాడు.

“కుజుడి యాత్ర ముగిసింది... ఇక విద్యా బోధనా బాధ్యతలు ముఖ్యం...” అన్నాడు.

“సరే సర్. నేను హ్యూమన్ ఇంటిగ్రేటెడ్ బయో-మెకానికల్ సిస్టమ్స్ మీద క్లాసులు తీసుకుంటున్నాను. మానవుల శరీరాలలో మైక్రో చిప్‌లు ఉంచి, వారి జ్ఞానేంద్రియాల సామర్థ్యాన్ని అంటే వినికిడి, దృష్టి, ఆఘ్రాణ శక్తుల పనితీరుని మెరుగుపరిచే ప్రక్రియలో చివరి దశలో ఉన్నాం. గుండె రక్తనాళాలు, నాడీవ్యవస్థ యంత్రపరికరాలతో ఈ సంధానానికి అనువుగా ఉన్నాయి. ఈ అంశాలపైనే మాట్లాడబోతున్నాను, సీనియర్ విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్ ఇవ్వబోతున్నాను..” చెప్పాను.

“సరే” అన్నాడు శాన్. మళ్ళీ తనే మాట్లాడుతూ.. “నువ్విప్పుడు, శరీరంలో ఏ పరికరం లేని, విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివని నా నమ్మకం...” అన్నాడు.

నేనొక్కసారిగా విస్మయానికి గురయ్యాను. "బహిరంగ రహస్యాలు అనేవి కొన్నుంటాయి, నాకు అవి తెలియవని అనుకుంటున్నావా?" అడిగాడు శాన్.

ఓ ఆకుపచ్చని తాడుతో చుట్టిన ఎఱ్ఱరంగు తోలు కాగితపు ఉత్తరాన్ని నాకు చూపించాడు. "వింతగా అనిపిస్తున్న ఓ ముసలి వ్యక్తి 'మాంత్రికుల పర్యవేక్షణా కేంద్రం' నుంచి వచ్చిన ఆదేశాలను నాకు ఇప్పటికే అందించాడు. నువ్వు విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివని, నీ చర్యలను, బోధనలను జాగ్రత్తగా ఓ కంట కనిపెడుతూండమని ఆ ఆదేశాలలో ఉంది. క్షుద్రవిద్యలని సాధన చేయడం కాని ఇతరులకు నేర్పించడం గాని చేయకూడదు. కాబట్టి నీ బోధనని - యంత్రాలు, మానవ వ్యవస్థల అనుసంధానానికి మాత్రమే పరిమితం చేసుకుంటే మంచిది.." అన్నాడు శాన్.

"సరే సర్.." అంటూ గొణిగాను.

మేము ఔత్సాహికులపై ప్రయోగాలు చేస్తున్నాం. రోబోట్లు, మానవుల సంధానంపై ప్రయోగాలు కొనసాగుతున్నాయి. భూమి మీద, ఈ శాస్త్రం క్రమ క్రమంగా పురోగమిస్తోంది. గుండె నరాలు బుల్లెట్ ప్రూఫ్‌తోను, చేతులలో క్రేన్ల శక్తితోనూ ఎవరినైనా లేపి కనీసం ఇరవై అడుగుల దూరంలో విసిరేయగల కాళ్ళు, సాధారణ మానవ మెదడు కన్నా వంద రెట్లు జ్ఞాపకశక్తి ఉండేలా శంఖులంబికలో (Temporal Lobe) మైక్రోచిప్ అమర్చిన మనుషులు ఉన్నారు. నేను కుజగ్రహానికి వెళ్ళకముందు నా విద్యార్థి ఒకడు ఇలాంటి ప్రాజెక్టే చేపట్టాడు. బుల్లెట్లతో లేదా కత్తిపోట్లతో చచ్చిపోతాననే భయంలేని, రాత్రిళ్ళు నేరస్తులను పట్టుకోగలిగే రోబోటిక్ పోలీసుని తయారు చేయాలని అతని ఉద్దేశం. అయితే నేను కుజుడి మీద చూసినది ఆశ్చర్యకరమైనది... 'సైన్యం మొత్తం క్లోనింగ్‌తో చేయబడ్డవారే. చావు భయం లేకుండా పోరాడడానికి శిక్షణ పొందినవారే. తమపైకి పంపిన క్షిపణులను విశ్వశక్తితో తిరిగి శత్రుపక్షం మీదకి పంపగలిగిన వారు, గాలిలోకి ఎగరగలిగేవారు, వస్తువులను నాశనం చేయ గలవారు, సృష్టించగలవారు....'.

"సర్.. నేను నా బోధనని సిలబస్‌కి మాత్రమే పరిమితం చేస్తాను. అయితే వచ్చే వారంతంలో నేను మా ఊరికి, ఆమ్రపాలికి వెళ్ళిరావాలనుకుంటున్నాను..."

"ఓహో. గతాన్ని వెంటాడాలనుకుంటున్నావన్నమాట..." నా అధిపతి శాన్

ముఖంలో అప్రసన్నత. "వద్దని నీకు సలహా ఇస్తున్నాను, హనీ. ఇది జరిగి ఎంతో కాలమైంది. మీ తల్లిదండ్రుల చావుకి కారణాలు వెతకొద్దు, ఆ గాథలని బయటపెట్టద్దు. నీవు సంతోషంగా ఉండలేవు.. "

నేను ఖిన్నుఁడనయ్యాను. "సర్..." అన్నాను.

"అయితే, ఇదంతా నీ ఇష్టానికే వదిలేస్తున్నాను. మాంత్రికుల పర్యవేక్షణ కేంద్రం (WMC) లేదా ఎర్త్ కౌన్సిల్ గాని నిన్ను ఆపలేవు. ఇది స్నేహపూరితమైన సలహా మాత్రమే.. అంతే.." అన్నాడు శాన్ దయ నిండిన స్వరంతో.

❄ ❄ ❄

# 4. మానవ రోబో వ్యవస్థ నిర్మాణం

**పా**ఠాలు చెప్పడమంటే నాకెంతో ఇష్టం. నా క్లాసులో సుమారుగా 12 మంది విద్యార్థులు ఉంటారు, అందరూ తెలివైనవాళ్ళు, నేర్చుకోవాలన్న తపన ఉన్నవారు. వీళ్ళంతా భౌతికశాస్త్రంలోనూ, ఖగోళశాస్త్రంలోనూ ఉన్నత స్థాయి పట్టభద్రులు, భూమిలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చినవారు.

అక్కడ ఆరు అడుగులు ఎత్తులో మానవ శరీరాన్ని పోలిన లోహ విగ్రహం ఉంది. దాని కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి, వేళ్ళు నెమ్మదిగా కొట్టుకుంటు న్నాయి. అలాగే, తన శరీరంపై ప్రయోగాలకి స్వచ్ఛందంగా సిద్ధపడిన యువకుడు ఉన్నాడు. అతని తల శుభ్రంగా గుండు చేయబడి ఉంది. గుండు మీద చిన్న పట్టీ వేసి ఉంది. మెదడుకి శస్త్రచికిత్స చేసి మెదడులో ఓ కృత్రిమావయవం (bionic chip) అమర్చారు. ఆ రోబోని మా యంత్ర పరిశోధనాలయంలోనే తయారు చేసాం. దానికి కృత్రిమ గుండె, మెదడు అమర్చాం. నిజానికి అవి మెమొరీ కలిగిన హార్డ్ డిస్క్‌లు. రోబో చేతులు బలమైనవి, చక్కని కదలికల కోసం కీళ్ళు, కణుపులు ఉన్నాయి. ఒక వైపు - కృత్రిమ గుండె, మెదడు అమర్చిన మరమనిషి, మరో వైపు జ్ఞాపకశక్తిని పెంచేందుకు తన మెదడులో కృత్రిమ అవయవాన్ని జొప్పించుకున్న మనిషి. మానవ రోబోటిక్ వ్యవస్థలను అనుసంధానం చేయడమే లక్ష్యం.

కుజుడి మీద నేను చూసిన వాటి ప్రమాణాలతో పోలిస్తే, ఇవి ఎంతో ప్రాచీనమైనవని అనుకున్నాను. నా సొంత రోబో యు-7776 ఇందుకు సజీవ తార్కాణం. యురేకస్ పాటి సామర్థ్యాన్ని పొందాలంటే మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. విజ్ఞానం, విశ్లేషణ, మేధ, పరిపక్వతల భాండాగారం యురేకస్.

ప్రయోగానికి సంసిద్ధమైన వ్యక్తిని ఓ విద్యార్థి అడిగాడు: “గంగారాం,

987645 అనే సంఖ్యని 4.3తో హెచ్చువేస్తే వచ్చే సంఖ్య వర్గమూలం ఎంతో చెప్పు".

గంగారాం తికమకకి గురయ్యాడు. "నేను గణించలేకపోతున్నాను. ఆలోచిస్తుంటే నాకు తలనొప్పి వస్తోంది.." అని జవాబు చెప్పాడు.

"చైనీస్ రిపబ్లిక్, యూరోపియన్ యూనియన్ మధ్య జరిగిన యుద్ధం పేరేమిటి? ఆ యుద్ధంలో అణ్వాయుధ ప్రయోగం జరిగి, రగిలిన అగ్నిలో 2వ సహస్రాబ్ది యొక్క నాగరికత అంతా బూడిదై, భూమిపై కొత్త శకం మొదలైంది?"

"ఆ యుద్ధం గంగామైదానాల యుద్ధం. రెండు వర్గాల సైన్యం పోరాడి నశించినది 2457లో, వెయ్యి సంవత్సరాల క్రితం. అప్పుడు అణు విస్ఫోటనం జరిగి ఆసియా దేశాలు, తూర్పు యూరప్ దేశాలు నాశనమయ్యాయి."

"బావుంది.." అన్నాన్నేను. "చరిత్రకి చెందిన ధారణ బాగానే ఉంది, కాని మీరు అమర్చిన గణనశక్తి చిప్ నాణ్యత బావున్నట్లు లేదు. మానవ రోబోటిక్ వ్యవస్థలను అనుసంధానం చేయడంలో మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాలి.." అన్నాను.

మరి మరమనిషి సంగతేంటి?

చైనీయుల రూపురేఖలతో ఉన్న 25 సంవత్సరాల విద్యార్థి ముందు కొచ్చాడు.

"నేను చూపిస్తాను సర్." అన్నాడు.

రోబో కేసి చూస్తూ, "తిన్నగా నడిచి, రెండు అడుగులు గాల్లోకి ఎగురు" అని ఆదేశించాడు.

రోబో కొంత దూరం ముందుకు నడిచి, గాల్లోకి రెండు అడుగులు ఎగిరింది, కాని సక్రమంగా నేలమీదకి దిగలేకపోయింది. పక్కకి ఒరిగిపోయింది. దాని నోట్లోంచి లోహపు చప్పుళ్ళు కేకలా వినవచ్చాయి. విద్యార్థులందరూ నవ్వారు.

"సరే.." అన్నాన్నేను.

"పరిపూర్ణత రావడానికి మనమెంతో శ్రమించాలి. ఈ పూట నేను మీకు మానవ ధారణ గురించి, ఏకాగ్రత శక్తి గురించి, ధ్యానం గురించి చెబుతాను.

సరేనా? ఈ యంత్రపరికరాలను, భౌతిక శాస్త్రాన్ని మర్చిపొండి. మానసిక శక్తి గురించి చెబుతాను.'' అన్నాను.

ఆ క్షణంలో నేను మా హెచ్.ఓ.డి శాన్ సూచనలను మర్చిపోయాను. మనసు యొక్క శక్తి గురించి మాట్లాడడం ప్రారంభించాను.

ఉంగరాల జుట్టూ, నీలి కళ్ళున్న ఓ చిన్న విద్యార్థికేసి చూసాను. అతని పేరు సూర్య. ''సూర్యా, ఏకాగ్రతతో ఉండు. నీ ముందు ఓ యాపిల్ పండుని సృష్టించడానికి ప్రయత్నించు..'' అన్నాను.

క్లాస్ రూమ్ అంతా నిశ్శబ్దం. విద్యార్థులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

''కానీ, సర్, పదార్థం సృష్టించబడదు...'' అన్నాడు సూర్య.

''యాపిల్ చెట్టు పోషణ లేకుండా, గింజలు విత్తకుండా, యాపిల్‌ని ఎలా సృష్టించగలమో చూడు'' అన్నాను.

''నాకేసే చూడండి. నేను ధ్యానం చేసి, యాపిల్ ఉన్నట్లు ఊహించి.. ఓ యాపిల్‌ని సృష్టిస్తాను...'' అంటూ నేను నా అంతర్గత శక్తిపై ఏకాగ్రత నిలిపాను.

''ఓ విశ్వశక్తీ, ఓ ఆకుపచ్చని యాపిల్ సృష్టించబడాలి.'' క్రమంగా నా కళ్ళ ముందో ఆకుపచ్చ వెలుగు కదలాడి నెమ్మదిగా ఓ ఆకుపచ్చని యాపిల్‌గా మారింది.

విద్యార్థులు మూలిగారు.

''ఎలా?'' అడిగాడు సూర్య.

''నువ్వు సృష్టించలేకపోవచ్చు, కానీ ఎక్కడి నుంచైనా తెచ్చి చూపించ గలవు... అంటే ఏదైనా పళ్ళ దుకాణం నుంచి అన్నమాట. అంటే టెలీపోర్టేషన్ ద్వారా. అంతే కాదు, మరింత శక్తి ఉంటే, ఓ యాపిల్‌ని నిజంగానే సృష్టించవచ్చు. విశ్వశక్తిని నియంత్రించగల సామర్థ్యం మెదడుకి ఉంది. విశ్వశక్తి అంటే పదార్థంలానే సర్వవ్యాపకమైనది, సర్వాంతర్యామి. దీన్ని కూడా వస్తువులలా లేదా శక్తిలా మార్పు చేయవచ్చు, అనంతమైన శక్తిని పొందచ్చు.''

''కానీ మేము చేయలేనిది మీరెలా చేసారు?'' విద్యార్థులంతా ఒకే గొంతుతో అడిగారు.

“ఇది సాధ్యపడాలంటే కొన్ని ప్రత్యేక శక్తులు ఉండాలి. అటువంటి వ్యక్తులను విశ్వశక్తిని ఉపయోగించగలిగే శక్తి ఉన్న వ్యక్తులని అంటారు. తగిన విధంగా సాధన చేసి, హెచ్చు తగ్గులతో ఈ శక్తిని మీరు కూడా పొందవచ్చు...”

“మాంత్రికులా? క్షుద్రవిద్యలా? వీటి గురించి నేను ఇరవై శతాబ్దపు పత్రాలలో చదివాను. పుస్తకాలలో, జానపద గాథలలో, నవలలో మాంత్రికుల శక్తియుక్తుల గురించి రాసారు. వాటి గురించి చదవడం, సినిమాలలో చూడడం తప్ప, వాటిని విశ్వసించలేదెవరూ. అలాంటివారెవరూ లేనే లేరు. ఇవన్నీ నిరూపితం కాని అభూతకల్పనలు...” అన్నాడు సూర్య.

యాపిల్‌ని చేతిలోకి తీసుకుని, సూర్యకి ఇచ్చాను. “తిని, రుచెలా ఉందో చెప్పు సూర్యా!” అన్నాను.

సూర్య నాకేసి చూసి, “సర్, ఇదంతా గారడీ. మీరు నన్ను హిప్నటైజ్ చేస్తున్నారు. దీన్ని నిజంగానే తినాలని నాకు అనిపించచ్చు. ఎవరికి తెలుసు? అది నిజం యాపిల్ కాకపోవచ్చు, అయినా దాన్ని రుచి చూస్తాను...” అని గట్టిగా అన్నాడు.

ఓ ముక్క కొరికి చూసి, “అబ్బా, ఎంత తియ్యగా ఉందో..” అన్నాడు.

మా క్లాసు యూనివర్సిటీలో ఓ తరగతి గదిలో జరుగుతోంది. గది బయట అడుగుల సవ్వడి, వేసి ఉన్న తలుపులపై ఎవరో గట్టిగా కొడుతున్న చప్పుడయింది. తలుపు తోసుకుని లోపలికి వచ్చినది శాన్.

“ప్రొఫెసర్ హనీ, ఏం చేస్తున్నారు? మీరు నిషేధించిన పనిని చేస్తున్నారు. సంక్షోభాన్ని సృష్టిస్తున్నారు. పొద్దున్నే కదా, ఇలాంటివేవీ చేయకూడదని మీకు చెప్పాను?” మిస్టర్ శాన్ కోపంతో మండిపడుతున్నాడు.

“ఈ సంగతి కౌన్సిల్‌కి తెలిస్తే, అంతే సంగతులు. మనమంతా నాశనమై పోతాం.”

“సారీ సర్.. ఈ తప్పు మళ్ళీ చేయను. పాఠం చెబుతూ, పరధ్యానంగా ఆ విషయంలోకి వెళ్ళిపోయాను...” అంటూ విద్యార్థులకేసి తిరిగి, “జరిగినదాన్ని పట్టించుకోకండి. ఈరోజుకి క్లాసు రద్దయింది.” అన్నాను.

విద్యార్థులంతా వెళ్ళిపోయారు. నేను వాస్తవంలోకి వచ్చాను. శాన్ నాకేసి క్రోధంగా చూస్తున్నాడు.

“సర్, నాకు సెలవు కావాలి. నేను నా గతం గురించి తెలుసుకోవాలి, దాన్ని అర్థం చేసుకుని వర్తమానంలోకి రావాలి. కుజుడిపై ఎదురైన అనుభవాలతో నా మెదడు తికమకకి గురవుతోంది. నన్ను నేను కనుక్కోవాలి. నా జీవితపు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి...” అన్నాను.

“సరే. నాకు అభ్యంతరం లేదు. నువ్వు కలగనే విషయాలకన్నా, ముఖ్యమైనవి ఎన్నో ఉన్నాయి ఈ భూమి మీద. ఓ పదిహేను రోజులు సెలవు తీసుకో. జాగ్రత్తగా ఉండు. నువ్వు డీలా పడి, అన్నింటినీ పాడు చేయద్దు..” అంటూ శాన్ హుందాగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. అక్కడంతా నిశ్శబ్దం.

‘పాడు చేయద్దని అంటాడేంటి? దేనిని పాడు చేయడం? దాని అర్థం ఏమిటి? ఈ భూమి మీద నాకు తెలియని విషయాలేం ఉన్నాయి?’ అనుకున్నాను.

బయటకు నడిచాను. పార్కింగ్ లాట్‌కి వెళ్ళి, పాత కారులో కూర్చున్నాను. అది చాలా పాత కాలపు కారు. 3507 సంవత్సరం నాటి ఎర్ర ఈగల్ మోడల్ కారది. స్టార్ట్ చేసాను. ఈ కారుతో ఉన్న ఏకైక సౌకర్యం ఏమిటంటే.. ఇది ఇంధనాన్ని తక్కువగా వాడుతుంది. అవసరమైనప్పుడు నీటితో కూడా కొంతసేపు నడుస్తుంది. ఈ శతాబ్దంలో భూమిపై ఇంధనం కొరత కారణంగా, నీటి నుంచి తయారు చేసిన ఆమ్లజని, ఉదజనిలతో స్టార్ట్ అయ్యే ఇంజన్లను తయారు చేసారు.

ఇక, నేరుగా, బ్యాంకుకి... లాకర్ దగ్గరికి వెళ్ళి, ధరణి మావయ్య ఇచ్చిన డివిడిలు తీసుకోవాలి. చాలా కాలం క్రితమే చూడమన్న ఆ డివిడిలో ఏం సమాచారం నిక్షిప్తమై ఉందో?

వాటిని చదవాల్సిన సమయం ఆసన్నమైంది. కాసేపటికే నా కారు సెంట్రల్ ఏసియన్ జోనల్ బ్యాంక్, ఇండికా యూనివర్సిటీ బ్రాంచి ముందు ఆగింది. నేను నేరుగా సేఫ్టీ లాకర్స్ ఉంచే భూగృహంలోకి నడిచాను.

❄ ❄ ❄

# 5. ధరణి మావయ్యా

**సెం**ట్రల్ ఏసియన్ జోనల్ బ్యాంక్, ఇండికా యూనివర్సిటీ శాఖ ఉన్న భూగృహం చీకటిగాను, చల్లగాను ఉంది. నేను నా లాకర్ తాళం చెవులు తీసుకున్నాను, నాతో పాటు లోపలికి వచ్చిన అధికారి, నా పాస్‌వర్డ్ అడిగి, అతని తాళంచెవి కూడా గుచ్చి, లాకర్ తెరిచి, అక్కడ్నించి వెళ్ళిపోయాడు. ఈ పద్ధతి ఎంతో పురాతనమైనది, ఇంకా కొనసాగుతోంది.

లాకర్‌లోని డివిడీలనూ, డివిడీలను ఉంచి ప్లే చేసే లేజర్ యంత్రాన్ని తీసుకున్నాను. దాన్ని నా గదికి తీసుకువెళ్ళాలా అని ఆలోచించాను. కాని ముందు దాన్ని ఒకసారి పరీక్షిస్తే మంచిదేమోనని అనుకున్నా. లేజర్ ప్లేయర్‌ని ఆన్ చేసాను. పెద్ద శబ్దం... ధరణి మావయ్య ముఖం భూగృహం కప్పు అంతా ఆక్రమించింది. తత్తరపడి, లేజర్ ప్లేయర్ మీటలని సరిజేసాను. మావయ్య బొమ్మని చూడగలిగే స్థాయికి, ధ్వనిని భరించగలిగే స్థాయికి తగ్గించాను.

మావయ్య తల ఒకటే కనబడుతోంది... పైగా అది మాట్లాడుతోంది.

"మొత్తానికి నాతో మాట్లాడాలనుకున్నావన్నమాట! ఇది 7 డిసెంబర్, క్రీ.శ. 3265. ఇప్పుడు నువ్వు నన్ను ఏవైనా అడగచ్చు లేదా, నీ సందేహాలను తీర్చుకునేందుకు ఈ డిస్క్‌లలో ఉన్న సమాచారాన్ని చదువుకోవచ్చు.... అడుగు...".

అడగాల్సిన ప్రశ్నలెన్నో ఉన్నాయి, తీర్చుకోవాల్సిన సందేహాలు చాలానే ఉన్నాయి. ఏది ముందు అడగాలి?

"మావయ్యా, ఓ విషయం చెప్పు... నేను మాంత్రికుడినా లేక స్థానిక పరిభాషలోని 'విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తి'నా? మా అమ్మానాన్నల సంగతి ఏమిటి? వాళ్ళు కూడా విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులేనా?"

గడ్డంతో వింతగా ఉన్న ధరణి మావయ్య ముఖం చెప్పసాగింది.. "అడగాల్సినదే అడిగావు. మీ నాన్న నారా, మీ అమ్మ నయన ఇద్దరు విశిష్టమైన వారు. అద్భుతమైన, అసాధారణమైన మానవాతీతశక్తులున్నవారు. ఇప్పుడు 'విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులుగా' పిలబడుతున్నవారు ఒకప్పుడు మాంత్రికులుగానూ, క్షుద్ర ఉపాసకులుగాను పరిగణించబడేవారు. గ్రామస్తులు, అధికారులు వారిని అనుమానాస్పదంగా చూసేవారు. కాని వారందరూ చెడ్డవారు కాదు. నిరాడంబరంగా జీవిస్తూ, తమ సాయం కోరి వచ్చినవారికి తమ శక్తులతో మేలు చేసేవారు."

"ఉదాహరణకి?"

"ఏ మందు లేని జబ్బుతో బాధపడుతున్నవాళ్ళు, భ్రమలతో కూడిన వివరించలేని మానసిక జబ్బులు, పంటలను, పశువులను నాశనం చేసే క్షుద్రశక్తులు నుంచి రక్షించేవారన్నమాట. జనాలు తమకి తోచింది ఇచ్చేవారు. మీ అమ్మానాన్న అందరిలానే వ్యవసాయం చేసుకునేవారు. ఏదో అనుకోకుండా జరిగిన ప్రమాదాలకు... అంటే అకారణంగా సోకిన స్ఫోటక జ్వరాలు, అకాలంలో సంభవించిన వాతావరణ మార్పులు వంటి ఘటనలకు బాధ్యులుగా చేసి మీ అమ్మానాన్నని గ్రామం నుంచి పంపేసి, ఊరిబయటకి తరిమేసారు ఊరిపెద్దలు."

"అమ్మానాన్నలు మంచి చేస్తే, మరి వాళ్ళని ఎందుకు నమ్మలేదు? మరి వారిని చంపడానికి కారణమైన ఘటనలు ఏవి?"

మావయ్య ముఖకవళికలు మారిపోయాయి.

"హనీ, అదంతా పెద్ద కథ. నాకు కూడా కొంతే తెలుసు. మీ నాన్న ఎందరో గ్రహాంతరవాసులతో - కంప్యూటర్ ద్వారా, టెలిపతీ ద్వారా తరచుగా మాట్లాడుతుండేవాడు. విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులు లేదా మంత్రశక్తి కలిగినవాళ్ళు ఈ విశ్వంలో నలుమూలలా వ్యాపించి ఉన్నారని నీకు తెలుసు. వాళ్ళలో మంచివాళ్ళూ ఉన్నారు, చెడ్డవాళ్ళూ ఉన్నారు. మంత్రశక్తులున్న గ్రహాంతర దుష్టశక్తులు కొన్ని భూమిపై దాడి చేసి ఆక్రమించుకోవాలని చూసేవి. సంప్రదాయక రక్షణాయుధాలతో వాటిని ఎదుర్కొనడం కష్టం. కాబట్టి ఎర్త్ కౌన్సిల్ - అసలీ మానవాతీత శక్తుల గురించి, విశ్వశక్తి గురించి, మంత్రశక్తుల గురించి శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయాలని నిశ్చయించింది, ఈ సంగతిని రహస్యంగా ఉంచింది. అయితే మంత్రశక్తులున్న గ్రహాంతర దుష్ట

శక్తులు తమ పాపిష్టి ప్రయోజనాలను సాధించుకునేందుకుగాను భూమి మీద పలు ప్రాంతాలలో ఉన్న విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులను వాడుకునేవి. ఈ ప్రక్రియలో భాగంగానే అవి, మీ నాన్నని ప్రభావితం చేయడానికి ప్రయత్నించాయని నేను అనుకుంటున్నాను. వాటి ప్రయత్నం విఫలం అవడంతో, మీ అమ్మానాన్నలని ఆమ్రపాలి గ్రామంలోని దక్షిణ దిశలోని పొలాలలోకి రప్పించి, ఆ తుఫాను రాత్రి పూట దారుణంగా హతమార్చాయి...''

''కానీ ఎలా? వాళ్ళ వలలో నాన్న ఎలా పడిపోయాడు? ఎర్త్ కౌన్సిల్‌కి రిపోర్ట్ చేయచ్చుగా లేదా వారినే నాశనం చేసి ఉండచ్చుగా?''

''బహుశా ఏదో బ్లాక్‌మెయిల్ జరిగి ఉంటుంది. ఆ క్రూరజీవులు.. అదే గ్రహాంతర దుష్ట శక్తులు... మొత్తం ఆమ్రపాలి గ్రామాన్ని, పంటల్నీ, పశువులని నాశనం చేస్తామని బెదిరించాయి.''

''కాని ఎందుకు? ఆ రాత్రి ఆమ్రపాలికి వచ్చిన ఆ దుష్టశక్తులు లేదా దుర్మార్గులు ఎవరు? అమ్మానాన్నలని బయటకి వచ్చేలా చేసి చంపిందెవరు?''

డివిడి ప్రొజెక్టర్ మీద ధరణి మావయ్య ముఖం అభావంగా ఉండి పోయింది. తర్వాత మావయ్య కళ్ళలో భయం కనపడింది.

''మరిన్ని వివరాలు కావాలంటే మాంత్రికుల యుద్ధాల గురించి, విశ్వాన్ని నియంత్రించే అధికారం కోసం విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తుల మధ్య జరిగిన పోరాటాల గురించి నువ్వు సెర్చి ఇంజన్‌లో వెతకాలి హనీ. సమాచారమంతా సంక్లిష్టంగా ఉంటుంది. మానవ కాలనీలకీ, హ్యూమనాయిడ్స్‌కీ మధ్య జరిగిన రాజకీయ యుద్ధాల వంటిది కాదు ఈ 'విశ్వశక్తిని ఉపయోగించ గలిగే వ్యక్తుల మధ్య జరిగిన పోరాటం'. ఇది అత్యంత రహస్యమైనది, భూమి మీద దీని గురించి మాట్లాడడం కూడా నిషేధించబడింది....''

చిన్నగా నిట్టూర్చి, ఆ పాత డివిడి మీద ఉన్న మీటలను వెతుక్కుని సెర్చి ఇంజన్ మీట నొక్కి... 'కుజుడిలోని అరుణ భూముల చక్రవర్తి, సమూరా...' అని గట్టిగా అన్నాను.

చిన్నపాటి అంతరాయం కలిగాక, తెర మీద నాకు సుపరిచితమైన కుజగ్రహం మీద ఎర్రటి నేలలు కనబడ్డాయి. దుష్ట చక్రవర్తి సమూరా తన రాజమహల్‌లో పచార్లు చేస్తూ కనపడ్డాడు. అతని కూతురు, మంత్రగత్తె సయోనీ కూడా అక్కడే తిరుగుతోంది. నేపథ్యంలో మానవులకూ, గ్రహాంతర మాంత్రికు

లకు మధ్య జరిగిన యుద్ధాలపై వ్యాఖ్యానం వినబడుతోంది. ఇవన్నీ నాకు తెలిసినవే..

మరోసారి నిట్టూర్చాను. ఈసారి తెరపైన టైప్ చేసాను - 'భూమిపై ఆమ్రపాలికి చెందిన నారా, నయన'- అని. కాసేపు ఖాళీ తెర, నిశ్శబ్దం. కొన్ని క్షణాల తర్వాత, పొడవాటి గడ్డం, తెల్లని పైగుడ్డతో నాన్న, ఎర్రటి చీరలో అమ్మ కనపడ్డారు. "వీరు ఆమ్రపాలిలోని పవిత్రమైన, గౌరవనీయులైన విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులు..." అంటూ వ్యాఖ్యానం మొదలైంది.

ఇంతలో మళ్ళీ మావయ్య ముఖం ప్రత్యక్షమైంది.

"హనీ, తొందరపడకు. వీటిని అర్థం చేసుకోగలిగే వయసొచ్చే వరకూ ఇవేవీ వినద్దు..." అంది.

ముఖకవళికలు మారిపోతుండగా, మావయ్య చెప్పసాగాడు:

"దుష్ట మాంత్రికుడు సమూరా - గ్రహాలను జయించడం కోసం - విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులను తన సైన్యంలో చేర్చుకోసాగాడు. మీ అమ్మానాన్నలు ప్రతీసారీ తిరస్కరించారు. వారి కంప్యూటర్‌లో రహస్య సందేశం... బహుశా తమతో చేరకపోతే ఆమ్రపాలిని నాశనం చేస్తామనే బెదిరింపు - వచ్చిన మర్నాడు మీ అమ్మానాన్నలు వాళ్ళని ఎదుర్కోడానికి దక్షిణ దిశలోని పొలాలకు వెళ్ళారు. అక్కడే హత్యకి గురయ్యారు.... నీ చిన్నప్పుడు నువ్వు చూసినది అదే..."

"కానీ మావయ్యా, వాళ్ళు సమూరా మనుషులని నీకు ఖచ్చితంగా తెలుసా?"

"ఖచ్చితంగా. ఎందుకంటే భూమి మీద వాళ్ళ సైన్యం దాగి ఉంది. ఎర్త్ కౌన్సిల్ వాళ్ళని నిరంతరం గమనిస్తూ ఉంటుంది, ఏదైనా మంత్రశక్తిని సాధన చేస్తే వెలువడే తరంగాల ద్వారా వాళ్ళ ఉనికిని కనిపెడుతుంది. అందుకే వాళ్ళు తమ చర్యల్ని రహస్యంగా చేపడుతారు. ఒకవేళ మీ అమ్మానాన్నలు వాళ్ళతో రాజీ పడి ఉంటే, ఏ సుదూర గ్రహాలకో వాళ్ళని తీసుకువెళ్ళి, ఉపయోగించుకునేవారు. అందుకు అంగీకరించలేదు కాబట్టి, మిగతా వాళ్ళకి గుణపాఠంగా ఉండడం కోసం మీ అమ్మానాన్నలని చంపేసారు..."

నేను నిర్ఘాంతపోయాను. మొత్తం సంగతంతా అర్థమైంది.

❄ ❄ ❄

# 6. దోపిడీ

**లా**కర్ మూసేసాను. నాకందిన కొత్త సమాచారం, నా కొత్త అవగాహన నా శరీరాన్ని వణికించాయి.

నేను కుజుడి మీదకి వెళ్ళొచ్చాను, మానవులకు, హ్యూమనాయిడ్లకూ మధ్య జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను. సమూరా, సయోనీల కుట్రకు సాక్షిగా ఉన్నాను. వారి ఎంపిక పద్ధతికీ, వారు విశ్వశక్తిని దురుపయోగం చేసే తీరుకీ, కుజగ్రహంలో మానవ కాలనీపై వారు జరిపిన అస్తవ్యస్త దాడికీ... అన్నింటికీ నేను సాక్షిని. అమరత్వం పొందడం కోసం అమృత ఔషధం తాగాడు సమూరా, కాని దానివల్ల అతని శక్తులు పోయాయి. అతని ఆశలన్నీ నేను నాశనం చేసాను. సయోనీ, మిగతా మంత్రులు కుజ గ్రహం నుంచి పారిపోయారు. కాని మళ్ళీ అందరూ ఒక చోట చేరి, తాము కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి సంపాదించేందుకు పథకాలు వేస్తారు. కాని ఎలా? ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి వెళ్ళడానికి వాళ్ళకి శక్తులున్నాయా? లేదంటే వాళ్ళింకా కుజగ్రహంలోనే రహస్య స్థలంలో దాక్కుని ఉన్నారా? భూమి మీద వాళ్ళకి ప్రతినిధులున్నారా? సౌరవ్యవస్థలో ఉన్న అన్ని మానవ కాలనీలలో క్షుద్రశక్తులను ఆవాహన చేసే వారి అనుచరులు ఉన్నారా? వారి ద్వారా ఏదైనా కుట్ర చేస్తున్నారా? చేస్తుంటే ఎలా? ఏం చేయబోతున్నారు?

ఇంతలో లాటెర్ అంతరిక్ష వేదిక వద్ద నాపై దాడి చేసిన చైనా దేశపు రూపురేఖలలో ఉన్న వ్యక్తి గుర్తొచ్చాడు. కుజగ్రహం స్పేస్‌డ్రోంలో నామీద దాడి చేసిన ముగ్గురు అమ్మాయిలు గుర్తొచ్చారు.

కారు స్టార్ట్ చేసి, బ్యాంకు నుంచి యూనివర్సిటీ వైపు బయల్దేరాను. అక్కడక్కడా కొంతమంది తచ్చాడుతున్నారు. చీకటి పడుతోంది. దారికి రెండు

వైపులా పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి, ఎర్రని పూలగుత్తులతో నిండి ఉన్నాయి. సముద్రపు ఒడ్డున ఉన్న ఈ మధ్య ఆసియాలోని ఈ ఊరు... చెట్లు, ఎర్ర ఇటుకలతో కట్టిన ఇళ్ళు, చిన్న చిన్న నల్లని గేట్లు,... ప్రశాంతమైన యూనివర్సిటీ కాంపస్... బావుంటాయి. ఇంతలో... నాకెందుకో అనిపించింది... వాళ్ళు నన్ను వదలరని! వెంటాడుతారని. ఋజువులు - ఇప్పటికే నాపై జరిగిన రెండు దాడులు... వాళ్ళంతా మళ్ళీ కలుస్తారు.. నన్ను వెతుకుతారు.. నాపై ప్రతీకారం తీర్చుకుంటారు..

హాస్టల్ పార్కింగ్ లాట్‌లో కారుని ఉంచి, పదో అంతస్తులో ఉన్న నా అపార్ట్‌మెంట్‌కు వెళ్ళేందుకు లిఫ్ట్ వైపు నడిచాను. విశ్వంలో దాయబడ్డ అద్భుతమైన మంత్రశక్తులున్న వస్తువుల గురించి సయోనీ ఒకసారి నాతో చెప్పింది. బహుశా హిమాలయాలలో ఏదైనా ఉందేమో. ఎలాగోలా తన శక్తులన్నింటినీ తిరిగి పొందడానికి ప్రయత్నిస్తాడు సమూరా. అతని మంత్రులు అందుకు సహకరిస్తారు. సయోనీ వయసులో చిన్నదైనా, ఆమెకి అమరత్వం లేదు. శక్తులు ఉన్నాయి. మిగతావాళ్ళకి కూడా వినాశక శక్తులు ఉన్నాయి. వాళ్ళ తక్షణ కర్తవ్యం... సమూరా శక్తులను తిరిగి రప్పించడం, విశ్వాన్ని జయించడం లేదా కనీసం కుజుడి మీద ఉన్న అరుణ భూములను స్వాధీనం చేసుకోడం! అమృత ఔషధం తాగితే శక్తులు నశిస్తాయని చక్రవర్తికి చెప్పక పోవడం మోసమే. అందుకే నేను వంచకుడిని.

“వాళ్ళు ఖచ్చితంగా నన్ను చంపడానికి వస్తారు...”

వాళ్ళకి ఈ భూమి మీద ఎంతమంది అనుచరులున్నారో ఎవరికి తెలుసు? ఈ భూమి మీద మాంత్రికుల గురించి, విశ్వశక్తి గురించి ఏదైనా రహస్యంగానే ఉంచబడుతోంది.. ఎర్త్ కౌన్సిల్‌కి తప్ప మిగతావారికెవరికీ ఈ విషయాలు తెలియవు.

ఇష్టమున్నా లేకపోయినా నేనో దారుణమైన యుద్ధంలో చిక్కుకున్నాను. పైగా అమ్మానాన్నల హత్యకి ప్రతీకారం చేయాలన్న కోరిక నాలో చెలరేగుతోంది.

నా అపార్ట్‌మెంట్ తలుపులు తెరవగానే, విస్మయానికి గురయ్యాను.

❄ ❄ ❄

# 7. మళ్ళీ భూమికి, ఆ పిమ్మట...

**నా** అపార్ట్‌మెంటంతా చిందరవందరగా ఉంది. అన్ని అలమారలు తెరిచి ఉన్నాయి, వాటిలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడున్నాయి. పుస్తకాలు, బట్టలు, కాయితాలు అన్నీ నేల మీద అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. కంప్యూటర్ తెర ఖాళీగా నిశ్చలంగా ఉంది, నా డివిడీలు, సిడీలు అన్నీ మాయం. నా బల్ల సొరుగులు తెరిచి ఉన్నాయి. గదిలోంచి పొగ వాసన వస్తోంది. ఓ దారుణమైన సంఘటన జరిగాక నెలకొనే భయగ్రస్త వాతావరణం ఉంది.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి చూసాను. అద్దం మీద ఎర్ర మరకలు ఉన్నాయి. దగ్గరికి వెళ్ళి చూసేసరికి అదేమిటో అర్థమైంది. రెండు ఎర్ర కత్తులు, మధ్య కుజగ్రహం గుర్తు, ఎర్రటి ఎరుపు రంగులో. కుజ గ్రహం మీది అరుణభూముల పతాకం చిహ్నమది. ఆ చిహ్నం కింద రక్తమోడుతున్న నల్ల అక్షరాలు...

"హనీ, వంచకుడా! నిన్ను గమనిస్తూనే ఉన్నాం. నీ తుది ఘడియలు సమీపిస్తున్నాయి.."

"నశించు... మానవా నశించు..."

బహుశా ఇదే అర్థం వచ్చేలా ఏదో భాషలో ఉందా హెచ్చరిక. నా వెన్ను జలదరించింది.

'వాళ్ళు ఇక్కడికి వచ్చేసారు...'

కుజగ్రహపు మాంత్రికులు.. వాళ్ళకి నేనెవరో తెలుసు, వాళ్ళ చక్రవర్తికి నేనే ద్రోహం చేసానో కూడా తెలుసు. నా వల్ల తన మంత్రశక్తులన్నీ పోగొట్టు కున్నాడు సమూరా. కాని ఒలింపస్ పర్వత శిఖరం నుంచి నేను తెచ్చిన అమృత ఔషధం తాగి అమరత్వాన్ని పొందాడు. సమూరా భూమి మీదకి వచ్చాడా? అతని శక్తులు నశించి ఉండచ్చు, కానీ అతని అనుచరుల శక్తులు నశించ లేదుగా... వారు అతని ఆజ్ఞలను ఉల్లంఘించరు. వాళ్ళంతా కలసి దెబ్బతిన్న

అతని పేరు ప్రతిష్ఠలను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తారేమో.

కానీ ఈ భూమి మీదే ఎందుకు? అసలైనా ఎన్నో రక్షణ వలయాలని దాటుకుని వాళ్ళు భూమి మీదకి ఎలా రాగలిగారు? బయటి మాంత్రికులు భూమిపైకి ఎవరొచ్చినా ఎర్త్ కౌన్సిల్ సులువుగా పసిగడుతుందే.. ప్రతీకారం కోసమా? భూమి మీద  ఊరూపేరూ లేని నాలాంటి ఓ మనిషి మీద ప్రతీకారమా? నేను చిన్నవాడినే. కాని నేనొక సాకు కావచ్చు. నా మీద పగ అనే మిషతో వాళ్ళేదో ఇంకా పెద్ద ప్రణాళిక మీదే ఉన్నట్లున్నారు. ఖచ్చితంగా వాళ్ళు ఏదో లక్ష్యంతోనే భూమిమీదకి ప్రవేశించారు. వాళ్ళు లేదా వాళ్ళ ఇక్కడి ప్రతినిధులు! ఈ దుష్ట మాంత్రికులకు అన్ని గ్రహాలలోనూ ప్రతినిధులు ఉన్నారు, ఏకమనస్తత్వము ఉన్న విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులందరినీ ఎంపిక చేసుకుని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. అది సమూరా కావచ్చు, అతని బృందం కావచ్చు లేదా వారి ప్రతినిధులు కావచ్చు. వాళ్ళు నన్ను బెదిరిస్తున్నారు. నేనేమో ఒంటరిని.... నా శక్తులు పరిమితమైనవి. నేను దుర్బలుడిని.

సోఫాని మామూలు స్థానంలోకి జరిపి, దాని మీద కూర్చుని ఆలోచించ సాగాను. ఎవరినైనా సాయం కోరనా....? ఇది భూమి. ఇక్కడ ఏనిమాయిడ్ లేడు, డిమిట్రీ లేదు, మీరోస్ లేడూ, వాళ్ళ అద్భుత శక్తులూ లేవు. నా హెచ్.ఓడి. శాన్? ఎర్త్ కౌన్సిల్? ఎవరిదో ఒకరిది సాయం తీసుకోకుండా ఉండలేని పరిస్థితి నాది. నేనొక్కడినే వాళ్ళని ఎదిరించలేను.

పైగా నేను విశ్వశక్తిని ఉపయోగిస్తే... కనిపెట్టేస్తారు. వంటగదిలోకి వెళ్ళి టీ చేసుకుని తాగుతూ ఆలోచించసాగాను.

ఉన్నట్లుండి నాకు కుజగ్రహపు అరుణభూముల రాకుమారి సయోనీతో జరిపిన సంభాషణ గుర్తొచ్చింది. టెలీపతిని సాధించే రహస్యాలు, యుద్ధాలు కల్పించే ప్రకృతి వైపరీత్యాలు, గాల్లో ఎగరడం వంటివి... భూమిలో ఉన్నాయి. అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) విశ్వంలోని ఆరు గ్రహాలలో ఆరు అద్భుతమైన శక్తులున్న వస్తువులని దాచి పెట్టిందట. అత్యద్భుతమైన మంత్రదండం, సుదూర సమాచారాలని చూడ గలిగే మహాదర్పణం.. వంటివి. సమూరా ఇప్పుడు అమరుడు, కాబట్టి పోగొట్టుకున్న శక్తులను ఎలాగైనా తిరిగి పొందాలని చూస్తాడు. అందులో అనుమానం లేదు. అతనే ఇక్కడికి వచ్చుంటాడు లేదా తన అనుచరులను

పంపి ఉంటాడు.. అమృత ఔషధం ఇచ్చి అతని శక్తులను పోగొట్టేలా చేసినందుకు నా అంతు చూడడానికి.. అంటే నా పరిస్థితి అత్యంత ప్రమాద కరంగా ఉందన్నమాట. వాళ్ళకి పనికొచ్చే వస్తువు దేనికోసమో నా గదంతా వెతికారు. ఒకవేళ నన్ను చంపడమే వారి లక్ష్యమైతే నేరుగా నాపై దాడి చేసేవారు...

ఆలోచిస్తూనే, పైకి లేచి శాటిలైట్ ఫోన్ అందుకున్నాను. మూడు స్టార్ గుర్తులు, 999 నొక్కాను. అది సెక్యూరిటీ సిబ్బందిది.

“మిస్టర్ హనీ,...” అంటూ పలికాడు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్.

“మిస్టర్ శాన్ మీ గురించి అడుగుతున్నారు. మీ గదిలో ఏవో విద్యుత్ తరంగాల సంక్షోభం నెలకొందని తెల్సింది..”

నేను మెల్లగా చెప్పాను..

“అది నా పని కాదు. నా మీద దాడి జరిగింది. ఎవరో నా గదిలోకి అక్రమంగా చొరబడ్డారు. ఇల్లంతా వెతికారు, చిందరవందర చేసారు. నా సిడీలని ఎత్తుకుపోయారు. మీ పరికరాలు ఉపయోగించి వాళ్ళెవరో, ఎటు వెళ్ళారో వెతకాలి. బహుశా వాళ్ళు మాంత్రికులై ఉంటారు. వాళ్ళు విశ్వశక్తిని ఉపయో గించగల గ్రహాంతరవాసులు.. బహుశా కుజ గ్రహం నుంచి వచ్చుంటారు....”

“కానీ ప్రొఫెసర్ హనీ, మీ మీదే ఎందుకు దాడి జరిగింది?”

“వాళ్ళకి నా మీద పాత పగలు ఉన్నాయి. అయినా జరిగినదంతా నేను మా హెచ్.ఓ.డి శాన్‌కి వివరిస్తాను. మీరు మీ బాధ్యత నిర్వర్తించి, విద్యుత్ సంకేతాల ద్వారా వాళ్ళ జాడలు కనిపెట్టండి... ప్లీజ్!”

“కానీ అటువంటి జాడలేవీ లేవు. సంకేతాలూ లేవు. ఎటువంటి కార్య కలాపాలు ఇప్పుడు జరగడం లేదు...”

నేను ఫోన్ పెట్టేసాను. తమ జాడలు తెలియకుండా ఉండడానికి ఆ దుష్టుడు సమూరా తగిన జాగ్రత్తలు తీసుకునే ఉంటాడు.

ఫోన్ మోగింది. ఎత్తి “హనీ హియర్..” అన్నాను. అటువైపు మిస్టర్ శాన్.

“హనీ, నువ్వు మళ్ళీ అదే పని చేస్తున్నావు. నీ గదిలో విశ్వశక్తిని వాడినట్లు తెలుస్తోంది. ఇది ఆఖరి హెచ్చరిక. లేదంటే నిన్ను అరెస్టు జేసి, ఇన్వెస్టిగేషన్ కోసం ఎర్త్ కౌన్సిల్‌కి పంపాల్సి ఉంటుంది.”

"అదేం లేదు సర్, చేసింది నేను కాదు..." అంటూ జరిగినదంతా చెప్పుకొచ్చాను. అద్దం మీద రాసిన బెదిరింపుల గురించి వివరించాను.

"నన్ను వెంటాడుతున్నారు ప్రొఫెసర్. మీరేమో నేను దోషినని అంటున్నారు, నన్ను నిందిస్తున్నారు. దయచేసి సాయం చేయండి, నన్ను అర్థం చేసుకోండి.."

"సరే, నేనొచ్చి నీ గదిని పరిశీలిస్తాను..."

నా గదిలో ఏవీ మిగల్లేదు. నా డివిడీలు, కంప్యూటర్ డిస్కలలో నా బయో-మెడికల్ సిస్టమ్స్ పరిశోధన విషయాలు తప్ప మరేవీ లేవు. మేము మానవ - రోబోల వ్యవస్థల అనుసంధానం కోసం ప్రయత్నిస్తున్నాం. అందునా, మేమింకా ప్రారంభ దశలోనే ఉన్నాం. అద్భుతమేదీ జరగలేదు. కుజుడి మీద మానవుల కాలనీలో గాని, అరుణభూములలోగాని ఉన్నంత పురోగతి లేనే లేదు. కాబట్టి ఇది నన్ను భయపెట్టడానికి వేసిన ఎత్తుగడని భావించాను. ఇంతలో తలుపు తట్టి, శాన్ లోపలికి వచ్చాడు.

"ఓయ్ హనీ, ఏమిటిదంతా, నీ గది యుద్ధరంగంలా ఉందే.."

"గ్రహాంతరవాసుల దాడి సర్. బహుశా గ్రహాంతర మాంత్రికులు వచ్చి నట్లున్నారు. నేనెక్కడైనా దాచవలసిన వస్తువేదయినా దాచానేమోనని వెతికారు.."

మార్స్‌పై నేను చేసిన సాహసాలు, సమూరా శక్తులను నేను పోగొట్టిన తీరు అన్నీ మిస్టర్ శాన్‌కి తెలుసు.

"సమూరా, అతని మంత్రులు - భూమిలో దాచబడిన అయిదు లోహ విగ్రహాల కోసం లేదా అటువంటి అద్భుతశక్తులున్న వస్తువు కోసం ఇక్కడికి వచ్చారు. వాటిని సాధిస్తే ఆ దుష్ట మహామాంత్రికుడి పోయిన శక్తులు తిరిగొస్తాయి..."

మా హెచ్.ఓ.డి  మిస్టర్ శాన్ ఆలోచిస్తూనే ఉన్నాడు.

"గెలాక్టియా ఎన్‌సైక్లోపీడియాలో ఎప్పుడో చాలాకాలం క్రితం చదివానోయ్. ఇప్పుడంతగా గుర్తులేదు. సౌర వ్యవస్థలోని గ్రహాలలో అద్భుత శక్తులను అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం దాచిందని... అవును. ఒకసారి చదివాను. కాని అది నిజమని ఎప్పుడూ అనుకోలేదు..."

"సర్, మీరు నన్ను ఇంకా అనుమానిస్తున్నారు. నేను మంత్రశక్తిని సాధన

చేస్తూ, ఇక్కడ గందరగోళం సృష్టిస్తున్నారని భావిస్తున్నారు. దారుణం. చూడండి... వాళ్ళు నన్నెలా వెంటాడి వేధిస్తున్నారో...."

"కానీ హనీ, మన నిఘా వ్యవస్థని దాటి, లా టెర్ అంతరిక్ష వేదిక వద్ద పలురకాల స్క్రీనింగ్ టెస్టులను తప్పించుకుని ఏ గ్రహాంతర మాంత్రికులు భూమి మీదకి రాలేరు. మన నిఘాకి దొరకకుండా వాళ్ళెలా తప్పించుకోగలరు? నిన్ను వాళ్ళు ఎలా చేరుకోగలిగారు? ఏ గ్రహంలోనైనా నువ్వు చెబుతున్న ఆ అద్భుత వస్తువుని సాధించడం మానవులకు సాధ్యమేనా? లేదంటే వాళ్ళు కేవలం నీ మీద పగ తీర్చుకోడానికే వచ్చారంటావా... ఎదురయ్యే ప్రమాదాలతో పోలిస్తే, నీ మీద దాడి చేయడం సమయం వృథా అని వారికి తెలియదా?"

"సర్, నన్ను నమ్మండి. దొరికిపోయినా ఫర్వాలేదనుకునే, అతని శక్తులను తిరిగి పొందడానికి సమూరా ఇక్కడికి వచ్చాడనే నాకు అనిపిస్తోంది. పైగా నా జాడ కనుక్కోడం పెద్ద కష్టమేమీ కాదు, ఎందుకంటే.. నేను గ్రహాంతర వ్యోమ నౌకలో ప్రయాణించాను, వీసాతో. నా చిరునామాని సులభంగా తెలుసు కోవచ్చు."

"నీ గురించి వాళ్ళకి చాలా ఏళ్ళ క్రితమే తెలిసుండాలి. నువ్వు విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివని ముందే గుర్తించి, నీ కలలో కనపడి నిన్ను హిప్నటైజ్ చేసి కుజుడి మీదకి రప్పించారు.."

"అవును సర్.." అంటూ నేను దీర్ఘాలోచనలో మునిగిపోయాను.

ఆమ్రపాలిలో మా నాన్న నారా.. విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తి... దుష్టశక్తులు ఆయనని బలి తీసుకున్నాయి. నా బాల్యంలో అదొక బాధాకరమైన జ్ఞాపకం.

"సర్. మా నాన్న బహుశా వాళ్ళకి సహకరించలేదేమో... అందుకే వాళ్ళు మా అమ్మానాన్నలిద్దరినీ చంపేసారు. బహుశా నాన్న రికార్డులు, ధరణి మావయ్య ఇచ్చిన డివిడీలు దీని వెనుక ఉన్న నిజాలని చెబుతాయేమో. ధరణి మావయ్యని అన్ని విషయాలు అడగాలి.. సమూరా తన శక్తులు తిరిగి పొందకుండా ఆపడానికి నా శాయశక్తులా ప్రయత్నించాలి..."

"నీ ఆలోచన మంచిదే! కాస్త విశ్రాంతి తీసుకో. నేను నీకు సాయం చేస్తాను. జరిగినదంతా ఎర్త్ కౌన్సిల్‌కి తెలియజేస్తాను.. చూద్దాం వాళ్ళూ ఏమైనా సాయం చేస్తారేమో. అయితే వాస్తవం చెప్పాలంటే, ఇదొక నిగూఢమైన

ప్రమాదకరమైన పరిస్థితి. వీటన్నింటికి దూరంగా ఉండమని సలహా ఇవ్వాలని ఉన్నా..''

``సర్, నేను దూరంగా ఉన్నా, ఏం చేయకపోయినా, వాళ్ళు నన్ను వెంటాడుతున్నారు కాబట్టి నేనూ జోక్యం చేసుకోక తప్పదు. ఖచ్చితంగా వాళ్ళు మళ్ళీ వస్తారు. ఎర్త్ కౌన్సిల్, పిసియుఎఫ్ విభాగం, మాంత్రికుల పర్యవేక్షణ కమిటీ నాకు సాయం చేస్తే, మంచిదే. లేకపోతే నన్ను నేను రక్షించుకోవాలి. ఎందుకంటే ఇది వ్యక్తిగత వైరం... అంతేకాదు స్వీయసంరక్షణ కూడా. వాళ్ళెలాంటివారో నాకు తెలుసు... ఎవరినీ క్షమించరు...''

``సరే'' అంటూ నిట్టూర్చాడు శాన్.

``నేను వెడతాను. కౌన్సిల్‌కి రిపోర్ట్ రాసి పంపిస్తాను. వాళ్ళేం చేస్తారో చూద్దాం...'' అంటూ నాకేసి విచారంగా చూసి బయటకు నడిచాడు.

నేను అక్కడే కూర్చుని మౌనంగా ఆలోచిస్తూండిపోయాను.

❊ ❊ ❊

# 8. ఇండికా సెంట్రల్

**ఇం**డికా సెంట్రల్ యూనివర్సిటీ మధ్యధరా సముద్రం ఒడ్డున ఉంది. సువిశాలమైన కాంపస్. ప్రాచీనత, ఆధునికత ఉట్టిపడే భవనాలు, ఇరువైపులా పచ్చని చెట్లతో నిగనిగలాడే తారు రోడ్లు, దూరంగా నీలి సముద్రంలో గర్జించే అలలు, బీచ్‌ని నిరంతరం తాకే నీటి నురగలు. విద్యార్థులు ఒక తరగతి నుంచి మరో తరగతి గదిలోకి వెళ్ళడానికి మినీబస్‌లను ఉపయోగిస్తారు. ప్రొఫెసర్లు తమ ఎలెక్ట్రిక్ కార్లను వాడతారు. ఆ ప్రాంతమంతా అత్యంత ప్రశాంతంగా ఉంటుంది. నాలుగో సహస్రాబ్దిలో భూమి మీద దేశాలు లేవు, కేవలం జోన్లే ఉన్నాయి. ఇది సెంట్రల్ ఏసియా జోన్, పలురకాల జాతీయతలున్న వ్యక్తులు ఇక్కడ సంచరిస్తూంటారు. సౌత్ ఏసియా జోన్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ, అక్కడివారు వ్యవసాయంపై ఆధారపడతారు. ప్రస్తుతం భూమి మీద జనాభా ఎంత తక్కువగా ఉందంటే మీరు అసలు నమ్మలేరు... కాని నమ్మి తీరాలి. నాలుగింట మూడో వంతు జనాలు యుద్ధాలలో చనిపోవడమో లేదా పాలపుంతలో, సౌరవ్యవస్థలోని ఇతర గ్రహాలకో వెళ్ళిపోయారు. భూమి మీద ప్రస్తుతం ప్రాంతాలకు పేర్లు లేవు, అన్నీ డిజిటల్ నెంబర్లే. ఆమ్రపాలి గ్రామం సౌత్ ఏసియాలో ఎక్కడో జోన్ 990లో ఉంది. అది ఒకప్పుడు భారత ఉపఖండం. ఏరియా 990 నగరం రాజధాని వరకూ నేను విమానంలో వెళ్ళగలను. అక్కడ్నించి, 888-990 సమీపానికి.. బస్‌లో గాని రైల్లో గాని వెళ్ళాలి. ఇది ఏరియా 990 నగరం రాజధాని. ఇది ఒకప్పుడు ఆగ్నేయాసియా. నేను వెళ్ళాల్సిన గ్రామాన్ని మాప్‌లో డిజిటల్ నెంబర్ 990-19-10 గా పేర్కొన్నారు. కాని దాని కింద చిన్న అక్షరాలలో ఆమ్రపాలి అని దాని అసలు పేరు కూడా రాసారు.

నేను వెళ్ళాల్సింది అక్కడికే. నాలాగే, దుష్టశక్తులు కూడా ఆ గ్రామంలో

తమ ప్రశ్నలకు జవాబుల కోసం వెదుకుతాయని నాకనిపిస్తోంది. నాకున్న ఏకైక మార్గమల్లా ధరణి మావయ్య ఇచ్చిన డివిడీలను చూడడం, దేని కోసం వెతకాలో మావయ్యనే అడగడం. దాని గురించే ఆలోచిస్తూ, చేయాల్సిన పనులపై దృష్టి నిలిపాను. గదనంతా చక్కగా సర్దుకున్నాను. ఇంతలో తలుపు చప్పుడయింది. యూనివర్సిటీ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, అతని సిబ్బంది వచ్చారు. ఏవేవో ప్రశ్నలడిగారు, నా సమాధానాలకి మైక్రో రికార్డర్లలో నమోదు చేసుకున్నారు. వాళ్ళు వెళ్ళిపోయాక నిశ్శబ్దం...

నాకు బాగా ఆకలేస్తుంది. బేస్‌మెంట్‌లో ఉన్న డిన్నర్ హాల్‌కి వెళ్ళాలనుకున్నాను. చీకటి పడుతోంది, బహుశా రాత్రి ఎనిమిది గంటలవుతున్నట్లుంది. ఓ బల్లమీద అలసటతో కూలబడి, శాండ్‌విచ్, పళ్ళు ఆర్డర్ ఇచ్చాను. అక్కడున్న బల్లల మీద కొంతమంది విద్యార్థినులు, విద్యార్థులు కూర్చుని ఉన్నారు. టీవీలో సౌర వ్యవస్థకి చెందిన వార్తలు వస్తున్నాయి. తెరంతా రంగులమయంగా ఉంది. టైటాన్ అనే ఉపగ్రహంలో రాజకీయ సంక్షోభం నెలకొన్నట్లుంది. రాజుని పదవి నుంచి తొలగించి, సైన్యం అధికారం హస్తగతం చేసుకొందట. రాజధాని మండిలోని రాజప్రాసాదంలో సైనికులు అడుగుపెడుతున్నారు... వార్తల ప్రసారంపై గట్టి ఆంక్షలున్నట్లున్నాయి. న్యూస్ రీడర్ వీటి గురించి చెబుతూండగానే, తెర మీద శని గ్రహాన్ని, దాని వలయాలని చూపించారు. అలాగే టైటాన్ ఉపగ్రహంలోని చీకటి వీధులను, ఇనుప భవనం ముందున్న పెద్ద పెద్ద ద్వారాలకు కాపలా కాస్తున్న సైనికులు కనబడ్డారు. వాళ్ళు తలకి పెద్ద హెల్మెట్లు ధరించి, లేజర్ గన్‌లతో భవనాన్ని కాపలా కాస్తున్నారు.

నాకు డిమిట్రీ గుర్తొచ్చింది. ఏం చేస్తోందో, ఎలా ఉందో? ఆమె తండ్రి పోసయిడన్ ఎలా ఉన్నాడో? రాజకీయ సంక్షోభం ఉంటే, పౌరులందరూ ఇబ్బంది పడాలనేం లేదు, అయినా ఐజి నెట్‌లో ఆమెకి మెయిల్ చేసి క్షేమ సమాచారాలు కనుక్కోవాలని నిర్ణయించుకున్నాను. కుజుడి మీది ఒలింపస్ శిఖరంపైకి మేమందరం అమృత ఔషధం కోసం వెళ్ళడం గుర్తొచ్చింది. గ్రేట్ హాల్‌లో జరిగిన గొప్ప పోరాటం జ్ఞాపకం వచ్చింది. అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) విశ్వంలోని ఆరు గ్రహాలలో ఆరు అద్భుతమైన శక్తులున్న వస్తువులని దాచిపెట్టిందని సయోనీ చెప్పడం గుర్తొచ్చాయి. శాండ్‌విచ్ తినడం పూర్తయ్యాక, కాఫీ తాగుతూ, విశ్లేషించసాగాను.

నేనే గనుక సమూరాన్నై, అమృత ఔషధం తాగడం ద్వారా నా శక్తు

లన్నింటినీ పోగొట్టుకుని ఉంటే, నేనేం చేస్తాను? ఆ ఔషధం తాగితే అమరత్వం లభిస్తుంది, కానీ మంత్రశక్తులన్నీ పోతాయి కదా (కుజుడి మీద సమూరాకి అదే జరిగింది..). ఇప్పటికీ నాకు విశ్వాసపాత్రులుగా నా మంత్రుల సలహాల తోనూ, మంత్రశక్తులున్న సైన్యం సహాయంతోనూ నేను ప్రతీకారం తీర్చు కోడానికి, నా శక్తులను తిరిగి పొందడానికి ప్రయత్నిస్తాను. ఎందుకంటే కాలం నావైపు ఉంది. నన్నెవరూ చంపలేరు. నా దగ్గర మాత్రమే ఉన్న 'విశ్వశక్తి రహస్య గ్రంథం'లో అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం ఏయే వస్తువులను ఎక్కడ దాచాయో వివరంగా రాసుంది. వాటిని సాధిస్తే నా శక్తులను నేను తిరిగి పొందచ్చు. కుజుడి మీది ఒలింపస్ శిఖరంపై 'అమృత ఔషధం'. భూమి మీద, శుక్రుడి మీద, చంద్రుడి మీద ఏం దాచారో? ఇవన్నీ ఆ అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం పరిశోధనా ఫలితాలు. అవి "నిర్మలంగా, నిస్వార్థంగా ఉండి కేవలం విజ్ఞాన సముపార్జన చేసే మాంత్రికులకే కనబడుతాయి". అమృత ఔషధం గురించే కాకుండా మిగతావాటి గురించి కూడా వివరించారు. గురుని ఉపగ్రహమైన గ్యానిమేడ్ గుహల్లో అద్భుతమైన శక్తులున్న మంత్రదండం, ఐదు ఉన్నత మంత్రవిద్యలను ప్రసాదించే ఔషధాలు శుక్రుడిలోనూ, సుదూర సమాచారాలని చూడగలిగే మహాదర్పణం టైటాన్‌లోనూ, మహాశాపాల నివ్వగలిగే ఎనిమిది శక్తులను భూమి మీదా దాచారట! భూమి మీద ఏ వస్తువులో ఉన్నాయో అవి...

ఏమిటా శక్తులు? భూమి మీద ఎక్కడ, ఏ రూపంలో, ఎలా దాచ బడ్డాయో? ఈ ప్రశ్నలకి నావద్ద జవాబుల్లేవు. కుజుడి మీద ఘోరమైన ద్వంద్వ యుద్ధం జరిగిన ఆ రోజున సయోనీ కూడా ఏం చెప్పలేదు. కాబట్టి సమూరా ఈ గ్రహాన్నింటిలో ఉన్న శక్తులను ఒకదాని తర్వాత మరోదాన్ని సాధించడానికి ప్రయత్నిస్తాడనేది సుస్పష్టం. శక్తులు లేని మాంత్రిక-చక్రవర్తిని అనుచరులు అంగీకరించరు. మరి అతను భూమికి ఎందుకొచ్చినట్లు? కాఫీ ఇంకో గుటక తాగుతూ.. ఏకాగ్రతతో ఆలోచిస్తున్నాను. నేనే ఎందుకు? విశ్వశక్తిని అత్యంత తక్కువస్థాయిలో ఉపయోగించగల అల్ప మానవుడైన ఈ హనీయే యెందుకు? కుజ మాంత్రికులతో పోలిస్తే అతి తక్కువ శక్తులున్న నేనే యెందుకు? ఎందుకని?

ఉన్నట్లుండి కారణం నా మనసుకి తోచింది. కుజుడి మీది ఒలింపస్ శిఖరంపై 'అమృత ఔషధం' తేవడానికి నన్ను ఎంపిక జేసింది అతడే. టెలీపతీ

ద్వారా నన్ను హిప్నటైజ్ చేసి కుజుడి మీదకి రప్పించినది అతడే. ఈ అద్భుత శక్తులు నిర్మలంగా, నిస్వార్థంగా ఉండి కేవలం విజ్ఞాన సముపార్జన చేసే మాంత్రికులకే కనబడుతాయని సయోనీ చెప్పింది. నేను ఇప్పటికే నా నిర్మలత్వాన్నీ, నిస్వార్థాన్ని నిరూపించుకున్నాను. అమృత ఔషధం నాకొక్కడికే కనబడింది, నేనే దాన్ని తెచ్చి సమూరాకి ఇచ్చాను. అయితే ఆ పాత్రతో పాటు ఉన్న తోలు కాగితంలోని జోస్యం - దాన్ని తాగినవాడి శక్తులు నశిస్తాయి - అనే విషయాన్ని మాత్రం సమూరాకి చెప్పలేదు. కాబట్టి భూమి మీద ఉన్న ఎనిమిది శక్తులను దాచిన ఆ వస్తువుని నేనే కనిపెట్టాలి. హనీ.. నిర్మలమైన, నిస్వార్థమైన మానవుడు.. విశ్వశక్తిని స్వార్థానికి ఉపయోగించని వ్యక్తి... కాబట్టి నాకా వస్తువు సులువుగా కనిపిస్తుందన్నమాట! అది వాళ్ళకి ఖచ్చితంగా తెలుసు. లేచి నిలుచున్నాను. అందుకే వాళ్ళు నన్ను చంపలేదు. వాళ్ళకి వాళ్ళ శక్తులు తిరిగి పొందడం కావాలి, అందుకే వాళ్ళ పని చేసేలా - నన్ను బెదిరిస్తున్నారు, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు, భయపెడుతున్నారు... వాళ్ళు నన్ను చంపరు. ఒకవేళ నన్ను చంపేస్తే, విశ్వశక్తిని స్వార్థానికి ఉపయోగించని మరో వ్యక్తిని వాళ్ళు వెతుక్కోవలసి ఉంటుంది.

ఇవన్నీ అలోచిస్తూండగానే, మెస్ మూసేసే సమయం అయింది. బయటకు నడిచాను. అప్పుడప్పుడు తారసపడుతున్న విద్యార్థుల పలకరింపులను పట్టించుకోకుండా నా గది వైపు నడుస్తున్నాను. అద్భుత శక్తులున్న ఆ వస్తువు భూమి మీద ఎక్కడుందో కనిపెట్టాలి. అవసరమైతే ధరణి మావయ్యా డివిడిల సాయం తీసుకోవాలి.

❄ ❄ ❄

# 9. యురేకస్

**చీ**కటి పడడమే ఆలస్యం, నాకు నిద్ర ముంచుకొచ్చింది. నా రక్షణ కోసం ఏర్పాట్లు చేసుకోడం తప్పనిసరి. మిస్టర్ శాన్ కాంపస్ గేట్ల దగ్గర సెక్యూరిటీ ఏర్పాట్లు పెంచినా, హాస్టల్ కారిడార్లలో నిఘా పెంచినా, నా జాగ్రత్తలో నేనుండాలి.

అత్యంత శక్తివంతమైన రోబో, నా సహవాసి అయిన యురేకస్ 7776ని వీలైనంత ఎక్కువ సేపు చార్జింగ్ మోడ్‌లోనే ఉంచాను. ఇప్పటి వరకూ దాన్ని బహిరంగంగా వాడడానికి ఇష్టపడలేదు. దాని సాయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. రోబోట్‌ని దాచి ఉంచిన అలమారా తెరిచి, దాని బటన్స్ ఆన్ చేసాను. దాన్ని నా పక్కనే లేదా నా గదిలో రక్షణ కోసం ఉంచకపోవడం నేను చేసిన తప్పు. ఎవరైనా మాంత్రికుడు లేదా విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తి లేదా గ్రహాంతరవాసి నా గదిపై దాడి చేస్తారని అస్సలు ఊహించలేదు. యురేకస్ ఉండి ఉంటే నా వస్తువులను కాపాడగలిగేది లేదా అధికారులను అప్రమత్తం చేసుండేది లేదా కనీసం చొరబాటుదార్ల వీడియో అయినా తీసుండేది.

యురేకస్ 7776 మళ్ళీ జీవం పోసుకుంది. ఈ నాలుగో సహస్రాబ్దిలోనైనా రోబో పని చేయాలంటే దానిలో విద్యుత్ నిలవ ఉండైనా ఉండాలి లేదా విద్యుత్‌తో అనుసంధానమై ఉండాలి. పవర్ లేకపోయినా, పవర్ ఆఫ్ చేయబడినా ఆ రోబో దండగ. కంట్రోల్స్ మాత్రం దాని యజమాని చేతిలో ఉంటాయి. ఎప్పుడో ఇరవయ్యో శతాబ్దంలో అసిమోవ్ చెప్పిన సూత్రాలు రోబోల మీద ఇప్పటికీ కొంతవరకూ పనిచేస్తూనే ఉన్నాయి!

"గుడ్ డే మాస్టర్..!" అంటూ రోబో లోహ స్వరం ఠంగున మ్రోగింది. దాని స్వరంలో తాజాదనం, ఆత్మవిశ్వాసం.

"క్రీ. శ. 3265 జనవరి నెల 21 తారీఖు సమయం రాత్రి 11 గంటలు..."

ఇలా అది సమయం చెబుతుంటే దాని ముందు వైపు, యాంటీనా మీద లైట్లు వెలిగాయి.

"సారీ యురేకస్, నిన్ను చాలా రోజులు డిస్‌కనెక్ట్ చేసి ఉంచాను. ఇప్పుడు నీ సాయం నాక్కావాలి..."

ఎవరైనా ఇంట్లో చొరబడితే కనుక్కునేలా, వేలిముద్రలు తీసుకునేలా, ఫోటోలు తీసుకునేలా, స్వరాలు, వాసనలు రికార్డ్ చేసేలా ప్రోగ్రామ్ చేసాను. ఎవరైనా విశ్వశక్తిని ఉపయోగిస్తే, వెలువడే విద్యుత్ తరంగాలను నిలువరించేలా చేసాను. ఇంకా, చొరబాటుదారుల ఫోటోలను, ఇతర సమాచారాన్ని వెంటనే గ్రహించేందుకు గాను దాన్ని గెలాక్టికా ఎన్‌సైక్లోపీడియాకి కూడా కనెక్ట్ చేసాను.

యు-7776 ఓ అద్భుతమైన గ్రహాంతర రోబో. కుజగ్రహంలో సమూరా దుష్టపాలన అంతమయ్యాక, అరుణభూములకు రాజైన నా మిత్రుడు మీరోస్ నాకిచ్చిన కానుక అది. యు-7776 సమాచారాన్ని నిలువ చేసుకోగలదు, అవసరమైనప్పుడు అందించనూగలదు. ప్రణాళికలు రూపొందించగలదు, తేలికపాటి యుద్ధాలు చేయగలదు, పైగా అణు విస్ఫోటనం కూడా దాన్ని నశింపజేయలేదు. అయితే ఉన్న ఒకే ఒక సమస్య, ఏంటంటే, బ్యాటరీ అయిపోయిందంటే మాత్రం అది పనిచేయదు, కనీసం వారానికి ఒకసారైనా చార్జింగ్ చేయాలి.

కళ్ళు మూతలు పడుతుండడంతో, నిద్రకి సిద్ధమయ్యాను.

'రేపొద్దున్నకల్లా, నా గదిలోకి చొరబడిన వ్యక్తుల సమాచారం, వారి వేలిముద్రల విశ్లేషణ, విశ్వశక్తి యొక్క తరంగాల లక్షణాలు నాకు కావాలి. నీకో కిటుకు చెప్తాను. వచ్చినవాళ్ళు కుజుడి మీద అరుణభూములకు చెందిన మాంత్రికులై ఉండచ్చు, లేదా సమూరా మంత్రులు అయ్యుండచ్చు.." అని చెప్పాను యురేకస్‌తో.

"సరే, సరే మాస్టర్. నేను గదులన్నీ వెతుకుతాను. మీకు కాపలాగా ఉంటాను. మళ్ళీ ఎవరైనా వస్తే యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారులకీ, మిస్టర్ శాన్ ఆఫీసుకి తెలియజేస్తాను. మీరు హాయిగా నిద్రపొండి.." అంది యురేకస్.

యురేకస్ భరోసాతో నేను ప్రశాంతంగా నిద్రపోయాను. అలసిన నా మెదడు కూడా సాంత్వన పొందింది. కానీ, ఆలోచనలకీ, ఊహాలకి అలవాటు పడిన నా మనసు ఖాళీగా ఉండదు. నా కలలో నేను - దూరంగా ఓ గ్రామాన్ని చూసాను. అనేక కొబ్బరి చెట్లు, ఆకుపచ్చని పొలాలు, దట్టమైన నీలిరంగుతో ప్రవహిస్తున్న పంట కాలువలు.. నీలి ఆకాశంలో రకరకాల ఆకారాల్లో తెల్లని మేఘాలు.. చలికాలపు లేలేత ఎండ ఇటుకలతో కట్టిన ఇళ్ళపైన, తాటాకు గుడిసెలపైన పడుతోంది. ఏదో మత్తులో నడుస్తున్నవాడిలా ఆ గ్రామపు మట్టిరోడ్ల మీద నడుస్తున్న నన్ను నేను చూసాను. 'అమ్రపాలి... మా నాన్న ఊరు...' అంటూ నాకు నేను చెప్పుకున్నాను.

రెండు వేల సంవత్సరాల వయసున్న గ్రామం గతం ప్రత్యక్షమైనట్లుంది. విశాలమైన మట్టిరోడ్లకు రెండు వైపులా ఇళ్ళు, గడ్డం ఉన్న వృద్ధరైతులు పొలాల వైపు నడుస్తున్నారు. దూరంగా ఏదో పొలంలో ట్రాక్టర్ దున్నుతోంది. బహుశా వరి పండిస్తున్నారేమో. చల్లగాలికి తమ మెడలో ఉన్న చిరుగంటలు మ్రోగుతుండగా ఎడ్లు బండ్లను లాగుతున్నాయి. నేను అలా గమ్యం తెలియకుండా నడుస్తూనే ఉన్నాను. చివరికి నీలి రంగు నీరున్న ఓ సరస్సు దగ్గర ఆగాను. ఆకుపచ్చని ఆకులు, తెల్లని తామరపూలతో ఉన్న ఆ సరస్సులో తేనెటీగలు ఒక పూవు నుంచి ఇంకో పూవు మీదకి ఎగురుతున్నాయి. స్వచ్ఛమైన నీటి, మట్టి వాసన! ఈ సరస్సు విశాలమైనది. అనేక మార్గాలు ఉన్నాయి. జాగ్రత్తగా దిగి నీరు తోడుకునేందుకు వీలుగా రాతిమెట్లు ఉన్నాయి. అది ఎంతో ప్రాచీనమైన సరస్సులా అనిపిస్తోంది, బహుశా ఓ సహస్రాబ్ది క్రితందేమో. గ్రామీణ వాతావరణం ఏమాత్రం మారలేదు. కాలం ఆగిపోయి, చాలా కాలం నుంచి నిశ్చలంగా ఉన్న దృశ్యంలా ఉంది. సరిగ్గా అప్పుడే ఆమెను చూసాను.

రంగురంగుల దుస్తులు ధరించిన పొడుగాటి, అందమైన అమ్మాయి, బహుశా ఓ ఇరవై ఏళ్ళు ఉంటాయోమో, నీళ్ళు తోడుకునేందుకు బిందెతో నడుస్తోంది. ఆమె రూపం దివ్యంగా ఉంది, చర్మం గులాబీ రంగులో ఉంది. కనురెప్పలు నల్లటి రంగులో ఉన్నాయి. ఆమె పొడవాటి కేశాలు గాలికి ఎగురుతున్నాయి. ఆమె గాజులు గలగలలాడుతూ ఓ వింత సవ్వడిని చేస్తున్నాయి. మెరుస్తున్న ఎరుపు రంగు పూలున్న దుస్తులు వేసుకుంది. నీళ్ళలో

బిందెని ముంచి, నీటి బిందెని తలమీద పెట్టుకుంది. రెండు చేతులతోనూ బిందెని పట్టుకుని నడుస్తూంటే ఆమె చేతులపై సూర్యరశ్మి పడి అవి బంగారు రంగులో ప్రకాశించసాగాయి. ఆమె నడుస్తూ, సరస్సు ఒడ్డునే ఉన్న తన ఇంటి వైపు వెళ్ళసాగింది. ఆమె ముఖం ఎంత ప్రశాంతతని కలిగించిందో చెప్పలేను. ఆమె నాకు ఇంతకుముందే తెలుసనే భావన గట్టిగా కలిగింది. ఆమె కనుమరుగు కాగానే నేను మళ్ళీ నా దీర్ఘమైన గాఢనిద్రలోకి జారు కున్నాను. నిద్రలో కూడా ఆమె కాలి మువ్వల శబ్దం, అక్కడ వీస్తున్న గాలి, తేనెటీగల ఝుంకారాలు, సరస్సులోని అలల మెత్తటి సవ్వడులు ... వీటినే గుర్తుంచుకుని, మరీ వింటున్నాను.

❄ ❄ ❄

# 10. వర్తమానంలోకి... క్రీ.శ. 3265

**బ్యాం**క్ ఆఫ్ ఇండికా సెంట్రల్ బ్రాంచి ఉన్న భూగృహంలోకి ప్రవేశించాను. ధరణి మావయ్యతో మాట్లాడాలని డివిడి ప్లేయర్‌ని ఆన్ చేసాను. విరబోసుకున్న ఉంగరాల జుట్టుతోనూ, గడ్డంతోనూ ఉన్న మావయ్య ముఖం తెరమీద ప్రత్యక్షమైంది. నా ప్రశ్నలకు జవాబులివ్వసాగాడు మావయ్య.

"మావయ్యా, నీకు అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం గురించి, విశ్వశక్తి రహస్య గ్రంథం గురించి, విశ్వంలోని ఆరు గ్రహాలలో ఆరు అద్భుతమైన శక్తులున్న వస్తువుల గురించి తెలుసా?" అడిగాను.

కాస్త విరామం... డివిడి తెర నిశ్చలంగా ఉండిపోయింది.

కాసేపటికి మావయ్య మాట్లాడసాగాడు.

"ఏవైనా కీవర్డ్ టైప్ చెయ్యి.. అంటే... ఐ.జి. నెట్‌లో వెదికినట్లు... అప్పుడే చెప్పగలను.. అవన్నీ చాలా రహస్యమైన అంశాలు.."

నేను కొన్ని పదాలు టైప్ చేసాను.

"శుక్రుడు, మంత్రదండం"

"ఏడు మహా శాపాలు"

"మహాదర్పణం.."

ఏదో ఆధారం దొరికినట్లు మావయ్య చెప్పసాగాడు.

"అవును. ఆరు అద్భుతమైన శక్తులున్న వస్తువులను, స్వార్థ మాంత్రికుల చేతికి చిక్కకూడదని విశ్వంలోని ఆరు గ్రహాలలో దాచింది అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం. వాటిని మంత్రశక్తులతో సంరక్షిస్తోంది. అవి నిర్మలంగా, నిస్వార్థంగా ఉండి కేవలం విజ్ఞాన సముపార్జన చేసే మాంత్రికులకే కనబడుతాయి. కుజుడి మీది ఒలింపస్ శిఖరంపై 'అమృత ఔషధం', గురుని ఉపగ్రహ

మైన గ్యానిమేడ్ గుహల్లో అద్భుతమైన శక్తులున్న 'మంత్రదండం'... అంటూ ఆపాడు మావయ్య.

"భూమి మీద ఏం దాచారో చెప్పు మావయ్యా..."

వెతకడం సులువుగా ఉండాలని, 'భూమి', 'భూగ్రహం' అని టైప్ చేసాను.

మావయ్య కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

"అదో రహస్యం. అందుకే నీకు చెప్పలేదు. మీ అమ్మానాన్నలు హత్యకి గురవడానికి కారణం ఆ రహస్యమే. ఇక నువ్వు అడిగావు, పైగా చెప్పాల్సిన సమయమూ వచ్చేసింది. మహా శాపాలను ఉపయోగించే పరికరం ఎక్కడ దాచబడి ఉందంటే..." అంటూ ఆపాడు. మావయ్య పళ్ళు బిగుసుకున్నాయి.

"ఆమ్రపాలిలో ఉంది."

"సరిగ్గా చెప్పు.." ఆత్రుతతో అరిచాను.

"అదెక్కడుందో ఖచ్చితంగా తెలియదు. పురాతనమైన భైరవాలయం నేలమాళిగలో ఓ గదిలో దాచబడి ఉందని అంటారు. అత్యంత శక్తిమంతమైన నాగబంధం వేసున్న ఆ గది తాళాలను తెరిస్తే అరిష్టమని నమ్మకం"

"అంటే వాటికి నాగుపాము కాపలా ఉంటుందా?"

"అవును. ఒకటి కాదు, అనేక విషనాగులు కాపలా ఉంటాయట. అవి ఆ నేలమాళిగలోనే ఉంటాయట. అందుకే ఆ గది తలుపులపై పాముల బొమ్మలు ఉంటాయి. ఆ గది తలుపులను తెరిచిన వారెవరూ బతికుండరని నమ్మకం. కాని ఆ శక్తులు ఊరి దక్షిణ దిశలో ఉన్న మీ నాన్న పొలంలోని మఱ్ఱిచెట్టు కింద ఉన్నాయని కొందరు మాంత్రికులు.. మీ పరిభాషలో విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులు చెబుతారు...."

ఇప్పుడు నాకు అర్థమవుతోంది.

ఆనాడు ఆ వర్షం కురిసిన రాత్రి.. నాన్న పోరాడింది ఖచ్చితంగా దుష్ట శక్తులతోనే... వాళ్ళు ఆ శక్తులను సాధించడానికే వచ్చుంటారు.

"దక్షిణాసియాలోని మాంత్రికులలో వినబడే పుకార్ల ప్రకారం - మీ నాన్న నారా, అతని వారసుడైన నువ్వు మాత్రమే ఆమ్రపాలిలో దాచబడి ఉన్న ఆ శక్తులను కనుక్కోగలరు. మంచివో చెడ్డవో ఆ శక్తులను ఏరకంగానైనా కాపాడాలి, వేరెవరూ వాటిని ఉపయోగించకుండా చూడాలి. మీ నాన్న వాటిని కాపాడడానికే తన ప్రాణాలర్పించాడు. కాబట్టి ఆ మఱ్ఱిచెట్టు కింద

ఉన్నదేదయినా లేదా గుడిలోని నేలమాళిగలో ఉన్నదయినా....''

చాలా స్పష్టంగా ఉందని నాకు అనిపించింది. కుజుడి మీది దుష్ట మాంత్రికులు భూమి మీదకి వచ్చారు, మహాశక్తులను సాధించేందుకు నేనే కీలకమైన వ్యక్తినని తెలుసుకున్నారు. అందుకే నా వెంటపడ్డారు. ఇదంతా అర్థమయ్యేసరికి, వాళ్ళు నన్ను చంపరని గ్రహించాను. పోయిన శక్తులను, అవెక్కడ దాచబడి ఉన్నా, వాటిని పొందడానికి సమూరాకి నా అవసరం ఎంతో ఉంది.

''మావయ్యా, ఓ విషయం చెప్పండి. ఆమ్రపాలిలో ఇంకా ఎవరైనా మాంత్రికులు లేదా విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులు ఎవరైనా ఉన్నారా?''

''నాకు తెలిసినంతవరకూ, నేనూ, మీ అమ్మానాన్నలు, నువ్వు మాత్రమే ఆమ్రపాలిలో విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులం. మీ అమ్మానాన్నలు తమ మంత్రశక్తులను మంచికే ఉపయోగించారు. అవసరమైనప్పుడు వానలు కురిపించడం, పంటల చీడలు తొలగించడం, పశువుల రోగాలు నయం చేయడం, దుష్టమాంత్రికుల మంత్రోపయోగాలకు విరుగుడు చేయడం వంటివి చేసేవారు, అది కూడా అతి తక్కువ రుసుం తీసుకుని. వాళ్ళు వ్యవసాయం చేసుకుని జీవించేవారు. కానీ గ్రామపెద్దలకు మీ అమ్మానాన్నల మీద అనుమానం వచ్చింది. గ్రామం బయటకి తరిమేసారు. పండగలు పబ్బాలకి కూడా తోటి గ్రామస్తులతో కలవనీయలేదు. అయినా మీ అమ్మానాన్నల జీవనానికి ఇబ్బంది కలగలేదు, హాయిగా బతికారు. మీ నాన్న తన పరిశోధనలు చేసుకుంటూ, భూమి మీద, విశ్వంలోని ఇతర గ్రహాలలో ఉన్న విశ్వశక్తిని మంచి ప్రయోజనాలకు కోసం ఉపయోగించేవారితో సంప్రదింపులు కొనసాగించాడు. ఆయన నిజంగా గొప్పవాడు...''

''ఆ వర్షం రాత్రి దుష్టశక్తులు వచ్చి అమ్మానాన్నలను చంపేసేవరకు అంతా సక్రమంగానే ఉంది కదా మావయ్యా...''

''మావయ్యా, ఇక ఇది తీవ్రమవుతోంది. ఇప్పుడు నేను మూడో శ్రేణి మాంత్రికుడిని. పైగా కుజుడి మీదకు కూడా వెళ్ళొచ్చాను. గొప్ప శక్తులున్న మాంత్రికులతో పోరాడాను. కష్టసాధ్యమైన కార్యం - ఒలింపస్ పర్వత శిఖరం నుంచి అమృత ఔషధాన్ని తీసుకురావడం - సాధించగలిగాను. ఇంకా ఎన్నో దుర్గమమైన పనులు చేసాను. ఇక ఇప్పుడు అమ్మానాన్నలను చంపినవాళ్ళ మీద వ్యక్తిగతంగా పగ తీర్చుకోవాలనుకుంటున్నాను..''

“శాంతించు హనీ, శాంతించు. మంచి మాంత్రికుడెప్పుడు క్రోధానికి గురవకూడదు. కేవలం దృఢమైన పట్టుదల కలిగి ఉండాలంతే. ద్వేషం ఉండ కూడదు, ఎందుకంటే ద్వేషం నిన్ను లోపలి నుంచి దహించివేస్తుంది. ద్వేషం లేకుండా - నిర్వికారతతోనూ, ధైర్యంతోనూ చెడును నాశనం చేయడానికి పూనుకో. అప్పుడే విజయం లభిస్తుంది. స్వార్థం పనికిరాదు. వ్యక్తిగత పగలు వద్దు. తప్పనిసరి అయితే తప్ప ఎవరికీ చెడు చేయకు, ఎవరినీ చంపకు”

మావయ్య గంభీరంగా చెప్పాడు.  మళ్ళీ కొనసాగించాడు.

“ఎన్‌సైక్లోపీడియా గెలాక్టియా చదువు. విశ్వశక్తి రహస్య గ్రంథం చదువు. ఎటువంటి విద్యుత్తరంగాలు లేకుండా, ఎవరికీ తెలియకుండా నీ సాధన కొనసాగించు. విశ్వశక్తి రహస్య గ్రంథంలోని ఎనిమిదో అధ్యాయం చదువు. ఏకాగ్రతతో సాధన చేసి, విద్యుత్ తరంగాలను అతి తక్కువ స్థాయిలో ఉత్పత్తి అయ్యేలా ఎలా చేయచ్చో అందులో ఉంది. శారీరక బలం ఉపయోగించు, వీలైనంత వరకు తుపాకులు, కత్తులు వాడు. నిజంగా అత్యవసరం అయినప్పుడే మంత్రబలం ఉపయోగించు. తద్వారా ఎర్త్ కౌన్సిల్ దృష్టి నుంచి తప్పించుకోవచ్చు. విశ్వశక్తిని సాధన చేసినందుకు శిక్షగా విధించే ఖైదును తప్పించుకోవచ్చు. నువ్వు జీవితాంతం జైలులో ఉండాల్సిరావచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండు...”

నేను గట్టిగా నిట్టూర్చాను. కొత్త సమస్యలు.. ఈ భూమిమీద నేను మళ్ళీ మనుష్యుల చేత, మాంత్రికుల చేత వెంటాడబడతాను.

“సరే మావయ్యా, నీ సలహా పాటిస్తాను. నీ సాయం నాకెప్పుడూ కావాలి. నాకు అవసరమైనప్పుడు నీతో మాట్లాడడానికి ఏదైనా పద్ధతి ఉందా? ఈ డివిడీలను నాతో తీసుకువెడతాను.”

“వద్దు. ఈ డివిడిలను ఇక్కడే లాకర్‌లో ఉంచు. ఈ డివిడీలలోని సమాచారాన్నంతా నీ రోబో యురేకస్‌లో డౌన్‌లోడ్ చేసుకో, సీక్రెట్ పాస్‌వర్డ్‌తో మాత్రమే తెరువు. నీ రోబోని ఎవరైనా దొంగిలించినా, లేదా అది నాశనమైనా బ్యాంకు లాకర్‌లోని డివిడీలు బ్యాక్‌అప్‌గా ఉపయోగపడతాయి..”

“అద్భుతం మావయ్యా. అలాగే చేస్తాను... రోబో U-7776 హాల్లో ఉంది. దాన్ని ఇక్కడికి తెచ్చి డౌన్‌లోడింగ్ మొదలుపెడతాను”.

❄ ❄ ❄

# 11. భూమి - సాంకేతికత

**4**వ సహస్రాబ్దిలో భూమి - అత్యాధునిక సాంకేతికాభివృద్ధి చెందిన ప్రాంతాలూ, అతి ప్రాచీన, యుద్ధ పిపాసమైన అభివృద్ధికి ఏ మాత్రం నోచుకోని ప్రాంతాల మిశ్రమంలా ఉంది. 21 వ శతాబ్దపు దేశాల విభజనకి కాలం చెల్లింది. ఆర్థికంగా బలవంతులైన అమెరికా, చైనాల మధ్య 2050లో జరిగిన 4వ ప్రపంచ యుద్ధం అనేక చిన్న దేశాలను నాశనం చేసింది. ఇరాన్, వెనిజులా వంటి చిన్న దేశాలలోని అణురియాక్టర్లలో ప్రమాదవశాత్తు జరిగిన విస్ఫోటనాల వల్ల సంభవించిన అణు విపత్తుల వలన దక్షిణ ఆసియాలోనూ, దక్షిణ అమెరికాలోనూ ఎన్నో ప్రాంతాలు నశించాయి. 3012లో కెనడా ఉత్తరాగ్రంలోని ఓ అమెరికా నగరంలో ఉల్కాపాతం వల్ల బీభత్సమైన వరదలు సంభవించి పర్యావరణ ప్రమాదాలు తలెత్తాయి. సహస్రాబ్ది మొత్తం తీవ్రవాదుల యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి, ఫలితంగా అభివృద్ధి చెందిన దేశాలు సౌరవ్యవస్థలోని ఇతర గ్రహాల వైపు చూడసాగాయి.

గొప్పదేశాలు, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఇంగ్లండ్, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్ ఇప్పటికే - అణు, రసాయన, జీవాయుధాలు కలిగిఉన్న తీవ్రవాదులతో వేగలేక తమ దేశాలలోని పెద్ద పెద్ద నగరాలను విడిచి సుదూర గ్రహాలకు వలసలు ప్రారంభించాయి. చంద్రుడిని ఆరాధించే ఓ తెగవారితో ప్రారంభమైన మహమ్మారి ఆసియా నగరాలనెన్నింటినో తుడిచిపెట్టేయడం నాకు గుర్తుంది. ధనవంతులు భూమి నుంచి వలసపోగా, ఇక్కడ ఉండిపోయిన సముదాయాలు, జాతులు కలసి 2075లో ఎర్త్ కౌన్సిల్‌ను తమ పాలనా సంస్థగా ఏర్పాటు చేసుకున్నారు. 21వ శతాబ్దపు ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వంటివి ఎర్త్ కౌన్సిల్ యొక్క రాజకీయ, ఆర్థిక విభాగాలుగా మారాయి. క్రీ. శ.

3000 సంవత్సరం నాటికి భూమి మీద జనాభా కేవలం 200 కోట్లు మాత్రమే, అందులో మూడింట రెండు వంతులు ఆసియాలోనూ, ఇప్పటికీ ఇంకా నాశనం కాకుండా మిగిలి ఉన్న ఆఫ్రికాలోనూ ఉంటున్నారు. ఆసియాలో జనాలు చిన్న చిన్న పట్టణాలలోనూ, గ్రామాలలోనూ నివసిస్తున్నారు. పేదలు తమ జీవనోపాధికై వ్యవసాయం మీద, చిన్న చిన్న వ్యాపారాల మీద ఆధారపడ్డారు. ఉత్తర దక్షిణ అమెరికాలు, చైనా, రష్యా, జపాన్ జోన్లు సాంకేతికాభివృద్ధి సాధించినవి. అక్కడి ప్రజలు తరచూగా గ్రహాంతర ప్రయాణాలు చేస్తూంటారు. ఆహారోత్పత్తి, దుస్తుల తయారీ, ఎలక్ట్రానిక్ వస్తువులు, రవాణా పరిశ్రమలు బాగా వృద్ధి చెంది గ్రహాంతర ప్రమాణాలను అందుకున్నాయి. గ్రహాంతర, గెలాక్సీ స్థాయిలో ఎగుమతి దిగుమతులు చేయడం వల్ల ఈ జోన్లలోని ప్రాంతాలు - ఆసియా, ఆఫ్రికా జోన్లలోని ప్రాంతాలపై ఆర్థికంగా దోపిడీకం చేస్తూంటాయి. వీటికి కూడా స్థానిక పాలన మండలులు ఉంటాయి, అవి ఎర్త్ కౌన్సిల్‌కి లోబడి పని చేస్తాయి.

భూమి పాలనా వ్యవహారాలు, ఆర్థిక రంగం, రక్షణ అన్నీ ఎర్త్ కౌన్సిల్ చూసుకుంటుంది. దీనిలో ఎన్నో అదృశ్య కమిటీలు ఉన్నాయి. ఆర్థికంగా గొప్పవైన ప్రాంతాలలోని అనుభవజ్ఞులుండడం, రిమోట్ ద్వారా నియంత్రించబడే క్షిపణులు, ఆయుధాల వల్ల మిగతా అందరూ ఎర్త్ కౌన్సిల్ అధికారానికి లొంగి ఉన్నారు. ఉత్తర అమెరికా నుంచి నియంత్రించబడే పైలట్ రహిత సూక్ష్మ యుద్ధ విమానాలు, న్యూక్లియర్, కెమికల్ వార్ హెడ్స్ మోసుకుపోగల చిన్న విమానాలు ఎక్కడైనా తిరుగుబాటు, స్వతంత్ర్యోద్యమం, తీవ్రవాదం తలెత్తిందంటే వెంటనే అణిచివేస్తాయి. నిజానికి భూమి మొత్తం - రూప రహిత వ్యక్తులతో నిఘా ఉపగ్రహ కెమెరాల ద్వారా నియంత్రించబడింది. ఆలోచనా ప్రక్రియలను కూడా పర్యవేక్షించేవారేమోనని నా అనుమానం. దీని గురించి ఏ వార్తాపత్రికలోనూ, టివీలోనూ చర్చించలేదు. ఎర్త్ కౌన్సిల్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా 'అజ్ఞాత, విమర్శించరాని సంస్థ' అని మాత్రం పేర్కొనేవారు. జనాలు ఎన్నో ప్రాంతాలలో నివాసం ఉండేవారు. బాగా చదువుకుని, గొప్ప ప్రాంతాలకు ఉద్యోగాల కోసం వెళ్ళేవాళ్ళు. కొంతమంది గ్రహాంతర ఉద్యోగాలు లేదా నియోజనాలు సంపాదించి భూమి నుంచి వెళ్ళిపోయేవాళ్ళు. మరికొందరు వారి అర్హతలతో భూమిని విడిచి, ఇతర గ్రహాలలో శాశ్వత నివాసం ఏర్పరుచుకున్నారు.

దురదృష్టవంతులైన పేదలు మాత్రం దక్షిణ ఆసియాలోనూ, ఆఫ్రికాలోనూ, దక్షిణ అమెరికాలోని సుదూర ప్రాంతాలలోని చిన్న చిన్న ఊళ్లలోనూ, గ్రామాలలోనూ ఉండిపోయారు. పేద ప్రాంతాలలో ఏం జరుగుతోందో ఎవరికీ సరిగా తెలియదు. ఒకప్పటి పాత రాతియుగంలా ఉందిప్పుడు ఈ ప్రాంతాలలో. అభివృద్ధి చెందిన ప్రజలెవ్వరూ వీటి కేసి చూడను కూడా చూడరు, పైగా వాళ్ళ దృష్టి ఎప్పుడూ అంతరిక్ష వేదికపైనే ఉంటుంది, భూమికి దూరంగా చక్కని జీవితం గడపాలని చూస్తారు.

సౌత్ జోన్ రాజధాని నగరం ఎస్. 888 (ఒకప్పుడు న్యూఢిల్లీ)కి విమానంలో వెళ్ళి అక్కడ్నించి రైల్లో గాని బస్‌లో గాని ఆమ్రపాలికి వెళ్ళాలని అనుకున్నాను. భూగోళానికి దక్షిణ దిశలో ఉన్న గ్రామాలకు విశిష్టమైన ఐదు అంకెల గుర్తింపు సంఖ్యలనిచ్చారు. ఇది డిజిటల్ భూమి. అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాలు, ప్రాంతాలు, ఇంకా మనుషులకి సైతం ఓ విశిష్ట సంకేత సంఖ్య ఉంటుంది. తమ బంధుమిత్రులతో వ్యవహరించేటప్పుడు మాత్రం పిల్లలకి, పెద్దలకి, ఆడవాళ్లకి, మగవాళ్లకి, ప్రదేశాలకి పేర్లుంటాయి. కాని ఎర్త్ కౌన్సిల్‌కి మాత్రం అన్నీ డిజిటలే. ఫలితంగా అది అన్నింటినీ చూడగలుగుతుంది, పర్యవేక్షించగలుగుతుంది, వృద్ధి చేయగలుగుతుంది. యాజమాన్యం వహించగలుగుతుంది, అవసరమైతే, పరిస్థితులు తమకు అనుకూలంగా లేకపోతే రిమోట్ ద్వారా బాంబులు వేసి, పరిస్థితులను నియంత్రించ గలుగుతుంది.

నేను నా సామన్లను సర్దుకున్నాను, రోబోని కూడా నా వెంట తీసుకువెళ్ల దలచాను (దానికి లగేజ్ టికట్ కొన్నాను). దాన్ని నా వెంట కాబిన్‌లో ఉంచుకో నిస్తారు. నా కోసం ఓ టాక్సీని పిలిచింది రోబో. బయల్దేరే ముందు, నేను మిస్టర్ శాన్‌ని కల్సి సెలవు కోసం దరఖాస్తు చేసాను. ఎక్కడికి వెడుతున్నాను, ఎక్కడెక్కడ ఉండబోతున్నానో, ఏం చేయబోతున్నానో అన్ని వివరాలు అతనికి చెప్పాను.

“ఎర్త్ కౌన్సిల్ దీనికి అంగీకరించక పోవచ్చు..” అన్నాడు శాన్, పళ్ళు బిగపెడుతూ.

“కానీ నువ్వు వాళ్ళ పర్యవేక్షణలో ఉన్నంత కాలం, విశ్వశక్తి లేదా మంత్రాలు లేదా క్షుద్రవిద్యలని సాధన చేయనంత కాలం నువ్వు క్షేమంగా

ఉంటావు. ప్రొఫెసర్ హనీ! గుర్తుంచుకో.. నీకు డిజిటల్ ఉనికి ఉంది, పైగా నిన్ను నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉంటారు. ఎల్లప్పుడూ! ఎక్కడికి వెళ్ళినా సరే. నన్ను నమ్ము... వాళ్ళు అత్యంత శక్తిమంతులు, వాళ్ళ మాటలు చేతలూ ఒకేలా ఉంటాయి..."

"వాళ్ళ చేతలెలా ఉంటాయి సర్?"

"సమస్య తలెత్తడం లేదా రక్షణ వ్యవస్థకి భంగం కలగడం వాళ్ళకి ఇష్టం ఉండదు. ప్రస్తుతం మానవులకీ, విశ్వశక్తిని ఉపయోగించగలిగేవారికి మధ్య యుద్ధాలేవీ జరగడం లేదు. కాబట్టి ప్రతీకారం కోసం పోరాటాలేవి లేవు. అవసరమైతే సమీపంలోని ఎర్త్ కౌన్సిల్ వారి సెక్యూరిటీ స్టేషన్‌ని లా అండ్ ఆర్డర్ కోసం సందర్శించు. నీ విశిష్ట సంఖ్య... X 333-666-78231 బాగా పెద్దదని అనిపిస్తే..." పళ్ళికిలించాడు. అంతలోనే మాట్లాడుతూ, "కాని ఆమ్రపాలి సెక్యూరిటీ గురించి నెట్‌లో వెతుకుతూ అందుబాటులో ఉండు.." అని చెప్పాడు.

"ఓకే సర్."

"బై హనీ. జాగ్రత్త. దేవుడు నీకు మేలు చేయుగాక."

'నా విశ్వశక్తి నాతో ఉండు గాక!' అని నేను అనుకుని, అభివాదం చేసి, సెలవు తీసుకున్నాను.

❄ ❄ ❄

# 12. ఇండికా సెంట్రల్ సమీపంలోని ఎయిర్‌పోర్ట్

**మా** యూనివర్సిటీకి దగ్గర్లో ఉన్న విమానాశ్రయానికి పేరూ, సంఖ్యా రెండూ ఉన్నాయి. దాని విశిష్ట సంఖ్య SA 3907. ఎస్ ఎ అంటే సదరన్ ఎయిర్‌పోర్ట్ అని అర్థం. పేరేమో వీరా ఇంటర్నేషనల్. ఈ వీరా అనే ఆయన భారత జాతీయుడు, ఆసియా వాసి. 4వ సహస్రాబ్దిలో ఆసియాలోని వెనుక బడిన ప్రాంతాల మెరుగుదల కోసం రాజకీయ ఉద్యమం నడిపాడు. అహింసా పద్ధతులతో ఉద్యమాలు చేస్తూ, సమ్మెలు చేయించి, ఆసియాలోని వెనుకబడిన ప్రాంతాలకు చక్కని రహదార్లు, విద్యుత్, అనుసంధానం, విద్య అందించగలిగాడు. ఆయన ఓ సమావేశంలో మాట్లాడుతూండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆయనని లేజర్ గన్‌తో కాల్చి చంపడం విషాదం.

వీరా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో నేను, నా రోబో యురేకస్‌తోనూ, ఓ చిన్న సూట్‌కేసుతోను తిరుగుతున్నాను. సదరన్ జోన్ రాజధాని ఎస్ 888కి వెళ్ళడం కోసం పోర్ట్ నెంబర్ 3 దగ్గర వేచి ఉన్నాను. విమానాశ్రయం నిండా ప్రయాణీకులు.... అందులో సగం మంది వేరే గ్రహాల నుంచి వచ్చినవారే. వాళ్ళ దుస్తులు, శరీర ఆకారాలు విభిన్నంగా ఉన్నాయి.

గ్రహాంతరవాసులు కూడ భూమిని సందర్శిస్తాంటారు. వాళ్ళు స్థానికులతో ఎక్కువగా కలవరు. వాళ్ళు ఎక్కువగా బీచ్‌లకీ, అటవీ ప్రాంతాలకీ, హిల్ స్టేషన్లకీ వెడతారు. అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, పరీక్షించాక కాని వారిని భూమి మీద నగరాలకీ, గ్రామాలకీ పంపడం జరగదు. ఏదైనా నేరం చేస్తారేమోనని, వాళ్ళపై విద్యుత్, సాంకేతిక పద్ధతులలో కూడా నిఘా ఉంచుతారు. ఈ కారణం వల్లనే భూమి, మిగతా గ్రహాలతో పోలిస్తే, పర్యాటక రంగంలో వెనుకబడి ఉంది.

ఎస్ 888కి వెళ్ళడం కోసం ఇక్కడ విమానం ఎక్కుతాను, తర్వాత ఎస్ - 533367 అనే ఊరికి వెళ్ళడానికి రైలు ఎక్కుతాను, అక్కడినుంచి ఆమ్రపాలికి బస్‌లో గాని లేదా ఏదైనా కారు అద్దెకు తీసుకుని గాని వెడతాను.

"మాస్టర్, విమానంలో మీకు వేడి వేడి పిజ్జాలు, పొటాటో సలాడ్, పళ్ళరసం ఇస్తారు. ఒకవేళ మీకు ఆకలిగా ఉంటే, ఇక్కడ ఏదైనా తినండి.." అంది యురేకస్.

కెఫటేరియాకి వెళ్ళి పిజ్జా 3050 కొనుక్కున్నాను. అది వేడిగా, రుచిగా ఉంది. విమానం బోర్డింగ్ ప్రకటన కోసం ఎదురుచూస్తూ, దాన్ని తినేసాను. ఐజి నెట్ బ్రౌజ్ చేసే అవకాశం ఉంది. టైటాన్‌లో ఉంటున్న డిమిట్రీతో గాని, గ్యానిమీడ్‌లోని ఏనిమాయిడ్‌తో గాని లేదా కుజుడి మీది అరుణ భూముల చక్రవర్తి మీరోస్‌తో గాని నేను మాట్లాడవచ్చు. కాని నేను ఇప్పటిదాక ఆ పని చేయలేదు. భూమి మీదకి తిరిగొచ్చి, నా విధులకు హాజరవడంతోనే నా సమయమంతా సరిపోయింది. కుజుడి పీడకలలు, ఇంకా నా ప్రమేయం లేకుండానే జరిగిపోతున్న సంఘటనల వల్ల నేను రంగంలోకి దిగక తప్పలేదు. నాకిష్టం ఉన్నా లేకపోయినా విశ్వశక్తిని ఉపయోగించగల గ్రహాంతర వ్యక్తుల (మాంత్రికులు) వ్యవహారాల్లో తలదూర్చక తప్పలేదు. పిజ్జా వేడిగా బావుంది. ఇన్‌స్టంట్ కాఫీ రుచిగా ఉంది.

"నాకు అక్కడ కొందరైనా మిత్రులు లభిస్తారా, మాస్టర్.." అడిగింది యురేకస్.

నిజమే. భూమి మీద రోబోలు తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. గ్రహాంతర పర్యాటకులు తమ వెంట తెచ్చుకునే కొన్ని రోబోలు తప్ప. యురేకస్‌తో నేను మాట్లాడుతూండడం చూసి కొంతమంది ఆశ్చర్యపోయారు.

నా పక్కనే కూర్చున్న ఓ పెద్దాయన, "ఇది ఇంపోర్టెడా?" అని అడిగాడు.

అవునన్నాను.

"మంచిదే. నాలాంటి ముసలాళ్ళకి ఇవి బాగా ఉపయోగపడతాయి. ఇంటా బయటా పనులలో సాయం చేస్తాయి. నా దగ్గర కూడా ఒకటి ఉంటే బాగుండేది, మా దురదృష్టం భూమి మీద రోబోలను అమ్మడం లేదు..." అన్నాడతను.

"నిజమే.." అన్నాన్నేను.

భూమి మీద ఆధునిక రోబోలకి నిజంగానే కొరత ఉంది. ఉత్తర అమెరికా లోని ఎర్త్ కౌన్సిల్ వీటి తయారీనీ, పంపిణీనీ నియంత్రిస్తుంది. ఎందుకు? శాస్త్ర సాంకేతిక రంగాలలో భూమి, మిగతా గ్రహాలతో పోలిస్తే ఎందుకు వెనుకబడి ఉంది? గ్రహాల మధ్య రాకపోకలు ఉన్నాయి, విజ్ఞానం, సాంకేతికతల మార్పిడి ఉంది, అయినా...

'ఎర్త్ కౌన్సిల్‌లో ఎవరో భూమి అభివృద్ధిని నియంత్రిస్తున్నారు. విశ్వశక్తిని ఉపయోగించేవారిపై నియంత్రణ, సాంకేతిక రంగంలో పురోగతిపై అదుపు, ఇవన్నీ ఒకే నిర్ధారణకి తీసుకువెడతాయి. పైగా గ్రామీణ దక్షిణ ప్రాంతాలకు, మిగతా ప్రాంతాలకు ఉన్న భారీ వ్యత్యాసం.... అక్కడ అందరూ ఇంకా వ్యవసాయం మీదే ఆధారపడడం, ప్రాచీన వృత్తులలోనే కొనసాగడం వంటివి 19వ శతాబ్దపు భూమిని గుర్తుకు తెస్తాయి. ఉత్తర అమెరికాలో బాగా అభివృద్ధి చెందిన స్పేస్‌డ్రోమ్స్ లేదా వాళ్ళ ఊర్లు, అవి సౌరవ్యవస్థలోని ఇతర గ్రహాలతో అనుసంధానమైన తీరు.. ఆ తేడాని స్పష్టంగా చెబుతాయి. అత్యాధునిక భవనాలు, నెట్‌తో పని చేసే రిమోట్ కంట్రోల్స్, ఇంకా వారి సమాచార వ్యవస్థ... సూక్ష్మీకరించిన టెలీపతీ, మౌన సందేశాలు, వారి జీవితకాలం, ఆరోగ్య సంరక్షణ, దిగుమతి చేసుకున్న రోబోటిక్ సర్జన్లు, అత్యాధునిక ఆసుపత్రి వసతులు... అక్కడ విపరీతమైన అభివృద్ధి... ఇక్కడేమో మచ్చుకైనా కనపడని పురోగతి...'

"దోపిడీ.." అన్నాడు నా పక్కన కూర్చున్న ముసలాయన, నా ఆలోచనలను గ్రహించినవాడిలా.

"మనం దోచుకోబడుతున్నాం అబ్బాయి! ఇప్పుడు సదరన్ జోన్‌లో విపరీతంగా కురుస్తున్న వానల వల్ల మన విమానాలన్నీ బాగా ఆలస్యం అవుతాయి. పైగా వరదలు పంట పొలాలని ముంచెత్తాయట. చిన్న చిన్న మామిడి తోటలు కూడా నీట మునిగాయట.. పట్టించుకునే నాథుడు లేడు...

"నిజంగానా, మీరెక్కడి నుంచి వచ్చారు సర్?" అడిగాను.

"ఒకప్పటి ఢిల్లీ రాజధాని అంటే 888 సమీపంలో నాకు పొలాలు ఉన్నాయి. టెలిఫోన్ లైన్లు పనిచేయకపోవడంతో మా రైతులు నాకు ఐజి నెట్ ద్వారా సమాచారం పంపించారు. వరదలు... ముంపు! పరిస్థితి ఎలా ఉందో చూడడానికే అక్కడికి వెడుతున్నాను. వ్యవసాయం భూములపై ఈ ఏడాది పెట్టినదంతా పోయింది. అయినా, ఇదేమీ ఇవాళ కొత్తకాదుగా, కొన్ని వందల ఏళ్ళుగా జరుగుతున్నదే కదా! వ్యవసాయం ఎప్పుడూ వాతావరణంపైనే

ఆధారపడి ఉంటుంది. పురాతన కాలం నుండి కూడా రైతులు పాపం వాతావరణం దయాదాక్షిణ్యాలపైనే జీవిస్తున్నారు...''

''ఇంతకీ మీదే ఊరు సర్? నేను నా స్వస్థలం ఆమ్రపాలికి వెడుతున్నాను...''

ముసలాయన చిన్నగా నవ్వాడు. ''అయితే నువ్వు ఇండికా సెంట్రల్‌లో పనిచేసే ప్రొఫెసర్‌వి, నారా కొడుకువి అయ్యుంటావు... కదా. ఎందుకంటే ఆమ్రపాలి నుంచి వెళ్ళి ఇండికా సెంట్రల్‌లో ఉంటున్నది ఒకే ఒక్కడు. అది నువ్వే కదా!''

''నిజమే సర్.''

''మాది ఆమ్రపాలి పక్కన ఊరు శివపురం. బహుశా నీకు తెలిసి ఉండక పోవచ్చు, మీ ఊరు కూడా ముంపుకి గురైంది. ఇంతకీ నువ్వు ఎందుకు వెడుతున్నావు? బంధువులను చూడడానికా లేక పంటపొలాలను చూసుకోడానికా? మీ అమ్మానాన్నలు గతించారని విన్నాను... చాలా కాలం అయిందనుకుంటా...''

ఇంతలో మా విమానం బోర్డింగ్ గురించి ప్రకటన వచ్చింది.

''పదండి. పిలుపు వచ్చింది. విమానం ఎక్కుదాం..'' అంటూ కదిలాను.

''నేను కూడా నా భూములని, పంట పొలాలని చూసుకోడానికే వెడుతున్నాను. అక్కడ నాకెవరూ బంధువులు లేరు.. వెళ్ళి కూడా చాలా ఏళ్ళవుతోంది...'' అన్నాను.

''మాస్టర్, పదండి. త్వరగా నడవండి..'' అంటూ తన యాంత్రిక స్వరంతో చెప్పింది యురేకస్.

మళ్ళీ లోగొంతుకతో... ''అపరిచితులతో మాట్లాడద్దు...'' అంటూ హెచ్చరించింది.

నేను నెమ్మదిగా నడిచి, బోర్డింగ్ కోసం వరుసలో ఉన్న జనాల వెనుక నిలుచున్నాను. ఓ గేట్ దగ్గర లావుపాటి పోలీసు అధికారి, ఇంకో వ్యక్తి సామాన్లు పరీక్షిస్తూ, ప్రయాణీకుల వేలిముద్రలు తీసుకుంటున్నారు.

నిజమే. ఈ కాలంలో కూడా తీవ్రవాదం చురుకుగానే ఉంది.. పలు రూపాలలో.

❄ ❄ ❄

# 13. కిడ్నాప్

**వి**మానం పెద్దగా శబ్దం చేస్తూ గాల్లోకి లేచింది. విమానం లోపల చాలా విశాలంగా, సౌకర్యంగా ఉంది. ఈ విమానాలు ఇప్పుడు అణు ఇంధనంతో నడుస్తున్నాయి, ప్రయాణాలు క్షేమకరం కూడా. అయితే విమానయానం ఖరీదు పేదవాళ్ళకి ఏ మాత్రం అందుబాటులో లేదు. ఎయిర్ హోస్టెస్‌లు నలుగురున్నారు. ఆశ్చర్యం! వాళ్ళల్లో ఇద్దరు గ్రహాంతర వాసులు. తలమీద చిన్న ఏంటినాతో, రెప్పల్లేని కళ్ళతో, బంగారు రంగు కేశాలతో, నీలిరంగు దుస్తుల్లో అందంగా ఉన్నారు. వందల ఏళ్ళుగా ఆచరణలో ఉన్న సెక్యూరిటీ డ్రిల్ ఎగ్జిట్ డోర్‌ని, ఆక్సిజన్ మాస్క్‌ని ఎలా ఉపయోగించాలో తెలిపే డెమో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అయితే, ఆఖర్లో ఓ అమ్మాయి ఈ విధంగా ప్రకటించింది:

“ప్రియమైన ప్రయాణీకులారా! మీకు తెలియని ప్రయాణీకులతోనూ, అపరిచితులతోనూ జాగ్రత్తగా ఉండండి. కుజుడి నుంచి గ్రహాంతరవాసులు మానవుల వేషాలలో ఇక్కడ తిరుగుతున్నారని ఎర్త్ కౌన్సిల్ నుంచి సమాచారం అందింది. అపరిచితులతో మాట్లాడద్దు. విశ్వశక్తిని గుర్తించే పరికరం పాడయి పోయినందున, ప్రస్తుతం అలాంటివాళ్ళని గుర్తించలేం....”

ఇది నాకు నిజంగానే ప్రమాదకరం. నన్ను అనుసరించే వాళ్ళల్లో గ్రహాంతర వాసులు ఉండచ్చు. నన్ను పట్టుకోడానికి, ప్రయాణీకుల్లా వేషం వేసుకొని ఎవరైనా విమాన్నాన్ని హైజాక్ చేయచ్చు. కొంచెం అతిగా అనిపించచ్చు, కానీ, గతంలో కుజుడి మీద నా అనుభవాలను దృష్టిలో ఉంచుకుంటే, ఇలాంటి ఘటన జరిగే అవకాశాన్ని కొట్టి పారేయలేం.

“యురేకస్, నువ్వు విశ్వశక్తిని ఉపయోగించగల గ్రహాంతరవాసులను గుర్తించగలవా?” రోబోని అడిగాను.

"గుర్తించగలను మాస్టర్.." అంది యాంత్రిక స్వరంతో.

"వాళ్ళ చుట్టూ ఉండే విద్యుదయస్కాంత వలయం వలన నిమిషంలోనే గుర్తించగలను. విశ్వశక్తిని ఉపయోగించే, గుర్తించడం మరీ తేలిక. ప్రస్తుతానికైతే ఇక్కడ ఎవరూ ఉన్నట్లు లేరు. కాని ఖచ్చితంగా చెప్పలేను. ఎందుకంటే రేడియేషన్ చాలా తక్కువగా ఉంది.."

అయితే మా ప్రయాణం సాఫీగా సాగిపోయింది. మేము దక్షిణాసియా రాజధాని ప్రాంతంలో (S-888) దిగిన తర్వాతే అసలు ప్రమాదం ఎదురయ్యింది. బాగ్స్ తీసుకుని, ఎయిర్‌పోర్ట్ బయటకి నడిచాము. ఒక బాగ్‌ని చేత్తో పట్టుకున్నాను, మరో దాన్ని భుజానికి తగిలించుకున్నాను. యురేకస్ నాతో పాటు నడుస్తోంది.

బయట ఎండగా ఉంది, పైన నీలి ఆకాశం వెచ్చగా ఉంది. ఎరుపు, పసుపు రంగులు పూసిన టాక్సీలు ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ వారి బస్ కూడా ఉంది. ఈ బస్‌లూ, కార్లూ అన్నీ అణు ఇంధనంతో నడవడం, దూరాలను వేగంగా చేరుకోడానికి, భూఉపరితలానికి కాస్త ఎత్తులో ఉండడం నాకు ఆశ్చర్యం కలిగించింది. అయితే, వెనుకబడిన పట్టణాలలో ఇప్పటికీ రోడ్డు మీద గంటకి 80 కిలోమీటర్ల వేగంతో నడిచే పాతకాలపు కార్లు ఉన్నాయి. ఇవి సహజవాయువుతో నడుస్తాయి. ఇవి చవకైనవి, పేదలకి అందుబాటులో ఉన్నవి. పెట్రోల్ ఇప్పటివాళ్ళకి తెలియదు, ఎందుకంటే భూమి మీద పెట్రోల్ నిల్వలు గత శతాబ్దంలోనే హరించుకుపోయాయి. సహజవాయువుని కూడా దగ్గర్లో ఉన్న చంద్రుడి నుంచి అంతరిక్ష రవాణా వాహనాల ద్వారా కొద్దిగా దిగుమతి చేసుకుంటున్నారు.

"ఆమ్రపాలికి మనం బస్‌లో వెడదాం.." యురేకస్‌తో చెప్పాను.

న్యూక్లియర్ టాక్సీ కన్నా, బస్‌లో వెడితేనే నయం... ఎందుకంటే దారిపొడవునా పట్టణాలనీ, గ్రామాలని పరిశీలించవచ్చు.

"సరే, మాస్టర్! టికెట్ కౌంటర్‌కి దారి అదిగో..."

దాని యాంటీనా, టికెట్ కౌంటర్ అని ఇంగ్లీషు, హిందీ, ఇంకా గ్రహాంతరవాసులు అర్థం చేసుకోగలిగే ఇంటర్‌గలాస్టిక్ లిపిలో రాసి ఉన్న స్టాల్ వైపు చూపిస్తోంది. బస్ టికెట్ కోసం కౌంటర్ క్యూలో నిలబడ్డానో లేదో.. హఠాత్తుగా నా చుట్టూ ఏదో చల్లటి గాలి నిండిపోయిన అనుభూతి కలిగింది.

కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది. అయితే ఇలా హఠాత్తుగా చల్లగాలి సోకుతోందంటే - విశ్వశక్తి ప్రయోగించబడుతోందని - నాకు అనుభవపూర్వకంగా తెలుసు.

పొడవాటి జుట్టు, తెల్లటి గడ్డాలు ఉన్న నలుగురు వ్యక్తుల ఆకారాలు నాకు మసకగా కనబడ్డాయి. నల్లటి గుడ్డ, తాళ్ళు ఉన్నాయి వాళ్ళ చేతుల్లో. వెంటనే వాళ్ళేవో మంత్రాలు ఉచ్ఛరించి, నన్ను తాళ్ళతో కట్టేసారు, నా నోట్లో నల్ల గుడ్డని కుక్కేసారు. నా రోబో, నా సంరక్షకుడు అయిన యురేకస్‌కి ఏమైందో నాకు తెలియదు. తలదిమ్ము ఎంతో తీవ్రంగా ఉంది, నిస్సహాయంగా ఉండిపోయాను, నన్ను మత్తు ఆవరించింది. నన్ను గాల్లో తీసుకుపోతున్న భావన కలిగింది. బలమైన గాలుల చప్పుడు నా చెవులకి తెలుస్తోంది, నా కళ్ళముందు అంతా దట్టమైన చీకటి. మాంత్రికులు నన్ను అపహరించారని గ్రహించేసరికి నాకు స్పృహ తప్పింది.

❄ ❄ ❄

# 14. అడవి

**నా**కు స్పృహ రాగానే, నాకు వినబడిన శబ్దమల్లా... ఎంతకీ ఆగని కీచురాళ్ళ రొద! చుట్టూ చీకటి. నా కళ్ళకి గంతలు లేవు. కానీ నాకేదీ స్పష్టంగా కనిపించడం లేదు. కానీ ఆ దట్టమైన అడవిలోని కీచురాళ్ళు నా చెవులు చిల్లులు పడేలా కిచకిచలాడుతున్నాయి. ఇప్పుడు నేను కాస్త చూడగలుగుతున్నాను. చెట్ల ఆకారాలు, శిధిలాలు అస్పష్టంగా గోచరిస్తున్నాయి. ఓ నీటి జంతువు చర్మాన్ని తాకినట్లుగా తడిగాలి నన్ను తాకుతోంది. నేనో చెట్టుకు కట్టేయబడి ఉన్నాను. కాళ్ళని కట్టేసారు కానీ చేతులని వదిలేసారు. నేలమీద రాలిన ఆకులపై అడుగుల చప్పుడు సోకింది. మానవ ఆకారంలో ఉన్న వింత ప్రాణులు రెండు వచ్చి నా ముందు నిలుచున్నాయి. సగటు మనుషుల కంటే పొడుగ్గా ఉన్నారు, పొడవాటి జుట్టుతో, మెరుస్తున్న ఎర్రటి కళ్ళతో.. ఉన్న వారి రూపురేఖలు ఆ చీకటిలో మసకగా ఉన్నాయి.

ఇంతలో - ఎప్పుడో పురాతన కాలంలో భూమి మీద వెలిగించుకున్న కాగడా లాంటి దివిటీనొకదాన్ని చేతిలో పట్టుకుని మూడో వ్యక్తి ప్రవేశించాడు.

"Bien- Venue" అని పలికాడు.

ఇది ఫ్రెంచ్ భాష. అతను కుజ గ్రహానికి చెందిన మానవజాతి వాడయి ఉంటాడని ఊహించాను. కుజుడి మీద నేను దిగిన హోటల్‌లోని టూరిస్ట్ గైడ్ ల్యూనా లాంటి వాళ్ళు అక్కడ ఫ్రెంచ్ మాట్లాడేవాళ్ళు.

“వెల్‌కం హనీ” అంటూ ఇంగ్లీషులో సంభాషణ కొనసాగించాడతను.

“ఇక్కడ నీకేమీ ప్రమాదం జరగదు. నీ శరీరమేమీ ముక్కలవదు. మా విశ్వశక్తి వల్ల అంతరిక్షంలో నువ్వు చోదనానికి గురయ్యావు. ఇప్పుడు నీకెలా ఉంది? తల తిరగడం లేదు కదా? ఒళ్ళు నొప్పులేవీ లేవుగా? సౌకర్యంగా ఉందా?”

"అవును.." అంటూ అరిచాను... కాని నా స్వరం బొంగురుగా మారింది.

"కాని, ఎందుకు? ఎవరు మీరు? మీరు సమూరా తాలూకానా? అతనిక్కడే ఉన్నాడా?"

నా ప్రశ్నకి జవాబు రాలేదు. అక్కడంతా నిశ్శబ్దమే. అప్పటిదాకా మాట్లాడిన వ్యక్తి మధ్యలో ఉన్నాడు, అతనికి అటు ఇటూ మొదట వచ్చిన ఇద్దరూ నిలుచున్నారు. చిటపటమంటున్న కాగడా మంట చప్పుడు తప్ప మరేమీ లేదక్కడ. పొడవాటి చెట్లూ, గుబురు పొదలూ ఉన్న ఆ అడవిలో వేలాదిగా ఉన్న మిణుగురులు మినుకు మినుకుమంటున్నాయి, వాటికి తోడు కీచురాళ్ళ రొదతో ఆ ప్రదేశమంతా భయంగొల్పేదిలా ఉంది.

"కుజగ్రహంలోని అరుణభూముల చక్రవర్తి, మా ప్రభువు సమూరా తొందరలోనే నిన్ను కలుస్తాడు. అప్పుడు నువ్వు ఆయన శక్తులు పోగొట్టావు. మా ప్రభువుకి పోయిన శక్తులను తిరిగి తెప్పించే బాధ్యత కూడా ఇప్పుడు నీదే. హనీ, ఓ మానవా! నీ సొంతూరు ఆమ్రపాలిలో ఎక్కడో రహస్యంగా దాచబడిన అ శక్తులను సాధించాలంటే నువ్వు ఎంతో ముఖ్యం... ఆ సంగతి నీకూ తెలుసు.

"హుఁ... " అంటూ బొంగురు గొంతుతో అరిచాను..

"ఇలా జరుగుతుందని ఊహించాను. కానీ మా గ్రామంలో దాచబడిన ఆ అద్భుత వస్తువుల గురించి నాకేమీ తెలియదు. మీకెన్నో శక్తులున్నాయి.. ఎంతో పకడ్బందీ కాపలానీ, నిఘాని తప్పించుకుని మీరు భూమి మీదకి వచ్చి, నన్ను అపహరించగలిగారంటే..... మీరే వెతుక్కుని దాన్ని సాధించుకో వచ్చుగా? ఓ సాధారణ మానవుడి, విశ్వశక్తిని అతి సూక్ష్మంగా ఉపయోగించగల అల్పుడిని మీకెలా సాయపడగలను?" అన్నాను.

ఇంతలో ఎరుపు నీలం రంగులతో ఓ మెరుపు మెరిసినట్లయింది. పొడవాటి దుస్తులు ధరించిన బక్కపలచని శరీరం, మరో పొడవాటి కేశాలు కలిగిన పొడగరైన స్త్రీ ఆకారం నా ముందు ప్రత్యక్షమయ్యాయి.

గాలిలో చల్లదనం. పక్కనే పొదల్లో ఉన్న పాములు అపస్వరంతో బుసకొట్టి, కునుకు తీసాయి. ఉన్నట్లుండి కొన్ని పక్షులు తమ రెక్కలను చాచి చప్పుడు చేస్తూ ఎగిరి పోయాయి. నాకర్థమైంది.

చక్రవర్తి సమూరా, రాకుమారి సయోనీ ఇక్కడున్నారు. భూమి మీద!

❉ ❉ ❉

# 15. మళ్ళీ సమూరాతో...

**భ**యం... ఏదో తెలియని భయం నన్ను నిలువెల్లా వణికిస్తోంది. వాళ్ళు నన్ను తప్పకుండా చంపేస్తారు. ఒలింపస్ పర్వత శిఖరం మీద నుంచి నేను తెచ్చిన అమృత ఔషధం తాగి సమూరా తన శక్తులు పోగొట్టుకున్నాడు, నిజమే. తోలు కాగితం మీద రాసున్న ఆ భవిష్యవాణిని నేను సమూరాకి చెప్పలేదు. అందుకని అతని శక్తులు నశించడానికి కారకుడిని నేనే. అయితే అతని కూతురు సయోనీకి శక్తులు నశించలేదన్న సంగతి మర్చిపోకూడదు. అతని మంత్రులు సైతం ఉన్నతశ్రేణి మాంత్రికులే. తల్చుకుంటే వాళ్ళు నన్నో ఈగలా క్షణంలో మాడ్చి మసి చేయగలరు. మరి ఎందుకు చేయడం లేదు? అప్పుడు స్ఫురించింది.

మౌలికమైన విషయం! ఇంగితజ్ఞానం!!

వాళ్ళకి నా అవసరం ఉంది. ఆమ్రపాలి గ్రామంలో దాచబడిన అద్భుత శక్తులను కనుగొనేందుకు నేనే కీలకం. వాటిని పొందితే సమూరాకి ఎనిమిది అద్భుతమైన శక్తులు లభిస్తాయి. గాలిలో ఎగరగలగడం, నీటిపై నడవగలగడం, దివ్యదృష్టి, దూరశ్రవణ శక్తి, వస్తువులను సృష్టించగలగడం, శరీరం పరిమాణాన్ని పెంచుకోడం, తగ్గించుకోడం, హృదయ స్తంభనల్మ్యగంటల కొద్దీ సమాధిలో ఉండగలగడం వంటివి లభిస్తాయి. అసలా వస్తువు ఏమిటో, ఆమ్రపాలిలో ఎక్కడ ఉందో నాకు తెలియదు. అయితే అవి ఆమ్రపాలిలో ఉన్నాయని మాత్రం ధరణి మావయ్య డి.వి.డీలో చెప్పాడు.

బక్కపలచగా, సమూరాలా కనిపిస్తున్న ఆకారం, గుసగుసలాడు తున్నట్లుగా బొంగురుగొంతుతో మాట్లాడసాగింది.

"నేను ఎగరలేను. అదృశ్యం అవలేను. మోసగాడా! నీ వల్ల నా శక్తులన్నీ నశించాయి. అల్ప మానవుడిలా, జీవచ్ఛవంలా బతకడం తప్ప నేనిక ఏమీ చేయలేను. నా ప్రియమైన కూతురు, నా మంత్రులు వాళ్ళ మంత్రశక్తులను

ఉపయోగించి నన్ను అదృశ్యం చేసారు. వాళ్ళ శక్తులన్నీ ఉపయోగించి, మారువేషాలలో నన్నిక్కడికి తీసుకొచ్చారు. వాళ్ళు నా కోసం ఎన్నో బాధలు పడ్డారు. ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొన్నారు. ఎర్త్ కౌన్సిల్‌కి చెందిన డిటెక్టివ్‌లు మమ్మల్ని నిరంతరం వెంటాడారు. చివరికి ఇక్కడ ఇలా అడవిలో దాక్కోవలసి వచ్చింది. దీనికంతా కారణం... నువ్వే! ఓ అల్ప మానవుడి వల్ల మాకీ తిప్పలు. నువ్వు విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివి, శుష్క ఆదర్శాలున్న ఓ తెలివి లేని వ్యక్తికి కొడుకువి... విశ్వాన్ని జయించేందుకు సిద్ధం చేసిన నా సైన్యంలో అతనెన్నడూ చేరలేదు. ఆమ్రపాలిలో ఆ అద్భుత వస్తువు ఎక్కడుందో తెలుసుకో గలిగే శక్తి నీకొక్కడికే ఉంది. నువ్వు నాకు సాయం చేసి తీరాలి లేదా నీ కళ్ళు పెరికించేస్తాను. నిన్ను గుడ్డివాడిని చేస్తాను...."

వాళ్ళు ఇంతవరకూ నన్ను ఎందుకు చంపలేదో, ఎందుకు చంపరో నాకు అర్థమైంది.

"ప్రభూ! నాకేమీ తెలియదు. ఆ వర్షం రాత్రి మా అమ్మానాన్నలు చనిపోయాకా, నేను ఆమ్రపాలి గ్రామాన్ని శాశ్వతంగా విడిచిపెట్టాను. పైగా విశ్వశక్తిని నేనేమీ గొప్పగా ఉపయోగించలేను, మాంత్రికుడిని కాను. మీలాంటి గొప్ప మాంత్రికులే కనిపెట్టలేని ఆ వస్తువుని నేనెలా కనిపెట్టగలను..?" అన్నాను.

"మూర్ఖుడా..." అంటూ కోపంతో బుసలు కొట్టింది సయోనీ.

నా కలలో కనిపించిన అందాల యువరాణి కాదామె. ఆమె కేశాలు కట్ల పాముల్లా ఉన్నాయి. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. శరీరం నల్లగా ఉంది, మెడలో మానవ కపాలాల దండ. కుజుడి మీద ఉన్నప్పుడు ఆమె ఎప్పుడూ ఇలాంటి ఆభరణాలను ధరించగా చూడలేదు. క్రోధంతో ఆమె ఛాతి ఎగిరెగిరి పడుతోంది. అంతటి ఆగ్రహంలో ఆమెను అంతకుముందెప్పుడూ చూడలేదు నేను.

"బుద్ధిహీనుడా... ఎటువంటి కోరికలు లేని నిర్మలంగా, నిస్వార్థంగా విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తివి భూమి మీద నువ్వొక్కడివే. ఆ వస్తువుని చూడగలిగే అతి కొద్దిమందిలో నువ్వొ ఒకడివి.." అని అంది.

"మళ్ళీనా..." అంటూ నిట్టూర్చాను.

"నువ్వు నా కల్లోకి వచ్చి, టెలిపతీ ద్వారా నన్ను వశపరుచుకుని కుజగ్రహానికి వచ్చేలా చేసావు... ఒలింపస్ శిఖరం నుంచి అమృత ఔషధం

తీసుకొచ్చేలా చేసావు. ఏం... ఈ పని చేయడానికి భూమి మీద ఇంకెవరూ లేరా? ప్రతీసారి ఎందుకు నా వెంట పడుతున్నారు? నన్నొదిలేయండి..." అన్నాను.

ఈ మాటలు అనడమైతే అన్నాను గానీ, మనసు పగతో రగిలిపోతోంది. తమతో చేరనందుకు వీళ్ళు మా అమ్మానాన్నలను చంపేసారు. వీళ్ళకి గుణ పాఠం చెప్పాలి.. ఇప్పుడిక ఇది వ్యక్తిగత వైరం. కుజుడి మీద జరిగిన గతం కాదిక.

సయోనీ గట్టిగా నవ్వింది. ఆ నవ్వు చీకటి గుహలోని పాము బుసలా ఉంది.

"శాంతం.. శాంతం! నిన్ను పట్టుకోడం చాలా తేలిక. నువ్వు ఆ ఊరి వాడివి. నువ్వు మాత్రమే ఆ వస్తువుని కనుగొనగలవు. ప్రమాదానికైనా సిద్ధపడగలవు. నువ్వు చచ్చిపోతేనే మేం వేరొకరిని వెతుక్కుంటాం. అర్థమైందా..."

ఏమిటా వస్తువు? ఏంటా ప్రమాదం? నేనెలా చచ్చిపోతాను? పరిస్థితి విషమిస్తోంది. నేనొప్పుకోకపోతే, చంపేస్తారు. ఒప్పుకున్నా చంపేస్తారేమో. ఒలింపస్ శిఖరం మీద అమృత ఔషధాన్ని చూసినట్లుగా, ఈ వస్తువుని కూడా నేను చూడాలని రాసి పెట్టి ఉందేమో.

"సరే.." అన్నాను.

❄ ❄ ❄

# 16. ప్రయాణం

గ్రహాంతర మాంత్రికులతో కలసి ప్రయాణించడంలో అనేక సమస్యలు ఉన్నాయి. మొదటిది: ఎర్త్ కౌన్సిల్ వీళ్ళని వెంటాడుతూ ఉండడం, మంత్ర శక్తులు ప్రయోగించినా లేదా బహిరంగంగా ప్రయాణిస్తున్నా, ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే సిబ్బంది, నిఘా పరికరాలు వీళ్ళని పట్టేస్తాయి. జైల్లో పెట్టిస్తాయి. విశ్వశక్తిని ప్రయోగించగల గ్రహాంతర మాంత్రికులంటే ఎర్త్ కౌన్సిల్‌కి ఎందుకో తగని భయం. వాళ్ళు భూమి మీదకు రాకుండా జాగ్రత్త పడుతుంది.

సమూరా, అతని బృందం మారువేషాలలో స్పేస్ డ్రోమ్ కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్స్ అధికారుల కళ్ళుగప్పి భూమి మీదకి రహస్యంగా రాగలిగారు. కాని ఎలా? వీసాలు, పాస్‌పోర్ట్స్, ప్రయాణపత్రాల మాటేమిటి? ఎంత మంత్రశక్తులున్నా, వేల మైళ్ళ దూరం అలా ఆకాశంలో ఎగిరి వచ్చేయలేరు కదా? స్పేస్ షిప్పులలో సామాన్య ప్రయాణీకుల్లా, ఎటువంటి మంత్రశక్తులను ప్రయోగించకుండా, ఇక్కడికి రావల్సిందే కదా... ఒకసారి లా టెర్ వద్దకి చేరితే, అక్కడ కఠినమైన ప్రయాణ నియమాలను ఉల్లంఘించడం, పత్రాలను పరీక్షించడం, 'విశ్వశక్తి వాడకాన్ని' కనుక్కోడం కోసం రేడియేషన్ పరీక్ష వంటివాటిని తప్పించుకోడం కష్టం.

సమూరాని గ్రహాంతర నేరస్తుడిగా ఇంటర్ గెలాక్టిక్ పోలీసులు ఎప్పుడో ప్రకటించారు, అతని కోసం వెతుకుతున్నారు కూడా. మరి ఎలా రాగలిగారు?

ఇక్కడ వీళ్ళు నన్నో గుర్రం ఎక్కించారు. కొద్ది దూరంలో నా చుట్టూ ప్రయాణిస్తూ అడవిలో ప్రయాణిస్తున్నారు. చీకటిగా ఉన్నా, దారి బురదగా జారుతూ ఉన్నా, అలవాటైనా దారిలా ఉండడంతో, గుర్రాలు చకచకా సాగుతున్నాయి. మూడు గుర్రాలు మమ్మల్ని మైదాన ప్రాంతంలోకి తీసుకు వచ్చాయి. ఆ తర్వాత ఓ ప్రధాన రహదారి మీదకి. దూరంగా ఏదో ఉత్తర

భారతదేశపు గ్రామం కనపడుతోంది. కాలం స్తంభించిపోయిందా అన్నట్లు, ఎప్పుడో వందలాది ఏళ్ళ క్రితపు పాత గ్రామంలా ఉందది. ఎర్ర ఇటుకల ఇళ్ళు, గుడిసెలు, పొగగొట్టాల నుంచి పొగ, పచ్చని పొలాలు, బండ్లు లాగుతున్న ఎడ్ల మెడలో చిరుమువ్వలు. అక్కడక్కడా కాంక్రీట్‌తో కట్టిన ఇళ్ళు కూడా ఉన్నాయి. ఊర్లోకి సమీపిస్తుండగా.. ఆ ఊరి పేరుని సూచించే "హరిపురం" అనే బోర్డుని చూసాను. గ్రామం ప్రధాన వీధంతా గుర్రపు డెక్కల చప్పుడుతో దద్దరిల్లింది.

"హనీ, మనం ఇక మోటారు బళ్ళకి మారుదాం. గుర్రాలని వాటి యజమానులకు అప్పగిద్దాం. ఏదైనా తిని, ఆమ్రపాలికి బయల్దేరుదాం. జాగ్రత్త, తప్పించుకోవాలని చూడకు, ఉపాయాలు పన్నకు, విశ్వశక్తిని ఉపయోగించకు. మీ యూనివర్సిటీ అధికారులని సంప్రదించాలని చూడకు... అలా చేస్తే ఇక్కడికిక్కడే నిన్ను చంపేస్తాం. అర్థమైందా?" అంటూ అదేదో సామాన్యమైన విషయంలా హెచ్చరించాడు నన్నిక్కడకి తీసుకువచ్చిన వారిలో అందరికంటే పెద్దవాడైన ఓ కుజగ్రహం మాంత్రికుడు.

హరిపురం, పరిశుభ్రమైన, అందమైన గ్రామం. సహస్రాబ్ది అలంకరణలన్నీ ఉన్నాయి.. రెండు హోటళ్ళున్నాయి, ఫలహారశాలలున్నాయి. ఇక్కడ కార్లు అద్దెకి లభిస్తాయి. ఇంటర్ గెలాక్టిక్ నెట్ సెంటర్లు, ఓ బస్‌స్టాండ్, టాక్సీ స్టాండ్‌లు ఉన్నాయి. అణుఇంధనంతో నడిచే టాక్సీలూ ఉన్నాయి... కాని వాటిలో ప్రయాణం అంత చవక కాదు. 'ఇండియన్ రైన్‌బో' అనే హోటల్‌కి వెళ్ళాం. అక్కడ కాలకృత్యాలు తీర్చుకుని, బ్రేక్‌ఫాస్ట్‌కి ఆర్డర్ ఇచ్చాం. బ్రెడ్, గుడ్లు, ద్రాక్షరసం, పాలు, అరటిపళ్ళతో ఉపాహారం ముగించాం. కుజగ్రహ మాంత్రికులు కూడా తిన్నారు. ఆపాదమస్తకం నల్లటి దుస్తులతో తమ శరీరాలను కప్పుకున్నారు వాళ్ళు. తమ పొడవాటి కేశాలను దాచుకోడానికి పెద్ద టోపీలు, జీవం లేని ఎర్రటి కళ్ళు కనపడకుండా పచ్చకళ్ళద్దాలు ధరించారు. కంకాళంగా మారినా సజీవంగా ఉన్న సమూరా, ముసలిగా, దుర్బలంగా కనిపిస్తున్న సయోనీ కూడా బాగా ఆకలితో ఉన్నట్లుగా తెగ తిన్నారు. ప్రయాణీకులకు ఆహారాన్నందించే చక్కని స్థలం రైన్‌బో రెస్టారెంట్. భూమిని సందర్శించే గ్రహాంతరవాసుల రాక పట్ల ఈ హోటల్ వాళ్ళకి అభ్యంతరమేమీ ఉన్నట్లు లేదు. గుమ్మం దగ్గర నిలబడే వ్యక్తి వచ్చి, 'న్యూక్లియర్ టాక్సీ' దగ్గర్లోనే ఉందని చెప్పాడు.

“కాస్త ధర ఎక్కువే అయినా, మీ గమ్యానికి వేగంగా చేరుకోగలరు” అన్నాడు.

సమూరా, భూమి మీద, ఇక్కడి డబ్బుని ఎలా సాధించాడో, తన కుజ గ్రహపు కరెన్సీ యూనిట్లను ఎలా మార్పిడి చేసాడో నాకర్థం కాలేదు.

“డబ్బు సమస్య కానే కాదు. కాని మీరు చూపించే వాహనం గ్రహాంతర స్థాయి నాణ్యత కలిగి ఉండాలి, చక్కని నావిగేషన్ సిస్టమ్ ఉండాలి, మరమ్మత్తులు లేకుండా ఉండాలి...” అన్నాడు సమూరా బొంగురు గొంతుతో.

“తప్పకుండా సర్, టాక్సీని మీరే స్వయంగా పరీక్షించుకోవచ్చు. ఇంతకీ మీరెక్కడికి వెళ్ళాలో తెలుసుకోవచ్చా?”

ఈ ప్రశ్నకి ఎవరూ బదులివ్వలేదు. జాగ్రత్త అన్నట్లుగా గుఝమని చప్పుడు చేసింది సయోనీ.

“సరే, చూస్తాం...” అంటూ, లేచి, బయటకి నడిచింది. మిగతా అందరం ఆమెని అనుసరించాం. గుర్రాలను ఓ ఏజెన్సీకి అప్పజెప్పాం.

టాక్సీ స్టాండ్ వైపు నడుస్తుండగా... “హనీ, నీకు ఇక్కడి నిబంధనలు తెలుసు. మంత్రశక్తులు వాడద్దు. ఒక కారుని నువ్వు నడుపు, రెండో దాన్ని మా మంత్రి నడుపుతాడు. ఎవరైనా వాహనాలను తనిఖీ చేస్తే, నువ్వు డ్రైవర్‌వనీ, మేము గ్రహాంతర పర్యాటకులమని చెప్పు. గెలాస్టిక్ పొజిషనింగ్ సిస్టమ్‌ని ఆమ్రపాలికి సెట్ చెయ్యి. సాయంత్రం కల్లా మనం అక్కడికి చేరాలి. తప్పించుకోవాలని చూడకు. నువ్వు పారిపోవాలని చూసినా, మేం దొరికిపోయినా నిన్ను చంపేస్తాను. నిజం..” అంది సయోనీ.

“నాకు మరో మార్గం లేదు యువరాణీ! అయినా మా సొంతూరు ఆమ్రపాలిని చూడాలని నాకూ ఆత్రుతగానే ఉంది. పైగా ఆ అద్భుత వస్తువుని కళ్ళారా చూడొచ్చు. కానీ ఆ వస్తువు ఎక్కడుందో?” అన్నాను.

“ఆ అద్భుత వస్తువుని పొందినవారికి ఎనిమిది అద్భుతమైన శక్తులు లభిస్తాయి. గాలిలో ఎగరగలగడం, నీటిపై నడవగలగడం, దివ్యదృష్టి, దూరశ్రవణ శక్తి, వస్తువులను సృష్టించగలగడం, శరీరం పరిమాణాన్ని పెంచుకోడం, తగ్గించుకోడం, హృదయ స్తంభనం, గంటల కొద్దీ సమాధిలో ఉండగలగడం వంటివి లభిస్తాయి. అక్కడికి వెళ్ళాక నీకే అన్ని విషయాలు తెలుస్తాయిగా. దాన్ని చూడగలిగేది నువ్వొక్కడివే. దాన్ని మాకు తెచ్చివ్వాల్సింది

కూడా నువ్వే.. ఈసారి నువ్వా పని చేస్తావు... మోసం చెయ్యవు...'' అంది

''క్రితం సారి కూడా నేనేమీ మోసం చెయ్యలేదు యువరాణీ, అమృత ఔషధాన్ని తెచ్చి చక్రవర్తికి ఇచ్చాను..'' అన్నాను.

''ఓయ్...'' అంటూ అరిచాడు సమూరా.

''ఔషధంతో పాటు ఉన్న కాలజ్ఞాన పత్రం సంగతి నీకు తెలియదు కదూ. దాన్ని తాగితే నా శక్తులు నశిస్తాయన్న కాలజ్ఞానం సంగతి నీకూ తెలియదు కదా .. అయినా నువ్వు మంత్రశక్తులలో కొద్ది శిక్షణనే పొందావు. మంత్రగ్రంథాలు చదవలేదు. ఇలాంటి అమృత ఔషధం తాగితే చిరంజీవి నవుతానుగానీ, శక్తులన్నీ పోతాయి. గ్రంథాలలో చెప్పారు. నువ్వు ఆ సంగతి నాకు చెప్పలేదు...'' అన్నాడు.

నిజమే. నేను కాలజ్ఞానపత్రం చదివాను. చదివిన వెంటనే దాన్ని నాశనం చేసేసాను. వాళ్ళకి ఆ సంగతి చెప్పలేదు. వాళ్ళకి కూడా ఆ విషయం ముందు తెలియదు.

''హనీ, ఓ మానవా..! అది నీ తప్పు కాదని నేను ఒప్పుకుంటున్నాను. దాన్ని తాగే ముందే పవిత్ర గ్రంథాలని ఓమారు చూసి ఉండాల్సింది, విజ్ఞులను సంప్రదించి ఉండాల్సింది.. ఓ మంచి ముహూర్తం నాడు తాగి ఉండాల్సింది.... నా శక్తులు పోతాయని తెలిస్తే.... దాన్ని తాగేవాడినే కాదు... తాగేవాడినే కాదు....'' అన్నాడు సమూరా. అతని గొంతు జీరబోయింది. బాగా దిగాలుగా ఉన్నాడు.

''శక్తులేవీ లేకుండా చిరంజీవిగా జీవించడం ఎందుకు? దేవా? కుజాధిపతీ! నాకెందుకీ శిక్ష?'' అంటూ బాధపడ్డాడు సమూరా.

''తండ్రీ, కాసేపు విశ్రాంతి తీసుకో. ఆమ్రపాలిలో నీ శక్తులు నీకు లభిస్తాయి. కనీసం ఎనిమిదయినా. నువ్వు అమరుడివి. అది సరిపోదా? చిన్నపిల్లాడిలా ఏడవకు. ఇదంతా నీ కోసమే గదా చేస్తున్నది. నీకోసం మేము చావడానికైనా సిద్ధం.. నువ్వు చిరంజీవివి నాన్నా, కలకాలం బ్రతుకుతావు...'' అంటూ అరిచింది సయోనీ చిరాకుగా.

మంత్రులు ఎనిమిది మందిలో ఒకతను అన్నాడు.. ''శాంతించండి... శాంతించండి... నిశ్శబ్దం. గొడవ చేస్తే మనం దొరికిపోయే ప్రమాదం ఉంది...''

ఇండియన్ న్యూక్లియర్ కార్ స్టేషన్‌లో రెండు కార్లు అద్దెకి తీసుకున్నాం. నీలంరంగు కారు నాకు, నల్లరంగు కారు మిగతా వాళ్ళకి. సూర్యోదయం

అయ్యింది. హరిపురంలో మేము బయల్దేరి, హైవే 333 ప్రవేశించేసరికి సమయం 8:15 అయ్యింది. ఓ కంప్యూటర్‌లాగా నేను టాక్సీ కంట్రోల్స్ అన్నీ గుర్తుపెట్టుకున్నాను. నావిగేషన్ సిస్టమ్ ఆన్ చేసి, లాటిట్యూడ్‌పై ఆమ్రపాలి ట్రాజెక్టరీ సెట్ చేసాను. ఉన్నట్లుండి నేను ఒంటరినన్న భావన కలిగింది. యురేకస్‌ని కోల్పోయినందుకు బాధపడ్డాను. అయితే, అది సరైన దారి వెతుక్కుని నన్ను కలుస్తుందని నా ఆశ. కుజుడి మాంత్రికులు దాన్ని ఎక్కడో పడేసారు. అయితే యురేకస్ నాశనం లేనిది, పాడవనిది. అది నడవగలదు, ప్రయాణించగలదు లేదా ఏ ట్రక్‌లోనో, విమానంలోనో లేదా రైల్లోనో ఎక్కేయగలదు. దాన్ని తయారు చేసినవాళ్ళు తప్ప వేరేవాళ్ళు దాన్ని పాడు చేయలేరు, లేదా దాని ప్రోగ్రామింగ్‌ని మార్చలేరు. నిజానికి అది ఓ కుజగ్రహపు రోబో. అరుణ భూములలోని అత్యంత మేధావులైన రోబో-ఇంజనీర్లచే రూపొందించబడినది. నా వల్ల అరుణ భూములకు చక్రవర్తి అయిన మీరోస్ స్నేహపూర్వకంగా నాకు ఇచ్చిన కానుక ఆ రోబో.

ఇక వర్తమానానికి వస్తే, ఈ మాంత్రికులకు లొంగి ఉండాలి, వాళ్ళకి డ్రైవర్‌లా పనిచేయాలి. ఆమ్రపాలిలో ఉన్న ఆ వస్తువు ఏమిటో, అదెక్కడ దాచబడి ఉందో తెలుసుకోవాలన్న ఉత్సుకత నాలో అంతర్గతంగా పెరిగిపోతోంది.

❄ ❄ ❄

# 17. న్యూక్లియర్ హైవేలు

గత సహస్రాబ్దులలో భూమి మీద పెట్రోల్ వంటి హైడ్రోకార్బన్ ఇంధనాల నిల్వలు క్రమంగా అడుగంటాయి. అంతే కాదు, ఎన్నో యుద్ధాలు జరిగాయి, అంతరిక్ష ప్రయాణాలు సర్వసాధారణమయ్యాయి. అప్పుడే అణుశక్తి నుంచి అణు ఇంధనాన్ని తయారు చేసారు. ఇక్కడ తయారైన ఇంధనానికి తోడు ఇతర గ్రహాలనుంచీ దిగుమతి చేసుకున్న ఇంధనంతో ఇప్పుడు వాహనాలు నడుస్తున్నాయి. కార్లు, విమానాలు, ట్రక్కులు, అరుదుగా కనబడే బైకుల వంటివి కూడా అణు ఇంధనాన్నే ఉపయోగిస్తున్నాయి. మేమెక్కిన ఈ కారుకి వాయిస్ కంట్రోల్ ఉంది. కారు అద్దెకి ఇచ్చిన ఏజెంట్ దగ్గర నేను నా స్వరాన్ని రికార్డ్ చేయాల్సి వచ్చింది.

స్టీరింగ్ వీల్ ఉంటుందనుకోండి. కారు సాధారణ వేగంతో రోడ్డు మీద ప్రయాణిస్తే దాన్ని వాడనవసరం లేదు. అదే, అధిక వేగంతో నేల మీద నుంచి మూడు అడుగుల ఎత్తులో ప్రయాణిస్తే మాత్రం స్టీరింగ్ వీల్‌ని డ్రైవర్ చేతిలో ఊతకర్రలా వాడుకోవచ్చు. మాములు వేగం కన్నా తక్కువ వేగంతో ప్రయాణిస్తే మాత్రం స్టీరింగ్ వీల్‌ని ఉపయోగించాలి. నిర్జనంగా ఉన్న ప్రధాన రహదారుల పైన నడిపేటప్పుడు అధిక వేగాన్ని ఉపయోగించవచ్చు, అవి ఎనిమిది లేన్ల మార్గాలు, రద్దీ తక్కువగా ఉంటుంది. 'స్టార్ట్' అని నేను అనగానే కారు బయల్దేరి, క్రమంగా వేగం పుంజుకుంది. వెంటనే 'ఫస్ట్ గేర్' అని గట్టిగా అన్నాను. సమూరా, సయోనీ, ఇంకా ఇద్దరు మంత్రులు నా కారులో ఉన్నారు.

ఓ అమాత్య మాంత్రికుడు కిసుక్కున నవ్వి - "సాంకేతికతని గుప్త విద్యలకి జోడించడమంటే ఇదే.." అన్నాడు. మళ్ళీ తనే మాట్లాడుతూ, "నీ భాషలో నువ్వేదో మంత్రం చదువుతున్నావు లేదా దేన్నో ఆవాహన చేస్తున్నావు! కాని ఇక్కడ పనిచేస్తున్నది టెక్నాలజీయే..." అన్నాడు.

“అవును. మనం ఏదైనా వరం లేదా శాపం ఇచ్చేటప్పుడు ఆవాహన చేస్తాం, విశ్వశక్తిని మేల్కొలుపుతాం.. ఇదీ అంతే...” అన్నాడు ఇంకో మంత్రి.

కాసేపటికే మేం హరిపురం నుంచి బయటపడ్డాం. నిజానికీ ఊరు హైవేకి ఆనుకుని ఉంది. మమ్మల్ని దాటుకుంటూ వెళ్తున్న వాహనాలకు దారిస్తూ కారును నడుపుతున్నాను.  కాస్త దూరంలో సౌత్ ఏసియన్ గవర్నింగ్ కౌన్సిల్ వాళ్ళ చెక్ పోస్ట్ కనపడుతోంది. “చెక్ పోస్ట్.. మిలిటరీ అధికారులుంటారు....” అంటూ మాంత్రికులందరూ ఒకేసారి అరిచారు. “ఉన్నారు... అక్కడ వాళ్ళున్నారు...” అంది సయోనీ లోగొంతుతో. తన దూరదృష్టితో వాళ్ళని చూస్తోందామె.

తర్వాత నా భుజం గట్టిగా నొక్కుతూ.. “హనీ. మాట్లాడకు. నువ్వెవరో చెప్పినా, పారిపోడానికి ప్రయత్నించినా.. నిన్ను భస్మం చేసి, మేం లొంగిపోతాం. మాతో సహకరిస్తే, నిన్నేం చేయం, నిన్ను మళ్ళీ యూనివర్సిటీకి పంపేస్తాం... అర్థమైందా?” అంటూ హెచ్చరించింది.

“అటువంటి పనులేవీ చెయ్యను సయోనీ. మీరు అమాయకులని చంపుతానన్నా, వాళ్ళ ఆస్తులు ధ్వంసం చేస్తానన్నా నేను సహకరించను. అది నా మనస్సాక్షికి విరుద్ధం. ఆ అద్భుత వస్తువేదో గుర్తించి, దాన్ని మీకందజేస్తాను. అంతే. నా మాటకి కట్టుబడి ఉంటాను...” అన్నాను.

చెక్‌పోస్ట్‌ని సమీపించగానే, స్లో చేయమని, ఫస్ట్ గేర్‌లోకి, తర్వాత న్యూట్రల్ లోకి రమ్మని కారుకి చెప్పాను. నీలం రంగు హెల్మెట్‌లు ధరించిన ఇద్దరు వ్యక్తులు కారు అద్దాల దగ్గరికి వచ్చారు. నేను అద్దాలని కిందికి దించాను.

“గుర్తింపు పత్రం..” అని అడిగాడో వ్యక్తి. నేను నా ఫోటో ఐడి కార్డుని ఇచ్చాను. తన చేతిలో ఉన్న పరికరంతో దాన్ని పరీక్షించాడు.

“వాళ్ళెవరు?” అంటూ వెనుక సీట్లో,  దుర్బలంగా కనిపిస్తున మంత్రుల కేసి వేలు చూపిస్తూ అడిగాడు.

వాళ్ళు చూడడానికి వృద్ధుల్లా ఉన్నారు. పొడవాటి గడ్డాలతో కృశించి పోయినట్లు కనబడుతున్నారు.

“కుజగ్రహం నుంచి వచ్చిన పర్యాటకులు వీళ్ళు. మా సొంతూరికి తీసుకు వెడుతున్నాను. వీళ్ళు భూమిని సందర్శిసున్న ప్రొఫెసర్లు, నాకు మిత్రులు...” చెప్పాను.

"గ్రహాంతరవాసులా, అయితే పాస్‌పోర్ట్‌లు చూపించండి..." అన్నాడు.

వీళ్ళకి పాస్‌పోర్ట్‌లు ఉన్నాయో లేవో నాకు తెలియదు. కానీ సయోనీ ఎరుపు, తెలుపు రంగులతో మెరుస్తున్న డిజిటల్ కార్డులను బయటకి తీసి, ఆ వ్యక్తికి అందించింది.

"అరుణ భూముల సామ్రాజ్యం, కుజగ్రహం.. మీరేమో... సయోనీ రుబ్ర, ఆయన సమూరా రుబ్ర..." అన్నాడతడు.

"అవును.." అంది సయోనీ. "మిగతా వాళ్ళు మార్కస్, మెనియస్, రూపస్, క్రూయస్, లెవటాస్.." అంది.

"అబ్బో మీ వయసు చాలా ఎక్కువ..." అన్నాడా అధికారి ఆశ్చర్యపోతూ.

"880, 999, 800 సంవత్సరాలా? నిజమేనా?"

"నిజమే ఆఫీసర్. కుజుడి మీద జీవుల ఆయుర్దాయం ఎక్కువ..."

"భూమి మీద ఏం చూడాలని వచ్చారు?"

సయోనీ ఏమీ చెప్పలేక పోయింది.

వెంటనే నేను అందుకున్నాను.

"ఆమ్రపాలిలో ఉన్న ప్రాచీన భైరవ ఆలయాన్ని సందర్శించడం వాళ్ళ ఉద్దేశం... పైగా అది వాళ్ళ పూర్వీకుల ఊరట..." అన్నాను.

"మంచిది వెళ్ళిరండి. మీ ఆరోగ్యం జాగ్రత్త. అక్కడ వర్షం కురవబోతోంది. సముద్రతీరంలోని ఆమ్రపాలి ప్రాంతంలో తుఫాను సంభవించే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అప్రమత్తంగా ఉండండి.." అంటూ మమ్మల్ని ముందుకు సాగమని సైగ చేసాడు.

తమ శక్తులను నియంత్రించుకుంటున్న కుజ మాంత్రికులు ఉన్న కారు హైవే మీద వేగంగా దూసుకుపోతోంది.

❄ ❄ ❄

# 18. ది హైవే ఔల్

ఎన్నో వస్తువులు మారినట్లుంటాయి.. కాని అవి అలానే ఉంటాయి. దీన్ని మీరు 2014లో చదువుతున్నట్లయితే 1402 ఏళ్ళు గడిచాయని అర్థం. అయితే రహదారికి అటూ ఇటూ ఉన్న పరిసరాలలో పెద్దగా మార్పులేవీ లేవు. అప్పుడప్పుడు కనబడే చెట్లు, దూరంగా కొండలు, ఎర్రటి నేలలు, పచ్చటి పొలాలు. చలనం ఉన్నది - ఎనిమిది లేన్ల హైవేకే. న్యూక్లియర్ కార్లు వేగంగా పోతుంటే, ట్రక్కులు నెమ్మదిగా కదులుతున్నాయి. భారతదేశంలోని ఎడ్లబండ్లు ఎప్పుడో కనుమరుగైపోయాయి. మరీ నెమ్మదిగా వెళ్ళే వాహనాల కోసం కేటాయించిన ఆఖరి ఎడమ లేన్‌లో అప్పుడప్పుడు ఒకటి రెండు ఒంటె/ఎద్దు లాగే బండ్లు కనపడ్డాయి. యుద్ధాలు, పర్యావరణ ప్రమాదాలు ఆసియాని.. ముఖ్యంగా ఇండియాని బాగా నాశనం చేసాయి. అయినా అవి కోలుకున్నాయి, కాని మునుపటంత ఉజ్వలంగా లేవు. కుజ గ్రహం వంటి గ్రహాలతోనో, లేదా చంద్రుడి మీది శాటిలైట్ కాలనీతోనో పోలిస్తే, భూమి నిస్సారంగాను, ఉదాసీనంగానూ అనిపిస్తుంది. ఒకప్పటి ఇండియాకి ఇప్పుడెవరైనా వస్తే ఆధునిక పరికరాలతో గతంలోకి ప్రయాణించినట్లుంది, మనకి తెలియని కుగ్రామాల్లోకి, అపరిచిత లోకంలోకి ప్రవేశించినట్లుంది. తమ శక్తులను తిరిగి పొందడానికి అగ్రపాలిలో దాచబడిన ఓ నిగూఢమైన, అద్భుత వస్తువుని చేజిక్కించుకోవాలనుకునే వింత జీవులు వీళ్ళు. ఎందుకో అసలేమాత్రం పొసగడం లేదు. శాస్త్ర సాంకేతిక రంగం, నిగూఢ విద్యలు ఒకటయ్యే మార్గం విశ్వశక్తే. ఈ రాజకీయ మాంత్రికులు -భూమిని పాలిస్తున్న రాజకీయ శాస్త్రజ్ఞులని కలిసి తీరాలి.

కారు ముందుకు దూసుకుపోయింది. చీకటి ముసురుకుంది. అత్యంత వేగంగా వెళ్ళే వాహనాల లేన్లో, నేలకి మూడు అడుగుల ఎత్తులో ఎగురుతున్న

కార్లు ఎర్రటి లైట్లను ఆన్ చేసాయి. డజన్ల కొద్దీ ఎర్ర మిణుగురులు కాంతులు విరజిమ్ముతూ, చిరుసవ్వడి చేస్తున్నట్లుంది ఆ దృశ్యం. నెమ్మదిగా వెళ్ళే వాహనాల లేన్‌లో అప్పుడప్పుడు సరుకులని రవాణా చేసే భారీ ట్రక్కులు వెడుతున్నాయి. మెటల్ రోడ్ మీద వాటి పెద్ద పెద్ద టైర్లు కదులుతున్నప్పుడల్లా భరించలేనంత చిటపట ధ్వని వినవస్తోంది. సమయం ఏడవుతోంది. కారులోని గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్‌లో చూస్తే, ఆమ్రపాలికి ఉత్తరంగా 600 దూరంలో ఉన్నామని తెలుస్తోంది. ఎక్కడో దూరంగా ఆకాశంలో ఓ మెరుపు మెరిసింది, పిడుగు పడిన శబ్దం వినబడింది.

"భోజనం చేయడానికి దగ్గరలో ఏదైనా హోటల్ ఉందేమో చూడు..." వెనుక నుంచి ఓ మంత్రి చెప్పాడు. రెండో కారు కూడా మా వెనుకే వస్తోంది.

గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్‌లో రెస్టారెంట్స్ అని కనిపిస్తున్న గుర్తుని చూస్తూ.., "మంచి భోజనం దొరికే హోటల్స్ చూపించు.." అని కారుకి చెప్పాను.

తెర మీద రెండు కలర్ ఫోటోలు ప్రత్యక్షమయ్యాయి.

మొదటి ఫోటో 'ది హైవే ఔల్'ది. హైవేపై రాత్రిళ్ళు తెరిచి ఉంచే హోటల్. దీంట్లో భూమిమీది భారతీయ వంటకాలు, గ్రహాంతర రుచులు లభిస్తాయట. పానీయాలు మాత్రం ప్రయాణీకులకేట, డ్రైవర్లకు కాదుట.

ఇక రెండోది 'ది నైట్ పీకాక్'ది. అత్యంత సొగసుగా, విలాసవంతంగా ఉన్న హైవే రెస్టారెంట్ అది. చంద్రుడి నుంచి వచ్చిన వంటవాళ్ళూ, విజాతీయ వంటకాలు దీని ప్రత్యేకత అట! ఖరీదయిన హోటల్ అని అర్థమవుతోంది.

కుజగ్రహం మాంత్రికులు బాగానే తింటారు, అరుణ భూములలో నా యాత్ర సందర్భంగా వాళ్ళ సంగతి నాకు బాగా తెలుసు. బాధైనా, సంతోషమైనా వాళ్ళకి మద్యం కావాలి.

"హైవే ఔల్‌లో భారతీయ వంటకాలు, పానీయాలు కావాలా? లేకపోతే నైట్ పీకాక్‌లో చంద్రుడి రుచులు కావాలా?" అంటూ గట్టిగా అడిగాను.

"హైవే ఔల్‌కే వెడదాం. భారతీయ వంటకాలు ముఖ్యంగా ఉత్తర భారత రుచులు బాగుంటాయి.." అంది సయోనీ.

సయోనీకి మసలాలంటే ఇష్టమేమో.

కార్లని పార్కింగ్ లాట్‌లో ఉంచి, మేము హోటల్లోకి ప్రవేశించాం. గాలి

గుమ్మటంలాంటి నిర్మాణం ఆ హోటల్‌ది. నల్లరంగులో ఉంది. గుమ్మటం మీద గుడ్లగూబ కళ్ళ ఆకారంలో రెండు దీపాలు ఉన్నాయి. హోటల్ గోడలు కూడా నల్లరంగులో ఉన్నాయి, నల్లటి ఉన్ని అనే భ్రమని కల్పిస్తున్నాయి. కుర్చీలు ఎఱ్ఱ రంగులో ఉన్నాయి. డైనింగ్ టేబుల్ మీద తెల్లటి బట్టపై మెరుస్తున్న వెండి పాత్రలున్నాయి. గుడ్లగూబ ఆకారంలో మంచినీళ్ళ సీసాలు ఉన్నాయి. డైనింగ్ హాల్ ఖాళీగా ఉంది. గోడల్లోపల అమర్చిన స్పీకర్ల నుంచి మంద్రస్వరంతో పాటేదో వినిపిస్తోంది. నేనూ, నల్లటి దుస్తులలో తన బక్క పలచని శరీరాన్ని దాచుకున్న సమూరా, సయోనీ, ఇంకా మిగతా మంత్రులు ఓ గుండ్రటి టేబుల్ చుట్టూ కూర్చున్నాం. ఎఱ్ఱటి దుస్తులలో, తలపాగాతో ఉన్న ఓ భారతీయ వెయిటర్ వచ్చి మెనూ కార్డ్ అందించాడు. శతాబ్దాల కాలం నాటి ఇండియన్ ఫ్రైడ్ రైస్, బిర్యానీలు, నాన్, చికెన్, చేపల పులుసులని ఆర్డర్ చేసారా కుజగ్రహం మాంత్రికులు. మిగతావాళ్ళంతా నిశ్శబ్దంగా భోజనం చేస్తుంటే, సయోనీ మాత్రం చెంచాలనూ, ఫోర్క్‌లనూ చప్పుడు చేస్తూ తింటోంది. గాయనీమణి ఎవరో పాడుతున్న హిందీ పాట వినబడుతోంది. అది ఒకప్పటి హిందీ పాట కాదు, ఆధునిక సహస్రాబ్దికి తగ్గట్టుగా పరివర్తించిన భాష అది.

"హనీ, నువ్వు నిజాయితీ గలవాడివి. మోసగాడివి కాదు. ఆ అమృత ఔషధం తాగితే, శక్తులన్నీ నశిస్తాయని మా నాన్నకి ముందే చెప్పుంటే, నువ్వు రక్షించబడేవాడివి. ఇక ఇప్పుడు నిన్ను నమ్మడం కష్టం మాకు. లేకపోతే, నిన్ను మా బృందంలో చేర్చుకుని, మంత్రిని చేసుండేదాన్ని. మాతో చేతులు కలిపి విశ్వాన్ని జయించేవాడివి..." అంటూ ఆపింది సయోనీ.

అన్నం ముద్దలు తింటూ, మధ్య మధ్యలో రెడ్ వైన్ తాగుతూ, బొంగురు గొంతుతో మూలిగాడు. "నన్ను మోసం చేసినవాడి కళ్ళు పెరికేస్తానని నేను శపథం చేసాను. కానీ, హనీ, ఆమ్రపాలిలో దాచిన 'వెండి కొవ్వొత్తి' సంపాదించి నాకిచ్చావంటే నిన్ను క్షమిస్తాను..." అన్నాడు.

"ఆపు నాన్నా..." అంటూ గాభరాగా అరిచింది సయోనీ.

ఆమ్రపాలిలోని ఆ అద్భుత వస్తువేంటో సమూరా పొరపాటున బహిర్గతం చేసేసాడని అర్థమైంది.

"నాన్నా... నువ్వు బాగా తాగావు. ఆఖరి క్షణందాకా చెప్పద్దని అనుకున్నాం కదా..." అంది వణుకుతున్న గొంతుతో, కోపంగా.

నేను చిన్నగా నవ్వి, “కంగారు పడకండి యువరాణీ, నాకెప్పుడు తెలిసినా ఒకటే. తొందరగా తెలిసిపోయింది కాబట్టి దాన్ని వెతకడం కూడా సులువవు తుంది. కాలం వృధా అవదు. మిమ్మల్ని మోసం చేయను. నావి భూగ్రహం నీతి నిజాయితీలు, కుజగ్రహానివి కావు.. “ అన్నాను.

సయోనీ మౌనంగా ఉండిపోయింది. మిగతా మంత్రులు తినడం పూర్తి చేసారు. యూనివర్సల్ కరెన్సీ యూనిట్లలో బిల్ చెల్లించి, టిప్ కూడా ఉదారంగా ఇచ్చి, బయటకి వెడదామని లేచామో లేదో... డైనింగ్ హాల్ తలుపులు హఠాత్తుగా తెరుచుకున్నాయి. వేడిగాలి బయటి నుంచి ఒక్కసారిగా లోపలికి వచ్చింది. నలుగురు ముసుగు మనుషులు లోపలికొచ్చారు. వాళ్ళ చేతుల్లో ... ఫైర్ బర్డ్స్ అని పిలవబడే అత్యాధునికమైన మెషిన్ గన్స్ ఉన్నాయి, అవి ఒకప్పటి చైనాలో, ఇప్పటి నార్తన్ టెర్రిటరీ నెంబర్ సి-111లో తయారైనవి. 21వ శతాబ్దం నాటి AK-47 తుపాకుల్లా కాకుండా, ఇవి నిమిషానికి 10,000 రౌండ్లు కాల్పులు జరపగలవు, అంతే కాదు, కిలోమీటరు దూరం వరకు అగ్గి పుట్టించగలవు.

“అందరూ చేతులు పైకెత్తి నిలుచోండి! మీరు బందీలు. గ్రహాంతర వాసులారా...” అన్నాడో వ్యక్తి ఆయుధంతో సమూరా, అతని మంత్రుల ముందుకు వస్తూ. డైనింగ్ హాల్‌లో నిశ్శబ్దం నిండిపోయింది. పాట కూడా ఆగిపోయినట్లుంది. మాంత్రికులందరూ, మౌనంగా నిలుచున్నారు.

“మేము మీకు హాని చేయం...” అన్నాడో మాంత్రికుడు నెమ్మదిగా.

“మర్యాదగా మీ డబ్బులు, నగలు నేల మీద పెట్టి, కళ్ళు మూసుకోండి. మాకు కావల్సింది అదే..”

నా దగ్గర బంగారు నగలూ లేవు, భూమి మీద ఎంతో విలువైన యూని వర్సల్ కరెన్సీ యూనిట్లూ లేవు. అందుకని నేను మౌనంగా ఉండిపోయాను. కుజగ్రహపు మాంత్రికులందరూ మెల్లగా తమ డబ్బునీ, ఆభరణాలను నేలమీద ఉంచసాగారు. సమూరా కూడా అప్పటిదాక బయటకు కనిపించకుండా ఉంచిన తన వజ్రాల కిరీటాన్ని కూడా తీసి నేల మీద ఉంచాడు. అందులోని వజ్రాలు చీకటిలో మిణుగురుల్లా మెరిసిపోతున్నాయి.

“ఇలా జరిగిందేమిటి? అత్యంత శక్తిమంతమైన కుజమాంత్రికులు ఏదో చిన్న తుపాకీ ఉన్న వీధి దొంగలకి ఇలా లొంగిపోడమా? చాలా ఆశ్చర్యంగా

ఉంది. కాని ఎందుకు లొంగిపోతున్నారో?'' నాలో నేనే అనుకున్నాను.

''గ్రహాంతర మిత్రులారా, ఇవన్నీ విలువైనవి. ఘనమైన సొత్తు. మీరు బాగా ధనవంతులు. మాకు మొదట్నించీ తెలుసు. మిమ్మల్ని పాత స్పేస్ లిఫ్ట్ దగ్గర్నించి అనుసరిస్తూ వస్తున్నాం. మీరు రహస్యంగా వస్తున్నారని మాకు తెలుసు. డబ్బుతోనూ, నకిలీ పత్రాలతోనూ ఏ మూర్ఖుడూ లా టెర్ ప్లాట్‌ఫారాన్ని ఉపయోగించడు. మీలాంటి అక్రమార్కులని వెంటాడడమే మా పని.. హా... హా..'' అంటూ వికటంగా నవ్వాడు.

ఇప్పుడర్థమైంది నాకు. సమూరా, అతని బృందమంతా 'స్పేస్ ఎలివేటర్' అనే పాతకాలపు లిఫ్ట్‌లో లా టెర్ అంతరిక్ష వేదిక నుంచి భూమి మీదకి వచ్చారు. అంతరిక్ష నౌకలకి బదులుగా, భూమినీ, అంతరిక్ష వేదికని సంధానించే చవకైన ప్రత్యామ్నాయం ఇది. వందల ఏళ్ళ క్రితం, ఓ అమెరికా అధ్యక్షుడికి తట్టిన ఆలోచనతో, రూపుదిద్దుకున్న అత్యంత ఎత్తైన, వేలాది కిలోమీటర్ల పొడవైన దుక్క ఇనుప నిర్మాణం అది. నాలుగు వైపులా మూసి ఉండే ఈ లిఫ్ట్ భూమి నుంచి లా టెర్ అంతరిక్ష వేదిక వరకూ ఉంటుంది. అక్కడ్నించి చిన్న బస్ లాంటి వాహనంలో వేదికవద్దకి వెళ్ళాలి. పేద ప్రయాణీకులు, స్పేష్ షిప్ ధరలను తట్టుకోలేని వారు ఈ లిఫ్ట్‌ని ఆశ్రయిస్తారు. దీన్ని రెండు రోజులకొకసారి, అణు ఇంధనాన్ని మండించడం ద్వారా నడుపుతారు. నెమ్మదిగా పైకి లేచి, కుదుపులతో చీకట్లలో కలిసిపోతుంది. ప్రయాణీకులకి ఆక్సిజన్, ఇంకా భారరహిత స్థితిని తట్టుకునేందుకు లోపల రైలు పెట్టెల్లాంటి గదులుంటాయి. ఆ ప్రయాణం భయంకరంగానూ, కంగారుగానూ ఉంటుంది. చాలాసార్లు పవర్ సప్లయి ఆగిపోడం వల్ల ప్రయాణీకులలో ఉద్వేగాలు, మరణాలు, భ్రాంతులు సంభవిస్తాయి. తర్వాతి కాలంలో దాన్ని నిషేధించారు. అయినా, కొంతమంది స్మగ్లర్లు, దొంగతనంగా దిగుమతి చేసుకున్న వస్తువుల సరఫరాదారులు, నేరస్తులు ఈ లిఫ్ట్‌ని ఉపయోగిస్తున్నారట. గ్రహాంతర మాఫియా గ్యాంగ్ ఒకటి దీన్ని లాభాలతో నిర్వహిస్తోందట. ప్రస్తుత ఎర్త్ కౌన్సిల్ ఈ లిఫ్ట్‌పై నిఘా ఉంచిందో లేదో నాకు తెలియదు. సమురా, అతని బృందం నేరస్తులు కాబట్టి, గ్రహాంతర పోలీసుల నిఘాని తప్పించుకోడానికి ఈ రహస్యమార్గాన్ని ఎంచుకోడంలో ఆశ్చర్యం లేదు.

''ఇంక చాలు! ఇచ్చింది తీసుకుని బయల్దేరండి. మీరు అడిగిన దానికన్నా మీకు ఎక్కువే దొరికింది... కిరీటం తీసుకుని బయటకి నడవండి. మాకు

డబ్బు, పాస్‌పోర్ట్‌లు అవసరం. మేము కుజగ్రహం నుంచి వచ్చాం, తెలుసుకదా. మేము తిరిగి వెళ్ళాలంటే ఆ పత్రాలు కావాలి...'' అంది సయోనీ వణుకుతున్న గొంతుతో.

మంత్రుల వైపు తిరిగి, ''మీ డబ్బు, పత్రాలు తీసుకోండి... ఆ పత్రాలు మన దగ్గర ఉండడం మనకెంతో ముఖ్యం...'' అని అంది.

అయినా ఆ దుండగుడు ఆగలేదు. ముందుకే దూసుకొచ్చాడు.

''ఓయ్, ముసల్దానా.. నువ్వెంత దుర్బలంగా ఉన్నావో తెలుసా... ఎముకల గూడులా ఉన్నావు. ఆ కిరీటం అత్యంత విలువైనదని మాకు తెలుసు. అయినా మాకు డబ్బు కూడా కావాలి.  నల్లబజారులో ఈ కిరీటాన్ని అమ్ముకోడానికి కాస్త సమయం పడుతుంది. మీకేం? మీరు గొప్పోళ్ళు.. మీ గ్రహంలో మీకు బోలెడంత డబ్బుంది. కావాలంటే ఇక్కడ కూడా  యూనివర్సల్ ఎటిఎంల నుంచి లేదా మారిటన్ బ్యాంకు శాఖలనుంచి డబ్బు తీసుకోవచ్చు...'' అన్నాడు.

''కుదరదు. మేమలా డబ్బు తీసుకోలేం. కారణాలన్నీ మీకు చెప్పలేం. మేము బహిరంగంగా తిరగలేం. దొంగల్లారా, మా మీద దయచూపండి. డబ్బూ, పత్రాలు వదిలేయండి...'' అంటూ బ్రతిమాలింది సయోనీ.

దొంగలు గట్టిగా నవ్వారు. మరింత ముందుకొచ్చారు.

''బామ్మా... కదలకు. లేదంటే కాల్చి పడేస్తాం...'' అన్నాడు వాళ్ళల్లో ఒకడు.

ఈ వేడుకోళ్ళూ, బ్రతిమాలడాలు చాలాసేపు కొనసాగాయి. చివరికి వాళ్ళల్లో ఒకడు కిరీటం మీద చెయ్యేసాడు, మరొకడు డబ్బు గుంజుకోడానికి ప్రయత్నించాడు. భూమి మీద సినిమాలలో ఘటనలను స్లో-మోషన్‌లో చూపించినట్లుగా జరుగుతోంది ఈ తతంగం అంతా. ఇక్కడి సినిమాలు కథల వల్ల, పాటల వల్ల సౌరవ్యవస్థలో బాగా ప్రసిద్ధి చెంది, మిగతా గ్రహాలకు ఎగుమతి అవుతున్నాయి.

ఉన్నట్లుండి దొంగలందరూ బాధతో విలవిలలాడిపోయారు క్షణకాలంలో నీలిరంగు కాంతి ఒకటి ప్రత్యక్షమైంది, పొగ వచ్చింది. వాళ్ల చేతులు కాలిపోయి నల్లగా మారాయి. బాధతో గట్టిగా అరిచారు వాళ్ళు. చర్మం కాలుతున్న వాసన గాల్లో వ్యాపించింది. కాలిపోయిన తమ చేతులను చూసుకుని, కేకలు పెట్టారు. వాళ్ళ తుపాకులు జారిపోయాయి. అయస్కాంతానికి అతుక్కుపోయే ఇనుప వస్తువుల్లా ఆ తుపాకులొచ్చి మాంత్రికుల చేతికి అందాయి. వెంటనే వాళ్ళు

ఆ తుపాకులను దొంగలకేసి గురిపెట్టారు.

"వద్దు వద్దు.." అని నేను అరిచే లోపే, ఓ మంత్రి, సయోనీ తుపాకులు పేల్చి దొంగల్ని కాల్చేసారు. కాల్పుల శబ్దం ఆ గదంతా ప్రతిధ్వనించింది. దొంగలు రక్తం మడుగులో పడిపోయారు. వాళ్ళ గుండెల నుంచి రక్తం కారుతోంది, చర్మం కాలిన వాసన వస్తోంది. మంత్రులూ, సయోనీ కిరీటాన్ని, తమ డబ్బుని, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కిరీటాన్ని సమూరా తల మీద ఉంచి, ఎవరి డబ్బుని వాళ్ళు తమ తమ జేబుల్లో ఉంచుకున్నారు.

"హనీ, పరిగెత్తు... బయటకి పరిగెత్తు... నేను విశ్వశక్తిని ప్రయోగించాను. విద్యుత్ తరంగాలు మన ఆచూకీని పట్టిస్తాయి. మనల్ని వెతుక్కుంటూ వచ్చేస్తారు. మమ్మల్ని తొందరగా మీ ఊరికి తీసుకెళ్ళు.. లేదంటే నువ్వు కూడా చస్తావ్..." అంది క్రోధంతో.

నేను విస్మయం నుంచి తేరుకున్నాను. ఆమె మాటల్ని పాటించాను.

"అలాగే యువరాణీ, రండి బయల్దేరుదాం" అంటూ బయటకి గెంతి కారులో కూర్చున్నాం. అణు ఇంధనంతో నడిచే మా కార్లు అత్యంత వేగంగా ఆమ్రపాలి కేసి దూసుకుపోయాయి. బయట ఇంకా చీకటిగానే ఉంది. ఆకాశంలో లక్షలాది నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి. కాని త్వరలోనే ఎర్త్ కౌన్సిల్‌కి మా సంగతి తెలుస్తుంది. మమ్మల్ని వేటాడడం మొదలవుతుంది.

❉ ❉ ❉

# 19. యురేకస్‌తో కలయిక

**హై**వే మీద మేము గంటకి 200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాం. గాల్లో ఎగురుతున్న మిణుగురులు దూరంగా ఎర్రటి చారలా కనిపిస్తున్నాయి. అప్పుడప్పుడు మా వెనుక వస్తున్న కార్లు హారన్ మ్రోగించి, ఎర్రటి కాంతిని ప్రసరిస్తూ, ప్రయాణిస్తున్నాయి.

“తొందరపడ్డారు యువరాణీ, మంత్రశక్తులను ప్రయోగించడం ద్వారా, వాళ్ళని చంపడం ద్వారా మీరు మమ్మల్నందరినీ ప్రమాదంలో పడేసారు...” అన్నాను.

సయోనీ కలవరంతో ఉంది, ఉద్విగ్నంగా ఉంది.

“మూర్ఖుడా! వాళ్ళు మా నాన్న వజ్రాల కిరీటం లాక్కోవాలని చూసారు. మా డబ్బు, ప్రయాణ పత్రాలు గుంజుకోవాలనుకున్నారు? మరి మేము వెనక్కి ఎలా వెళ్ళేది? అయినా నేను కోపంగా ఉన్నా, భయపడుతున్నా, నా ప్రమేయం లేకుండానే నా నుంచి విశ్వశక్తి ప్రయోగం జరిగిపోతుంది. దాన్ని ఆపడం నా వల్ల కాదు..” అంది.

‘ఇంత గొప్ప మాంత్రికులు కదా, యూనివర్సల్ కరెన్సీని, ప్రయాణ కాగితాలను మరో ప్రతిని సృష్టించుకోలేరా...?” అనుకున్నాను. కొన్ని ప్రశ్నలకు జవాబులు దొరకకపోతేనే మంచిది.

ఇంతలో ఆకాశంలో ఏదో పెద్ద చప్పుడు వినిపించింది. అది జెట్ విమానం చప్పుడు. కార్లోంచి ఓ మంత్రి తలెత్తి పైకి చూసాడు.

“ఓ విమానం ఎర్ర, ఆకుపచ్చని దీపాలతో, ఆకాశంలో ఎగురుతోంది... కాని చాలా చిన్న విమానంలా ఉంది...” అన్నాడు.

అప్పుడు తట్టింది నా మనసుకి... అది ఏమిటో.

“నిజానికి అది ‘డ్రోన్’, మానవ రహిత విమానం. నిఘాకీ, దాడులకు ఉపయోగిస్తారు. ఇందాక హోటల్లో సంభవించిన విద్యుదయస్కాంత తరంగాలని పసిగట్టినట్లుంది. అక్కడికి వెళ్ళి సాక్ష్యాలను సేకరించి, ఫోటోలు తీసుకుంటుంది. అది బహుశా ఆటోమాటిక్ విమానం అయ్యుంటుంది. అది మనల్ని వెంటాడడం లేదు. అది సమాచారం అందించాలి, దగ్గర్లోని ఊరునించి అధికారుల బృందం పరిశోధన కోసం రావాలి. ఇదంతా జరగడానికి కాస్త సమయం పడుతుంది. ముందు మీరు మీ ఆయుధాలను వదిలేయండి. మంత్రశక్తులను అస్సలు వాడద్దు. ఏ ఇంద్రజాలాలూ వద్దు, ఆవాహనలూ వద్దు. మన ఆనవాళ్ళు దొరకకుండా జాగ్రత్త పడదాం. మామూలు సాధారణ మనుషుల్లా ఆశ్రమపాలికి వెడదాం. సరేనా?” అన్నాను.

“సరే... సరే...” అన్నారు మంత్రులు.

గాల్లోని డ్రోన్ మా వెనుకగా మాయమైంది... దూరంగా హోటల్ ఉన్న చోట చిన్న చుక్కలా వెలుగుతోంది.

“ఇంకో ఆరు వందల మైళ్ళు... మూడు గంటలు పట్టచ్చు... జాగ్రత్తగా ఉండండి...” అంటూ నేను నా పాదాల్ని తీసేసి, కారుని ఆటోమేటిక్ మోడ్‌లో ఉంచాను. రాత్రి పూట ప్రయాణం, ప్రమాదభరితమైనది. దున్నలు, ఏనుగులు, పశువులు... వంటివి ఏవైనా రోడ్డుకి అడ్డం రావచ్చు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు బావుండవు. రోడ్డు మీద వచ్చే వాహనాలను పట్టించుకోకుండా ఏ గ్రామీణుడైనా నడుస్తూండవచ్చు. లేదా మా అతి వేగం వల్ల మా కారు ఏదైనా ఆగి ఉన్న ట్రక్‌ని ఢీకొట్టచ్చు... అయినా మేం వెళ్ళితీరాలి. ఉద్విగ్నతతో నా నరాలు వేడెక్కుతున్నాయి. మేం ముందుకు దూసుకుపోతున్నాం. మా ప్రయాణం సాగుతున్న కొద్దీ, మేమక్కడ మా జాడలేవీ వదిలి రాలేదన్న నమ్మకం కలుగుతోంది. అయితే నిఘా బృందం వాళ్ళు కాలుతున్న హోటల్‌ని గుర్తించినా, దాన్లో విశ్వశక్తి ప్రయోగం జరిగిందన్న రుజువులేవీ ఉండవు. అయినా, వాళ్ళు మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి, మమ్మల్ని పట్టుకోడానికి చూస్తారు. విశ్వశక్తి లేదా మంత్రశక్తుల ప్రయోగం ఇప్పటికే మూడుసార్లు జరిగింది. మొదట నా గదిలో, రెండు విమానాశ్రయంలో.. మూడోసారి హోటల్‌లో.

తరువాతి మూడు గంటలు వేగంగా గడిచిపోయాయి. కుదుపులు లేకుండా కారు అత్యంత వేగంగా నడుస్తుండడంతో ముసలి మాంత్రికులు

కునుకులు తీసారు.

కాసేపటికి తెల్లారింది. తూర్పున వెలుగు రేఖలు. మా ప్రయాణం, దక్షిణ దిశగా, ఆమ్రపాలి వైపు గతుకుల రోడ్డులోకి మారింది. ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడు మెరుపులు, ఉరుములతో భయం కలిగిస్తోంది. వాన పడుతుంది, ఖచ్చితంగా భారీ వర్షం కురవబోతోంది. పైగా తెల్లవారు జామున కురిసే వానలు ఓ పట్టాన ఆగవనీ, రోజులకొద్దీ కొనసాగుతాయనీ విన్నాను. తెర మీద ఓ మీట నొక్కి వాతావరణం గురించి అడిగాను. తెర మీద వెంటనే, తేదీ, వారం, సమయం ప్రత్యక్షమయ్యాయి. సమయం ఉదయం ఆరు గంటలైంది. రాబోయే మూడు రోజుల వాతావరణ వివరాలను చూపించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల దట్టమైన మేఘాలు ఏర్పడి, గత రెండు రోజులుగా అవి దక్షిణం నుంచి ఉత్తర దిశగా సాగాయి. ఆమ్రపాలి గ్రామం ఒకప్పటి భారతదేశంలో ఉత్తర మండలంలో ఉండేదని నాకు తెలుసు. ఆ ఊరి పక్కనే ఓ నది ప్రవహిస్తూ ఉండేది. జలసమృద్ధి వల్ల వరి బాగా పండేది, మామిడి, కొబ్బరి తోటలు బాగా ఉండేవి. తూర్పు దిశగా 30 కిలోమీటర్లు ప్రయాణించి ఆ నది సముద్రంలో కలిసేది.

దారి బాగా గతుకులుగా ఉండడంతో, వేగాన్ని గంటకి 50 మైళ్ళకి తగ్గించాను.

ఉన్నట్లుండి, "వచ్చేసాం... మనం ఆమ్రపాలికి వచ్చేసాం..." అంటూ గట్టిగా అరిచాను. కాస్త దూరంలో 'ఆమ్రపాలికి స్వాగతం' అనే బోర్డు కనిపిస్తోంది.

తెల్లారినా, ముసురు కారణంగా చీకటిగా ఉంది. మేము గ్రామం సరిహద్దులు సమీపించేసరికి వాన చినుకులుగా మొదలై, ఒక్కసారిగా కుంభవృష్టిగా మారింది. రోడ్డు జారుతుండడంతో నేను కారు వేగాన్ని బాగా తగ్గించాను. ఊరి పేరున్న బోర్డు దగ్గరకి వచ్చేసరికి ఎవరో ఆపమని సైగ చేస్తున్నట్లుగా చేతులడ్డం పెట్టారు. కొంచెం దగ్గరగా వెళ్ళేసరికి.... తల మీద యాంటినా, ఇనుపచేతులూ, ముఖం మీద మెరుస్తున్న ఎరుపు, ఆకుపచ్చ దీపాలు, బురద అంటుకున్న ఇనుప కాళ్ళు... నేను ఆనందం పట్టలేకపోయాను.

ఎందుకంటే... అది మరెవరో కాదు. యు-7776! యురేకస్. నా ప్రియమైన రోబో.

మాంత్రికులందరూ మేల్కొన్నారు. గాఢమైన నిద్ర పాడయినందుకేమో,

వాళ్ళ గ్రహం భాషలో గొణుక్కున్నారు.

"ఆ రోబో ఇక్కడికి ఎందుకు వచ్చింది? అది నాశనమైపోయిందని అనుకుంటున్నాం మేం. వద్దు. కారు ఆపద్దు..." అంది సయోనీ.

"సయోనీ, యువరాణీ, దయ చూపు. అది నా ఆజ్ఞలను పాటిస్తుంది. మీకు ఎటువంటి హాని తలపెట్టదు. పైగా దానికున్న శక్తితో అది మీక్కావల్సిన అద్భుత వస్తువు 'వెండి కొవ్వొత్తి'ని సులువుగా గుర్తించగలదు. నేను చెబితేగాని ఎవరిమీద దాడి కూడా చేయదు..." అన్నాను.

నిశ్శబ్దం... ఎవరూ మాట్లాడలేదు.

సమూరా, సయోనీ గుసగుసలాడుకుంటున్నారు. నేను కారుని ఆపాను.

"మీరు దాన్ని అనుమతించకపోతే, నన్ను చంపినా సరే, నేను యురేకస్‌తో వెళ్ళిపోతాను. మీకు సాయపడతానని మాట ఇచ్చాను. మాట నిలుపుకునే మనిషిని నేను. నన్ను సందేహించనవసరం లేదు. అయితే, మీరు ఈ రోబోని అనుమతించకపోతే, నేను కూడా మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతాను. ఏదైతే అదౌతుంది..." అన్నాను తిరుగుబాటు ధోరణిలో.

మౌనం. ఒక నిముషం పాటు సమూరా, సయోనీలు మాట్లాడలేదు.

మా కారు ఆగేసరికి యురేకస్ మా వైపు నడిచింది. ఇంతలో రెండో కారు కూడా వచ్చి మా వెనుకే ఆగింది. యురేకస్ తల మీది యాంటినా నుంచి నిప్పురవ్వలు బయటకొచ్చాయి. అపరిచితులని ఎదుర్కొని నన్ను కాపాడడానికి సన్నద్ధమవుతోంది. నా ఇయర్ ఫోన్ పోగొట్టుకోడంతో, అది నాకు ఏం చెబుతోందో వినలేకపోతున్నాను.

అప్పుడు వెనుక సీట్లో ఉన్న ఓ మంత్రి అన్నాడు "ప్రభూ! ఆ యంత్రం ఈ మనిషికి లొంగి ఉంటుంది. పైగా యురేకస్‌ని రోబోల ప్రమాణాలను అనుసరించి ప్రోగ్రామ్ చేసారు. హనీ నమ్మదగ్గ మనిషైతే, యురేకస్ కూడా విశ్వసించదగ్గదే. అతని విన్నపాన్ని మన్నించండి ప్రభు. మన కార్యం సులువవుతుంది..."

"సరే, సరే.." అంటూ గొణిగాడు సమూరా.

"వెళ్ళి నీ యురేకస్‌ని తెచ్చుకో. పిచ్చి ప్రయత్నాలు చేయకు. లేదంటే నిన్ను బూడిద చేసి అమ్రపాలి మట్టిలో కలిపేస్తాను..." అన్నాడు నాకేసి చూస్తూ.

ఈ విధంగా, నేనూ యురేకస్ మళ్ళీ కలిసాం. అత్యంత తెలివైన ఈ రోబో కిడ్నాపర్ల బారి నుంచి ఎలాగోలా తప్పించుకుని, ట్రక్కులు, లారీల వంటి వాహనలెక్కి ఎలాగోలా ఆమ్రపాలికి చేరిందన్నమాట. కిడ్నాపర్లనుంచి ఎలా తప్పించుకుందో నాకు అర్థం కాలేదు. కారు దిగి, చేతులు చాచి యురేకస్ కేసి పరిగెత్తాను ఆ వానలో.

"వాళ్ళపై దాడి చేయద్దు యురేకస్. అంతా మంచే జరుగుతుంది. వాళ్ళు మన మిత్రులు.. దాడి చేయద్దు..." అంటూ గట్టిగా అరిచాను.

కుండపోతగా కురుస్తోంది వాన. రోడ్డు మీద మోకాళ్ళలోతు నీళ్ళున్నాయి. ఈ విధంగా నా ఊరు... ఆమ్రపాలి ఆ ముసురుక్రమ్మిన ఉదయాన నాకు స్వాగతం పలికింది.

❄ ❄ ❄

# 20. ఆమ్రపాలి

**యు**రేకస్ పరిస్థితిని అర్థం చేసుకుంది. నేను దాని దగ్గరికి చేరి, ఆజ్ఞలిచ్చాను, అదేదో శబ్దాలను వెలువరించింది. రోబోకున్న ఆకుపచ్చ దీపాలు వెలగసాగాయి. అది శాంతించిందనడానికి సంకేతమేమో.

"మాస్టర్! మీ గొంతు విని గుర్తించాను. మీరు ఆమ్రపాలికి వచ్చే అవకాశం 70% ఉందని నమ్మి, ఇక్కడికి వచ్చి ఎదురుచూస్తున్నాను..."

"అయినా, నువ్వు ఇక్కడి దాకా ఎలా రాగలిగావు యురేకస్?"

"వాళ్ళు మీ మీద మంత్రప్రయోగం చేసి, రహస్యశక్తులతో మిమ్మల్ని అపహరించినప్పుడు విద్యుత్ తరంగాలను ఉపయోగించారు. అవి నా మీద పనిచేయలేదు. నేను కాసేపు అదృశ్యంగా ఉన్నాను, తాత్కాలికంగా నన్ను నేను నిర్వీర్యం చేసుకున్నాను. నా సిస్టమ్స్ అన్నీ మూసివేస్తే, నేనెవరికి కనపడకుండా ఉండేలా ప్రోగ్రామ్ చేసారు. దాంతో నన్ను నాశనం చేయడానికి వీలవదు. నేను దొరకనని తెలిసే వీళ్ళు నన్ను వదిలేసారు. పైగా నన్ను తయారు చేసిందే కుజుడి మీద అరుణ భూముల శాస్త్రవేత్తలు కదా..."

"సరే, ఇంతకీ నువ్వు ఆమ్రపాలికి ఎలా వచ్చావు?"

"రాత్రి పూట తిరిగే వాహనాలకు నన్ను నేను తగిలించుకున్నాను. వాహనాలేవీ దొరకనప్పుడు గాల్లో ఎగిరాను. ... ఎలాగైతేనేం మీ కన్నా ముందే రాగలిగాను..."

"అది సరే, మరి నిన్ను నువ్వు చార్జింగ్ ఎలా చేసుకున్నావ్? నువ్వు అదృశ్యం అవడంలోనూ, వాహనాలు పట్టుకుని వేలాడుతూ రావడంలోనూ నీ చార్జింగ్ అయిపోవాలి గదా?"

"అవును... చార్జింగ్ అయిపోతూనే ఉంది. కానీ అవకాశమున్న చోటల్లా అంటే రైలు పట్టాల పక్కన ఉండే హై వోల్టేజ్ కరెంట్ తీగల నుంచి, రాత్రి

పూట ఏదైనా హోటల్లో... ఎక్కడెక్కడ అవకాశం లభిస్తే... అక్కడ చార్జింగ్ చేసుకున్నాను..."

"అద్భుతం.." అన్నాను విస్మయంగా.

మేమిద్దరం ఇలా మాట్లాడుకుంటూ నడుస్తూంటే, కారు దగ్గర కుజ గ్రహం మాంత్రికులు చిరాకు పడుతున్నారు. వర్షంలో తడుస్తూ అసహనంగా నిల్చుని మాకేసే చూస్తున్నారు.

కిరీటంలోని వజ్రాలు ధగధగా మెరుస్తుండగా.. ధరించిన నల్లటి దుస్తులు తడుస్తుండగా... అంతటి వర్షంలోనూ సమూరా కళ్ళు ఎర్రగా నిప్పులు చిమ్ముతున్నాయి.

"అయ్యాయా కబుర్లు? ఓయ్ హనీ. పిచ్చి వేషాలు వేయద్దు. నీ రోబోతో కలసి మమ్మల్ని ఏమార్చాలని చూస్తే, నిన్ను కాల్చి బూడిద చేసేస్తాను...." అంది సయోనీ కోపంతో బుసలు కొడుతూ..

నాకు కోపం వచ్చింది, కాని వాగ్వాదాలకు సమయం కాదని మిన్నకుండి పోయాను. "శాంతించండి యువరాణీ! నన్ను తిట్టక్కర్లేదు, బెదిరించనక్కర్లేదు. ఈ ఊర్లో ఆ వెండి కొవ్వొత్తి ఎక్కడుందో స్థానికుల సాయంతోనూ, ఈ యురేకస్ సాయంతోనూ కనుక్కోడానికి ప్రణాళికలు వేసుకోవాలి. కాదంటారా? నేను మిమ్మల్ని ఎలా మోసం చేయగలను? నాకింకా బతకాలని ఉంది.. అయినా ముందుగా మీరెక్కడ దాక్కుంటారూ, బయటకి ఎప్పుడొస్తారు, వీటి గురించి ఆలోచించండి..." అన్నాను.

"యాత్రికుల కోసం, పర్యాటకుల కోసం ఏదైనా సత్రం లేదా లాడ్జి ఏవైనా ఉంటాయేమో..." అంది సయోనీ.

"ఉన్నాయి. యువరాణీ!" చటుక్కున అంది యురేకస్. ఎంతైనా కుజుడి మీద అరుణ భూముల శాస్త్రవేత్తలు రూపొందించిన రోబో కదా.

"నా జియోపొజిషనింగ్ సిస్టమ్‌లో చూస్తే, ఆమ్రపాలి గ్రామం శివార్లలో ఓ చక్కని లాడ్జి కనబడుతోంది. దాని పేరు 'మాంగో ఆర్చర్డ్'. 12 గదులున్న లాడ్జి. దాంట్లో బస, ఆహారం రెండూ లభిస్తాయి..." చెప్పింది యురేకస్.

"సరే. మేము అందులోనే ఉంటాం. బాగా గుర్తుంచుకో. మేము సాధారణ పర్యాటకులమే. మాకు మంత్రశక్తులున్నాయని లేదా మానవుల భాషలో... మేం విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులమని ఎవరికైనా చెబితే.. జాగ్రత్త!

అర్థమైందా...?"

"అర్థమైంది.. యువర్ ఎక్సలెన్సీ..." అంది యురేకస్ అణుకువగా.

"రహస్యం... గోప్యం..." అంటూ నేను యురేకస్‌కి వాయిస్ కమాండ్స్ ఇచ్చాను.

"నేను మీతో...." అని అన్నానో లేదో సయోనీ అందుకుంది.

"లేదు... లేదు నువ్వు మాతో ఉండడానికి వీల్లేదు. నువ్వు గ్రామస్తులకి తెలుసు కాబట్టి నువ్వు విడిగా, ఏ బంధువు ఇంట్లోనో ఉండి ఆ అద్భుత వస్తువు గురించి భోగట్టా చెయ్యి..."

"శిథిలమైన మా ఇల్లు తప్ప ఈ ఊర్లో నాకేమీ లేదు. బంధువులూ లేరు. ఉన్న ఒక్క ధరణి మావయ్య ఇప్పుడు లేరు.. అయినా, సరే, నేను మా పాత ఇంట్లోనే ఉంటాను. మా నాన్న కాగితాలలో ఏవైనా ఆచూకీ దొరుకు తుందేమో చూస్తాను... ఏదన్నా దొరికితే నేను మిమ్మల్ని లాడ్జిలో కలుస్తాను." అని చెప్పి, "అన్నట్లు మీ దగ్గర మొబైల్ ఫోన్లు ఉన్నాయా?" అడిగాను.

సయోనీ దగ్గర, మంత్రుల వద్ద ఇంటర్ గెలాస్టిక్ మొబైల్ ఫోన్లు ఉన్నాయి. తమ తమ ఫోన్ నెంబర్లు ఇచ్చారు.

"చూడండి. ఎటువంటి మంత్రశక్తులు ప్రయోగించకండి. మీ గదుల్లో హాయిగా విశ్రాంతి తీసుకోండి. రుచికరమైన భారతీయ ఆహారపదార్థాలు తినండి, వేచి చూడండి. నేను మీతో టచ్‌లో ఉంటాను..." అంటూ జాగ్రత్తలు చెప్పాను.

ఈ లాడ్జి సుమారుగా 10-12 గదులున్న ఓ చిన్న భవనం. మామిడి, కొబ్బరి చెట్లు విస్తారంగా ఉన్న తోటలో ఉంది. కుజగ్రహవాసులందరూ తమ తమ గదుల్లోకి వెళ్ళేదాక అక్కడే ఉందామనుకున్నాను. వాళ్ళ యూనివర్సల్ కరెన్సీ యూనిట్లు చాలానే ఉన్నట్లున్నాయి, గదులకి అడ్వాన్స్ చెల్లించారు.

రిసెప్షనిస్ట్ వాళ్ళకి గదుల తాళం చేతులు అందించింది. "పెద్దగా సామాన్లేవీ ఉన్నట్లు లేవే?" అంది నవ్వుతూ.

వాళ్ళు అవునన్నారు.

పర్సులు చూపిస్తూ, "మా దగ్గర ఉన్నవి ఇవే" అన్నారు. కానీ రెండో కారులో వచ్చిన కొందరు మంత్రులు రెండు పెద్ద సూట్‌కేసులు మోసుకొచ్చారు. హోటల్ సిబ్బంది వాటిని వాళ్ళ గదులలో చేర్చాడు.

“సరే, యువరాణీ, నేనిక సెలవు తీసుకుంటాను. మీకు కావల్సిన సమాచారం లభించగానే కలుస్తాను...” అన్నాను.

వృద్ధ మంత్రులు, సయోనీ, సమూరాలు లిఫ్ట్ ఎక్కి పైకి వెళ్ళేదాక ఆగి, మేము లాబీలోకి వచ్చాం. రిసెప్షనిస్ట్ ఈ ఊరి అమ్మాయే. నీలం రంగు చీరలో, తలలో ఎఱ్ఱ మందారం పూలు పెట్టుకుని ఉంది. మేము బయటకి నడవబోతుంటే, “సర్... ఒక్క నిమిషం..” అంటూ ఆపింది.

“చెప్పండి”

“సర్, వాళ్ళు తమ వయసు 850, 900 సంవత్సరాలని రాసారు. నిజంగా వాళ్ళకి అంత వయసుంటుందా?” అంటూ రిజిస్టర్లో వయసు గడిని చూపింది.

చిన్నగా నవ్వాను.

“ఉంటుంది. కుజగ్రహం మీద జీవితకాలం చాలా ఎక్కువ. వాళ్ళ వయసు చాలా ఎక్కువ... కాని వాళ్ళని వయసైపోయినవాళ్ళని అనకూడదు. సీనియర్ మారిటన్స్ అని అనాలి...”

“అవునా. నాకు తెలియదు. మునుపెన్నడూ ఇలాంటి వాళ్ళని చూడలేదు...”

“వాళ్ళతో చక్కగా ఉండండి... ఏం కావాలో జాగ్రత్తగా చూసుకోండి...” అంటూ యురేకస్‌తో కలసి హోటల్ బయటకి నడిచాను. ఇక ఈ ఊర్లో మా ఇల్లు వెతుక్కోవాలి... కాని ఈ హోటల్లోనే భోజనం చేయచ్చు కదా అనే ఆలోచన తట్టి మళ్ళీ వెనకొచ్చి రిసెప్షనిస్ట్‌ని అడిగాను రెస్టారెంట్ ఎటువైపు అని. రెస్టారెంట్ ఎటువైపో చెప్పి, యురేకస్ కేసి ఆరాధనగా చూస్తూ, “మీ రోబో బావుంది. ఇంపోర్టెడా?” అని అడిగింది.

“అవును. కుజుడి నుంచి తెచ్చుకున్నాను...”

“అవునా.. సర్, మీది ఈ ఊరేనా...?”

“అవును. నా పేరు హనీ ఆమ్రపాలి. ఇక్కడి వాడినే. ఓ పని మీద ఈ ఊరొచ్చాను. శివార్లలో ఉండే ఆమ్రపాలిలో ఇల్లు కనుక్కోవాలి...” అన్నాను.

ఆమె ముఖంలో రంగులు మారాయి.

“సర్... ఆమ్రపాలి అనే ఇంటి పేరు... నిషేధిత కుటుంబానికి చెందినది.. వాళ్ళేవో మంత్ర ప్రయోగాలు చేసారని విన్నాను.. నిజమేనా? ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. నేనప్పుడు చాలా చిన్నపిల్లని. ఆమ్రపాలి

కుటుంబం ఇక్కడున్నప్పుడు వాళ్ళ గురించి రకరకాలుగా చెప్పుకునేవాళ్ళట...'' అంది.

''ఫరవాలేదు. నేను ప్రమాదకర వ్యక్తిని కాను. నేరస్తుడిని కాను. పైగా నా కుటుంబమేమీ నిషేధిత జాతి కాదు. నేనో ప్రొఫెసర్‌ని, నేను నా ఇంటిని చూసే హక్కు నాకుంది, అంతే కాదు, పర్యాటకులకు ఈ ఊరూ, చుట్టుపక్కల ప్రదేశాలు చూపిస్తాను...'' అన్నాను.

''మీరు గ్రామాధికారి మహాగారిని కలిస్తే మంచిది. ఒకప్పటి మీ ఇల్లు ఎక్కడ ఉందో చెబుతాడు, అందులోకి ప్రవేశించడానికి అనుమతి ఇస్తాడాయన...'' అంది.

నేనీ ఊరొచ్చి చాలా కాలమైంది. ఆ ఇంటి తాళంచెవులు నాదగ్గర లేవు. ధరణి మామయ్యతో ఒకటి రెండు సార్లు వెళ్ళుంటానేమో... అయినా ఆ ఇంట్లో నాకేమీ తీపి గుర్తులేవీ లేవు, ఉన్నవల్లా చేదు జ్ఞాపకాలే.

''కానీ...'' అంటూ ఓ క్షణం ఆపింది ఆ అమ్మాయి.

''ఆ ఇల్లు ఇక్కడికి దగ్గరే. ఇక్కడికి వచ్చేముందు, వెళ్ళేముందూ ఆ ఇంటి మీద నుంచే వెడతాను. మా లాడ్జికి సుమారుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చాలా పాతబడిపోయింది, చుట్టూ చెట్టూ చేమా! శిథిలమవుతున్న ప్రహరీ గోడలు.. అందులో దెయ్యాలున్నాయని అంటారు... నాకెప్పుడూ ఆ ఇల్లు వింతగానే ఉంటుంది... అయినా మీ సొంత తల్లిదండ్రుల ఇల్లంటున్నారు... ఊరి మధ్యలో ఉన్న గ్రామాధికారి ఆఫీసుకి వెళ్ళి అడగండి.. మీకు మేలు జరగాలని కోరుకుంటున్నాను...'' అంది.

''థాంక్యూ మిస్...''

''నా పేరు మందార''

''థ్యాంక్యూ మందారా...''

బరువెక్కిన హృదయంతో రెస్టారెంట్‌లోకి ప్రవేశించాను. గతం గుర్తుకొచ్చేసరికి నా ఆకలి చచ్చిపోయింది.

''మాస్టర్, తినండి.. చాలా దూరం కారు నడిపి అలిసిపోయారు...'' అంది యురేకస్.

❊ ❊ ❊

# 21. ప్రకృతి

**నా**ల్గో సహస్రాబ్దిలో కూడా ఆసియాలో గ్రామాలు పూర్వం ఎలా ఉండేవో అలానే ఉన్నాయి, కొద్దిపాటి సాంకేతిక హంగులు తప్ప! అమ్రపాలి చిన్న ఊరు. సుమారుగా 3000మంది జనాభా ఉంటుంది. ఆరేడు వందల కుటుంబాలు ఉంటాయి. ఊరి చుట్టూ పచ్చని పొలాలు, 30 కిలోమీటర్ల దూరంలో సముద్రం. అయితే సరైన బీచ్ లేకపోవడంతో సముద్రానికి వెళ్ళడం కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుంది. ఊరిని ఆనుకుని ప్రవహించే ఓ నది ఆ సముద్రంలో కలుస్తుంది. ఈ నదీజలాలతో వ్యవసాయం కొనసాగుతుంది. గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో హైవే ఉంది. ఒకటి రెండు చిన్న హోటళ్ళు, ఓ చిన్న బస్ స్టాండ్, పురాతన వస్తువులు అమ్మే కొట్లు, పళ్ళు, బట్టలమ్మే కొట్లున్నాయి. గ్రామంలో చాలామంది వ్యవసాయదారులే, వరి పండిస్తారు, మామిడి, కొబ్బరి తోటలను పెంచుతారు. ఆవులు, గొర్రెలతో పశుపోషణ కూడా బాగానే ఉంది. గ్రామాధికారి పేరు 'మహా'. చాలా పెద్దాయన. ఎర్రటి ముడుతలు పడిన ముఖంపై బూడిద రంగు మీసాలు, తలకి పాగా, వంటి మీద తెల్ల ధోవతి, నీలం రంగు అంగీ ధరిస్తాడు. మెడలో బంగారు గొలుసు. ఇంట్లో విశ్రాంతిగా కూర్చుని ఉన్నాడు, ఆయన చుట్టూ కొంతమంది సహచరులు కూర్చున్నారు.

"హానీ. బావున్నావా నాయనా. చాలా ఏళ్ళ తర్వాత నిన్ను చూస్తున్నాను. ఎలా ఉన్నావు? మీ మావయ్య ధరణి, చనిపోయిన మీ అమ్మానాన్నలు నాకింకా గుర్తున్నారు..." అంటూ పలకరించాడు.

ఓ పనివాడు ఓ నల్లని ట్రేలో టీ, బిస్కట్లు తెచ్చి నా ఎదురుగా ఉన్న బల్లపై ఉంచాడు.

"నమస్కారమండీ. నేను యూనివర్సిటీలో పనిచేస్తాను.... అమ్రపాలికి

రావాల్సిన అవసరమేదీ కలగలేదు ఇప్పటిదాకా. అందువల్ల మిమ్మల్ని కలవలేక పోయాను. పైగా నా ఆప్తుడు ధరణి మావయ్య కూడా ఇప్పుడు లేడు...''

''అయితేనేం నాయనా, మేమంతా లేమా నీకు? పైగా నీకిక్కడ 50 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి, నీ పాత ఇల్లు ఉంది. నీ పంటల మీద వచ్చే ఆదాయాన్ని బ్యాంకులో జాగ్రత్తగా దాస్తున్నాం. నీ ఇల్లు తాళం వేసి భద్రంగా ఉంది... నీ తల్లిదండ్రులు... దేవుడు చూపిన మార్గంలో నడవకుండా.. కష్టాలు కొనితెచ్చుకున్నారు..''

ఈ సంభాషణ నాకు నచ్చడం లేదు. యురేకస్ చిన్న చప్పుడు చేసింది, దానిలోని లైట్లు వెలిగాయి.

''ఈ యంత్రం బావుందోయ్... ఇంపోర్టెడా?''

''అవును'' అంటూ గొణిగాను.

''మహా గారూ, నాకూ మా ఇంటి తాళాలు కావాలి. మీ అనుమతితో మా ఇంట్లో కొన్ని రోజులు ఉండాలనుకుంటున్నాను. నాతో పాటు కొంత మంది వృద్ధులు కూడా ఉన్నారు. వాళ్ళు కుజగ్రహం నుంచి ఇక్కడికి పర్యాటకులుగా వచ్చారు. ఇక్కడి భైరవాలయాన్ని, ఇంకా తోటలని చూడాలని వచ్చారు....''

ఆయన ఆలోచనలో పడ్డాడు. తోటి వారి కేసి చూసాడు.

''హనీ! మీ తల్లిదండ్రులు అసాధారణంగా మరణించారు.. వాళ్ళు క్షుద్రశక్తులను ఆరాధించారు, గ్రహాంతర మంత్రగాళ్ళతోనూ, దెయ్యాలతోనూ సంబంధం పెట్టుకున్నారు. వాళ్ళకి గొప్ప శక్తులుండేవి.. గ్రామస్తులంతా వాళ్ళంటే భయపడేవాళ్ళు...'' చెప్పాడాయన.

''క్షమించండి.. మా అమ్మానాన్నలు ఎవరికీ హాని చేయలేదు. పశువులకి సోకే రోగాలను నయం చేసేవాళ్ళు. వింత జబ్బులతో బాధపడే ప్రజలకు చికిత్స చేసేవారు, పంటలకి సోకే దిష్టిని తొలగించేవారు, అకాల వర్షాలను నిలువరించి పంటలను కాపాడేవారు...'' అన్నాను.

''నిజమే. అవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాని అదంతా గతం. నువ్వు యువకుడివి. పైగా సైన్సు చదువుకున్నవాడివి. నీకు నేను చెప్పేదొకటే... గ్రహాంతర మంత్రగాళ్ళతో స్నేహం చేయకు. మంత్రగాళ్ళనూ, క్షుద్రశక్తులను ఆరాధించేవాళ్ళను ఇక్కడ భూమి మీద 'విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులు'

అని పిలుస్తాం.. తెలుసుగా. అలాంటివాళ్ళకు దూరంగా ఉండమని మాత్రమే నా సలహా. ప్రార్థన కూడా. మీ అమ్మానాన్నలు ఈ ఊర్లోనే ఉండేవారు. మంత్రశక్తులున్నవారని తెలిసినా కూడా గ్రామస్తులు వాళ్ళకి ఎటువంటి హాని తలపెట్టలేదు. ఎవరి విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా వారు నడుచు కున్నారు. కాని ఇప్పుడు నువ్వు వైజ్ఞానికుడివి... పైగా....'' అంటూ ఆపి, ఓ గోధుమ రంగు కవర్లో ఉన్న ఉత్తరం బయటకి తీసాడు.

''ఉత్తర అమెరికాలోని ఎర్త్ కౌన్సిల్ నుంచి వచ్చిన వర్తమానం ఇది. పిసియుఎఫ్ మానిటరింగ్ సెల్ నుంచి వచ్చింది. నువ్వు కుజగ్రహం వెళ్ళి, అక్కడ ఏదో విశ్వశక్తి నేర్చుకుని వచ్చావని, నిన్ను గమనిస్తూ ఉండాలని రాసారు. నాకు చాలా బాధగా ఉంది అబ్బాయి. ఈ ఊరివాడిగా నీకు స్వాగతం పలకాలో, లేదా విశ్వశక్తిని సాధన చేసే అనుమానితుడిగా భావించి నీ చర్యలను గమనిస్తూండాలో నాకు అర్థం కావడం లేదు. మీ అమ్మానాన్నల గురించి మాకంతా తెలుసు. వాళ్ళూ, మేము కలిసే ఉన్నాం. కాని చివరికి దుష్టశక్తులొచ్చి వాళ్ళని చంపి.. నిన్ను అనాథని చేసాయి.. దుష్టశక్తులతో సావాసం చేస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయి...

''క్షమించండి... నేను విశ్వశక్తిని గాని లేదా మంత్రాలు గాని లేదా వేరే ఏ క్షుద్రశక్తులని ఉపయోగించను. మా అమ్మానాన్నలు గొప్పవాళ్ళు. ప్రజలకి మేలు చేయడానికే విశ్వశక్తిని ఉపయోగించారు. నిజానికి వాళ్ళిద్దరూ దుష్టశక్తులకు బలైపోయారు తప్ప వాళ్ళతో కలిసి పనిచేయలేదు. చెడు ఉద్దేశాలతో మా అమ్మానాన్నలను కలుపుకోవాలనుకున్నారు ఆ దుష్టులు. అమ్మానాన్నలు వ్యతిరేకించేసరికి చంపేసారు.. నేనలాంటి పనులేవీ చేయను....'' అన్నాను.

నేను అబద్ధమాడుతున్నానని నాకు తెలుసు. ఇంతలో రోబో మళ్ళీ ఏవో సంకేతాలిచ్చింది.

''అయినా మీరే చూస్తున్నారుగా, నేను సైన్సుపై ఆధారపడేవాడిని. ఇలాంటి రోబోలతో పనిచేసేవాడిని. నేను ప్రజలకి ఎటువంటి హానీ చేయను. విశ్వశక్తిని ఉపయోగించడం వల్ల నేను కొన్ని అద్భుతాలు చేయగల శక్తిని కలిగించే జన్యువులు నాలో ఉండి ఉండచ్చు... కాని వాటిని నేనెన్నడూ ఉపయోగించను. ఎందుకంటే వాటిని నిషేధించారు. పైగా, మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శాన్ ద్వారా ఎర్త్ కౌన్సిల్ నన్ను ఇప్పటికే హెచ్చరించింది.

కృంగి కృశించిన ఆ వృద్ధులు కుజగ్రహం మీద నాకు పరిచయమయ్యారు. ఇక్కడి ప్రాంతాలు చూపిద్దామనే తీసుకువచ్చాను అంతే....''

''సరే.. సరే. జాగ్రత్తగా ఉండు.. ఇదిగో మీ ఇంటి తాళాలు. బ్యాంకు పాస్ బుక్. భోజనానికి నువ్వు దగ్గర్లోని హోటల్‌కి వెళ్ళచ్చు. లేదా నేను మా ఇంట్లో వండించి పంపిస్తాను. ఇక వెళ్ళి కాస్త విశ్రాంతి తీసుకో...'' అన్నాడాయన.

తాళాలు అందుకుని, ఆయనకి ధన్యవాదాలు చెప్పి బయల్దేరాను. ఇంతలో కాలి అందెల సవ్వడితోనూ, మల్లెపూల పరిమళంతోను ఓ అమ్మాయి ఆ గదిలో ప్రవేశించింది. పొడుగ్గా ఉంది, ఎర్రటి రంగు! బంగారు రంగు చీర ధరించి, కొంగును తలమీదుగా కప్పుకుంది. కాటుక కళ్ళు, ఎర్రటి పెదాలు, నునుపైన గులాబీ చెక్కిళ్ళు!

''నాన్నా, నాన్నా... వీళ్ళతో పాటు నేను కూడా భైరవాలయానికి వెడతాను. చాలా రోజులయ్యింది అక్కడ పూజ చేసి. ఒప్పుకో నాన్నా...'' అంటూ గారాలు పోయింది.

''సరే, అలాగే వెడుదువుగానీ...'' అంటూ గట్టిగా నవ్వాడు మహా.

నాకేసి తిరిగి, ''నా ఏకైక కూతురు ప్రకృతి. నా గారాలపట్టి...'' అని చెప్పి, ఆమెకేసి తిరిగి, ''అమ్మా, ఇతను హనీ ఆమ్రపాలి.. మన ఊరివాడే కాని ఇండికా సెంట్రల్‌లో స్థిరపడ్డాడు. ఇతనొప్పుకుంటే, వీళ్ళతో పాటు నువ్వు కూడా భైరవాలయానికి వెళ్ళచ్చు... అయితే నేను విన్నదేంటంటే - ఇతనితో పాటు వచ్చిన వాళ్ళంతా ముసలాళ్ళేనట...'' అంటూ నవ్వాడు. ''ఆ గుడికి నువ్వు ఎప్పుడైనా వెళ్ళచ్చు. అయినా నువ్వు ఆ గుడికి పవిత్రదినాలలోనే వెడతావు కదా.. మరి ఇప్పుడెందుకు తొందర...'' అంటూ కూతురిని అడిగాడు.

ఆమెలో ఏదో విచిత్రమైన ఆకర్షణ ఉంది. నాలో నిలువెల్లా ఉత్సాహం. అతిసూక్ష్మమైన స్పందనలేవో నాలో కలుగుతున్నాయి. మునుపే తెలుసనే భావన.. ఓ కలలా.. ఓ భావనలా ఆమె నాకు ముందే పరిచయమన్న అనుభూతి. నన్ను చూసి నవ్విందామె. అప్పుడు నాకు గుర్తొచ్చింది. నా కలలో సరస్సు దగ్గర నీళ్ళ బిందెతో కనపడినది ఈ అమ్మాయే. ఆమె కళ్ళలో ఏదో ప్రశాంతత... ఏదో శక్తి. నాకెప్పటినుంచో తెలుసు ఈ అమ్మాయి.. ఎప్పటి నుంచో. ఆమెలోని ప్రతీ కణంలో విశ్వశక్తి ఉట్టిపడుతోంది.. నాకు తెలుసు. కానీ గ్రామాధికారి మహాగారికి తెలియదు.

“మిమ్మల్ని కలవడం సంతోషంగా ఉంది ప్రకృతి! మేము భైరవాలయానికి వెళ్ళే ముందు మీకు కబురు చేస్తాను.. కుజగ్రహం నుంచి వచ్చిన పర్యాటకులు ఆసక్తికరంగా ఉంటారు, మంచివాళ్ళు...” అన్నాను.

“థాంక్స్. మీతో రావడం నాకు సంతోషం...” అంది నెమ్మదిగా. ఆ స్వరం వేణునాదంలా ఉంది. నేను చదివిన ఉత్తర భారత గాథలలో చెప్పినట్లుగా సాయంత్రాల పూట ఊదే వేణునాదంలా ఉంది ఆమె గొంతు. ప్రశాంతంగా ఉన్నా, అందులో తీవ్రమైన శక్తి ఉంది.

❊ ❊ ❊

# 22. రక్త సంబంధం

గ్రామాధికారి ఇంటికి దూరంగా, ఊరికి ఉత్తరంగా ఉంటుంది మా పూర్వీకుల ఇల్లు. వాన వెలసింది. బురద నిండిన రోడ్డుపై నేను యురేకస్‌తో కలసి బయల్దేరాను. ఆకాశంలో సూర్యుడు దోబూచులాడుతున్నాడు. తెల్లని మబ్బులు కమ్ముకున్నాయి. గగనం నుంచి ఓ ఒంటరి కిరణం జారి యురేకస్ ఇనుప కోటుపై పడింది. యురేకస్ తళుక్కుమని మెరిసింది. మా అమ్మా నాన్నలు నివసించిన ఆ ఇటుకల ఇంటి ప్రహరీగోడకి నల్లరంగు ఇనుపగేటు ఉంది. సుమారు ఎకరం వైశాల్యం ఉండే ఆ ప్రాంగణంలోకి అడుగు పెడుతూనే నాలో ఆనందం. చిన్నప్పటి జ్ఞాపకాలేవో మేల్కొన్నాయి. చుట్టూ రకరకాల చెట్ల మధ్యలో ఉంది ఇల్లు. వేప, కొబ్బరి, మామిడి చెట్లున్నాయి, ప్రహరీగోడ చుట్టూ ఎన్నో పొదలు మొలిచాయి. కోసేవాళ్ళెవరూ లేకపోవడంతో గడ్డి మనిషంత ఎత్తు పెరిగింది. ఇంటి వెనుక పశువుల కొట్టం, ధాన్యపు గాదెలు ఉన్నాయి. చేత్తో తాళంచెవులు పట్టుకుని తలుపుల తాళం తీయడం యురేకస్‌కి నేర్పించాను. ఇలా తాళాలు తీసే పద్ధతి ఇంకా ఒక్క భూగ్రహం మీదే ఉంది. కారుని లోపల పార్క్ చేసి, ఇంట్లోకి ప్రవేశించాం. చాలా ఏళ్ళుగా ఇంట్లో ఎవరూ లేరు కాబట్టి, విపరీతంగా దుమ్ము పేరుకుపోయింది. హాల్లో సోఫాలో కూర్చుంటూ..., "యురేకస్.. ఇదంతా నీ రాజ్యం. ఇల్లు శుభ్రం చెయ్, ఎలక్ట్రికల్ కనెక్షన్స్ అన్ని సరి చెయ్, వేడి నీళ్ళు పెట్టు, మనం తెచ్చిన ఆహార పదార్థాలతో వంట చెయ్..." అంటూ ఆదేశాలు జారీచేసాను.

"అలాగే మాస్టర్.." అంటూ పనిలోకి దిగింది యురేకస్. ఫ్రిజ్ చాలా పెద్దది. నేను తెచ్చిన పప్పు దినుసులు, తృణధాన్యాలు, పళ్ళు, జామ్‌లను ఫ్రిజ్‌లో ఉంచాను. గ్రామంలోని ఓ పెద్ద కొట్లోంచి బ్రౌన్ బ్రెడ్, తాజా పాలు, కోడి గుడ్లు కూడా కొన్నాను.

అవును. రోబో వండగలదు. ఆమ్లెట్ చేయగలిగేలా, బ్రెడ్‌ని సమానంగా కోయగలిగేలా దాన్ని నేను ప్రోగ్రామ్ చేసాను. అయితే కష్టమైన వంటలు.. అంటే బిర్యానీ, లేదా భారతీయ పచ్చళ్ళు వంటివి తయారు చేయడం దాని శక్తికి మించినవి. అయితే వడ్డన మాత్రం మహా బాగా చేస్తుంది. డైనింగ్ టేబుల్ మీద గుడ్డ వేయడం, పాత్రలను చక్కగా సర్దడం, అడిగిన వెంటనే వేడి వేడి కాఫీ అందివ్వడం.. చక్కగా చేస్తుంది.

ఈలోపు నేను సోఫాలోంచి లేచి వెళ్ళి బట్టలు మార్చుకున్నాను. ఇంట్లో ఉన్నప్పుడు ధరించే పైజామా వేసుకుని మా నాన్న లైబ్రరీలోకి వెళ్ళాను. అది చాలా పెద్ద గది. ఓ వైపు నిండుగా పుస్తకాలున్న చెక్క అలమారలు, మరో వైపు రెండు కంప్యూటర్లు, ప్రింటర్లూ ఉన్నాయి. విశ్వంలోని అన్ని సౌరవ్యవస్థల నుంచీ ప్రసారాలు అందుకోగల సామర్థ్యం ఉన్న టీవీ, ఓ ఆంటీనా ఉన్నాయి. అది సోనీ గెలాక్టికా మోడల్‌ది అని గ్రహించాను. అది ఇప్పుడు వాడుకలో లేకపోయినా, బాగానే పనిచేస్తోంది. ఇండికా సెంట్రల్‌లో నేను వాడే టీవీ "సోనీ స్టెల్లార్ గెలాక్టిక్ 3465" మోడల్‌ది. అత్యంత అధునాతనమైనది. నేనిక్కడకి రావడానికి రెండు రోజుల ముందు బృహస్పతి ఉపగ్రహం గానిమెడ్ వార్తలు వస్తున్నాయి టీవీలో. ఆ వర్షం కురిసిన రాత్రి, ఊరికి దక్షిణదిశలో ఉన్న మా పొలానికి మా నాన్న ఎందుకు వెళ్ళాల్సివచ్చింది, నాన్న వెనుకే అమ్మ ఎందుకు వెళ్ళిందో ముందు తెలుసుకోవాలి.. ఆపై లేజర్ కిరణాలు ప్రయోగించి అమ్మానాన్నలను చంపిన ఆ భయంకర ప్రాణులెవరో తెలుసు కోవాలి. ధరణి మావయ్య నా కళ్ళు మూసి, నన్ను అక్కడి నుంచి తీసుకెళ్ళి పోయాడా రోజు. మావయ్య ధరించిన రైన్ కోట్ నుంచి వర్షపు నీళ్ళు జారాయి. నేను ఏడుస్తూ, వణికిపోయాను.

ఇంతలో.. "మాస్టర్.. భోజనం తయారు. ముందు తినండి, ఆ తర్వాత మీ నాన్నగారి లైబ్రరీ, కంప్యూటర్లు వెదకచ్చు. నేనూ సాయం చేస్తాను..." అంటూ పిలిచింది యురేకస్.

"సరే, యురేకస్. నేను తినే లోపు నువ్వు నాన్న సీడీలు, పుస్తకాలు, డైరీలు వెతుకు: వెండి కొవ్వొత్తి, మఱ్ఱి చెట్టు, అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం, సమూరా, సయోనీ, భైరవాలయం, దాచిన అద్భుత వస్తువులు అనే పదాలను వెతుకు... ఆరోజు ఏం జరిగిందో మనకు కొన్ని వివరాలైన దొరకచ్చు..." అన్నాను.

"అలాగే మాస్టర్..."

వాయిస్ కమాండ్‌తో రోబోట్‌కి ఆజ్ఞలిచ్చి, నేను డైనింగ్ టేబుల్ దగ్గర కూలబడ్డాను. పదార్థాల వాసన చూస్తేనే నోరూరుతోంది. యురేకస్ మంచి వంటవాడిగా తయారైంది. సమస్యలన్నింటినీ తాత్కాలికంగా మర్చిపోవడంతో నాకు బాగా ఆకలి వేస్తోంది. వెజిటబుల్ సూప్ అద్భుతంగా ఉంది. ఉడికించిన పప్పు, బ్రెడ్, అద్భుతంగా కుదిరిన చేప కూర... వాహ్... అనుకుంటున్నానో లేదో, కాలింగ్ బెల్ మ్రోగింది. లేచి వెళ్ళి తలుపు తీసాను. అంతే! నేను ఇప్పటిదాక జీవితంలో అనుభవించనంత.. సంబరం..! గుమ్మం దగ్గర నిలువెత్తు అందం! ఎరుపు రంగు చీర ధరించి, నీలికురుల మధ్య తెల్లని మల్లెలతో, నల్లని కాటుకతో మెరుస్తున్న కళ్ళతో ఎదురుగా ఆమె. పెదవులు వణుకు తున్నాయి. చేతుల్లో రెండు పాత్రలున్నాయి.

"ప్రకృతీ, ఏమిటిలా హఠాత్తుగా..." అంటూ... "లోపలికి రండి" అని ఆహ్వానించాను.

"ఇంట్లో తయారుచేసిన పాయసం రుచి చూస్తారేమోనని తెచ్చాను..." అంటూ చిన్నగా నవ్వింది. మధ్యమావతీ రాగంలో వేణునాదంలా మృదువుగా ఉందా స్వరం.

లోపల భోజనానికి అన్నీ సిద్ధంగా ఉండడం చూసి, "ఓహ్, సరైన సమయానికే వచ్చాను. తాజా పాలతోనూ, బాదంపప్పుతో చేసిన పాయసం. తినండి.."

"థ్యాంక్యూ, ముందు మీరు కూర్చోండి.."

ఆమె ఇక్కడికి వస్తుందని కలలోనైనా ఊహించలేదు. నా సొంత బంధువులా అనిపిస్తోంది. ఇప్పటికే నా కలలోకి కూడా వచ్చింది. జరగబోయేవన్నీ నాకీ మధ్య కలల్లో ముందే కనిపిస్తున్నాయి.

"నాతో పాటు భోం చేయండి..." అన్నాను.

ఆమె సిగ్గుపడింది కానీ, అక్కడ్నించి కదల్లేదు.

"కూర్చోండి ప్రకృతీ. చేపకూర, రొట్టెలు... కాస్త రుచి చూడండి..."

ఆమె నిశ్శబ్దంగా కూర్చుని అన్ని పదార్థాలు కొద్దిగా రుచి చూసింది.

ఆమె మనసుని ఇబ్బంది పెడుతున్న విషయం ఏదో నాతో మాట్లాడాలని

వచ్చిందని నాకు అనిపించింది.

భోజనం పూర్తయ్యింది.

వచ్చి సోఫాలో కూర్చోమన్నాను.

"హనీ గారు, మిమ్మల్ని ఓ విషయం అడుగుతాను.. ఏమనుకోరుగా..."

"పర్లేదు... చెప్పండి..."

"మా నాన్న చెప్పాడు... మీరు మంత్రశక్తులున్న దంపతుల కొడుకని. విశ్వశక్తిని నియంత్రించే మాంత్రికులట..."

"అవును. మా అమ్మానాన్నలకు ఆ శక్తులున్నాయి.."

"మరి మీకో..."

నేను ఓ క్షణంపాటు సందేహించాను. ఎందుకు అడుగుతోందబ్బా? నిజం చెప్పాలా వద్దా? ఒకవేళ నిజం చెబితే నన్నీ గ్రామం నుంచి బహిష్కరిస్తే...?

"మీ మనసునొప్పిస్తే క్షమించండి.. కానీ నాకు పౌర్ణమి రోజు, అమావాస్య రోజున నాలో ఏవో చిత్రమైన స్పందనలు కలుగుతున్నాయి. చిన్నప్పటి నుంచి నాకు కలల్లో పొడుగాటి గడ్డాలున్న వింత వ్యక్తులు, అద్భుత భూములు, ఎగిరే జంతువులు ఇంకా కొన్నిసార్లు మాయగాళ్ళూ, మంత్రగత్తెలు కనిపించే వారు. అయితే నేను దీని గురించి ఎవరికీ చెప్పలేదు. మన గ్రామానికి ప్రత్యేకత ఏమైనా ఉందా? మనలో కొంతమంది విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులం, కానీ దాని గురించి తెలియకపోవడం..."

ఓ క్షణం పాటు మౌనంగా ఉన్నాను.

"ఇంతకీ మిమ్మల్ని బాధిస్తున్న విషయం ఏమిటి ప్రకృతీ? విశ్వశక్తిని ఉపయోగించగల రహస్య సామర్థ్యం మీకుందని భావిస్తున్నారా? నాకర్థం అయ్యేలా చెప్పండి."

ప్రకృతి ముఖం ఎర్రబడింది. కనురెప్పలు కొట్టుకున్నాయి.

"మీకు తెలుసా? మా అమ్మ, మీ నాన్నగారికి చెల్లెలి వరస అవుతుంది. మంత్రశక్తులను చెడ్డవిగా భావించి మీ అమ్మానాన్నలను ఊర్నుంచి తరిమేసారు. మాకూ మీ అమ్మానాన్నలకి బంధుత్వం ఉందన్న సంగతి నాన్న చాలాకాలం రహస్యంగానే ఉంచారు. మా అమ్మ చనిపోయే సమయంలో నాకీ సంగతి చెప్పింది..."

“ఓ! అదా సంగతి!” అన్నాను. మళ్ళీ నేనే మాట్లాడుతూ,

“ఇప్పుడర్థమైంది. మనకి పుట్టుకతోనే విశ్వశక్తిని ఉపయోగించగల సామర్థ్యం లభించినట్లుంది. అవును. నేను విశ్వశక్తిని ఉపయోగించగలను. కానీ దానిని నేర్చుకోడానికి నేను కుజగ్రహం దాకా వెళ్ళాల్సివచ్చింది. అక్కడ గొప్ప మాంత్రికులు నాకు శిక్షణనిచ్చారు. నాదిప్పుడు గ్రేడ్ 3 స్థాయి. అయినా నేను భూమి మీద ఆ శక్తులను సాధన చేయకూడదు. ఎందుకంటే ఎర్త్ కౌన్సిల్ వాటిని నిషేధించింది. కానీ నాకన్నా ఎక్కువ శక్తులున్న వాళ్ళు ఇంకా చాలామందే ఉన్నారు. వారిలో కొంతమంది దుర్మార్గులు కూడా....” అన్నాను.

ప్రకృతి కాస్త స్థిమితపడింది.

“అమ్మయ్య. మనిద్దరి రక్తంలోనూ ఈ శక్తులున్నాయన్నమాట! అమ్మ చెప్పింది.. నేను నిద్రపోతున్నప్పుడు అర్ధరాత్రి పూట నా చుట్టూ ఓ నీలి రంగు కాంతి ఉండేదట! అది వాళ్ళన్నయ్య... అంటే మీ నాన్నకి కూడా ఉండేదట. ఒక్కోసారి నేను ఎంతటి బరువైన వస్తువునైనా అవలీలగా ఎత్తేస్తుంటాను. ఒకసారి తోటి పిల్లల్తో ఆడుకుంటుంటే, ఓ అమ్మాయి మీద బాగా కోపం వచ్చింది. నా చేతి వేళ్ళ నుంచి నిప్పురవ్వలు వెలువడి ఆ అమ్మాయిని కాల్చేసాయి. నాకు మైకం కమ్మింది, జరిగినదేదీ నాకు తెలియదు.. ఇదంతా అమ్మ చూసిందట. నాన్నకి తెలిస్తే, వాళ్ళ అన్నయ్యని తరిమేసినట్లు నన్ను కూడా ఊరవతలికి తరిమేస్తాడని భయపడి ఎవరికీ చెప్పలేదట. అమ్మ చనిపోయేటప్పుడు నన్ను జాగ్రత్తగా ఉండమని చెప్పింది... అప్పుడు నాకర్థం కాలేదు.. కాని ఇప్పుడు మీరొచ్చాకా, నాకు అర్థమైంది...”

“ప్రకృతీ, భయపడద్దు. మీరూ అందరిలాగే మాములు మనిషే. కాకపోతే మీలో అదనపు ప్రజ్ఞ ఉంది. విశ్వశక్తి అనేది 4వ సహస్రాబ్దిలో కనుగొన్న అద్భుతమైన శక్తి. మంచికి ఉపయోగిస్తే మేలు, చెడుకు ఉపయోగిస్తే కీడు సంభవిస్తాయి. అది ఓ ఆయుధం లాంటిది, ఓ తుపాకీ లాంటిది.. మంచికీ ఉపయోగించవచ్చు, చెడుకీ వాడచ్చు. నేను విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తినే, కానీ నేను మంచిని కాపాడడానికి, చెడుని ఓడించడానికీ మాత్రమే విశ్వశక్తిని ఉపయోగిస్తాను. మీకు నేను సహకరిస్తాను. మరికొన్ని అంశాలు నేర్పిస్తాను. కాని ప్రస్తుతం మనం విశ్వశక్తిని సాధన చేయలేం ఎందుకంటే నాపై నిఘా ఉంది. విశ్వశక్తిని సాధన చేసినప్పుడు విద్యుదయస్కాంత తరంగాలు వెలువడుతాయి, ఎంత తక్కువ స్థాయిలో ఉన్నా వాటిని గుర్తించవచ్చు, వాటి

ఆధారంగా నన్ను పట్టేసుకోవచ్చు. శిక్షించవచ్చు...''

''ఓహో. అయితే మీరు నా బావ అన్నమాట. మన మధ్య రక్త సంబంధం ఉందన్నమాట. ఓ ముసలి మంత్రగత్తెతో పోరాడున్నట్లుగా మిమ్మల్ని నా కలల్లో చాలా సార్లు చూసాను. మొత్తానికి ఇక్కడికి వచ్చారు. మిమ్మల్ని కలుసుకోవడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను చెడ్డదాన్ని కాదని తెలియగానే, ఎంతో హాయిగా ఉంది. మీరు సహాయం చేస్తానంటే సంతోషంగా ఉంది...''

''ప్రకృతీ.. చెప్పాలంటే చాలా పెద్ద కథ... బోలెడు సమస్యలు.. కానీ క్లుప్తంగా చెబుతాను. ఈ కథని మీరు జాగ్రత్తగా వినాలి. ఓ అద్భుతమైన వస్తువుని వెతకడానికి ఇక్కడికి కుజగ్రహం మాంత్రికులు వచ్చారు...'' అంటూ జరిగిన కథంతా చెప్పి వెండి కొవ్వొత్తి గురించి చెప్పాను. మౌనంగా, కళ్ళు పెద్దవి చేసుకుని ఏ ప్రశ్నలు వేయకుండా అన్నీ వింది. గాలికి ఆమె కురులు ఎగురుతున్నాయి. మధ్యాహ్నపు నీడలు లాన్‌లో పడుతున్నాయి.

''నా దగ్గర ఓ ఉపాయం ఉంది, చూద్దాం వాళ్ళని ఓడించగలమేమో...'' అన్నాను.

''మీకు ఏ సహాయం కావాలన్నా చేస్తాను...'' అంది ప్రకృతి.

''సరే..'' అంటూ ఆ ప్రస్తావనని ముగించాను.

❄ ❄ ❄

# 23. భైరవాలయం

**ఊ**రికి ఈశాన్యంగా ఉన్న ఓ చిన్న కొండ మీద ఉంది భైరవాలయం. గుడి చుట్టూ దట్టమైన చెట్లున్నాయి. గుడి చేరడానికి రాతి మెట్ల మార్గం ఉంది. వాతావరణం నిన్నట్లా కాకుండా, ఎండగా ఉంది, కానీ గాలీ బాగానే వీస్తోంది. యురేకస్‌తో కలసి నేను మెట్లు ఎక్కాను. అది సునాయాసంగా మెట్లెక్కుతోంది. ఎటువంటి నేలపైనైనా నడవగలిగేలా, దానిలో అయస్కాంత శక్తి, ఇంకా ఎలక్ట్రానిక్ శక్తి ఉంది. మాతో పాటూ మరో ముఖ్యమైన వ్యక్తీ ఉంది. తనే ప్రకృతి. కొద్దిగా కష్టపడుతూ నన్ను అనుసరించింది. ఆమెలో ఏదో ఉద్వేగం... బహుశా తనిలా బయట తిరగడం వాళ్ళ నాన్న చూస్తే కోప్పడతారని భయమేమోనని నాకనిపించింది. కొండ ఎక్కి గుడి ప్రాంగణం చేరేసరికి అక్కడి దృశ్యం అత్యద్భుతం. కొండ చుట్టూ పచ్చని పొలాలు, చెట్లూ, కొబ్బరి తోటలూ, చిన్న చిన్న ఎర్రని గుట్టలూ, వాటి మధ్య నుంచీ గ్రామ సీమల్లోకి పోయే మట్టి దారులు... దూరంగా ఏదో లేత నీలిరంగు వెలుగు కనిపిస్తోంది. అది సముద్రం, ఉప్పునీటి కయ్యలు. అవును. ఆమ్రపాలి సముద్రానికి 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.. ఈ గుడి పురాతనమైన శిలలతో నిర్మించబడింది. చుట్టూ ఉన్న ప్రహరీగోడని సైతం భారీ రాళ్ళతోనే కట్టారు. చెక్కతోనూ, ఇనుముతోనూ చేసిన 20 అడుగుల తలుపులు ఎత్తుగా ఉన్నాయి, తెరిచే ఉన్నాయి.

మేము లోపలికి వెళ్ళాం. అసలా మందిరమే ఓ అద్భుతమైన రాతి కట్టడం. దానికి ఆలంబనగా రాతి స్తంభాలున్నాయి, వాటి మీద సర్పాలను, భయంకరాకారాలను చెక్కారు. రాతిస్తంభాల మీద రాతి బండలతో అమర్చిన చూరు ఉంది. చూరు మీద నాలుగు వైపులా నిగూఢమైన ఆకారాలలో తామర పువ్వులు, స్వస్తిక్‌లు, చిత్రవిచిత్ర నమూనాలతో పాటు దేవదూతల వంటి

బాలికల బొమ్మలు ఉన్నాయి.

"అవి యంత్రాలు.. అద్భుతమైన, నిగూఢమైన శక్తిని ఇముడ్చుకున్న జ్యామితీయ ఆకారాలు." చెప్పాను.

"మరి వాటికి విశ్వశక్తి ఉందా?" అడిగింది ప్రకృతి.

"నాకు తెలియదు.."

"సరే, ప్రదక్షిణం చేసాక, గర్భగుడిలోకి వెడదాం..." అంది.

మేము అక్కడున్న ఓ కుళాయి వద్ద కాళ్ళు కడుక్కుని, ముమ్మారు ప్రదక్షిణం చేసి, గుడిలోకి ప్రవేశించాం. ఆశ్చర్యం ఏంటంటే... యురేకస్ కూడా మమ్మల్ని అనుసరించింది.

దూరంగా కనిపిస్తున్న భైరవుడి/శివుడి విగ్రహానికి అభిముఖంగా పెద్ద రాతి నంది ఉంది. ఆ నంది ఎంతో అందంగా ఉంది, మెడలో నగలూ, గంటలూ ఉన్నాయి. గర్భగుడిలోని భైరవుడి విగ్రహం మెడలో పాము, చేతిలో త్రిశూలం, నడుముకి పులి చర్మం ఉన్నాయి. తెల్లని గడ్డం, మీసాలున్న ఓ ముసలి పూజారి విభూది ధరించి స్వామివారికి పూజ చేస్తున్నాడు. తన చేతులలో ఉన్న ఎరుపు, నీలం రంగు పూలని విగ్రహంపై విసురుతున్నాడు. యురేకస్ మమ్మల్ని అనుసరిస్తూనే ఉంది. మేము చేతులు జోడించి విగ్రహానికి నమస్కరించాము. పూజారి కర్పూరం వెలిగించి, స్వామివారి చుట్టూ మూడు సార్లు తిప్పి, మా కళ్ళ ముందు ఉంచాడు. హిందువుల పవిత్ర ఆరాధనల్లో ఒకటైన 'హారతి' అది.

"నాయనా, మీకు శుభం కలుగుగాక! అమ్మా, ప్రకృతీ.. కలకాలం సౌభాగ్యవతివై వర్ధిల్లు..." అంటూ దీవించాడు.

యురేకస్ మూలిగింది.

"ఓ యంత్ర మానవా! నువ్వు కూడా నీ యజమానికి సేవలందిస్తూ కలకాలం సుఖంగా ఉండు.." అంటూ ఆశీర్వదించాడు.

ఈ దీవెన పట్ల యురేకస్ సంతోషంగానే అనిపించింది. దాని దీపాలే ఆ సంగతి చెప్పాయి.

పూజారికి నమస్కరిస్తూ... వినయంగా అడిగాను - "పూజారిగారూ, వెండి కొవ్వొత్తి ఈ గుడిలోనేనా ఉన్నది..?" అని అడిగాను.

మౌనం...

పూజారి కోపోద్రిక్తుడయ్యాడు, అదే సమయంలో భయానికీ లోనయ్యాడు. ఎందుకో నాకర్థం కాలేదు. ఆయన ముఖం పాలిపోయింది. కళ్ళు ఎర్రబడ్డాయి. ఆయన చేతిలో ఉన్న రాగిపళ్ళెంలోని రాగి గ్లాసు, శఠగోపం చిన్నగా వణికాయి.

''మీ మనసుని గాయపరిస్తే నన్ను క్షమించండి...'' అన్నాను.

''వెండి కొవ్వొత్తిని గురించి ఆఖరిసారిగా భోగట్టా చేసింది 50 ఏళ్ళ క్రితం. దాని గురించి అడిగింది నారా ఆమ్రపాలి. ఊరవతల ఉండేవాడు. పొలాల్లో ఉండగా పిడుగుపడి చచ్చిపోయాడు...'' చెప్పాడాయన.

నేను విస్మయానికి గురయ్యాను. మంచి మంత్రవేత్తలూ, దుష్ట మాంత్రికులు భైరవాలయంలో దాచబడిన శక్తిమంతమైన ఆ వెండి కొవ్వొత్తి కోసం ఒకేసారి ప్రయత్నించారన్న మాట! దానికోసమే వాళ్ళు వచ్చారని నాన్నకి తెలిసి, దాన్ని కాపాడడానికి ప్రయత్నించాడన్న మాట! లేకపోతే నాన్నని ఎందుకు చంపుతారు?

''పూజారిగారు, కుజగ్రహం నుంచి కొంతమంది మిత్రులు వచ్చారు. వాళ్ళు వృద్ధులు, మంత్రశక్తులున్నవారు. వెండి కొవ్వొత్తి గురించి వాళ్ళే అడిగారు. ఈ గుళ్ళోనే దాన్నెక్కడో దాచి ఉంచారట. వాళ్ళకి నేను ఆ వివరాలు చెప్పాలి... అందుకే అడిగాను.. దాన్ని పొందిన వారికి గాల్లో ఎగిరే శక్తి, నీటిపై నడిచే శక్తి... లాంటి అష్టసిద్ధులు లభిస్తాయని అనుకుంటున్నారు.. నిజమేనా?''

పూజారి కాస్త స్థిమితపడ్డాడు. నేను అమాయకుడినని, నా వల్ల ఎటువంటి ప్రమాదమూ రాదని భావించినట్లున్నాడు.

''ఈ గుడికి మూడు నేలమాళిగలున్నాయి. పాలకులు, భక్తులు అందించిన బంగారు, వెండి వంటి విలువైన కానుకలెన్నో వాటిల్లో ఉన్నాయి. అయితే ప్రాచీన కాలపు అర్చకులు ఆ నేలమాళిగలకు తాళాలు వేసేసారు. వాటిని ఎవరూ తెరవలేరు. చరిత్ర ప్రకారం, ఒకవేళ ఎవరైనా తాళాలు తెరవగలిగినా, వెంటనే వాటికున్న సర్పబంధం తలుపులు మూసేస్తుంది లేదా తెరిచిన వారిపై దాడి చేస్తుంది. బ్యాంకు లాకర్ పాస్‌వర్డ్ లాంటిది అది... నేలమాళిగల రాతి తలుపులపై పాముల బొమ్మలు చెక్కిందందుకే. ఎన్నో వస్తువులున్న ఆ నేలమాళిగల్లో ఆ కొవ్వొత్తి కూడా ఉండి ఉండచ్చు. నేను కాని, ఆలయ అధికారులు కాని వాటిని తెరవలేము. సర్పబంధం ఉన్న

కారణంగా ఎవరూ వాటిని తెరవడానికి ప్రయత్నించరు. దీని గురించి ఇంకా వివరాలు కావాలంటే ప్రాచీన పత్రాలను చూడు. అవి ఈ పక్కగదిలో ఉన్నాయి. నీకు కావలిస్తే, మెట్లు దిగి భూగృహంలోకి వెడితే మూసి ఉన్న నేలమాళిగలు కనబడతాయి... అది సరే, ఇంతకీ నువ్వెవరు?''

''అయ్యా, నా పేరు హనీ అమ్రపాలి. నారా అమ్రపాలి కొడుకుని. నాకే చెడు ఉద్దేశాలు లేవు. కేవలం ప్రాచీన పత్రాలను, నేలమాళిగను చూస్తానంతే...''

''దానికేమీ అభ్యంతరం లేదు.. మీతో పాటు నేనూ వస్తాను...''

మేమంతా కలిసి మెట్లు దిగి చీకటి నిండిన భూగృహంలోకి ప్రవేశించాం. అక్కడున్న ఓ టెర్రాకోట ప్రమిదని వెలిగించి, ఆ ప్రదేశాన్ని కాంతివంతం చేశాడాయన. భూగర్భంలోని రాతి స్తంభాల నీడల మధ్య మూడు పెద్ద పెద్ద ఇనుప లేదా రాతి తలుపులను చూసాను. వాటి మీద జ్యామితీయ చిత్రాలు ఉన్నాయి. ప్రతీ తలుపుకీ మధ్య భాగంలో బంగారు రంగుతో మెరుస్తూ, భీతిగొలిపేలా పడగ విప్పిన నాగుపాములున్నాయి. అవి నిశ్శబ్దంగా బుసలు కొడుతున్నట్లున్నాయి.

❄ ❄ ❄

# 24. సమావేశం

**ఆ** రోజు సాయంత్రం 'మాంగో ఆర్చర్డ్' హోటల్‌లో కుజగ్రహపు పర్యాటకులతో చాలాసేపు సమావేశమయ్యాను. సమూరా, సయోనీ, ఇంకా ఐదుగురు మంత్రులు సమావేశానికి హాజరయ్యారు. బయట చీకటి ముసురు కుంటోంది. దాదాపుగా ఖాళీగా ఉన్న రెస్టారెంట్‌లో కూర్చున్నాం.

బాగా వర్షం పడుతుండడంతో, తినడానికి ఎవరూ రాలేదు. హోటల్‌లో ఉన్నది మేమే. బేరర్లు అక్కడక్కడా తచ్చాడుతూ ఆ ఆర్డర్ కోసం ఎదురుచూస్తున్నారు.

కుజగ్రహపు వృద్ధులు బాగానే తాగుతారు, కంకాళంలా కనపడే సమూరా కూడా రెడ్ వైన్‌ని, చేపల కూరని బాగా ఇష్టపడతాడు. మంత్రులు కూడా తిన్నారు, తాగారు. ఇంకా వేయించిన కోడి మాంసం, మేకమాంసం ముక్కలు, జీడిపప్పులు, మామిడి, అరటి పండ్లు వంటి చిరుతిళ్ళు తిన్నారు.

"ప్రభూ, మనం ఇక్కడే చర్చించుకుందామా? లేక మీ గదుల్లోకి వెడదామా?" అని సమూరాని అడిగాను.

"ఇక్కడ మాట్లాడుకోవచ్చు. దగ్గరలో ఎవరూ లేరు, ఒకవేళ వచ్చినా మనమేం మాట్లాడుకుంటున్నామో వాళ్ళకి అర్థం కాదు." అంది సయోనీ.

నేలమాళిగల గురించీ, సర్పబంధం గురించి లోగొంతుకతో చెప్పాను వాళ్ళకి.

సమూరా రుసరుసలాడాడు. "ఓహో, అది చాలా పాత చిట్కా.. దానికి విరుగుడుగా గరుడబంధం గాని లేదా నకులబంధంగాని ఉపయోగించాలి. అప్పుడే తలుపులను తెరవగలం" అన్నాడు.

మళ్ళీ తనే మాట్లాడుతూ, "నాకు గరుడబంధం తెలుసు. మనం అక్కడికి

వెళ్ళి నేలమాళిగలో ఉన్న వస్తువులలోంచి వెండి కొవ్వొత్తిని సంపాదించాలి.'' అంటూ, ''ఇంతకీ, అక్కడ భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?'' అని అడిగాడు.

''ఆశ్చర్యం. అక్కడ భద్రతా సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. రాత్రి పూట కాపలాగా ఒక్కడే ఉన్నాడు. గుడి ఆవరణలోనే పూజారిగారి కుటుంబం ఉంటోంది. బహుశా సర్పబంధం దోపిడిదారులని భయపెడుతోందేమో. లేదా ఎర్త్ కౌన్సిల్ రహస్య నిఘా ఏమైనా ఏర్పటు చేసిందేమో...'' అన్నాను.

ఈ దశలో యురేకస్ మా సంభాషణలో జోక్యం చేసుకుంది.

''మాస్టర్.. ఎర్త్ కౌన్సిల్ వాళ్ళకి ఉపగ్రహం ఉంది, రిమోట్ సెన్సింగ్ వ్యవస్థ ఉంది. అతి తక్కువ సమయంలో భూమి మీద ఎక్కడి నుంచి ఎక్కడికైనా దాడి చేయగల డ్రోన్ విమానాలున్నాయి. అందువల్ల ఆధునిక భద్రతా కవచం, ఇంకా ప్రాచీన మంత్రతంత్రాల కలయికగా భావించాలి...'' అంది తన కంచు కంఠంతో.

తన నల్లని ముసుగు తీసి మరోసారి రుసరుసలాడాడు. కంకాళం లాంటి అతని శరీరం నల్లటి బొగ్గుతో చేసినట్లుగా ఉంది. అతని కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రగా ఉన్నాయి. అతను మాట్లాడుతూంటే గులాబీరంగు పెదాల చాటునుంచి తెల్లటి పలువరుస బయల్పడింది. దీపాల కాంతిలో అతని దంతాలు పాలరాతి తెలుపులా మెరిసాయి. అక్కడ వాతావరణమంతా గందరగోళంగానూ, వేరే లోకానికి చెందినదిగానూ అనిపిస్తోంది.

''ఎలాగైనా నాకు ఆ వెండి కొవ్వొత్తి కావాలి. నాకు నా శక్తులు కావాలి. అవసరమైతే కొంత విశ్వశక్తిని ప్రయోగిద్దాం... ఓ చక్కని ప్రణాళికని రూపొందిద్దాం... విజయం సాధిద్దాం...'' అన్నాడు సమూరా.

అయిదుగురు మంత్రులలోనూ బాగా సన్నగా ఉన్న మంత్రి చెప్పాడు: ''ప్రభూ. అది ప్రమాదం. మనం ఇప్పటికే విశ్వశక్తిని ప్రయోగించిన జాడలు వదిలివచ్చాం. దారిలో హోటల్‌వద్ద దుండగులను ఎదుర్కొనేందుకు విశ్వశక్తిని ప్రయోగించాం. అది తక్కువ మోతాదు కాబట్టి మన జాడలు ఎవరికీ తెలియలేదు. అదే భైరవాలయం దగ్గరయితే, విశ్వశక్తిని భారీ స్థాయిలో ఉపయోగించాలి. అప్పుడు ఈ మనుషులు మనమీద డ్రోన్ దాడి చేయచ్చు. ఎవరు చెప్పగలరు? కాబట్టి విశ్వశక్తిని ప్రయోగించడం సరికాదు... ''

''మరి ఏం చేద్దాం?'' అంటూ అరిచాడు సమూరా.

అతను కోపం పట్టలేకపోతున్నాడు, క్రోధంతో వణికిపోతున్నాడు.

"హనీ, నీ ఆలోచన ఏమిటి?" అడిగింది సయోనీ.

ఆమె గొంతు తియ్యగా ఉంది, కానీ రూపం భయానకంగా ఉంది.

"యురేకస్ ఓ ఉపాయం చెప్పింది. మీరు గుడి బయట వేచి ఉండండి. నేను విశ్వశక్తిని ఉపయోగించి నేలమాళిగలోకి వెడతాను. సర్పబంధానికి విరుగుడు వేస్తాను. మీరు దాక్కునే ఉండండి. ఒకవేళ ఎర్త్ కౌన్సిల్ దాడి చేసినా, అది నామీదే అవుతుంది. మీకు పారిపోడానికి ఓ వాహనం, దానికో డ్రైవరు కావాలి. కొవ్వొత్తి దొరకగానే, నేను దాన్ని యురేకస్‌కి ఇస్తాను. అది దాన్ని బయటకు తెచ్చి మీకు అందిస్తుంది. విశ్వశక్తి ప్రయోగం ద్వారా వెలువడే విద్యుదయస్కాంత తరంగాలు ఎర్త్ కౌన్సిల్ దృష్టికి వెడతాయి. నన్ను పట్టుకుంటారు. వాళ్ళకి నేను ఏదో విధంగా నచ్చజెప్పి బయటపడతాను. మీరు మాత్రం, ఏదో ఒక వాహనం పట్టుకుని పారిపోవాలి.. ఇంతకీ, మీ గ్రహానికి మీరు ఎలా వెళదామనుకుంటున్నారు? ఆకాశమార్గం ద్వారా వెళ్ళడం అసాధ్యం.. ఎందుకంటే డ్రోన్లు ఎప్పుడైనా దాడి చేయచ్చు. అదీ గాక పలు రకాల తనిఖీలు, వేలిముద్రలు తీసుకోడం, ఎలక్ట్రానిక్ సెర్చ్.. విశ్వశక్తిని ఉపయోగిస్తే కనుక్కోవడం... వంటి సమస్యలు ఉంటాయి..." అన్నాను.

సమూరా తన తలని రెండు చేతులతోనూ పట్టుకున్నాడు. ఇంతలో ఓ వెయిటర్ మమ్మల్ని సమీపించడంతో, అందరికీ తలా ఒక గ్లాసు వైన్ తెమ్మని చెప్పాడు. వెయిటర్ వెళ్ళిపోయాకా...

"హనీ! నువ్వు చెబుతున్నది సరిగా లేదు. మా కోసం నీ జీవితాన్ని లేదా నీ స్వేచ్ఛని నువ్వెందుకు త్యాగం చేస్తావు? ప్రభుత్వానికి దొరికిపోయే ప్రమాదాన్ని ఎందుకు స్వయంగా ఆహ్వానిస్తున్నావు? నిన్నెలా నమ్మేది?" అన్నాడు సమూరా.

"ప్రభూ. నన్ను నమ్మండి. నేను మొదటి దోషిని, పైగా విశ్వశక్తిని ఉపయోగించడం కొత్తగా నేర్చుకున్నవాడినని, పొరపాటుగా ప్రయోగించానని చెబుతాను. లేదా ఆసక్తిని అణుచుకోలేక నేలమాళిగలోకి వచ్చానని, ఇక్కడ సర్పబంధానికి భయపడి విశ్వశక్తిని ప్రయోగించానని చెప్పి తప్పించుకుంటాను. వాళ్ళకి వెండి కొవ్వొత్తి గురించి, దాని శక్తుల గురించి తెలియదు కదా. అసలు అది ఉందన్న సంగతే వాళ్ళకి తెలియదు. నేలమాళిగలనూ, వాటిలోని సంపదలను చూస్తారు. అవి యథాతథంగా ఉండేసరికి, నన్ను హెచ్చరించి

వదిలేస్తారు లేదా కనీస శిక్ష విధిస్తారు... అంతే.. ఇది నా నమ్మకం. పైగా మీరెప్పుడూ దాక్కునే ఉంటారు, ఇక్కడి నుంచి మీ గ్రహానికి ఎలా వెడతారో అది మీ సమస్య.. భూమి నుంచి బయటపడడానికి నాకు మరో మార్గం తెలియదు.. " అన్నాను.

"అవును.. ఈ ఆలోచన బాగానే ఉంది. మేమో కారులో పారిపోతాం. సముద్రతీరం ఇక్కడికి 30 కిలోమీటర్లే కాబట్టి అక్కడికి వెళ్ళి, ఓ చిన్న పడవలో... పెద్ద ఓడ దగ్గరికి వెడతాం.. సుదూరంగా ఉన్న దీవి నుంచి స్పేస్ ఎలివేటర్ చేరడానికి ఓ రోజు చాలు..."

వాళ్ళు తప్పించుకోడానికి సముద్ర మార్గం ఎంచుకున్నారని నాకు అర్థం అయ్యింది. ప్రాచీన స్పేస్ ఎలివేటర్ ద్వారా అంతరిక్ష వేదికకి చేరుతారు. అంతరిక్షంలో తిరుగుతూ, వేదికని అధిరోహిస్తారు. ఆ తర్వాత ఏదైనా గ్రహాంతర అంతరిక్ష వాహనంలోకి రహస్యంగా జొరబడి, ప్రయాణీకులతో కలసిపోతారు లేదా అవసరమైతే ఓ స్పేస్‌షిప్‌నే హైజాక్ చేసి లా టెర్ వేదిక నుంచి తమ గమ్యానికి చేరుకుంటారు. పాడుబడ్డ ఆ స్పేస్ ఎలివేటర్ వద్ద ఎలాంటి తనిఖీలు ఉండవు. మనుషులెవ్వరూ దాంట్లో ప్రయాణించడం లేదు. దాన్ని ఎప్పుడో వదిలేసారు. దోపిడీదొంగలు, స్మగ్లర్లు, నిషేధానికి గురైనవారు, శత్రుగ్రహాల వాళ్ళు మాత్రమే దాన్ని ఉపయోగిస్తున్నారు. దక్షిణాసియాలో ఏదో మారుమూల ప్రాంతంలో ఉందది. హిందూ మహాసముద్రంలో ఓ రహస్య దీవిలో ఉంది. అది అత్యంత ప్రమాదకరమైన మార్గం. బుద్ధి సక్రమంగా ఉన్నవాడెవ్వడూ ఈ మార్గం ద్వారా గ్రహాంతర ప్రయాణాలు చేయడు. మరి నిఘా మాటేమిటి? నాక్కూడా తెలియదు. ఒక వేళ ఉన్నా కూడా అది ఉపేక్షింపదగిన స్థాయిలోనే ఉంటుంది. వీళ్ళు మంత్రశక్తులను ఉపయోగించారు. చీకట్లో నక్కి నక్కి, ఎలివేటర్ పని చెయ్యకపోతే, దానికి జోడించిన నిచ్చెనలో ఒక్కో మెట్టూ ఎక్కుతూ పైకి వెళ్ళాలి. ఆ తర్వాత భూమికి 1000 కిలోమీటర్ల దూరంలో ఉండి, గుండ్రంగా తిరుగుతూ ఉండే లా టెర్ అంతరిక్ష వేదికని అందుకుంటారు. ఎలివేటర్ ముగిసే చోటు నుంచి, లా టెర్ ప్రారంభమయ్యే ప్రాంతం వరకు మధ్య ఉండే దూరాన్ని వాళ్ళు గెంతుతారేమో... ఎంత వికారమైన ఆలోచన! కానీ సాధ్యమే.

ఇంతలో ఓ మంత్రి గొంతు సవరించుకున్నాడు. "అయ్యా, నేను లోపలికి వెళ్ళి వెండి కొవ్వొత్తిని తెస్తాను. మంత్ర ప్రయోగం చేస్తాను. ఒకవేళ దొరికిపోతే

అగ్నిప్రవేశం చేసి, మీ కోసం ఆత్మార్పణ చేసుకుంటాను. ఈ మానవుడిని నమ్మలేం....'' అన్నాడు.

''మేము కూడా త్యాగానికి సిద్ధం..'' అంటూ ఒకే గొంతుతో అరిచారు మిగతా మంత్రులు.

''మూర్ఖులారా... ఇతడిని వెతుక్కుంటూ మనం ఇంత దూరం ఎందుకొచ్చామో మరిచిపోయారా? జన్యు, కణ, నాడీజీవ విశ్లేషణలు, టెలీపతీ విశ్లేషణల ప్రకారం అతనొక్కడే అద్భుత వస్తువులని గుర్తించగలడు. స్వచ్ఛమైన వాడు, అమాయకుడు అయిన వ్యక్తికి మాత్రమే ఆ అద్భుత వస్తువులు కనబడతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. త్యాగమట... త్యాగం! అతని జన్యువులే ఆ శక్తులకు సరిపోతాయి. భూమి మీద హనీ ఆమ్రపాలి ఒక్కడే అటువంటి జన్యు లక్షణాలు కలిగిఉన్నాడు. అతను మాత్రమే వెండి కొవ్వొత్తిని సాధించి, మనకి తెచ్చివ్వగలడు... '' అన్నాడు సమూరా కోపంగా.

ఓ క్షణం విరామం తీసుకుని, ''అర్థమైందా? మీ త్యాగాలేవీ నాకు అక్కర్లేదు. మనని వెంటాడి తరిమేవారినీ, మనల్ని చట్టానికి పట్టించాలని చూసేవారినీ, మనని ఆపడానికి ప్రయత్నించేవాళ్ళని అడ్డుకోడానికి మీ మంత్ర శక్తులు కావాలి. ఇంక ఈ విషయంలో వాదనలు వద్దు...'' అన్నాడు సమూరా.

''సరే ప్రభూ...'' అన్నారందరూ.

నాకిప్పుడు అంతా అర్థమైంది. ఆ అద్భుత వస్తువుని గుర్తించడంలో నేను చాలా కీలకం అని, వాళ్ళా పనికి నన్నే వాడుకుంటారని గ్రహించాను. పని పూర్తయ్యాక నా పరిస్థితి ఏమిటో నాకు తెలియదు. ఏది ఏమయినా ఈ దుష్టమాంత్రికుడు తన శక్తులను తిరిగి పొందడానికి వీల్లేదు. అంతే కాదు, ఒక్కో గ్రహాన్ని జయించాలన్న వాళ్ళ కుతంత్రాలని ఛేదించాలనుకున్నాను.

❊ ❊ ❊

# 25. విరుగుడు

నిన్న చర్చలో, వెండి కొవ్వొత్తిని ఎలా తేవాలో నిర్ణయించాకా, ఆ బాధ్యతని నాపై మోపాకా, సమూరా అతని బృందం ఈ పూట నన్ను దయతో చూసారు.

“హనీ! ఇప్పుడు విశ్వశక్తిని ఉపయోగించేందుకు నీకు కొంత సామర్థ్యం ఉంది. నువ్వు మూడు నక్షత్రాల శ్రేణికి చెందిన మంత్రగాడివి. విశ్వశక్తిని అతి తక్కువగా ఉపయోగించి, అతి ఎక్కువ ఫలితాన్ని రాబట్టడం నీకు తెలియదు. పైగా.. సర్పబంధానికి విరుగుడు వేయడం నీకసలు తెలియదు...” అన్నాడు సమూరా.

“అవును ప్రభూ.. దయచేసి నాకా విద్యని నేర్పండి...” అన్నాను.

హోటల్‌కి ఇప్పుడిప్పుడే జనాల రాక మొదలవుతోంది. మధ్యాహ్నపు ఉపాహారాలు తినడానికి లేదా టీ తాగడానికి స్థానికులు వస్తున్నారు. మధ్యాహ్నం సూర్యుడి వెలుగు మేఘాల్ని దాటి వచ్చి హోటల్ పచ్చికపై పడి దానిని ప్రకాశింపజేస్తోంది. తోటమాలి పచ్చికకి నీరు పెడుతున్నాడు.

“పద, మనం వేరే చోటుకి పోదాం.. మనల్ని ఎవరూ గమనించకూడదు, మన మాటల్ని వినకూడదు. సాధన చేసేడప్పుడు భారీస్థాయిలో విద్యు దయస్కాంత తరంగాలు వెలువడతాయి.. తప్పదు...” చెప్పాడు సమూరా.

హోటల్‌కి దూరంగా, తోటలోకి వెళ్ళాము. ఇప్పుడు కుజగ్రహపు మాజీ చక్రవర్తి సమూరా, అతని కూతురు సయోనీ నా గురువులు. మిగతా మంత్రులని కూడా అక్కడ్నించి పంపేసారు. అమరత్వం పొందినా, సమూరా తన శక్తులన్నింటినీ పోగొట్టుకున్నాడన్న సంగతి నాకు తెలుసు. సయోనీ 99 నక్షత్రాల శ్రేణి మాంత్రికురాలు, కానీ చావు తప్పని జీవి.

చెట్లు దట్టంగా ఉన్న చోటుకి నడిచాం.

“హనీ, జాగ్రత్తగా విను. సర్పబంధం అనేది నేలమాళిగని తెరవడానికి సంకేతపదం లాంటింది. విరుగుడు మంత్రాలను సరిగ్గా, జాగ్రత్తగా, నిర్ణీత క్రమంలో ఉచ్చరిస్తే, తలుపులు తెరుచుకుంటాయి. అవి లాటిన్ లేదా సంస్కృతం వంటి ప్రాచీన భాషలలో ఉండచ్చు. వాటిని తీవ్రస్థాయి ఆరోహణంలో ఉచ్చరిస్తుంటే, శక్తి వెలువడి తలుపులు తెరుచుకుంటాయి. అంతమాత్రాన లోపలేం ప్రమాదం ఉండదని అనుకోవద్దు. లోపల తాచుపాములుండచ్చు, ఇతర భయంకర జీవులుండచ్చు. నిజం చెప్పాలంటే లోపల ఎంత నిధి ఉందో, అదెలా రక్షించబడుతోందో మాక్కూడా తెలియదు. నేలమాళిగలోకి ప్రవేశించాక నువ్వే తెలుసుకోవాలి. పాములని తరిమేందుకు నువ్వు నిప్పు రాజేయచ్చు లేక పొగపెట్టుకోవచ్చు. అదెలా చేయాలో నీకు తెలుసు. గతంలో చేసి ఉన్నావు... అవునా?” అంది సయోనీ.

నేను తలూపాను.

సర్పబంధాన్ని విడదీసే మంత్రాలను నాకు కంఠస్తం వచ్చేవరకూ నేర్పించారు తండ్రీకూతుర్లు. సాయంకాలమై చీకట్లు ముసిరే సమయానికి నా సాధన పట్ల వాళ్ళకి సంతృప్తి కలిగింది.

యురేకస్ కూడా ఆ మంత్రాలన్నింటినీ గుర్తుంచుకుంది. “భళా! మాస్టర్... ఇది చాలు. ఇంక ప్రణాళిక తయారు చేయండి...” అని అంది నాతో.

సయోనీ, సమూరా గాఢంగా నిట్టూర్చారు.

“హనీ! నువ్వు మంచివాడివి. ఇక వెళ్ళి విశ్రాంతి తీసుకో. రేపు మిట్ట మధ్యాహ్నం మనం భైరవాలయానికి వెడదాం. భక్తులెవ్వరూ లేని సమయంలో నువ్వు లోపలికి వెడుదువుగాని. రాత్రి పూట సాహసం చేయడం ప్రమాదం. వెండి కొవ్వొత్తి తెచ్చి మాకిస్తే, నీ దారి నీది మా దారి మాది. మేము పారిపోతాం. ఎర్త్ కౌన్సిల్ విచారణాధికారుల నుంచి నిన్ను నువ్వే కాపాడుకోవాలి...” అన్నాడు సమూరా.

“హనీ. నువ్వు మోసం చేయలేవు. లేదా కొవ్వొత్తితో పారిపోలేవు. లేదా మా సంగతి పోలీసులకి చెప్పలేవు...” అంది సయోనీ.

కొన్ని క్షణాల తర్వాత తనే మాట్లాడుతూ.. “ఎందుకంటే... నువ్వలా చేస్తే నీ కలల సుందరి ప్రమాదంలో పడుతుంది... తనిప్పుడు మా బందీ....” అంటూ ఓ ఫోటో చూపించింది. అందులో విపరీతంగా భయపడుతున్నట్లుగా ఉన్న

ప్రకృతి ఉంది. ఆమె చేతూలూ, నోరు కట్టేసి ఉన్నాయి.

"వద్దు... వీల్లేదు..." అంటూ అరిచాను. అతికష్టం మీద నా కోపాన్ని అణుచుకున్నాను. ఈ దుష్టుల బెదిరింపు అర్థమైంది.

"ఏవైనా తిక్క వేషాలు వేస్తే, ఈమె మా చేతుల్లో చస్తుంది. అయితే వెండి కొవ్వొత్తిని తెచ్చి మాకప్పగిస్తే ఆమె క్షేమంగా ఉంటుంది...." అన్నాడు సమూరా.

"కానీ... ఇదంతా అనవసరం ప్రభూ..." అంటూ ఏదో చెప్పబోతుండగా,

"నోరు మూసుకో హనీ!..." అన్నారు వాళ్ళిద్దరూ ఒకేసారి.

"నువ్వు గుంటనక్క లాంటివాడివి. బతకనేర్చినవాడివి. కపటివి. ఒలింపస్ పర్వతం నుంచి అమృత ఔషధం తెచ్చి, అది తాగితే శక్తులు నశిస్తాయన్న నిజాన్ని దాచిపెట్టావు.. అందుకే మా జాగ్రత్తలో మేముంటాం.. క్రితంసారి చేసినట్లు ఈసారి చేయలేవు...." అన్నాడు సమూరా.

❊ ❊ ❊

# 26. నాన్న డైరీలు

**సా**యంత్రపు నీడలు పొడవయ్యాయి. నేను ఇంటికి చేరాను. మా అమ్మానాన్నల ఇంటికి! బాగా చీకటి పడ్డాక, అన్యమనస్కంగానే ఏదో తిన్నాననిపించాను. ప్రకృతి ఇంటికి రాలేదని తెలిస్తే, గ్రామంలో ఎంత గొడవ జరుగుతుందో? గ్రామ పెద్ద ఏం చేస్తాడు? అసలీ విషయం ఆయనకి చెప్పాలా వద్దా? ... నా బుర్రలో ఎన్నెన్నో ప్రశ్నలు...

మా నాన్న గదిలో కాయితాలను వెతకసాగాను. చివరికి ఓ అలమారలో నాన్న డైరీలు దొరికాయి. 3220 సంవత్సరానివి అవి. రాసి 43 ఏళ్ళు గడిచిపోయాయి. చేతికందిన మొదటి డైరీని తెరిచాను.

“యురేకస్, మనకి ఉపయోగపడే సమాచారం ఉన్న డైరీలు దొరికాయి. కొన్ని బ్రెడ్ ముక్కలు, కాఫీ తీసుకురా” అంటూ అరిచాను

“అలాగే మాస్టర్” అంది యురేకస్.

నేను డైరీ చదవడం ప్రారంభించాను.

“అక్టోబర్ 10, 3220 : రోజురోజుకి పరిస్థితులు దిగజారుతున్నాయి. దుష్టశక్తుల నుంచి ఒత్తిడి మరీ ఎక్కువ అవుతోంది. కానీ నేను నా పద్ధతి మార్చుకోగలనా? నా సొంత మనుషులకే హాని తలపెట్టగలనా? వాళ్ళకి నా గురించి నా శక్తుల గురించి తెలిసినా.....”

“అక్టోబర్ 12, 3220 : వాళ్ళు నా కలలోకి వచ్చారు. తమతో చేతులు కలపకపోతే చంపేస్తామని బెదిరించారు. నన్ను, నయనని, హనీని అందరిని చంపేస్తామంటున్నారు. కాని నేను నా సిద్ధాంతాలపైనే నిలబడతాను. ఈ విషయాలన్నీ ఇవాళ నయనతో చెప్పాను. తను కూడా నా వెంటే ఉంటానంది. కాని తన దిగులంతా ఒక్కగానొక్క కొడుకు గురించే....”

ఇలాంటి రాతలెన్నో చూసాను ఆ డైరీలో. ఆ దురదృష్టవంతమైన ఘటన జరిగిన రోజు గురించి నాన్న ఇలా రాసుకున్నాడు..

''ఆకాశం మేఘావృతమై ఉంది. పొద్దున్నుంచీ నాకు ఐజినెట్‌లో బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. వాళ్ళు ఈరోజు వస్తున్నారట! వాళ్ళతో మాట్లాడి వాళ్ళని ఒప్పించాలి. భైరవాలయంపై దాడి చేయడం దైవద్రోహం. ఆలయంలోని నేలమాళిగలలోని విలువైన వస్తువులని ఎలాగైనా కాపాడితీరాలి. అవి ఎప్పటికీ భైరవాలయానివే...!''

చివరి రాత సమయం సాయంత్రం ఐదు గంటలు.

''కుంభవృష్టి కురిసింది. నయననీ హనీని ఇంట్లో ఉండమని చెప్పి, నేను పొలానికి వెళ్ళాను. అక్కడికి వచ్చి, మాట్లాడమనే సందేశం అందింది. కడవరకూ పోరాడి, వాళ్ళని ఎలాగైనా ఆపాలని నాకు తెలుసు...''

అంతే డైరీలో ఇదే ఉంది.

జరిగిన సంఘటనలన్నీ ఓ క్రమంలో పేర్చి చూసాను.

ఆ వర్షం కురిసిన సాయంత్రం, దట్టమైన చీకట్లలో, ఊరికి దక్షిణంగా ఉన్న పొలంలోని మఱ్ఱిచెట్టు కింద ఆ దుష్టశక్తులు మా అమ్మని నాన్నని చంపేసారు. వర్షంలో తడుస్తూ, నేను పెద్దగా ఏడుస్తుండగా... ధరణి మావయ్య నన్ను ఇంటికి చేర్చాడు....

చిన్న జలదరింపుతో నేను వర్తమానంలోకి వచ్చాను.

''యురేకస్, ఈ డైరీలో ప్రతీసారి వాళ్ళు... వాళ్ళు అని రాసాడు నాన్న. కాని స్పష్టంగా రాయలేదు వాళ్ళెవరో. వాళ్ళు సమూరా ప్రతినిధులా లేక నిధుల కోసం, అద్భుత వస్తువుల కోసం ప్రయత్నించే మరో మాంత్రికుల ముఠానా అనేది తెలియడం లేదు. నీకేమయినా అర్థమవుతోందా?'' అని అడిగాను.

యురేకస్ ఆలోచిస్తోందన్నట్లుగా దాని లైట్లు వెలిగాయి.

''మాస్టర్... మీ నాన్న ఐజి నెట్ ద్వారా సమాచారం పొందారు కదా, ఐజి నెట్‌లో ఆయన మెయిల్స్ చూస్తే ఏమయినా ఆధారం దొరకచ్చు...'' అంది.

''అయితే ఆ పని చూడు. పైగా నాన్న కంప్యూటర్ చాలా ఏళ్ళ నుంచి వాడకుండా ఉంది. ఐజి నెట్‌కి కనెక్ట్ అయి నాన్న మెయిల్స్ చూడు. ఈలోపు నేను ధరణి మావయ్య డివిడీలు చూసి, ఏదైనా ఆచూకీ లభిస్తుందేమో

చూస్తాను.''

''సరే మాస్టర్...''

ధరణి మావయ్య డివిడీలను ఓ సూట్‌కేస్‌లో భద్రపరిచాను నన్ను గ్రహాంతరవాసులు కిడ్నాప్ చేసినప్పుడు అవి పోయాయి. అయితే మావయ్య చెప్పినట్లుగా ముందేవాటిని యురేకస్ హార్డ్‌డిస్క్‌లో కాపీ చేసుకోవడంతో ప్రమాదం తప్పింది.

ఆమ్రపాలికి వచ్చాక పరిస్థితులు విషమించాయి. ప్రకృతితో స్నేహం ఆనందం కలిగిస్తే, సమూరా బృందం నాతో పని చేయించుకోడానికి ఆమెని అపహరించడం నన్ను భయపెట్టింది. మావయ్య మార్గదర్శనం లేకపోవడం ఇబ్బందిగా ఉంది. అయినా నాన్న డైరీ నా సందేహాలని తొలగించింది. దుష్ట మాంత్రికులే నాన్నని చంపేసారు. నాన్న మంచి వైపు నిలబడి చెడు మీద పోరాటం చేసి ప్రాణాలు పోగొట్టుకున్నాడు, అమ్మ కూడా అంతే! మరి నేనెటు వైపు? ఇప్పటిదాక దుష్ట మాంత్రికులకు సహాయం చేయనందుకు సంతోషించాను. అయితే, కుజుడి మీద, ఇప్పుడు భూమి మీద వాళ్ళకి పాక్షికంగానైనా సాయం చేసినందుకు అసంతృప్తి చెందాను. వారికి నా సామర్థ్యం తెలుసు, అందుకే నన్ను వాడుకున్నారు. ఇంకా వాడుకుంటున్నారు కూడా. ఇకపై వాళ్ళ ఆటలు సాగనివ్వను.

''యురేకస్, భైరవాలయం నేలమాళిగల్లోకి ప్రవేశించడానికి పథకాలు తయారుచెయ్యి. విశ్వశక్తిని ప్రయోగించకుండా, విద్యుదయస్కాంత తరంగాలను వెలువరచకుండా లోపలికి ఎలా వెళ్ళగలమో చూడు. అర్థమైందా?''

''సరే మాస్టర్. నేను ఆ గుడి ప్రాంగణమంతా ఇన్‌ఫ్రా రెడ్ ఫోటోలు తీసుకున్నాను. గుడి పటం సిద్ధం చేసుకున్నాను. మనం మధ్యాహ్నం పూట, భక్తులెవరూ లేని సమయంలో గుడికి వెళ్ళాలి. అప్పుడే మనల్ని ఎవరూ అనుమానించరు. సర్పబంధంతో మూయబడిన తలుపులని మీరు తప్పకుండా తెరవాలి. లోపల నిధులకి కాపలాగా నిజంగానే పాములుండచ్చు లేదా అదంతా ఓ మూఢనమ్మకమని తేలిపోవచ్చు. వాటికేమీ అపకారం చేయకపోయినా, అవి ఆకలిగా లేకపోయినా, పాములు మిమ్మల్ని ఏమీ చేయవు. చేతులకి రబ్బరు గ్లవుజులు, కాళ్ళకి పొడవాటి రబ్బరు బూట్లు, శరీరంపై రబ్బరు కోటు ధరించండి. దాంతో పాము కోరలు మీ శరీరంలోకి దిగబడవు. ఓ టార్చి లైట్,

కొవ్వొత్తిని తెచ్చేందుకు ఓ జిప్ బాగ్ తీసుకోండి. మీరు నేలమాళిగలోని గది తలుపులు తెరిస్తే, నేనూ మీతో పాటు లోపలికి వస్తాను...''.

''సరే. ఊర్లోకి వెళ్ళి గ్లవుజులు, బ్యాగ్, కోట్ ఇవన్నీ ఎక్కడ దొరుకుతాయో కనుక్కుందాం..''

కాసేపయ్యాక, ఊర్లోకి వెళ్ళి నాకు కావలసిన వస్తువులకోసం వెదికాను. చివరికి ఊరి మధ్యలో ఉన్న ఓ కొట్లో దొరికాయి. ఆ కొట్టు ఓ వృద్ధ దంపతులది.

''ఓ, ట్రెక్కింగ్‌కి వెడుతున్నారా?'' అంటూ గొణిగాడా వృద్ధుడు డబ్బు లెక్కపెట్టుకుంటూ.

''పొదలలోకి వెళ్ళినప్పుడు జాగ్రత్త! పాములు రబ్బరుకి, మీ చర్మానికి మధ్య ఖాళీని సులువుగా పట్టుకుంటాయి...'' అంటూ హెచ్చరించాడు.

నేను అద్దెకి తీసుకున్న కారులో గుడికి బయల్దేరాను. మధ్యాహ్న సమయం అవుతోంది. గుడిలో భక్తులు కార్యక్రమాలు చాలావరకు ముగిసాయి. భగవంతుడికి అపరాహ్ణ నైవేద్యం ఆరగింపు చేసారు. ఆలయ ప్రధాన ద్వారం మూయబడింది. కొండమీదకి తీసుకువెళ్ళే మెట్ల మొదట్లో కారుని ఆపాను. యురేకస్‌తో కలసి మెట్లెక్కాను. పైకి చేరడానికి ఇరవై నిమిషాలు పట్టింది. యురేకస్‌కి కాలుజారే ప్రమాదం లేదు. ఎందుకంటే దాని పాదాలకి అయస్కాంత శక్తి, బలమైన బంక ఉన్నాయి, అందువల్ల అది జారిపోదు, పడిపోదు. ఇది చలికాలం. గోపురం వెనుకగా ప్రకాశిస్తున్న సూర్యుడి కిరణాలలో అంతగా వేడి లేదు. ఆ వాతావరణంలో చూడడానికి గుడి అద్భుతంగా ఉంది. కాపలాదారు నన్ను పలకరించి, నమస్కారం చేసాడు. నడుములు వంగి, గడ్డాలు తెల్లబడ్డ వృద్ధ పూజారులు, మధ్యాహ్న భోజనానికి, అవకాశముంటే ఓ చిన్న కునుకు తీయడానికి తమ గృహాలకి వెడుతున్నారు.

''యురేకస్, సుమారుగా ఓ అరగంటలో మనం భూగృహంలోని నేలమాళిగల దగ్గరికి చేరుతాం. నేను మొదటి గదిలోకి వెడతాను. అదే ప్రధానమైనది...'' అన్నాను.

''సరే మాస్టర్.. నేను మీకు రక్షణగా ఉంటాను...'' అంటూ, ''మాస్టర్, సయోనీ సందేశం పంపింది.. చదవనా?'' అని అడిగింది.

''చదువు''

''హనీ, నీ ప్రతీ అడుగు గమనిస్తున్నాం. కొండ కింద కారుతో సిద్ధంగా

ఉన్నాం. ఇది మేం తప్పించుకోబోయే కారు. 1:30 కల్లా నువ్వు అద్భుత వస్తువుతో తిరిగి రావాలి... వేరే ఉపాయాలొద్దు.. అర్థమైందా...''

" 'అర్థమైంది. తీసుకువస్తాను..' అని జవాబివ్వు'' చెప్పాను యురేకస్‌తో. అది వాయిస్ కమాండ్. ఈ రోజుల్లో రోబోలు వాయిస్ కమాండ్‌లని గుర్తించి, దానికి తగ్గట్టుగా నడుచుకుంటాయి. నిర్జనంగా ఉన్న ప్రధాన ప్రాంగణం నుంచి నడిచి, రాతి మెట్లు మీదుగా క్రిందకి నేలమాళిగలోకి దిగాము. అది చాలా విశాలంగా ఉంది. పూలు, ఆకులు, దేవీదేవతలు, పాముల బొమ్మలు చెక్కిన పెద్ద పెద్ద రాతి స్తంభాలున్నాయి. చేతి గడియారంలో సమయం చూసుకున్నాను. 12:27 అవుతోంది. నేళమాళిగలో భయంకరమైన నిశ్శబ్దం. కొంచెం దూరంలో మొదటి గది కనబడుతోంది. దాని ఇనుప తలుపులు భారీగా ఉన్నాయి. వాటి దగ్గరకి వెళ్ళాను. యురేకస్ నన్ను అనుసరించింది.

''మాస్టర్.. తలుపులు తెరిచేందుకు అవసరమైన సంకేత పదాలు మీకు తెలుసుగా.. మీతో పాటూ నేనూ లోపలికి వస్తాను.'' అంది.

నేను మౌనంగా ఉండిపోయాను. నాకేమీ గుర్తు రావడంలేదు. చాలా ఉద్విగ్నంగా ఉంది. ఏదో అనుకోని అవాంతరం ఎదురవబోతోందన్న ఆందోళన నన్ను నిలువెల్లా వణికిస్తోంది. నా కళ్ళముందు ముఖం, చేతులు కట్టేసి ఉన్న ప్రకృతి రూపం, ఆనాటి వర్షపు సాయంత్రం నేలకూలుతున్న మా అమ్మానాన్నల రూపాలు కదలాడాయి.

సంకేత పదాలను ఉచ్చరించసాగాను.

''దయచేసి తలుపులు తెరవండి.. అమాయకులని రక్షించడం కోసమైనా తెరవండి... నన్ను కాపాడడం కోసం తెరవండి... దయ చూపండి..''

ఏకాగ్ర చిత్తం కోసం ప్రయత్నిస్తూ, నేను మగతలోకి వెళ్ళిపోయాను.

యురేకస్ తన లోహ స్వరాన్ని సవరించుకుంటూ చెప్పింది: ''మాస్టర్... మీకు సంకేత పదాలు గుర్తుకు వస్తున్నట్లు లేదు. ప్రాచీన గ్రంథాలలోని అన్ని మంత్రాలను, సంకేత పదాలను నా తెర మీద చూపిస్తాను. వాటిని ప్రయత్నించండి. కానీ అవకాశాలు యాభై శాతమే...'' అంటూ హెచ్చరించింది. చటుక్కున తెలివి తెచ్చుకున్నాను. సర్వశక్తులు కూడగట్టుకుని ఉత్సాహాన్ని ప్రోది చేసుకున్నాను.

తరువాత యురేకస్ ఛాతి మీద ఉన్న తెరపై కొన్ని వాక్యాలు కనబడ్డాయి.

వాటిని చూడగానే నాకు చదవాల్సిన మంత్రాలు స్ఫురించాయి.

"సర్పెంటికమ్ నజా నజా

రెప్టెలికమ్ నజా హన్నా

సర్ప బంధం ముక్తియో

భుజంగ శాప విముక్తి!!!

ఓం ఓం నమో భైరవాయ"

ప్రాచీన భాషలలోని ఇలాంటి మంత్రాలు నా మెదడులోకి ప్రవేశించాయి. దృఢమైన స్వరంతో వాటిని వేగంగా ఉచ్చరించాను. ఒకే ఆలోచనపై దృష్టి నిలపడం లేజర్ పుంజంలా శరీరాన్ని కంపింపజేస్తోంది. కొన్ని క్షణాలపాటు మనసులో "తెరుచుకో..." అన్న పదం తప్ప మరేది లేదు. సాధించాను... ఉన్నట్లుండి గాలి చల్లబడింది, మరింత చీకటి అలుముకుంది. విశ్వశక్తి ప్రయోగానికిది సంకేతం. దూరంగా ఉన్న దీపాలు మిణుకుమిణుకుమన్నాయి, ఎక్కడో పిడుగుపడిన శబ్దం. నేను నిలబడిన చోట భూమిలో ఏవో తీవ్రమైన తరంగాలు.. మరుక్షణం మొదటి గది తలుపులు కదిలిన శబ్దం.. దుమ్మూ, బూడిద కింద రాలుతున్నాయి. తలుపులకి మధ్యగా ఉన్న రెండు పాములు పెనవేసుకుని ఉన్న సర్పబంధం సడలి, తలుపులు రెండూ తెరుచుకోసాగాయి. అవి బుసకొట్టాయా? వాటి కళ్ళు ఎరుపెక్కాయా? ఏమో నేను చెప్పలేను. లేదా అదంతా నా భ్రమ కావచ్చు. భారీ తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నాయి. లోపల గది అంతా విశాలంగా, చీకటిగా ఉంది. లోపల ఎన్నో ఇత్తడి బిందెలు, పలురకాల ఆకారాలలో కళాఖండాలు ఉన్నాయి. ఎరుపు, తెలుపు, నీలం రంగులలో చిరుకాంతి వెలువడుతోంది. బహుశా ఏ రత్నాలవో అయ్యుంటాయి.

"మాస్టర్.. పరిగెత్తండి లోపలికి. లేదంటే విశ్వశక్తి ప్రయోగం గురించి తెలిసిపోతుంది. డ్రోన్‌లు వచ్చేస్తాయి... గ్లోబల్ పొజిషనింగ్ సర్వేయలెన్స్ ద్వారా మనం ఎక్కడున్నామో సులువుగా తెలిసిపోతుంది..." అంటూ హెచ్చరించింది యురేకస్.

నేను గబాగబా లోపలి పరిగెత్తాను. నా ధారణ, ఏకాగ్రత చెదిరిపోయాయి, క్రమంగా మాములు మనిషినవుతున్నాను. నా శరీరం వణకడం, అంత చీకటిలోనూ, నాకు తెలుస్తోంది. తన ఇనుప పాదాలను చప్పుడు చేస్తూ, నాతో పాటూ లోపలికి ప్రవేశించింది యురేకస్.

వెంటనే తన కంచుకంఠంతో హెచ్చరించింది - "మాస్టర్.. తలుపులు మూసెయ్యండి.. తలుపులు మూసేస్తే మనల్నెవరూ పట్టుకోలేరు... ఇదిగో సంకేత పదాలు..." అంటూ దాని తెర మీద చూపించింది.

"ఫెర్మెజ్ సర్పెంటికమ్

అంతర్ బంధన!!!

పునర్ యుగళం సర్పం!!!"

అంటూ ఆ మూడు మంత్రాలను ఉచ్చరించాను.

మూడో మంత్రం చదివేసరికి, పూర్తిగా తెరుచుకున్న తలుపులు నెమ్మదిగా మూసుకున్నాయి. దూరంగా వినబడిన డ్రోన్ విమానపు శబ్దంగానీ, అపస్వరంలో మ్రోగుతున్న గుడిలోని సైరన్ మ్రోతలు కాని నాకింక వినబడడం లేదు. వజ్రాలు, కెంపులు, నీలాలు, పచ్చలు ప్రసరిస్తున్న కాంతి మినహా లోపలంతా నిశ్శబ్దం... చీకటి.

❄ ❄ ❄

# 27. నేలమాళిగలో అన్వేషణ

**"మా**స్టర్.. వెండి కొవ్వొత్తిని వెతికి పట్టుకోడానికి మనకి పది నిమిషాల సమయమే ఉంది. వెతకండి.. అది మీలాంటి స్వచ్ఛమైన, నిజాయితీ గల - విశ్వశక్తిని ఉపయోగించగల వారికే కనబడుతుంది..." అంటూ హెచ్చరించింది యురేకస్. మాంత్రికుడు అనే పదానికి భూమిపై వాడుతున్న సమానార్థం గల పదాన్ని వాడింది యురేకస్.

"నేను వెతికి పట్టుకోలేకపోతే ఏం జరుగుతుంది?"

నా కళ్ళు లోపలి చీకటికి అలవాటు పడ్డాయి. నా కళ్ళు అప్పటికే... ఏనుగు దంతాలతో చేసిన బొమ్మలనూ, బంగారం, వెండితో తయారైన కత్తులు, ఆభరణాలను, కాంతులు వెదజల్లుతున్న జాతిరత్నాల మూటలను... వెండి కొవ్వొత్తి లేదా కొవ్వొత్తిని పెట్టుకునే పీఠం కోసం గాలిస్తున్నాయి. ఇన్ని జాతి రత్నాలను ఒకే చోట ఇంతకుముందెన్నడూ నేను చూడలేదు.

"ఇక్కడ ఏదైనా సంభవించే అవకాశం ఉంది. నేను వెతికిన ప్రాచీన గ్రంథాలలో చెప్పిన ప్రకారం - సర్పబంధం ఉన్న పవిత్రమైన నేలమాళిగలను తెరిస్తే, ఆ ఊరికి వినాశనం తప్పదట. అది చలికాలం లేదా వర్షాకాలమైతే, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, వరదలు వస్తాయట. వేసవి కాలం అయితే భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయట! ఈ నేలమాళిగకీ, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రానికీ లంకె ఉన్నట్లుంది. పైగా ఈ గది తలుపులు తెరవడం దేవతలకు కోపం తెప్పించి, సముద్రంలో వేలా తరంగాన్ని సృష్టించవచ్చు. సముద్రపు నీరు ముందుగా నేలమాళిగని, తరువాత మొత్తం గుడిని, ఆపై మొత్తం ఆమ్రపాలి ఊరినే ముంచేయచ్చు..." చెప్పింది యురేకస్.

"అయ్య బాబోయ్.. ఇవన్నీ నువ్వు నాకు ముందు చెప్పలేదు..." అన్నాను.

“ఇవన్నీ జరగడానికి గణాంకాల పరంగా సంభావనీయత చాలా తక్కువ. ఇక్కడికి వెయ్యి కిలోమీటర్ల పరిధిలో ఏ అల్పపీడనమూ లేదు. కాబట్టి వేలా తరంగం వెలువడే అవకాశం 12% మాత్రమే. అయితే ఉరుములు మెరుపుల అవకాశం ఉంది, ఎందుకంటే ఈశాన్య ఋతుపవనాలు బాగా చురుగ్గా ఉన్నాయి. పోతే అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం లేనే లేదు...” చెప్పింది యురేకస్.

“మరి గుడి, ఊరు నీట మునిగే ప్రమాదం మాటేమిటి?”

“అదే నాకు అర్థం కావడం లేదు. ఒకవేళ నిజంగానే, ఈ నేలమాళిగకీ, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రానికీ లంకె ఉన్నట్లయితే మాత్రం ఆ ప్రమాదం సంభవించే అవకాశం ఖచ్చితంగా ఉంది. పూర్వకాలంలో రాజులు యుద్ధాలలో తాము జయించిన రాజ్యాలనుంచి ఎన్నో విలువైన సంపదలను, వస్తువులను మోసుకొచ్చి, సొరంగ మార్గం ద్వారా, ఈ నేలమాళిగలలోకి చేర్చేవారట.” అంది యురేకస్.

“సరే, వెండికొవ్వొత్తిని సంపాదించాక, ఇక్కడ్నించి బయటపడడం ఎలా?”

“నాకు రెండు మార్గాలు తోస్తున్నాయి... మాస్టర్...”

“మొదటిది.. ఇక్కడ్నించి సముద్రానికి ఉన్న సొరంగమార్గాన్ని వెతికి పట్టుకుని సముద్ర తీరానికి చేరడం, అక్కడ్నించి ఈదుకుంటూ మరో ప్రాంతానికి చేరడం...”

“నాకు ఈత వచ్చు... కానీ నేను 30 కిలోమీటర్లు ఈదలేను...”

“ఇక రెండో మార్గం.. విశ్వశక్తి లేదా మంత్రాలను ఉపయోగించి తలుపులని తెరిచి అదృశ్యరూపంలో పారిపోవడం...”

“ఇది ఆత్మహత్యతో సమానం! ఎర్త్ కౌన్సిల్ అధికారులు, నా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శాన్ చేతిలో బేడీలు పట్టుకుని నేలమాళిగ బయట నిలుచుని ఉంటారు. లేదా కుజగ్రహపు మాంత్రికులు నన్ను పట్టుకుని, వెండి కొవ్వొత్తిని లాక్కుని పారిపోతారు, నేనేమో ఎర్త్ కౌన్సిల్ అధికారులకు దొరికి పోతాను. మాంత్రికులు నన్ను కాపాడితే తప్ప... నాకు ప్రమాదం తప్పే అవకాశం లేదు...” అన్నాను.

“అవును మాస్టర్. మీరు సొరంగమార్గం కనుక్కోలేకపోతే.. సమూరాతో చేతులు కలిపి వాళ్ళతో కలిసి పారిపోవాలి లేదా శక్తివంతమైన ఎర్త్ కౌన్సిల్

అధికారులకు లొంగిపోయి జీవితాంతం ఖైదీగా ఉండాలి. నేను ఆఖరిసారిగా లెక్కపెట్టినప్పుడు హై సెక్యూరిటీ ఐలాండ్ జైల్లో జీవితఖైదు అనుభవిస్తున్న - విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులు - అదే పి.సి.యు.ఎఫ్‌లు 1,313 మంది ఉన్నారు...'' చెప్పింది యురేకస్.

''ముందు నుయ్యి... వెనుక గొయ్యి... ఎలాగయినా నేను చిక్కుకు పోయినట్లే. నన్ను వాళ్ళతో తీసుకువెళ్లడం కంటే నన్ను చంపేయడమే సమూరాకి సులువు. ఎందుకంటే వాళ్ళ దుష్ట పన్నాగాలకి నేను సహకరించను కాబట్టి. ఎర్త్ కౌన్సిల్ అధికారులు మనుషులే, కానీ వాళ్లు నన్ను అర్థం చేసుకోరు. మనుషులు, మాంత్రికుల మధ్య నాకు ఎటూ తోచని స్థితి ఎదురవుతోంది...'' అంటూ వాపోయాను.

❄ ❄ ❄

# 28. కార్యసాధకుడు

**ఆ** ప్రాచీన నేలమాళిగలోని మొదటి గదినంతా నా కళ్ళు చురుగ్గా శోధిస్తున్నాయి. నాకా చీకటిలో ఒక్కో అడుగు వేయడమే కష్టంగా ఉంది. మావటివాడు కూర్చున్న ఇత్తడి ఏనుగు ప్రతిమ, బంగారు రంగు నెమలి, దాని పింఛంలో పొదిగిన రత్నాలు, చెక్క పీఠాలు లేదా దేవుని ప్రతిమలు ఉంచే పీఠాలు కనబడ్డాయి. వాటి తరువాత రకరకాల దేవీదేవతల ప్రతిమలు- బంగారంతో చేసినవి, వెండివి, ఇత్తడివి, రాగివి, చెక్కవి, మట్టివి, టెర్రాకోటవి, పెద్దవి, మధ్యస్తంవి, చిన్నవి ఉన్నాయి. కొన్ని ప్రతిమలు అందంగా ఉంటే, మరికొన్ని భయంకరంగా ఉన్నాయి. కొన్ని బొమ్మలకి రెండు తలలు, నాలుగు చేతులు ఉన్నాయి. వీటన్నింటి మధ్య రాశులుగా పోసున్న జాతిరత్నాలు - నీలాలు, కెంపులు, మరకతాలు, వజ్రాలు.. ఇంకా మూటలు కట్టిన సంచులలో బంగారు నాణాలు.. కొన్ని నాణాలు నేలమీద చెల్లాచెదురుగా పడున్నాయి. వేలాదిగా ఉన్న ఆ నాణాలు దుమ్ము పట్టినా ధగధగా మెరుస్తూనే ఉన్నాయి.

ఇంతలో నా కాళ్ళమీద నుంచి ఏదో పాకినట్లయింది. భయంతో నోరెళ్ళబెట్టి కిందకి చూసాను. వేగంగా కదిలే పాముకటి జరజరా పాకింది. తర్వాత మరో నల్లపాము.. బుసకొడుతూ పాకింది. ఇంకోటి... మరొకటి... నిజానికి పాములు, పిల్ల పాములు గుంపులు గుంపులుగా జరజరా పాకుతూ బుసలు కొడుతూ నా కాళ్ళ మధ్య నుంచి కదులుతున్నాయి. వాటిలో కొన్నే పెద్దవి, అవే పడగ ఎత్తి తోక మీద నిలబడగలుగుతున్నాయి. వాటి కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. అది భయంకరమైన, గుండె ఆగిపోయే అనుభవం!

“బాబోయ్ పాములు!” అంటూ గెంతి, పక్కనే ఉన్న ఓ పెద్దబల్లపైకి ఎక్కాను. దాని మీద నర్తిస్తున్న నటరాజు పెద్ద విగ్రహం నిలబెట్టి ఉంది.

“మాస్టర్.. కదలకండి. నిశ్చలంగా ఉండండి. వాటిని గాయపరచకండి.

మీరు మామూలు మనుషులు. మీ పాదాలకి ఏమీ లేవు. ఒక్క కాటు చాలు మీ ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. అందులో సందేహం లేదు. పైగా మన దగ్గర పాము విషానికి విరుగుడు మందు కూడా లేదు. అయినా వాటికి ఆకలి వేస్తేనే లేదా గాయపరుస్తేనే అవి కాటు వేస్తాయి. పైగా ఇక్కడున్నవన్నీ చిన్న చిన్న పాములే. కదలకుండా ఉండడానికి ప్రయత్నించండి. అవి మీ మీద నుంచి పాకినప్పుడు కనీసం ఊపిరి కూడా పీల్చకండి...'' అంటూ హెచ్చరించింది యురేకస్.

అది చెప్పినట్లే చేసాను. నేను నిలబడ్డ బల్ల మీద కూడా కొన్ని పాములున్నాయి. వాటిలో చాలామటుకు గుంపుగా సంచరిస్తున్నాయి, వేగంగా నేలమీదకి పాకి గబగబా వెళ్ళిపోయాయి. ఈ గదిలో పాములేకాక పెద్ద పెద్ద నల్ల ఎలుకలు కూడా ఉన్నాయి. పాముల నుంచి తప్పించుకోడానికి అవి కూడా నా కాళ్ళ మీద నుంచి అటూ ఇటూ పరిగెడుతున్నాయి. నేను అలాగే నిశ్చలంగా ఉండిపోయాను.

ఐదు నిముషాల తరువాత ఆందోళన, నరాల ఉద్రేకం చల్లబడ్డాయి. పాములొకవైపు, ఎలుకలు మరోవైపు సర్దుకున్నాయి. అక్కడంతా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. పాముల తోక జాడింపు శబ్దాలు లేవు, బుస బుసలూ లేవు. నేనా బల్ల మీద రెండు కాళ్ళ మీద నిలబడి ఉన్నాను. బల్ల మీద ఉన్న ప్రతిమలు ఒక కాలిపై ఉన్నాయి, వాటి రెండో కాళ్ళు గాలిలో ఉన్నట్లు పైకి లేచి ఉన్నాయి. దివ్యలోకపు నృత్య భంగిమలవి.

“అంతా సర్దుకుంది మాస్టర్. మీరు సాధించారు. జీవించారు. దీన్నిబట్టి నేనో యంత్రాన్ని అనీ, మీరు మనిషనీ తెలుస్తోంది. ...'' అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది.

“ఎందుకలా నీ మీద నువ్వే జాలిపడుతున్నావు? నీ లోహ శరీరం అంటే నాకు అసూయ. ఎందుకంటే అవి నిన్నేమీ చేయలేవు.. నువ్వు నాకు బాగా పనికొస్తావు..'' అన్నాను.

అనుకూలంగా ఉన్న స్థలంలోంచి బల్లమీద నుంచీ చుట్టూ చూసాను. ఆ బల్లే సుమారు ఆరు అడుగులు ఎత్తు ఉంది. నా కళ్ళు చుట్టూ వెతికాయి. నీడలు, బొమ్మలు, శిల్పాలు, గోడలు, స్తంభాలు... అదిగో అప్పుడు కనపడింది. చుట్టూ నీలంరంగు పరివేషంలో మెరిసిపోతోంది. ఆ నీలి పరివేషం మధ్యలో

వెండి కొవ్వొత్తి పీఠం. పొడుగ్గా ఉన్న దాని మీద చక్కని బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. అది ఓ శాఖోపశాఖలుగా విస్తరించిన చెట్టులా ఉంది. మధ్య మధ్యలో కొవ్వొత్తులు అమర్చుకునేందుకు సదుపాయం ఉంది. కాలిపోయిన చిన్న చిన్న కొవ్వొత్తులు జాడలింకా ఉన్నాయి. చుట్టూ రాశులుగా పోసి ఉన్న వజ్రాల మధ్యగా వెండి కొవ్వొత్తి కనపడింది. ఆహా, ఏం గొప్ప నిధి. 4వ సహస్రాబ్దిలో కూడా వజ్రాల విలువ అపారం. కొన్ని జేబులో వేసుకుందామా అనిపించింది. కాని అది దేవుడి సంపద. వెండి కొవ్వొత్తి కూడా దేవుని సొత్తే.. కానీ ప్రకృతిని రక్షించేందుకు, నా మాట నిలుపుకునేందుకు దాన్ని నేను తీసుకువెళ్ళక తప్పదు.

"అదిగో.. అక్కడుంది..." అంటూ అరిచాను.

"యురేకస్.. అటు చూడు. వెండి కొవ్వొత్తి. అద్భుతంగా ఉంది. చుట్టూ నీలిరంగు పరివేషం! ఆ వెండి వెయ్యి కాండిల్ వాట్ ఫ్లోరోసెంట్ బల్బ్‌లా ఉంది." అంటూ ఉత్సాహంగా చెప్పాను.

"మాస్టర్.. నాకు కనపడడం లేదు. మీరు మహామాంత్రికులచే ఎంపిక చేయబడ్డ వ్యక్తి కాబట్టి మీకు కనబడుతోంది. ఇంక ఆగద్దు. నా డివిడీ కెమెరా ఫ్రీక్వెన్సీ పెంచుతున్నాను. పది అడుగుల దూరంలో విద్యుదయస్కాంత తరంగాల ఉనికి తెలుస్తోంది. వెండి కొవ్వొత్తిని తీసుకోండి. ఎలకల్నీ, పాముల్ని తొక్కకుండా, సొరంగం గుండా పారిపోదాం. ఎందుకంటే మనం మళ్ళీ గుడిలోకి వెళ్ళే ప్రసక్తే లేదు..." అంది యురేకస్.

"సరే" అంటూ దూకి పరిగెత్తాను. కెంపుల మీద కాలు వేయడంతో దాదాపుగా జారిపడినంత పనయింది. గబగబా సర్దుకుని వెండి కొవ్వొత్తిని చేతిలోకి తీసుకున్నాను. ఓ శీతల తరంగం నన్ను నిలువెల్లా ఆక్రమించుకున్న ట్లనిపించింది. అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) రూపొందించిన అత్యద్భుతమైన వస్తువులలో ఒకటి నా చేతిలో ఉంది. నా చెవులలో చల్లని గాలి హోరు వినిపిస్తోంది. సముద్రపు అలల ఘోష వినిపిస్తోంది. దేవతల శక్తి నా చేతిలో ఉంది. పర్వతాల ఔన్నత్యం, అగ్ని పర్వతాల వేడిమి, సతత హరితారణ్యాల సాంద్రత నాలోనే ఉన్నాయనిపిస్తోంది. కొవ్వొత్తి పీఠం నాతో మాట్లాడుతున్నట్లూ, నా ప్రశ్నలకి జవాబిస్తున్నట్లూ, నాతో స్నేహం చేస్తునట్లూ అనిపిస్తోంది. "నువ్వు గాల్లో ఎగరగలవు, నీటిపై నడవగలవు, మాయమవగలవు, ఏదైనా చేయగలవు... నన్ను అడగాలంతే!" అంటూ అది

నాతో అంటున్నట్లు అనిపించింది. ఇంతలో నా భుజం మీద ఏదో పడింది. పల్చని నైలాన్ బట్టలా ఉన్న సింథటిక్ కాయితం అది. ఓ చేత్తో వెండికొవ్వొత్తిని పట్టుకుని మరో చేతిలో ఆ కాగితం ఉంచుకున్నాను. అంత చీకట్లోనూ ఆ కాగితంలోని అక్షరాలు మెరవసాగాయి. నా చుట్టూ వెండి వెన్నెల పరుచుకున్నట్లుంది. యూనివర్సల్ డిజిటల్ లాంగ్వేజిలో ఎరుపురంగులో అక్షరాలు కనపడుతున్నాయి.

"నువ్వు అదృష్టవంతుడివి! ఇంత దూరం రాగలిగి, లయకారుడూ, భూతనాథుడు అయిన భైరవుడి వెండి కొవ్వొత్తి చేతిలోకి తీసుకోగలిగిన అదృష్టవంతుడివి. నువ్వు మాత్రమే దీనిని చూడగలవు. అన్ని ఆటంకాలనూ దాటి, అత్యంత విషపూరితమైన సర్పాలనూ, ప్రమాదకరమైన మూషికాలను తప్పించుకున్నావు. వాటికి దొరికితే క్షణాల్లో అవి నీ మాంసం తినేసి, నిన్నో ఎముకల గూడులా తయారు చేసేసేవి. కాని నువ్వు సాధించావు. ఈ కార్యానికై ఎంపిక చేయబడిన వాడివి నువ్వే. గాల్లో ఎగరగలగడం, నీటిపై నడవగలగడం, చిన్న చిన్న వస్తువులను సృష్టించగలగడం, అదృశ్యమవగలగడం, చీకట్లోనూ చూడగలగడం, దివ్యదృష్టి, దూరశ్రవణం వంటి ఎనిమిది అద్భుత శక్తులు లభిస్తాయి. అవి ఎప్పటికీ నశించవు. అయితే ఓ విషయం గుర్తుంచుకోవాలి. ఈ విశ్వంలో భాగమైన నువ్వు.. దీన్ని ఎప్పుడూ నీ చేతిలోనే ఉంచుకోవాలి. అది నీ శరీరంలోని తరంగాలతో కలిసి పనిచేసి నీకు శక్తులను ఇస్తుంది.

ఒకవేళ నీతో సరిసమానమైన లేదా నీకన్నా ఎక్కువ శక్తులున్న మాంత్రికుడి చేతికి ఈ వెండి కొవ్వొత్తి వెడితే, ఇది అతనికి ఉపకరిస్తుంది తప్ప నీకు కాదు.. కాబట్టి దీన్ని ఉపయోగించనప్పుడు జాగ్రత్తగా భద్రపరుచుకో. దీన్ని సక్రమంగా ఉపయోగించుకో. విశ్వంలోని అన్ని జీవులకు మేలు జరగాలని అనుకుంటే, వాళ్ళని చంపకు, లేదా గాయపరచకు. క్షుద్రవిద్యలని ఎంత ఎక్కువగా సాధన చేస్తే, వెండి కొవ్వొత్తి శక్తి అంత త్వరగా క్షీణిస్తుంది. తెలుసుకో! జాగ్రత్తగా మసలుకో! భద్రంగా కాపాడుకో! ఎలాగైతే ఇంతకుముందు దీనిని పొందినవాడు భైరవాలయం నేలమాళిగలో భద్రంగా దాచాడో.. అలా దాచుకో!"

"బావుంది. మంచిదే..." అనుకున్నాను. ఉన్నట్లుండి నాకు చాలా హాయిగా అనిపించింది. నేను శక్తిమంతుడనైనట్లు అనిపించింది. వెండి కొవ్వొత్తిని రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకున్నాను.

"యురేకస్, ఇప్పుడేం చేయాలో నాకు బాగా తెలుసు. ఈ పరికరంతో

సహా మనం ఇక్కడ్నించి బయటపడడం ఖాయం. సముద్రానికి దారితీసే సొరంగం ఎక్కడుందో చూడు...'' అన్నాను.

''సరే.. సరే మాస్టర్.. ఆ కాగితం మీద ఏం రాసుందో నాకు కనపడలేదు. అయినా నేను మిమ్మల్ని అనుసరిస్తాను. సొరంగమార్గం ఎక్కడుందో వెతుకుతాను...'' అంది యురేకస్.

''అవును. నేనిప్పుడు ఏమైనా చేయగలను. నేను సముద్రం మీద నడవనూ గలను. ప్రకృతిని రక్షించుకోగలను...'' అన్నాను.

నాలో ఆత్మవిశ్వాసం తిరిగి తలెత్తింది. వెండి కొవ్వొత్తి ప్రసరిస్తున్న నీలి రంగు కాంతిలో, అడ్డొస్తున్న రాళ్ళనూ, వస్తువులను దాటుకుంటూ నడిచాను. ఆ తర్వాత పరుగందుకున్నాను. విశాలమైన ఆ ప్రాంగణంలో సొరంగమార్గం ఎక్కడుందో వెతికాను. ముందుకు పరిగెత్తేకొద్దీ తూర్పువైపున గది ఇరుకైంది. ఉన్నట్లుండి ఓ చీకటి మార్గం నా ఎదురుగా ప్రత్యక్షమైంది. అక్కడంతా ఏదో తెలియని భయం... శూన్యం... యురేకస్ ఇనుప అడుగుల చప్పుడు. రోబో కూడా తన లోహపు పాదాలను చప్పుడు చేస్తూ నా వెనుకే పరిగెట్టసాగింది. మిణుకుమిణుకుమంటున్న వెయ్యి దీపాల కాంతిని ప్రసరిస్తూ వెండికొవ్వొత్తి మాకు దారి చూపిస్తోంది.

❄ ❄ ❄

# 29. సొరంగం

**ఆ** పొడవాటి, ఇరుకైన సొరంగం చీకటిగా ఉంది. అది భైరవాలయం భూగృహం. గుడి కొండ మీద ఉందని నాకు తెలుసు. కాబట్టి భూగృహం, గుడికి సుమారుగా వంద అడుగుల దిగువన ఉండి ఉంటుంది. సముద్రం ఆమ్రపాలి గ్రామానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉందనీ తెలుసు. అంత దూరం పాటు ఉండే ఇరుకైన పొడవాటి చీకటి సొరంగంలో, రాకపోకలు లేని కారణంగా, విషపూరితమైన పాములు, లేదా, ఏ భయంకరమైన ఉభయచర జీవులో నివాసముండే ప్రమాదం లేకపోలేదు. మాములుగా అయితే ఇదొక సంకటస్థితే అనుకోవాలి. గాలి లేని కారణంగా నేనీ పాటికే దీంట్లో చిక్కుకుపోయి ఉండాలి. హఠాత్తుగా ఇది మూసుకుపోతే నా పరిస్థితి ఏమిటి? కానీ నాతో పాటు యురేకస్ ఉండడం, నా చేతిలో వెండి కొవ్వొత్తి ఉండడం నాకు అమితమైన ధైర్యాన్నిస్తున్నాయి. నేను చేస్తున్న సాహసకృత్యం నాకు ఉత్సాహాన్నిస్తోంది. ఎలివేటర్లలోనూ, లేదా, నలువైపులా మూసిఉన్న చీకటి ప్రాంతాలలోను ఉన్నప్పుడు నాకు మాములుగా కలిగే భయం ఇప్పుడు కలగడం లేదు. ఈ సొరంగంలో ఏ దుష్టశక్తులు లేదా ఎర్త్ కౌన్సిల్ నన్ను ఏం చేయలేవనే ధైర్యం నన్ను కాస్త దుడుకుగా వ్యవహరించేటట్లు చేస్తోంది.

కాని నేననుకున్నట్లు జరగలేదు. యురేకస్ తల మీద నుంచి వస్తున్న శక్తిమంతమైన దీపం కాంతిలోనూ, వెండి కొవ్వొత్తి నుండి వెలువడుతున్న నీలిరంగు కాంతిలోనూ దారి చేసుకుంటూ ముందుకు నడుస్తున్నాను. ఉన్నట్లుండి నా వెనుక అరుపులు వినబడ్డాయి.

“అదిగో... అక్కడున్నాడు. పట్టుకోండి...”

ఆరు అడుగుల ఎత్తు, ఐదు అడుగుల వెడల్పుతో, ఒకే ఒక మనిషి పట్టగలిగే ఖాళీ ఉన్న ఆ సొరంగంలో ఒకరి వెనుక ఒకరొస్తున్నట్లుగా క్రీనీడలు

కనిపించాయి. అవును వాళ్ళు ఎర్త్ కౌన్సిల్ అధికారులే.

నేలమాళిగ తలుపుని బలవంతంగా తెరిచి, నన్ను అనుసరిస్తున్నారు. చాలా వేగంగా వస్తున్నారు.. అత్యంత వేగంగా! నేనిక వెనక్కి వెళ్ళలేను. తప్పనిసరిగా ముందుకే వెళ్ళాలి. పైగా ఎర్త్ కౌన్సిల్‌లో నాకన్నా శక్తివంతమైన పి.సి.యు.ఎఫ్‌లు ఉన్నారు. వాళ్ళు వెండి కొవ్వొత్తి శక్తులను సులభంగా ఎదుర్కోగలరు. సమూరా, సయోనీ, ఆ ముసలి మంత్రులు ఎక్కడున్నారో? ప్రకృతి ఎక్కడుంది? ఆ సొరంగపు నేల మీద అక్కడక్కడ పడిఉన్న గులక రాళ్ళను దాటుతూ పరిగెడుతున్నాను. యురేకస్ సులువుగా జారుకుంటూ, నాకు వెలుగునిస్తూ వస్తోంది.

“యురేకస్. వాళ్ళు వచ్చేస్తున్నారు.. చాలా వేగంగా వస్తున్నారు.. పరిగెత్తు... పరిగెత్తు...” అన్నాను.

వాళ్ళు నన్ను పట్టుకుంటే? ఏం చేయాలి? నాకు చెమటలు పట్టాయి. భయం వల్ల నా గుండె మరింత వేగంగా కొట్టుకుంటోంది. నేను భయంలో కూరుకుపోయినప్పుడల్లా, అసలా భయానికి కారణం ఏమిటో ఆలోచిస్తాను. దేనికి భయపడాలి? నా జీవితం గురించా? నేను చనిపోతే ఏమవుతుంది? ఏమీ కాదు... నాకంటూ ఎవరూ లేరు. జైలు శిక్ష గురించి లేదా చిత్రహింసలు లేదా నొప్పి గురించి బాధపడుతున్నానా? అవునేమో. కాని నా అసలు బెంగంతా అమాయకురాలైన ప్రకృతి గురించే. నా కలల సుందరి.. తను కూడా విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తే, కాని ఇప్పుడు బందీగా ఉంది, ఆమె ప్రాణానికే ప్రమాదం. నావల్ల తను బాధ పడకూడదు. నావల్ల ఆమ్రపాలి గ్రామానికి నష్టం కలగకూడదు.

“ఆటంకాలు కల్పించండి మాస్టర్. వాళ్ళు తికమకపడతారు. ఏవన్నా భ్రమలు, ఛాయారూపాలు కల్పించండి.. మనల్ని వెంటాడడం కాస్త ఆలస్యం అవుతుంది ...” అని అరిచింది యురేకస్.

నాకు అర్థమైంది. పరిగెత్తడం ఆపి, వెనక్కి తిరిగాను. కొవ్వొత్తిని పట్టుకుని ఏకాగ్రతతో కళ్ళు మూసుకుని, “పడగ విప్పి, బుసలు కొడుతూ, విషాన్ని వెదజల్లుతున్న పెద్ద తాచు పాము రూపాన్ని సృష్టించు...” అన్నాను. నా శరీరం నిలువెల్లా వణికింది, నాలోంచి ఏదో శక్తి తరంగాలు వెలువడ్డాయి. విశ్వశక్తి ప్రయోగం జరుగుతున్న సూచనగా గాలిలో ఉన్నట్లుండి విపరీతమైన చల్లదనం..

దూరంగా నన్ను వెంటాడుతున్న వారికీ, నాకూ మధ్య చీకటి.. ఉన్నట్లుండి ఒక్కసారిగా వెలుగు. అంతే. మా మధ్య ఓ ఆరు అడుగుల నాగుపాము ప్రత్యక్షమైంది. తీవ్రంగా బుసలు కొడుతూ నన్ను అనుసరిస్తున్న ఆగంతుల వైపుకి మళ్ళిందా పాము. అడుగుల చప్పుడు ఆగింది.

"పరిగెత్తు యురేకస్, పరిగెత్తు.." అంటూ అరిచాను. ఇద్దరం ముందుకు సాగాం. ఇలా రెండు లేదా మూడు గంటల సేపు సాగింది. నాకు కాల స్పృహ పోయింది. చీకటి సొరంగం. ముందుకు పరిగెడుతూనే ఉన్నాం. ఒకదాని తర్వాత మరొకటి భయంకరమైన ఛాయారూపాన్ని సృష్టిస్తూ, వెనుక వస్తున్నవారిని తికమక పెడ్తూ ముందుకు సాగాను. వాళ్ళు ఒక్కో ఆటంకాన్ని తప్పించుకుంటూ నన్ను అనుసరిస్తూనే ఉన్నారు.

ఒకసారి అతి పెద్ద ఎద్దుని, మరోసారి పులిని, మరోసారి కంకాళాలను సృష్టించాను. చివరగా సొరంగంలోకి సముద్రం చొచ్చుకువచ్చినట్టు భ్రమ కల్పించాను. సముద్రపు నీరు నిజమో కాదో, ముందుకు సాగాలో వద్దో తేల్చుకోడానికే వాళ్ళకి అరగంటపైన పట్టింది. మొత్తానికి, ఎంతో ప్రయాస మీద సొరంగం అవతలి వైపుకి చేరాం. "మాస్టార్.. సాధించాం." అంటూ యురేకస్ సంతోషంతో అరిచింది... సొరంగం చివరన కొద్దిపాటి వెలుగు కనబడుతోంది. తడబడుతున్న అడుగులతో శక్తిని కూడదీసుకుని పరిగెత్తాను. నీలి ఆకాశం... నీలి సముద్రపు అలలు... సొరంగం సముద్రంలోకే తెరుచు కుంటోంది కాని  ఓ దృఢమైన నీలిరంగు గాజు ఫలకం అడ్డుగా ఉంది. దానికి దీపాలు, మెట్లు ఉన్నాయి. దగ్గరకి వెళ్ళి చూసాను, పైకి వెళ్ళడానికి మెట్లు, మెట్ల మీద నేల కనబడింది, చుట్టూ సముద్రపు ఘోష వినబడుతోంది. యురేకస్ తన యాంటీనాకి ఉన్న ఓ పదునైన కొమ్ముతో గాజు ఫలకానికి మూడు అడుగుల మేర చిల్లు పెట్టింది.

"మాస్టర్, దీంట్లో దూరి పైకి వెళ్ళండి.. మళ్ళీ మూసేద్దాం..." అంది.

నేను దూరి బయటకి నడిచాను, యురేకస్ తన రూపాన్ని గోళాకరంలోకి మార్చేసుకుని సులువుగా ఆ కన్నంలోకి వచ్చేసింది. ఆ తరువాత ఆ కన్నాన్ని మళ్ళీ జాగ్రత్తగా పూడ్చేసింది. తర్వాత తన యాంటీనాలోకి ఇంకో గొట్టంలోంచి నలుపురంగుని తెప్పించి గాజు ఫలకం మీద పిచికారీ చేసింది. కొద్దిసేపటికే ఆ గాజు ఫలకం మొత్తం నల్లగా అయిపోయింది. నన్ను వెంటాడేవాళ్ళకి మరింత ఆలస్యం అవుతుంది.

మేము గబగబా మెట్లు ఎక్కాం. సుమారుగా వంద ఉన్నాయవి. పైకి చేరి చూస్తే  చిన్న ద్వీపం మీద ఓ కమాను కింద ఉన్నాం. పైన ఆకాశం... చుట్టూ సముద్రం.

“ఇదే భైరవుడి రహస్య ద్వీపం.. మైలు వెడల్పు ఉంటుందట. ఈ మార్గం గుండా పూర్వకాలపు రాజులు తమ సంపదలను ఆలయంలోని నేల మాళిగలకు తరలించేవారట... చెప్పింది యురేకస్. మళ్ళీ తనే మాట్లాడుతూ... “ఈ వివరాలన్నీ గలాక్టికా ఎన్‌సైక్లోపీడియాలోనూ, మంత్ర గ్రంథాలలోనూ ఉన్నవే..” అంది.

కాసేపాగి, “మాస్టర్.. తిన్నగా చూడండి.. మీ మిత్రులు మీ కోసం ఎదురు చూస్తున్నారు. ఐజి నెట్ సిగ్నల్స్ అందుతున్నాయి.. ఇదుగో నా ఇన్‌బాక్స్‌లోకి సందేశం వచ్చింది.. “ఓడ దగ్గరికి రా.. వచ్చి వెండి కొవ్వొత్తిని అప్పగించు... ప్రకృతి సజీవంగా కావాలంటే అదొక్కటే మార్గం...” పైకి చదివింది యురేకస్.

నిజంగానే భూమ్యాకాశాలు కలిసే చోటులా అనిపిస్తున్న ప్రాంతంలో ఓ పెద్ద నౌక ఆగి ఉంది. నల్లరంగులో ఉన్న ఆ నౌక తెల్లటి తెడ్లు గాలికి కొట్టుకుంటూంటే - చూడడానికి ఓ బొమ్మలా ఉంది

❄ ❄ ❄

# 30. అలల మీద తేలుతూ

ఎదురవబోయే పరిణామాలను, ప్రమాదాలను అంచనా వేస్తున్నాను. అంతా చాలా స్పష్టంగా ఉంది. సమూరా, అతని బృందం చాలా చక్కగా ప్రణాళికలు రూపొందించారు. తాము పారిపోడానికి బంగాళాఖాతంలో ఓ నౌకని సిద్ధంగా ఉంచుకున్నారు. దాంట్లో, ఒకప్పటి అండమాన్ దీవులలో తూర్పు భాగంలోనో, లేదా దక్షిణకొసలోనో ఉన్న స్పేస్ ఎలివేటర్ వద్దకు చేరుకుంటారు. ఈ దీవులు తరచూ సంభవించే సునామీవల్ల ఎప్పుడో మునిగి పోయాయి. ఇవేకాదు, ఇలాంటి చిన్న చిన్న దీవులదీ ఇదే పరిస్థితి.

యురేకస్‌కి మళ్ళీ సందేశం వచ్చింది.

"మంత్రశక్తులున్న మానవుడా! ఓ హనీ! వెండి కొవ్వొత్తి సాయం తీసుకో. సముద్రపు నీటి మీద నడువు లేదా పరిగెత్తు.. నీవు చేయగలవు. రెండు గంటలలో మా వద్దకు చేరుకోగలవు. ఒకవేళ నువ్వు రాకపోతే, నీ ప్రియురాలు ప్రకృతిని చంపేస్తాం... ఆ తర్వాత నీ పని పడతాం...."

'ప్రియురాలా?' వీళ్ళకి బలహీన మనస్కులతో ఆడుకోవడం బాగా తెలుసు. ప్రకృతి అమాయకురాలని నాకు తెలుసు. ఈ ధూర్తుల చేతిలో ఆమె అంతం కాకూడదు.

"వస్తున్నాం. ప్రకృతిని ఏమీ చేయద్దు, ఆమె అమాయకురాలు. దీంట్లో ఆమెకి ఎటువంటి సంబంధం లేదు అని వాళ్ళకి జవాబివ్వు యురేకస్..." అని యురేకస్‌ని ఆజ్ఞాపించాను.

"జవాబిచ్చాను మాస్టర్..." అంది యురేకస్ తన కంచు కంఠంతో.

మళ్ళీ వెంటనే మరో సందేశం వచ్చింది.

"తొందరంగా రండి, మీతో పాటు మేము కూడా దొరికిపోయే ప్రమాదం

ఉంది. ఎర్త్ కౌన్సిల్ వాళ్ళు మిమ్మల్ని తరుముతున్నారు. కాసేపయితే మా వెంట కూడా పడేటట్లున్నారు..." అనే వాక్యాలు యురేకస్ తెర మీద కనపడ్డాయి.

వింతగా ఉన్న వెండి కొవ్వొత్తి పీఠం ఒక చేతిలోనూ, పక్కన ఇనుప కవచం ధరించి, తల మీద యాంటీనాతో, మిణుకుమంటున్న దీపాలతో విచిత్రంగా ఉన్న రోబోతోనూ - చుట్టూ ఉన్న నీలిసముద్రం మధ్యలో, భైరవ ద్వీపం మీద ఆ నౌకకి ఎదురుగా నిలబడి ఉన్నాను.

"ఓ వెండి కొవ్వొత్తీ, నీకే కనుక నిజంగా శక్తి ఉంటే నన్ను మునిగిపోనీయకు. నేను సముద్రం మీద నడవబోతున్నాను..." అని కొవ్వొత్తితో అని, "పద, యురేకస్. నీ ప్రజ్ఞని చూపించు. నీటిపై నడు లేదా ఈదు. నేను నా పద్ధతి పాటిస్తాను" అంటూ గట్టిగా అరిచి చెప్పాను యురేకస్‌కి.

"ఓ దేవా! భైరవా!" అంటూ ప్రార్థించి, ఓ క్షణం పాటు ధ్యానం చేసాను. గుడిలో దొరికిన వస్తువు కాబట్టి, దేవుని స్మరణ తప్పుకాదని, అది సరైనదేనని అనిపించింది. భీతావహురాలైన ప్రకృతినీ తలచుకున్నాను. తీరంలో నడుస్తున్నట్లుగా నీళ్ళలోకి నడవసాగాను. నా శరీరమంతా తడిసిపోయింది. అలలు నన్ను ముంచెత్తాయి, నేను వాటి మీద నడవసాగాను.

"మాస్టర్, నా పాదాల కింద ఉన్న గాలిసంచులని విప్పుకుని, నేను నీటిపై నడవగలను.. మీరూ ప్రయత్నించండి..." అంది యురేకస్.

ఉన్నట్లుండి నాకు మైకం కమ్మినట్లయింది. నా శరీరం మొత్తం తేలికగా మారింది, నా శరీరంలోని ప్రతీ కణమూ తేలికై గాలితో నిండినట్లుంది. నేను నీడలా తేలికగా మారాను. నీటి మీద హాయిగా తేలుతున్నాను. తిన్నగా నడవడం కష్టమవుతోంది, ఎందుకంటే అలలు నన్ను ముందుకు సాగనివ్వడం లేదు. వేగంగా నడవాలని ప్రయత్నించి విఫలమయ్యాను. నెమ్మదిగా, "మూన్ వాక్" చేస్తూ నౌకకి సగం దూరం చేరానో లేదో నా వెనుక అరుపులు వినబడ్డాయి. నన్ను పేరు పెట్టి పిలుస్తూ, వెనక్కి వచ్చేయమని కేకలు పెడుతున్న ఆ గొంతు ఎవరిది? ఇంకెవరిది? నా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శాన్ గొంతే అది. తల తిప్పి వెనక్కి చూసాను. శాన్‌తో పాటు వింతగా కనిపిస్తున్న సైనిక సిబ్బంది కూడా ఉన్నారు. శాన్ ఎలా వచ్చాడు? ఉన్నట్లుండి నాకు సమాధానం దొరికింది. అతను నన్ను మొదటి నుంచీ అనుసరిస్తూనే ఉన్నాడు. నాకేదో గ్లోబల్ పొజిషనింగ్ రిమోట్ సెన్సార్ అమర్చినట్లున్నాడు, నా జాడలన్నీ అతనికి

తెలుస్తూనే ఉన్నాయి. ఎర్త్ కౌన్సిల్‌కి బద్ధుడై ఉండి, నన్ను వెంటాడేది శాన్ కాక మరెవరుంటారు?

“హనీ! వెనక్కి వచ్చేయ్.. గ్రహాంతరవాసుల దగ్గరికి వెళ్ళొద్దు. వాళ్ళు క్షుద్ర మాంత్రికులు. వాళ్ళు నిన్ను చంపేస్తారు. నీ చేతిలోని వస్తువుని తీసుకుని వెనక్కి వచ్చేయ్...”

మళ్ళీ సందిగ్ధావస్థ! వెనుక నుంచి మానవులు! ముందు నుంచి మాంత్రికులు నన్ను పిలుస్తున్నారు. కానీ అమాయకంగా ఉన్న ప్రకృతి రూపమే నన్ను ముందుకు సాగేటట్లు చేసింది. నేను నీటి మీద పరిగెత్తసాగాను. యురేకస్ నీటి మీద తేలుతూ, సులువుగా జారిపోతోంది. ఇద్దరం ముందుకు సాగాం.

నా వెనుకగా తుపాకీ పేల్చిన శబ్దం వినబడింది. మొదటి తూటా నా ఎడమ చెవి పక్క నుంచి దూసుకుపోయింది.

“హనీ! అనవసరంగా చావుని కొని తెచ్చుకోకు. ఆగు..” అంటూ మరో కేక. ఆ వెనుకే మరో తూటా! ఈసారి కుడి చెవి పక్క నుంచి!

నీటి మీద వేగంగా పరిగెత్తడం ఎలా? వడివడిగా పరిగెత్తుతున్నాను.

“మాస్టర్, నేనో అవాంతరం సృష్టిస్తాను. తెల్లటి దట్టమైన పొగని మన వెనుక సృష్టిస్తాను. అయితే, ఒకసారి మాత్రమే చేయగలను... ఎందుకంటే అలా చేస్తే నా బాటరీ తొందరగా అయిపోతుంది... ఈ పొగ కనీసం అయిదు నిముషాల పాటు ఉంటుంది...” అంది యురేకస్.

నేను అలల మీద పైకి కిందకి జారుతూ ముందుకు వెడుతున్నాను. హంసలా నీటిపై తేలుతున్నాను. చుట్టూ కెరటాలే. పెరిగి, విరుగుతున్న అలలు పెద్ద ఎత్తున నీటి తుంపరలని ఆకాశంలోకి వెదజల్లుతున్నాయి. పైన నీలి ఆకాశంలో పత్తి ముద్దల్లా తెల్లని మేఘాలు. సర్ఫింగ్ ఆటలో నేనో ఛాంపియన్‌లా తోచాను. ఎర్త్ కౌన్సిల్ మనుషులు నన్ను చూడలేకపోవడంతో అయిదు నిముషాల పాటు పూర్తి నిశ్శబ్దంగా ఉంది. నౌకకి అర కిలోమీటరు దూరంలో ఉన్నాను. ఉన్నట్లుండి ఆకాశంలో ఏదో భీకర శబ్దం వినబడింది. వెనుకగా మిస్సైల్ గన్స్ నుంచి వెలువడుతున్న తూటాలూ, పైనుంచి మానవరహిత విమానం కురిపిస్తున్న లేజర్ బుల్లెట్లు తమ ప్రతాపం చూపిస్తున్నాయి.

“మాస్టర్, నీటిలో మునగండి. లేకపోతే అంతే సంగతులు..” అంటూ యురేకస్ హెచ్చరించడంతో నీటిలో మునిగాను. లోతుగా, ఇంకా లోతుగా

మునిగాను. చల్లని సముద్రపు నీరు నా శరీరాన్ని వణికించింది. నీటిలోపల ఉండే సరికి నా సంకేతాలేవీ బయటపడవు. విద్యుదయస్కాంత సంకేతాలూ, విశ్వశక్తి సంకేతాలూ ఏవీ కూడా వేగంగా దూసుకువస్తున్న అలల మధ్య, లోతైన నీటిలోనూ పనిచేయవు. సాయం చేయమని వెండి కొవ్వొత్తిని అడిగాను, అది తక్షణమే సహాయం చేసింది. నన్నెవరో తోస్తున్నట్లుగా నేను హాయిగా, సులువుగా నీటిలోపల్నించి ఈదుకుంటూ ముందుకు వెళ్ళాను. నాకు దూరంగా పడుతున్న బుల్లెట్లు నన్నేమీ చేయలేకపోయాయి. చివరికి బుల్లెట్లు ఆగి పోయాయి. నేను ముందుకే సాగాను. చివరికి ఆ నౌక అడుగు భాగానికి చేరాను. శక్తిమంతమైన యురేకస్ ఇప్పుడు ఈదుతోంది. దాని లోహపు శరీరం నీలి రంగు కాంతితోను, తెల్లని నురగలతో మెరిసిపోతోంది. హఠాత్తుగా చూస్తే ఏదో వింత జలచరంలా అనిపిస్తుంది.

“మాస్టర్... సందేశం వచ్చింది...” అంది యురేకస్.

“మీ కోసం నిచ్చెన కిందకి దింపాం. గబగబా పైకి ఎక్కి నౌక లోపలికి వచ్చేయండి...” అంటూ యురేకస్ తెర మీద ప్రత్యక్షమయింది సందేశం.

మరునిముషంలో మేమున్న చోట ఓ నల్లని నిచ్చెన కనబడింది. వణుకుతున్న కాళ్ళూ చేతులతో, ఓ చేత్తో వెండి కొవ్వొత్తిని పట్టుకుని, మరో చెత్తో నిచ్చెనని పట్టుకుని జాగ్రత్తగా పైకి ఎక్కాను. ఇదంతా వెండి కొవ్వొత్తి శక్తి వల్ల, యురేకస్ నావిగేషన్ నైపుణ్యం వల్లనే సాధ్యమైందని నాకు తెలుసు. ఈ పరికరాలు ఏమేమి చేయగలవో తలచుకుంటేనో ఆశ్చర్యం వేస్తోంది. ఈ రెండూ లేకపోతే నేనీ పాటికి చచ్చిన బాతులా సముద్రంలో తేలుతూ ఉండేవాడిని. మొత్తానికి నిచ్చెన ఎక్కి నౌక పైభాగానికి చేరాను. ఎవరివో రెండు చేతులు నన్ను పట్టుకుని పైకి లాగాయి. సూర్యుడి కిరణాలు ఒక్కసారిగా నా కళ్ళలో పడడంతో, కళ్ళు చిట్లించాను. అంతే మరుక్షణంలో, ఆకాశమార్గం గుండా నా మీద డ్రోన్ దాడి చేయక ముందే, డెక్ మీద నుంచి లోపలికి కాబిన్‌లోకి పరిగెత్తాను.

❄ ❄ ❄

# 31. వినాశనం

**మొ**త్తానికి నౌకలో ప్రవేశించాం. ఆ పెద్ద నౌక సుదూర ప్రయాణానికి సిద్ధంగా ఉన్నట్లు అలలమీద అటుఇటూ తీవ్రంగా కదులుతోంది. చీకటిగా ఉన్న లోపలి భాగంలో అక్కడక్కడా చిన్న చిన్న దీపాలు మిణుక్కుమంటు న్నాయి. నెమ్మదిగా నా కళ్ళు ఆ చీకటికి అలవాటు పడ్డాయి. ఓ పెద్ద సింహాసనం కనబడింది. ఎముకల గూడులా ఉన్న సమూరా దాని మీద కూర్చుని ఉన్నాడు. నల్లని దుస్తులతో, తెల్లని పళ్ళు ఇకిలిస్తూ కనిపించాడు. ఇక సయోనీ సరేసరి, ముడతలు పడిన ముఖంతో గంభీరంగా ఉంది. నలుగురు వృద్ధ మంత్రులు చక్రవర్తికి ఇరువైపులా నిలబడి ఉన్నాయి. నల్లటి దుస్తులు, తెల్లని పొడవాటి గడ్డాలు, పెద్ద టోపీలు! వీళ్ళు కాక ఇంకో నలుగురున్నారక్కడ. వాళ్ళు నౌకని నడిపే నావికులు. నల్లజాతి లక్షణాలున్న గ్రహాంతరవాసులు. నావికులు ధరించే తెల్లని దుస్తులు, టోపీలు ధరించారు. వాళ్ళ చేతిలోని భయంకరమైన రోగ్ మిలీనియం తుపాకులు - నిమిషానికి 10,000బుల్లెట్లు పేల్చగలిగినవి - మాకేసి గురిపెట్టబడి ఉన్నాయి. సౌర వ్యవస్థలోని ముఠాల సినిమాలలో చూపే 21వ శతబ్దపు AK-47ల కన్నా ఇవెంతో మెరుగైనవి.

"వందనాలు ప్రభూ!" అన్నాను.

"మోసగాడా..." అంటూ సమూరా, సయోనీ ఇద్దరూ ఒకేసారి అరిచారు కోపంతో బుసలు కొడుతూ.

"నువ్వు వెండి కొవ్వొత్తిని దొంగిలించాలని చూసావు, పారిపోదామని చూసావు. మమ్మల్ని మళ్ళీ మోసం చేయడానికి ప్రయత్నించావు..."

"ప్రభూ, తమరు కూడా నన్ను మోసం చేసారు.. ప్రకృతిని చెరబట్టి.. అది అన్యాయం కాదా?"

“నువ్వు మమ్మల్ని మోసం చేస్తావని, వెండి కొవ్వొత్తితో పారిపోతావని నేను ఊహించాను. అందుకే ముందు జాగ్రత్తలు తీసుకున్నాను. నేను అనుకున్నట్టే జరిగింది. ఇక చాలు... వెండి కొవ్వొత్తిని మాకు అప్పగించు....”

వెండి కొవ్వొత్తిని గుండెకి అదుముకుంటూ, “ముందు ప్రకృతి.... ఎక్కడుంది తను?” అన్నాను.

“ఆమె ఇక్కడే ఉంది.. ముందా వెండి కొవ్వొత్తిని ఇటివ్వు...” గట్టిగా అరిచింది సయోనీ.

“ప్రకృతిని చూపించండి. ఆమెని విడుదల చేయండి. తను నా వద్దకు క్షేమంగా వస్తేనే, ఈ వెండి కొవ్వొత్తి మీకు దక్కుతుంది...”

ఇంతలో యురేకస్ కూడా అక్కడికి చేరుకుంది. దాని యాంటీనాకి ఉన్న దీపాలు జిగేలుమన్నాయి.

“సరే, ఆమెని తీసుకురండి..” ఆజ్ఞాపించాడు సమూరా.

“ఈ అహంకారపూరితమైన ప్రవర్తనకి నిన్ను సులభంగా చంపేసేదానినే...” అంది సయోనీ క్రూరంగా చూస్తూ. మళ్ళీ తనే మాట్లాడుతూ, “కానీ మేము ఇక్కడ విశ్వశక్తిని ఉపయోగించకూడదు. ఇప్పటికే సంకేతాలు వెలువడు తున్నాయి. మానవరహిత డ్రోన్ విమానాలు వచ్చేస్తున్నాయి. ఎర్త్ కౌన్సిల్ అధికారులు వెంబడిస్తున్నారు.” అంది.

కాళ్ళూ చేతులు కట్టేసి, నోట్లో గుడ్డముక్కలు కుక్కి ఉన్న ప్రకృతిని తీసుకువచ్చాడో నావికుడు.

“ముందా కట్లు విప్పండి...” అరిచాను.

ప్రకృతి ఆకారం చూసి నేను విస్తుపోయాను. ముఖం పాలిపోయింది, కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆమె కట్లని విప్పేసారు.

“క్షమించు ప్రకృతీ! నా వల్లే ఇదంతా జరిగింది...” అన్నాను.

“వెండి కొవ్వొత్తిని అప్పగించు...” అంటూ అరిచింది సయోనీ.

ప్రకృతి మెల్లగా నా వైపు నడిచింది. నేను నెమ్మదిగా కుజగ్రహవాసులవైపు కదిలాను. ఒక గెంతులో సయోనీ వచ్చి నా చేతిలోని వెండి కొవ్వొత్తిని లాక్కుంది. ప్రకృతి గబగబా వచ్చి నా వెనుకకి చేరింది.

వెండి కొవ్వొత్తి లేకపోతే నాకు శక్తులు ఉండవని నాకు తెలుసు. ఇక నా పరిస్థితి అంతా వాళ్ళ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంది.

"ప్రకృతీ పరిగెత్తు, యురేకస్ నువ్వు కూడా! ఈ దుష్టులు మనల్ని చంపేస్తారు. పారిపోయి ప్రాణాలు దక్కించుకుందాం.." అన్నాను.

సయోనీ ఆ వెండి కొవ్వొత్తిని సమూరాకి ఇచ్చింది. అతని కళ్ళు మెరిసాయి. దాన్ని చేతిలో పట్టుకుని ఏదో ప్రార్థన చేసాడు.

"నా శక్తులలో కనీసం ఐదో వంతు నాకు తిరిగొచ్చాయి. ధూర్తుడా! అవి పోవడానికి నువ్వే కారణం. దుష్టమానవులారా! మీ అంతు చూస్తాను..." అంటూ ఏదో అర్థం కాని ప్రాచీన భాషలో శాపనార్థాలు పెట్టసాగాడు.

నేను కదలకుండా ఉండిపోయాను. నోట మాట రావడం లేదు. నిలువెల్లా భయం ఆవహించింది నన్ను.

"మాస్టర్... పరిగెత్తండి. ప్రకృతీ మీరు కూడా. సముద్రంలోకి దూకండి. నీళ్ళల్లో మంత్రాలు పనిచెయ్యవు..." అంటూ హెచ్చరించింది యురేకస్.

ప్రకృతి ఆగ్రహంతో ఊగిపోతోంది. ఆమె నోటి నుంచి వింత భాషలో మంత్రాలు వెలువడ్డాయి... "నాశనం... సంపూర్ణ వినాశనం..." అనే అర్థాన్నిచ్చే శాపాలవి! నేను విస్మయానికి లోనయ్యాను. ప్రకృతి శపిస్తోంది...

"అన్నిహిలేటమ్ మోర్టాలిస్...."

"వినాశనం భవతు..."

ప్రకృతి ముఖంలోని ఓ జ్వాల రేగింది. సయోనీ, సమూరాలవైపు దూసుకు వెళ్ళింది. మరుక్షణంలో ఆ నౌకకి నిప్పంటుకుంది. ఎటు చూసినా అగ్నికీలలే! నౌక తగలబడిపోతోంది. అప్పుడు నాకు గుర్తొచ్చింది. ప్రకృతి కూడా విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తే. తీవ్రమైన ఉద్వేగం కలిగినప్పుడు ఆమె తనకి తెలియకుండానే భారీ శక్తిని సృష్టించగలదు. ఇప్పుడా పనే చేసింది, బహుశా మొదటిసారేమో. పైన విమానం చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఈ విద్యు దయస్కాంత తరంగాలు మమ్మల్ని సులువుగా పట్టించేస్తాయి. ఎర్త్ కౌన్సిల్ వాళ్ళ డ్రోన్లు మాపైనే ఎగురుతున్నాయి.

"నీళ్ళల్లోకి దూకండి.." అని అరిచాను.

సమూరాకి చావు లేదు. వెండి కొవ్వొత్తి శక్తులు కూడా ఇప్పుడతని వశమయ్యాయి. స్పేస్ ఎలివేటర్ దగ్గరికి పారిపోతారు.

"యురేకస్, మనల్ని మనం రక్షించుకోవాలి.." చెప్పాను.

"ప్రకృతీ, పరిగెత్తు..." అంటూ ముందుగా నేను నౌక పైభాగానికి చేరి సముద్రంలో దూకేసాను.

దేవుడా! నాకిక శక్తులు లేవు... బహుశా మునిగిపోతానేమో...!

❄ ❄ ❄

# 32. మునక...

ప్రకృతి ఎర్రచీర కట్టుకుంది, జుట్టు విరబోసుకుని ఉంది. ఆమె పొడగరి. పద్మాల్లాంటి కళ్ళు, కొసదేరిన ముక్కు, ఎర్రటి పెదవులు... ఆమె అందగత్తె, అమాయకురాలు కూడా. తనకి అద్భుతమైన శక్తులున్నాయని తెలియని ముగ్ధ. నేను కూడా విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తినని మొదట్లో నాకు తెలియలేదు. నాకున్న శక్తుల సంగతి తెలిసాకా, నేను ఎవరి పక్షమో నిర్ణయించుకోవాల్సి వచ్చింది.

నేను భూగ్రహం మీద మనిషిని. స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం మా విలువలు. పైగా మానవ హక్కులు, దయ వంటి ఆదర్శాలు నాకు చిన్నప్పటినుంచే అలవడ్డాయి. నా విలువలకీ, అంతరాత్మ బోధనకే కట్టుబడి ఉండాలని నిశ్చయించుకున్నాను.

నేనూ ప్రకృతి కలసి నీళ్ళలోకి దూకేసాం.... ఎందుకో ఆమెని చూస్తుంటే తను నాకు ఎప్పటి నుంచో తెలిసిన భావన.. ఇక ఎప్పటికీ నాతోనే ఉంటుందన్న నమ్మకం.. యురేకస్ అదృశ్యంగా ఉండి ఈదుతున్నట్లుంది. నేనూ, ప్రకృతి మామూలు మనుషులం. గడ్డ కట్టించే ఈ సముద్రపు నీటిలో మేము ఓ గంట కంటే ఎక్కువ సేపు మునగకుండా ఉండలేం. యురేకస్ మాత్రం నాశనం లేనిది. నీటి ఉపరితలం మీదా లేదా నీటిలోపల ఈదగలదు, తేలగలదు. లేదా ఏ ఓడకో తనని తాను తగిలించుకుని ప్రయాణించగలదు. యురేకస్‌లా మేము తప్పించుకోవాలంటే మా శక్తికి మించిన పని.

విశ్వశక్తిని ప్రయోగిస్తే మా శరీరాలని నిస్సత్తువ ఆవహిస్తుంది. ప్రాణ క్షీణిస్తుంది. భగవంతుడి ఈ సృష్టిలో ఏ శక్తీ పరిపూర్ణం కాదు, ప్రతీ శక్తికి పరిమితులుంటాయి.

మేము మునిగిపోతున్నాం.. లోతుల్లోకి... మరింత లోతుల్లోకి....

ప్రకృతి చేయి పట్టుకున్నాను. భయంతో నోరెళ్ళబెట్టి ఉంది. నీటిని మింగుతూ, కళ్ళు తేలవేసింది.

నా కంటి ముందు చిన్ననాటి దృశ్యాలు కనబడుతున్నాయి.

ఆమ్రపాలి... నాన్న కంప్యూటర్ ముందు కూర్చుని పని చేసుకుంటున్నాడు.. పచ్చని పొలాలు, అమ్మతో కలసి తిన్న కమ్మని భోజనం, పచ్చికబీళ్ళనుండి ఇంటికి తిరిగొస్తున్న పశువులు.. కుజగ్రహపు అరుణ భూములు... ఒకటొకటిగా కనిపించాయి. ఇంకా, కంకాళంలా ఉన్న సమూరా గాల్లో తేలుతూ కనబడ్డాడు. శవాల కోసం వెదికే రాబందుల్లా సయోనీ, వృద్ధమంత్రులు సమూరా చుట్టూ ఎగురుతున్నారు. దూరంగా ఏదో నౌక పయనమైపోతున్నట్లు గోచరించింది... అప్పటిదాక చెవులు చిల్లులు పడే శబ్దాలు చేసిన విమానాలు నా కళ్ళ ముందు నుంచి క్రమంగా మాయమయ్యాయి. అంతా నిశ్శబ్దమే.

నాకు స్పృహ తప్పింది.

❄ ❄ ❄

# 33. ఎర్త్ కౌన్సిల్ కోసం...

**“హ**నీ... హనీ... మొత్తానికి లేచావన్న మాట..” అంటూ ఎవరివో మాటలు వినబడ్డాయి. తలలో ఎవరో వంద సుత్తులతో దారుణంగా మోదుతున్నంత నొప్పి. వళ్ళంతా నొప్పులు. నేను మరణించానా? నేను గ్రహాంతరవాసుల స్వర్గంలో ఉన్నానా? విశ్వానికి బయట స్వర్గం నరకం అనేవి ఉంటాయా? మనిషి చనిపోయాక ఆత్మ ఏం చేస్తుంది? ఎక్కడికి వెడుతుంది? ఒకవేళ మరో గ్రహంలో స్వర్గం ఉంటే నేను అక్కడికి వెడతానా? నెమ్మదిగా కళ్ళు తెరిచాను. అక్కడి ప్రకాశవంతమైన వెలుగు నా కళ్ళకి ఇబ్బంది కలిగించింది. గోడలకి ఆకుపచ్చ రంగు వేసి ఉంది, చిన్నకళ్ళు, ఎర్రని ముఖంతో నా కేసే చూస్తూన్న వ్యక్తి అస్పష్టంగా కనిపించాడు. గంభీరంగా ఉన్న ముఖాలతో, ఆకుపచ్చని టోపీలు పెట్టుకున్న మరికొందరు ఉన్నారు. మందుల వాసన, తెల్లని దుస్తులు, టోపీలు ధరించిన ఇద్దరు నర్స్‌లు మసకగా కనిపించారు. కళ్ళు నులుముకుని మళ్ళీ చూసాను.

“మిస్టర్ శాన్, మీరేంటి ఇక్కడ..?” అని అడిగాను ఆశ్చర్యపోతూ.

“నేను రాలేదు.. నువ్వే వచ్చావు...” అన్నాడు మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శాన్, దయతో కూడిన నవ్వుతో. మళ్ళీ తనే మాట్లాడుతూ, “నిన్నూ, నీ స్నేహితురాలిని, నీ రోబోని మన వాళ్ళు రక్షించారు. ప్రస్తుతం నువ్వు సముద్రం ఒడ్డున ఉన్న నౌకాదళం వారి ఆసుపత్రిలో ఉన్నావు. ఓ దేవుడా! ఎన్ని సమస్యల్లో చిక్కుకున్నావో తెలుసా? అనుమతి లేకుండా విశ్వశక్తిని ప్రయోగించినందుకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే గ్రహాంతరవాసులతో చేతులు కలిపినందుకు, వారి గురించి అధికారులకు తెలియజేయనందుకు... నీ మీద విచారణ జరుగుతుంది... ఇదంతా పక్కన బెడితే, గొప్ప అదృష్టం ఏంటంటే.. నువ్వింకా బ్రతికే ఉండడం...” అని చెప్పాడు.

"నన్ను బ్రతికించినందుకు దేవుడికి ధన్యవాదాలు... మా గ్రామం దేవుడు భైరవుడికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. కానీ ప్రొఫెసర్, ఇదంతా నన్ను కాపాడుకోడానికి, అమాయకురాలైన ఓ ఆడపిల్లని కాపాడడానికే చేసాను. నన్ను కిడ్నాప్ చేసి, బ్లాక్‌మెయిల్ చేసి, బలవంతంగా నేలమాళిగలోకి ప్రవేశించేలా చేసారా దుష్ట గ్రహాంతరవాసులు..."

శాన్ మౌనంగా ఉండిపోయాడు. ముదురు రంగు దుస్తులు, టోపీలు ధరించిన ముగ్గురు అధికారులు గదిలోకి ప్రవేశించారు. వారి వదనాలు మరింత గంభీరంగా ఉన్నాయి. ఏ యూరప్ నుంచో, కెనడా నుంచో వచ్చి అమెరికాలో స్థిరపడిన వ్యక్తుల్లా ఉన్నాయి వారి ఆకారాలు.

"నీ కేసులో విచారణ జరపడానికి ఎర్త్ కౌన్సిల్ ఈ ముగ్గురినీ నియమించింది. మంత్రశక్తులు ప్రయోగం లేదా విశ్వశక్తిని ఉపయోగించడం అనేది భూగ్రహం మీద నిషేధించబడిందనీ, మన దగ్గర విశ్వశక్తిని ఉపయోగించగలిగిన వారు ఉన్నారనీ, వాళ్ళని ఆ పని చేయద్దని హెచ్చరించిన సంగతీ నీకు తెలుసు... అలాగే విశ్వశక్తిని చెడు ప్రయోజనాల కోసం అంటే ఇతరులకు హాని కలిగించడం కోసం, భూమిని, ఇక్కడి వాతావరణాన్ని చెడగొట్టడం కోసం.. ఇంకా దుష్టశక్తులతో చేతులు కలపడం కోసం వాడే వారూ ఉన్నారు. వాళ్ళు చెడ్డవాళ్ళు. విశ్వశక్తిని ఉపయోగించగల గ్రహాంతర వాసుల గురించి, కొత్త శక్తులు సంపాదించుకుని, భూమిని, ఇతర గ్రహాలని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకునే వారి ప్రయత్నాల గురించి మాకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతూనే ఉంది. భూమిని కాపాడుకోడానికి అటువంటి వాళ్ళని మేము గమనిస్తూనే ఉంటాం. శాస్త్ర సాంకేతిక రంగాల లోనూ, యుద్ధ కళలోనూ, పర్యటనలలోనూ పురోగతిని మేం స్వాగతిస్తాం... మా నిగూఢ శక్తులను మేం నియంత్రించుకుంటూ, అధ్యయనం చేస్తూ, మంచి పనులకు వాడుకుంటాం. దుర్మార్గుల ఆటకట్టించడానికి ఉపయోగిస్తాం..."

"కానీ, సర్, నేను చెడ్డవాడిని కాను. జరిగినదంతా నేను వివరిస్తాను. దుష్ట గ్రహాంతర వాసులకు నేను సాయం చేయలేదు. వాళ్ళు నా మనసుని రెచ్చగొట్టి తమకు కావల్సిన విధంగా ప్రవర్తించేటట్టు చేసారు. నా మీద టెలీపతి ప్రయోగించారు, నన్ను బెదిరించారు. ఈ క్రమంలోనే నాకు తెలిసింది నాకు విశ్వశక్తిని ఉపయోగించగల సామర్థ్యం ఉందని. అలాగే ప్రకృతికి కూడా..."

"కంగారు పడకు. మీ ఇద్దరి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుంటాం. నువ్వు

మంచివాడివేనని మా నమ్మకం. నువ్వూ, ప్రకృతి ఇకనుంచి మాకోసం పని చేస్తారు. కానీ నీ వివరణపై మాకు విశ్వాసం కలగాలి. త్వరగా కోలుకో.. అంతా మంచే జరుగుతుంది..'' అన్నాడు ఎర్త్ కౌన్సిల్ అధికారి ఒకతను.

''కానీ, సర్, ముందు ఆ గ్రహాంతరవాసుల్ని ఆపాలి. వాళ్ళు పాతబడిన ఆ స్పేస్ ఎలివేటర్ వైపు పారిపోతున్నారు. అదెక్కి స్పేస్ ప్లాట్‌ఫారం లా టెర్ చేరుకోవాలని వాళ్ళ పన్నాగం...''

ఎర్త్ కౌన్సిల్ అధికారులు నిశ్చేష్టులయ్యారు.

''అవునా...'' అన్నాడు శాన్ తనని తాను సంభాళించుకుంటూ. మళ్ళీ తనే మాట్లాడుతూ.. ''అయినా ఫర్వాలేదు, మన ఉపగ్రహాలు, డ్రోన్‌లు వాళ్ళని అనుసరిస్తున్నాయి. అయితే వాళ్ళు మాంటెగోమెరి స్కై టన్నెల్ ద్వారా భూమికి వస్తారని అసలు ఊహించలేదు.'' అన్నాడు.

స్పేస్ ఎలివేటర్‌కి అది అసలు పేరు. ఓ మాజీ అమెరికా అధ్యక్షుడి పేరు మీద దానికా పేరు పెట్టారు. భూమిని, గ్రహాంతర ప్రయాణాలు చేసే వ్యోమనౌకల కోసం ఏర్పాటు చేసిన లా టెర్‌ని సంధానించే వ్యవస్థగా స్పేస్ ఎలివేటర్‌ని రూపొందించారు. కానీ ఎన్నో రకాల సమస్యల వల్ల - వాతావరణ సమస్యలు, వసతుల లోపాల వల్ల ఆ ఎలివేటర్ మూలపడింది. భూమి కదలికలు, వాతావరణం, తుపానులు, తోకచుక్కలు... ఇంకా లా టెర్‌ని భూమికి జోడించే కక్ష్య మార్గం విఫలమవడం వంటి ఇబ్బందులతో ప్రయాణీకుల ప్రాణాలకే ముప్పు వాటిల్లింది. అందుకే దాన్ని వదిలేసారు. అణుశక్తితో పైకి కిందకి నడిచే వంద అడుగుల ఇనుప బోనులాంటిదా ఎలివేటర్. ఒకవేళ విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలిగితే, పైకి చేరేందుకుగాను ఇరుకైన మెట్లు కూడా ఉంటాయి. అంతరిక్ష ప్రయాణానికి అయ్యే ఖర్చుని తట్టుకోలేని పేద ప్రయాణీకులు ఈ మార్గాన్ని ఎంచుకునేవారు.

''భూభ్రమణం, లా టెర్ అమరిక ప్రకారం చూస్తే, ఆ ఎలివేటర్ ప్రవేశద్వారం ఆస్ట్రేలియాకి దక్షిణ దిశగా అంటే ఆస్ట్రేలియాకి, అంటార్కిటికాకి మధ్యలో సముద్రంలో ఉండి ఉంటుంది...'' అన్నాడు శాన్.

''సరిగ్గా చెప్పారు సర్...'' అంది యురేకస్. అప్పటికే అది తన సెర్చ్ ఇంజన్‌లో ఆ సమాచారాన్ని వెదికేసింది.

విచారణాధికారులు ముఖాలు చూసుకున్నారు.

"దీన్ని బట్టి అర్థం అవుతోంది, వాళ్ళు మా నిఘా నుంచి తప్పించుకుని భూమి మీదకి ఎలా రాగలిగారో... వాళ్ళు రహస్యంగా ఆ మెట్లు దిగి వచ్చుంటారు, ఏదైనా ఓడని ఉపయోగించి లేదా హైజాక్ చేసి తీరానికి వచ్చుంటారు. మనం అప్పుడూ పట్టుకోలేకపోయాం... ఇప్పుడూ పట్టుకోలేక పోయాం. వాళ్ళు పారిపోతున్నారు..." అన్నాడొక అధికారి.

"సర్, సమూరా కుజగ్రహపు దుష్ట మాంత్రికుడు. పైగా వాడి దగ్గర ఇప్పుడు అద్భుత శక్తులున్న వెండి కొవ్వొత్తి ఉంది. దానివల్ల వాడికి అనేక శక్తులొస్తాయి..." చెప్పాను.

"విన్నాము. ఆ బక్కపలచని ధూర్తుడు విశ్వాన్ని జయిస్తాడా? ఏమో ఎవరికి తెలుసు? వాడిని ఎలాగైనా ఆపాలి... ఇంకో బృందాన్ని సముద్రంపైకి పంపిద్దాం.. వాళ్ళు వెళ్ళేదారి మనకి తెలిసిపోయిందిగా..." అన్నాడో అధికారి.

నా గుండె కొట్టుకుంటోంది...

"సర్, మా ఆమ్రపాలి గ్రామం ఎలా ఉంది? శాస్త్ర గ్రంథాల ప్రకారం నేలమాళిగలని తెరవకూడదని, తెరిస్తే అరిష్టమని అంటారు.. నన్ను బెదిరించిన కారణంగా, నేనా నేలమాళిగ తలుపులని తెరిచాను కదా. ఇప్పుడెలా ఉంది?" అంటూ అడిగాను.

పక్క మంచం మీదే ఉన్న ప్రకృతి కళ్ళు తెరిచి రోదించసాగింది. ఆమె నరాలకి గ్లూకోజ్ ఫ్లూయిడ్ ఎక్కిస్తున్నారు. ఆమె ఎప్పుడో మేల్కొన్నట్లుంది... మా సంభాషణంతా వింటునట్లుంది...

శామ్ గొంతు సవరించుకున్నాడు. మిగతావాళ్ళు అసహనంగా కదిలారు. విచారం వ్యక్తం చేస్తున్నట్లుగా యురేకస్ తన గొంతుని కిచకిచలాడించింది.

"ఈ విషయాలేవీ నీకు చెప్పకూడదనుకున్నా హనీ! ఘోరం జరిగి పోయింది. హఠాత్తుగా మహా చక్రవాతం వచ్చి పడింది. వేలాతరంగం దూసుకొచ్చి ఆమ్రపాలి గ్రామం పూర్తిగా మునిగిపోయింది. తీవ్రమైన నష్టం సంభవించింది. ప్రజలను సురక్షిత ప్రదేశాలకి తరలించారు.. వరదల వల్ల పంటలు నాశనమయ్యాయి."

"మరి భైరవాలయం...?"

"కొండ మీద గుడి కనబడుతూనే ఉంది. కాని కింద ఉన్న అన్ని ఇళ్ళూ, హోటళ్ళూ, పొలాలు నీట మునిగిపోయాయి. కొంతమంది చనిపోయారు...

కానీ చాలా మందిని హెలికాప్టర్ల ద్వారా రక్షించగలిగాం.. ఇదంతా ఒక్క రాత్రిలో జరిగిపోయింది... అందుకే మేం నీ వెంట పడ్డాం...."

"అయ్యో దేవుడా... మా నాన్న..." అంటూ విలపించసాగింది ప్రకృతి.

"అయ్యో.. నా గ్రామాన్ని నాశనం చేసేసాను..." అంటూ దిగులుపడ్డాను.

"క్రుంగిపోవద్దు హనీ! అంతా సర్దుకుంటుంది. నీరు త్వరలోనే బయటకు పోతుంది. గ్రామాన్ని పునర్నిర్మిస్తారు..."

"మా నాన్న సంగతేంటి?" అంటూ అడిగింది ప్రకృతి.

"మీ నాన్న అంటే గ్రామ పెద్దా, ఆయననీ రక్షించాం.. ఎక్కడున్నాడో కనుక్కుని చెబుతాను. వరద వచ్చినప్పుడు పొలాల్లో పనిచేసుకుంటున్న వాళ్ళని మాత్రం కాపాడలేకపోయాం.."

నేలమాళిగకీ, సముద్రానికి ఏదో లంకె ఉన్నట్లుంది.. నేలమాళిగ తెరవడం వల్ల, ఏదో ఒత్తిడి ఏర్పడి సముద్రపు నీరు ఊర్లోకి చొచ్చుకు వచ్చుంటుంది. బహుశా అది వేలాతరంగం కాకపోవచ్చు.

"పైగా ఆ రోజు సముద్రంలో వాయుగుండం, అల్పపీడనం వంటివి ఏర్పడుతాయనే హెచ్చరికలు కూడా ఏవీ లేవు..." అంది యురేకస్.

"నాన్నా... నాన్నా...." అంటూ ఏడవసాగింది ప్రకృతి.

"కంగారుపడకు ప్రకృతి! మీ నాన్న దగ్గర్లోని పట్టణంలోని శిబిరంలో క్షేమంగా ఉన్నాడు... ఇదిగో ఫోటో..." అంటూ ఓ ఫోటోని అందించాడు.

"నేను మా నాన్నని చూడాలి..." అంటూ లేవబోయింది. శాన్ ఆపాడు.

నాకిప్పుడు అర్థమవుతోంది.. శాన్ కేవలం మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ మాత్రమే కాదు, ఎర్త్ కౌన్సిల్ నిఘా వ్యవస్థలో కీలకమైన వ్యక్తి.

"ప్రకృతీ, హనీ! మీరిద్దరూ మాకు సహకరించాలి. మిమ్మల్ని జైలులో పెట్టడం లేదు. కానీ చట్ట ప్రకారం మీ మీద విచారణ కొనసాగుతుంది. మేము మిమ్మల్ని చక్కగా చూసుకుంటాం, మిమ్మల్ని రక్షిస్తాం.. మీకూ తెలుసు... భూమి మీద చట్టాలు క్రూరంగా ఉంటాయని. గ్రహాంతర దుష్ట మాంత్రికులతో చేతులు కలిపితే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అయినా మీరు మంచి వాళ్ళనే మేము నమ్ముతున్నాం. హనీ గొప్పవాడు. నువ్వు అమాయకురాలివి. ఇదంతా మాకు తెలుసు.. అయినా న్యాయస్థానంలో ఇవన్నీ నిరూపితం

అవడానికి కాస్త సమయం పడుతుంది. ఎందుకంటే  మన చట్టాలు కొంత సంక్లిష్టంగా ఉంటాయి... పైగా గ్రహాంతర వాసులు ఎప్పుడు దాడి చేస్తారో అని ఎర్త్ కౌన్సిల్ భయపడుతునే ఉంటుంది...'' అన్నాడు శాన్.

''కానీ మీరెందుకు మమ్మల్ని రక్షిస్తున్నారు? మమ్మల్ని కాపాడాల్సిన అవసరం మీకేముంది? అయినా ఇందులో ప్రకృతికి సంబంధం లేదు.. తనని వదిలేయండి...'' అన్నాను.

''హనీ, ప్రకృతీ! మీరిద్దరూ గ్రహాంతరవాసుల క్షుద్రవిద్యల బాధితులని మాకు తెలుసు. వాళ్ళని పట్టుకోడంలో మాకు సాయం చేస్తే, మీ శిక్ష రద్దు చేసి మిమ్మల్ని వదిలేస్తాం. మీకో గురుతర బాధ్యత అప్పగిస్తాం. విశ్వాన్ని ఆ దుష్టుల నుంచి కాపాడే బాధ్యత. మీరు మా ఏజెంట్లుగా పనిచేయాలి... అర్థమవుతోందా?...'' అంటూ చెప్పడం ఆపాడు శాన్.

మళ్ళీ ఇంకో లక్ష్యమా? మేము ఎర్త్ కౌన్సిల్ ఏజెంట్లమా? ఇది కూడా బెదిరింపేగా?  శాన్ మాటలని అర్థం చేసుకోలేనంత మూర్ఖుడిని కాను నేను. వారితో సహకరించకపోతే, నన్ను జైల్లో పెడతారు. వాళ్ళ కార్యక్రమంలో పాలు పంచుకోకపోతే నా మీద కేసులూ, విచారణలు కొనసాగుతాయి. యూనివర్సిటీలో ఉద్యోగం పోతుంది. కుజుడి మీద నన్ను సమూరా వాడుకున్నాడు... అక్కడ కుజగ్రహం మీది మానవ కాలనీలో ఉన్నప్పుడు మంత్రశక్తులు పొందినందుకు ఎంతో బాధపడ్డాను. ఇప్పుడేమో, నాకు శక్తులున్న కారణంగా, ఇక్కడ భూమి మీద దుష్టమాంత్రికులని వేటాడడానికి ఎర్త్ కౌన్సిల్ నన్ను వాడుకోవాలనుకుంటోంది...

''కానీ, ప్రకృతి ఎందుకు? ఆమెని వదిలేయండి. తను అమాయకురాలు...'' అన్నాను.

శాన్, ఎర్త్ కౌన్సిల్ అధికారులు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

''ప్రకృతి ఎవరో, ఆమెకున్న శక్తులేమిటీ ఇప్పటికే ఆమ్రపాలి గ్రామంలో అందరికీ తెలిసిపోయింది. తను ఓ మంత్రగత్తె అని... అదే  మన పరిభాషలో - విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తి అని అందరికీ అర్థమైంది. గ్రామం మునిగిపోడానికీ, ఇతర దారుణాలకీ తనే కారణమని అనుకుంటున్నారు జనాలు. అంతెందుకు, ఆమె కన్నతండ్రీ, ఆ గ్రామ పెద్ద అయిన మహా గారు కూడా ఇప్పుడు ప్రకృతిని దూరంగానే ఉంచచ్చు.. మీరిద్దరూ సాధారణ

మానవులు కాదు, మీకు సహజమైన సిద్ధులున్నాయి, జన్యుపరంగా ఉన్నత స్థాయిలో ఉన్నారు, విశ్వశక్తిని సులువుగా గ్రహించగలరు.. ప్రయోగించగలరు.. మీ ఇద్దరివీ ఉన్నత భావాలు, చక్కని విలువలు. హనీ! నీ దగ్గర తెలివైన రోబో కూడా ఉంది. పైగా ఈ మిషన్‌లో మీరు మాత్రమే ఉండరు. అద్భుత శక్తులున్న ప్రకృతిని కలుపుకునిపోవడం నీ బాధ్యత. పైగా తను ఇప్పుడా గ్రామానికి తిరిగి వెడితే, ఎర్త్ కౌన్సిల్ ఆమె మీద చర్యలు తీసుకుంటుంది. అది మాకు బాధాకరమైన నిర్ణయం. ఆలోచించుకో. మా పూర్తి మద్దతు నీకుంటుంది. నిఘా విభాగం, రక్షణ సిబ్బంది నీ వెన్నంటే ఉంటారు.. పైగా ఇది అండర్ కవర్ ఆపరేషన్. అధికారికంగా ఎర్త్ కౌన్సిల్ వారి పిసియుఎఫ్ మానిటరింగ్ యూనిట్ ఆమోదించిన ఆపరేషన్.. దుష్ట మాంత్రికులు కొత్త శక్తులను సాధించకుండా నిరోధించడం, మరిన్ని గ్రహాలను ఆక్రమించకుండా చూడడం మా లక్ష్యం. ప్రస్తుతానికి వాళ్ళ సంఖ్య తక్కువే అయినా, వాళ్ళ అత్యాశలు, కోరికలు ఇబ్బంది పెడుతున్నాయి. మరిన్ని శక్తులను సంపాదించుకోడానికి వాళ్ళేం చేస్తారో ఎవరికి తెలుసు?'' అంటూ సుదీర్ఘంగా వివరించాడు శాన్.

రాజకీయ కోణంలో చూస్తే, శాన్ చెప్పినదంతా నిజం. అతన్ని ముందెన్నడూ ఇలా చూడలేదు.

ప్రకృతి ఏడుపాపి, కళ్ళు విశాలం చేసుకుని శాన్ చెప్పేదంతా వింటోంది..

''ఇంతకీ నువ్వు ఏమంటావ్ ప్రకృతీ? మీ నాన్న దగ్గరికి వెళ్ళిపోతావా? లేకపోతే నాతోనూ, యురేకస్‌తోనూ ఉంటావా? నిర్ణయం నీదే..'' అన్నాను.

''హనీ, సర్స్.. మీరు నాకు మరో గత్యంతరం లేకుండా చేసారు. నా మనసు ఆమ్రపాలి వైపు, నాన్న వైపు మొగ్గుతోంది.. కాని ఇప్పుడున్న పరిస్థితులలో నాన్న నన్ను ఆదరించకపోవచ్చు.. మరో వైపు విశ్వాన్ని చూడాలని, అంతు చిక్కని శక్తుల రహస్యాలు తెలుసుకోవాలని బలంగా అనిపిస్తోంది. దుష్టులను ఎదిరించాలని అనిపిస్తోంది....'' అంది.

తను మాట్లాడుతుంటే ఉత్తర భారతదేశపు అడవులలో ఉండే కోయిల స్వరంలా మధురంగా ఉంది.

''సరే'' అన్నాను.

''ఈ అమ్మాయి తెలివైనది. మన మిషన్ ప్రారంభమైంది. వాళ్ళని

వెంటాడుతాం. సమూరాకి ఏం కావాలో నాకు బాగా తెలుసు. ముందు వాళ్ళని ఆపడానికి ప్రయత్నిస్తాం. ఒకవేళ పారిపోతే తరుముతాం. కాబట్టి మీరు మాకు అవసరమైన ప్రయాణపు అనుమతులు, నగదు, ఆయుధాలు, మీ రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయండి...'' అన్నాను.

''అయితే దీన్ని 'ఆపరేషన్ ప్రొటెక్షన్ ఆఫ్ ఎర్త్' అని అందామా?'' అడిగాడు శాన్.

''తప్పకుండా. ఇది మాకెంతో గౌరవసూచకం ప్రొఫెసర్'' చెప్పాను ఆమోదిస్తున్నట్లుగా.

❊ ❊ ❊

# 34. శాన్ ప్రణాళిక

**నా**లుగో సహస్రాబ్దిలో భూగ్రహం ఒకప్పటి భూగ్రహానికి ఛాయలా మిగిలింది. జనాభా బాగా తగ్గిపోయింది, ఒకప్పటి దేశాలు గొప్పదనపు అవశేషాలుగా మారిపోయాయి. వలసల వల్ల భూమి మీద జనసంఖ్య క్షీణించింది. నా అంచనా ప్రకారం 21వ శతాబ్దంలో 500 కోట్ల జనాభా ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య వందకోట్లకి పడిపోయింది. భూమి మీద మిగిలిన జనాలను, ఉత్తర అమెరికా నుంచి తమ కార్యకలాపాలను అమలు చేసే ఎర్త్ కౌన్సిల్ జాగ్రత్తగా కాపాడుతూంటుంది. భూమి మీద ఖండాలు ఇంకా ఉన్నాయి, ఆసియా, చైనా, ఉత్తర, దక్షిణ అమెరికా రూపాలలో. కానీ ద్వీప దేశాలైన న్యూజీలాండ్, జపాన్, ఇండోనేషియా, ఇంకా భారతదేశానికి చెందిన అండమాన్ దీవులు మాత్రం సునామీలకీ, భూకంపాలకీ గురై నశించి పోయాయి. ఇక ప్రస్తుతం భూమి మీద ఉన్న వందకోట్ల జనాలు కూడా చెల్లాచెదురుగా ఉన్నారు... ఎక్కువ భాగం ఒకప్పుడు మూడో ప్రపంచంగా పిలవబడ్డ ఆసియాలోనూ, ఆఫ్రికాలోనూ ఉన్నారు.

సుదూర గ్రహాలతో సంబంధాలు ఏర్పడడంతో, శ్రమని నమ్ముకున్న వాళ్ళు భూమిని విడిచి ఆయా గ్రహాలకు వలసపోయారు. సౌర వ్యవస్థలోని ఇతర గ్రహాలకు నిపుణులైన సిబ్బందిని అందించే వనరుగా మారింది భూగ్రహం. రహస్యంగా పనిచేసే ఎర్త్ కౌన్సిల్ తమ వనరులను జాగ్రత్తగా కాపాడుకుంటుంది. బహుళ జాతీయ, బహుళ-తెగల సైంటిస్టుల, రాజకీయ నాయకుల రక్షణ పట్ల ఎర్త్ కౌన్సిల్ అత్యంత అప్రమత్తంగా ఉంటుంది. నేను ప్రస్తుతం ఎర్త్ కౌన్సిల్ యొక్క అత్యాధునికమైన యుద్ధనౌక 'ఎస్.ఎస్. బే ఆఫ్ బెంగాల్'లో ఉన్నాను. 'ఆపరేషన్ ప్రొటెక్షన్ ఆఫ్ ఎర్త్'కి అంగీకరించిన కొన్ని గంటల్లోనే మాకు ఈ యుద్ధనౌకలో రాజకీయ నేతలూ, నౌకాదళ

అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు.

నేనూ, ప్రకృతి పూర్తిగా కోలుకున్నాం. మాకు అప్పగించిన బాధ్యతలపై దృష్టి సారించాం. ఇక యురేకస్ విషయానికొస్తే, అది అత్యంత ఆధునికమైన గ్రహాంతర ప్రమాణాలుగల రోబో.

''మీరు గ్రహాంతర మాంత్రికులని వెంటాడి, వెండికొవ్వొత్తిని సంపాదించండి. అవకాశముంటే వాళ్లని అరెస్ట్ చేయండి. వాళ్ళ నాయకుడు సమూరా గ్రహాంతర నేరస్తుడు. అతని కోసం గ్రహాంతర పోలీసులు, మాంత్రికుల నిఘా బృందం అధికారులు వెతుకుతున్నారు. పైగా కుజగ్రహపు మానవ కాలనీ అధ్యక్షుడు కాన్‌స్టంటైన్ నుంచి సమూరాని పట్టుకోమని విన్నపం వచ్చింది...'' అన్నాడో అధికారి.

''తప్పకుండా ప్రయత్నిస్తాం...'' చెప్పాను.

''సరే... అలాగే...'' అంది యురేకస్.

కానీ ఇదంతా హాస్యాస్పదంగా ఉంది. పటిష్టమైన నిఘావ్యవస్థ, ఆధునిక ఆయుధాలు కలిగి ఉన్న ఎర్త్ కౌన్సిల్ - గ్రహాంతర దుష్ట మాంత్రికులను పట్టుకోడానికి నాలాంటి సాధారణ మానవుడిని పంపడం ఎబ్బెట్టుగా లేదూ?

శక్తిమంతులైన అధికారుల ఆనుపానులన్నీ తెలిసిన శాన్ ఓ వంకర నవ్వు నవ్వాడు.

''ఇది రాజకీయ, దౌత్యపరమైన నిర్ణయం. గ్రహాంతర దుష్టమాంత్రికులని వెంబడించడం, పట్టుకోవడం బయటి ప్రపంచానికి తెలియకూడదు... అసలు గ్రహాంతర మాంత్రికులు భూగ్రహం మీదకి ప్రవేశించారన్న వార్తే ప్రజలలో కలకలం రేపుతుంది. అసలు మాంత్రికులనే వారే లేరని మేము భూమిమీద ప్రజలకు నమ్మబలుకుతున్నాం. మంత్రవిద్యలు శాస్త్ర సాంకేతిక పురోగతికి ఆటంకమని మేం భావిస్తున్నాం. అయినా స్వయంగా నీక్కూడా తెలుసు... భూమి మీద విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులు రహస్యంగా ఉన్నారని! వారిలో కొందరు మంచివాళ్ళు, కొందరు దుర్మార్గులు. కొంతమంది గ్రహాంతర దుష్టమాంత్రికులకు తొత్తులుగా వ్యవహరిస్తే, మరికొందరు మీ అమ్మా నాన్నల్లాగా జనాల మేలు కోసం పనిచేసారు. అటువంటి తొత్తులను పట్టుకుని అణచివేయాలన్నదే మా ప్రయత్నం. కానీ ఇదంతా రహస్యంగా జరగాలి. మీడియాకీ, టీవీ నెట్‌కీ, ఇతర గ్రహాల సమాచార వ్యవస్థలకీ ఈ సంగతి

పొక్కకూడదు. అందుకే నీ సహాయం కోరుతున్నాం... మీకు మా పూర్తి మద్దతు, సహకారం ఉంటుంది. నీకు కావల్సిన రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. ఆ మాంత్రికుల నౌక మాంటెగోమరీ స్పేస్ ఎలివేటర్ దిశగా ప్రయాణిస్తోంది. మన డ్రోన్‌లు దాన్ని సులువుగా పేల్చేయగలవు... కానీ ఆ వెండి కొవ్వొత్తిని తిరిగిపొందాలనీ, ఆ దుష్టమాంత్రికులను ప్రాణాలతో బంధించాలని మా ప్రయత్నం. ఆపైన వాళ్ళపై విచారణ జరిపించి గ్రహాంతర పోలీసులకు అప్పగిద్దాం... సరేనా?'' అన్నాడు.

''సర్, ఇప్పటికే నేను నా ఆమోదం తెలిపాను. ప్రకృతి కూడా నాతో వస్తోంది. నేను వాళ్ళపై ప్రతీకారం తీర్చుకోవాలి.. మా అమ్మానాన్నలని చంపినందుకు. వాళ్ళ హత్య వెనుక ఉన్నది సమూరానే అనే ఋజువులు నాకు లభించక ఇన్నాళ్ళు ఆగాను...'' అన్నాను.

''చంపమని ఆదేశాలిచ్చింది అతనే అయ్యుంటాడు... మీ నాన్న ఎక్క డెక్కడి నుంచో గ్రహాంతర సందేశాలను కంప్యూటర్ ద్వారా అందుకునేవాడు.. వాటిలో చాలా వరకు అండర్ కవర్ ఏజంట్‌గా పనిచేయమని అడిగేవే... భైరవాలయంలోని నేలమాళిగ విషయంలోనూ మీ నాన్న సాయం అడిగారు.. వాళ్ళకి సహకరించడానికి మీ నాన్న అంగీకరించలేదు...'' అన్నాడు శాన్.

''ఈ కథ అంతా మీకు తెలుసని నాకు అర్థమైంది.. కానీ ఖచ్చితంగా చెప్పండి... మా అమ్మానాన్నల హత్యల వెనుక ఉన్నది సమూరాయేనా? అతనే అయితే అతన్ని చంపకుండా వదలను..'' అన్నాను.

''ఖచ్చితమైన ఆధారాలు దొరకడం లేదు. కుజగ్రహపు దుష్ట మాంత్రిక చక్రవర్తికి తొత్తులుగా పనిచేసే ధూర్తులు భూమి మీద అక్కడక్కడా ఉన్నారు. మధ్య ఆసియాలో వింత ఆచారాలు పాటించే దిగంబర సాధువుల సమూహం ఒకటుంది. వాళ్ళు టెలీపతి ద్వారా, ఆధునిక ఐజి నెట్ ద్వారా కుజగ్రహ మాంత్రికులతో మాట్లాడుతున్నారు. గ్రహాంతర దాతలనుంచి నగదు రూపంలో, వస్తురూపంలో విరాళాలు స్వీకరిస్తున్నారు. అయితే అవన్నీ సక్రమంగానే ఉన్నాయి. వాళ్లని, ఇంకా వేరు వేరు చోట్ల ఉన్న విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులందరినీ మేము గమనిస్తూనే ఉన్నాం. ఇది నిజంగా కఠినమైన బాధ్యత! ఇండికా యూనివర్సిటీ నుంచి నువ్వు కుజగ్రహానికి వెళ్ళి అక్కడ మంత్రవిద్యలు నేర్చుకుని రావడం, పైగా నువ్వు నేరుగా కుజగ్రహపు దుష్ట చక్రవర్తి సమూరాతోనూ, అతని బృందంతోనూ సంబంధాలు పెట్టుకోవడం... అంతా

మాకు తెలుసు. కానీ నువ్వు చక్కగా నడుచుకున్నావు. గ్రహాంతర పోలీసుల నుంచి, కుజగ్రహపు మానవ కాలనీల ప్రభుత్వం నుంచి నీ గురించి పూర్తి సమాచారం, ఇతర నివేదికలు తెప్పించుకున్నాం. పైగా అధ్యక్షుడు నీ గురించి గొప్పగా చెప్పాడు. అప్పటి నుంచి నీ మీద ఓ కన్నేసి ఉంచాం. నువ్వు నారా ఆమ్రపాలి కొడుకవడం యాదృచ్ఛికం. మీ ఆమ్రపాలి గ్రామం విశ్వశక్తులను ఉపయోగించగలవారికి ఆశ్రయమిచ్చింది. అంతేకాదు, సమూరాలాంటి దుష్టులకు కావల్సిన కొన్ని అద్భుతవస్తువులలో ఒకటి అక్కడ ఉంది. దీనికి సంబంధించిన వివరాలు ఎన్‌సైక్లోపీడియా గెలాక్టికాలో ఉన్నాయి. అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) యొక్క పత్రాలలోనూ ఉన్నాయి...'' చెప్పాడు శాన్.

``సర్... ఇప్పుడు నాకంతా అర్థమైంది..'' అన్నాను.

``హనీ! సమూరా, అతని బృందం ప్రస్తుతం ఆమ్రపాలికి దక్షిణ దిశలో 2200 కిలోమీటర్ల దూరంలో ఉన్నారు. నువ్వు విమానంలో వెళ్ళి వాళ్ళని ఆపాలి.. నిన్ను విమానంలో తీసుకెళ్ళి ఆ నౌక మీద దింపుతాం. ఆ వెండి కొవ్వొత్తిని తిరిగి సంపాదించడానికి ప్రయత్నించు. మిగతా మాంత్రికులు తమ మంత్రశక్తులని విపరీతంగా ఉపయోగించకపోతే, మేము కూడా నౌక మీదకి దూకి వాళ్ళని బంధిస్తాం..''

``వాళ్ళు మొత్తం ఎనిమిది మంది ఉన్నారు. సయోనీ 90 నక్షత్రాల స్థాయి మంత్రగత్తె. సమూరా 100 నక్షత్రాల స్థాయి మాంత్రికుడైనా ప్రస్తుతం అతని శక్తులు క్షీణించాయి, అయినా అతని దగ్గర వెండి కొవ్వొత్తి ఉందన్న సంగతి మర్చిపోకూడదు. వాళ్ళు ఎంతో బీభత్సాన్ని, విద్యుదయస్కాంత తరంగాలని సృష్టించగలరు. అవసరమైతే యుద్ధానికి దిగగలరు. వాళ్ళని అణిచి వేయాలంటే మాములు మనుషులైతే... సాయుధదళాలకే సాధ్యం... వాళ్ళు పోరాటానికి దిగితే వెలువడే విద్యుదయస్కాంత తరంగాలని ఆపలేం.... ఈ విషయాలు మీడియాకి పొక్కకుండా దాచలేం...'' చెప్పాను.

``అందుకే వాళ్ళపై పోరాటానికి నిన్ను, ప్రకృతిని పంపిస్తున్నాం. మీరు అయిదు నక్షత్రాల స్థాయి మంత్రవేత్తలని మాకు తెలుసు. మీ మంత్రశక్తులతో మీరు వాళ్ళని నిలువరిస్తే యుద్ధవిమానాల్లో కమాండోలు వచ్చి వాళ్ళపై దాడి చేస్తారు. ఈ ప్రణాళిక గురించి మీకు ఎయిర్‌ఫోర్స్ అటాక్ కమాండర్ సమగ్రంగా వివరిస్తారు. సరేనా?'' అన్నాడు శాన్.

“సరే సర్. ప్రకృతి, యురేకస్ నాతోనే ఉంటారు. ఒకవేళ నేను మరణించినా, ప్రకృతికి ఏమీ ప్రమాదం ఎదురవకూడదు. ఆ మేరకు మాట ఇవ్వండి.” అన్నాను.

“ ఓహ్! పరాక్రమశీలీ! నిన్ను కూడా కాపాడుతాం హనీ! ఇది చాలా పెద్ద వ్యవహారం. ఇందులో మనం విజయం సాధిస్తే... నాకు పెద్ద హోదా లభిస్తుంది. ఎర్త్ కౌన్సిల్‌కి వైస్ చీఫ్‌ని అవుతాను...” చెప్పాడు శాన్.

“మరి నా మాటేమిటి?” మనసులోనే అనుకున్నాను.

నా ఆలోచనల్ని చదివినట్లుగా... “దిగులు పడకు హనీ! నువ్వో సెలబ్రిటీవి అవుతావు... నీ గురించి గొప్పగా చెప్పుకుంటారు... ఉన్నత స్థానానికి ఎదుగుతావు...” చెప్పాడు శాన్.

❉ ❉ ❉

# 35. అణు జలాంతర్గామి

**నీ**లి సముద్రం.. దూరంగా కనిపిస్తున్న ఆకుపచ్చని తీరం.. మేమెక్కిన పడవ అణువుల శక్తితో నీటిని చీల్చుకుంటూ వేగంగా ప్రయాణిస్తోంది.

నేను బైనాక్యులర్స్‌తో చూస్తున్నాను. బాగా కోలుకున్న ప్రకృతి, నల్ల రంగు జీన్స్ పాంట్, తెల్ల చొక్కా ధరించి చేతితో లేజర్ గన్ పట్టుకుని సెక్యూరిటీ గార్డ్‌లా నిలుచుంది. పడవ నడిపే అతను కాకుండా, మరో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను మాతో పాటు పంపింది ఎర్త్ కౌన్సిల్. కుజగ్రహపు దుష్టమాంత్రికులు తప్పించుకుపోతున్న ఆ నౌకని వెదకడానికి బయల్దేరాం. చికిత్స అధికారులు, రాజకీయ నాయకులతో శాన్ ఏర్పాటు చేసిన సమావేశాల వల్ల సుమారు ఎనిమిది గంటల సమయం నష్టపోయాం.

ఇప్పుడు మా లక్ష్యం కుజగ్రహపు దుష్ట మాంత్రికులను పట్టుకోవడం.. అంతే కాదు, విశ్వశక్తిని ప్రయోగించడానికి అనుమతి కూడా లభించింది. కానీ ఇదంతా గుట్టుగా జరగాల్సిన వ్యవహారం. మీడియాకి పొక్కకూడదు, ప్రచారం ఉండకూడదు. పైగా అనధికారికంగా చేయాల్సిన పని! విజయం సాధిస్తే, మేం గెలిచినట్లు.. అంతే! లేకపోతే...?

ఒకప్పటి ఇండోనేషియాలో భాగమై, వరుస సునామీల వల్ల నీట మునిగిన జావా ద్వీపానికి ఆగ్నేయ దిశలో రెండు వేల కిలోమీటర్లలో దూరంలో ఉంది.. స్పేస్ ఎలివేటర్ ఆఫ్ మాంటెగోమెరీ! దాని ప్రవేశ ద్వారం నీటిపై తేలే వేదికపైన ఎక్కడో సముద్రం మధ్యలో ఉంది. వేదికనుంచి ఎలివేటర్‌లోకి ప్రవేశించేందుకు మెట్లు ఉన్నాయి. ఆ మెట్ల మీద నుంచి ఎలివేటర్ కొన్ని వేల కిలోమీటర్ల మేర అంతరిక్షంలోకి వెడుతుంది. ఆ ఎలివేటర్ పూర్తి వివరాలున్న మాప్ నాకిచ్చారు. నానో ఫైబర్స్‌తో నిర్మితమైన కట్టడం అది. క్రిందకి పైకి తిరిగే ఎలివేటర్, ఇంకా మెట్లు ఉన్నాయా నిర్మాణంలో. కాని

ప్రస్తుతం ఈ ఎలివేటర్ - ప్రకృతి వైపరీత్యాలు, విధ్వంసాల వల్ల, చెల్లమి వల్ల - శిథిలావస్థలో ఉంది. ఈ ఎలివేటర్‌కి అవసరమైన విద్యుత్ జలాంతర్గత న్యూక్లియర్ రియాక్టర్ నుంచి లభించేది.. కాని ప్రస్తుతం అది కూడా పాడయిపోయింది, దాన్ని కూడా వాడడం మానేసారు. క్లుప్తంగా చెప్పాలంటే ఇప్పుడీ వ్యవస్థ నిరుపయోగమైనది. పరాయి గ్రహాలకు ప్రయాణించేందుకు - వ్యోమ నౌకల నిగమాగమన స్థానమైన లా టెర్‌కి చేరుకునేందుకు ఈ మార్గం చౌకయినదని భావించేవారు.

స్పేస్ టన్నెల్ ఆఫ్ మాంటెగోమెరీ అని పిలవబడే ఆ స్పేస్ ఎలివేటర్ వద్దకే వెళ్ళి ఉంటారు - సమూరా, అతని బృందం. ఇదే విషయాన్ని ఎర్త్ కౌన్సిల్ వారి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ నిర్ధారించింది. ఆ మాంత్రికులు తమ శక్తుల్ని ఉపయోగించి ఎలివేటర్‌ని పని చేయించగలరు లేదా సులువుగా ఆ మెట్లెక్కేయగలరు. ఆ తరువాత లా టెర్ నుంచి నకిలీ పత్రాలతో కుజ గ్రహానికో లేదా మరో ఇతర గ్రహానికో పారిపోగలరు. లా టెర్‌పై ఎర్త్ కౌన్సిల్‌కి ఎటువంటి నియంత్రణా లేదు. అక్కడి రాకపోకలను గెలాక్టిక్ కౌన్సిల్ చూసుకుంటుంది, స్థానిక గ్రహాల అధికారం అక్కడ పనిచేయదు. సౌరవ్యవస్థలో గ్రహాంతర ప్రయాణాలను నియంత్రించేవి - ఇంటర్ ప్లానెటరీ, ఇంటర్ గెలాక్టిక్ కౌన్సిల్సే.

ఉన్నట్లుండి యురేకస్ తన లోహ స్వరాన్ని సవరించుకుంది.

"సమూరా, అతని బృందం ప్రయాణిస్తున్న నౌక జాడలు తెలుస్తున్నాయి.. ఎర్త్ కౌన్సిల్ ఉపగ్రహాల సంకేతాలు అందుతున్నాయి.." అని చెప్పింది.

ఎర్త్ కౌన్సిల్ కో-ఆర్డినేటర్, మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అయిన శాన్ నాకో పరికరాన్ని ఇచ్చాడు. దాంట్లో సమూరా ప్రయాణిస్తున్న నౌక తాలూకు స్థానసంఖ్యలు ఉన్నాయి. వాటి సహాయంతో ఆ నౌక ఎక్కడున్నదీ అంచనా వేయచ్చు... సిగ్నల్స్ బావుంటే ఆ యంత్రం చిత్రాలను, రాతలను కూడా అందిస్తుంది. ఆ నౌక కనబడగానే.. నేను నా సొంతంగా ఏర్పాట్లు చేసుకుని వాళ్ళపై దాడి చేయాలి.. అవసరమైతే విశ్వశక్తిని ప్రయోగించైనా ఆ వెండి కొవ్వొత్తిని తిరిగి సంపాదించాలి. మంత్రశక్తులను వాడడాన్ని శిష్టోక్తిలో చెప్పేందుకు ఉపయోగించే పదం - విశ్వశక్తి! నేను వాళ్ళని బంధించగానే, ముందస్తుగా వేసుకున్న ప్రణాళికల ప్రకారం ఎయిర్‌ఫోర్స్ వారి పారాటూపర్స్ వచ్చి వాళ్ళని అరెస్ట్ చేసి, తీసుకెళ్ళి గ్రహాంతర నేరస్తులని ఉంచే జైలులో పెడతారు.

"మేము వాళ్ళని వెంటాడుతున్నట్లు వాళ్ళకి తెలియకూడదు.. కేవలం హనీ, ప్రకృతి మాత్రమే తమని తరుముతున్నారని వాళ్ళకి భ్రమ కల్పించాలి... అప్పుడే వాళ్ళు ఏమరుపాటుగా ఉంటారు..." అని చెప్పారు ఎయిర్‌ఫోర్స్ అధికారులు.

చుట్టూ నీలి సముద్రం.. మధ్యలో అణుశక్తితో నడిచే పడవ.. దాన్ని నడుపుతున్న వ్యక్తి నౌకాదళంలో పనిచేస్తాడు. అత్యంత అనుభవజ్ఞుడు. అతను మౌనంగానూ, గంభీరంగానూ ఉన్నాడు. అతని పేరు డేవిడ్.

"ఇది మామూలు పడవ కాదు. అవసరమైనప్పుడు నీట మునిగి, ఓ చిన్న జలాంతర్గామిగా ప్రయాణం చేయగలదు. ఇది అణుఇంధనంతో నడుస్తుంది. జలాంతర్గత నిఘాకి, దాడులకి దీన్ని ఉపయోగిస్తాం..." చెప్పాడు డేవిడ్ మా పరిచయాలప్పుడు.

"కాని ఇది తేలికపాటి దాడులకు మాత్రమే పనికొస్తుంది, నౌకలకి దీన్ని తగిలించి, వాటి రహస్య సమాచారాన్ని ఉపగ్రహాలకు అందించవచ్చు..." అని చెప్పాడు.

అతను చెప్పింది నాకు అర్థమైంది. "అయినా ఈ చిన్న పడవతో మనం సమూరా ప్రయాణిస్తున్న అంత పెద్ద నౌకని ముంచేయలేం..." అన్నాను.

ఉన్నట్లుంది ప్రకృతి అంది: "నాకు బాగా ఆకలేస్తోంది. నాలో శక్తి తగ్గిపోయినప్పుడు, బాగా ఆకలి వేసినప్పుడు నాకు తలనొప్పి ఎక్కువగా వస్తుంది...".

బలహీనంగా ఉన్నా కూడా అందంగా కనబడుతోంది ప్రకృతి. ఆమె ధరించిన నల్ల జీన్స్ పాంటు, తెల్ల కాటన్ టాప్ మెరుస్తున్నాయి. నల్లని కళ్ళు ఆకర్షణీయంగా ఉన్నాయి. కేశాలు గాలికి ఎగురుతున్నాయి.

"ఇదిగో... మీకు ఆహారం తీసుకొచ్చా..." అంటూ ఓ పెద్ద ట్రేలో తాజా బ్రెడ్, పళ్ళు, గుడ్లు, జామ్, ఇంకా రెండు పెద్ద గ్లాసులలో పాలు పెట్టుకుని వచ్చింది యురేకస్.

నాక్కూడా ఆకలిగా ఉండడంతో ఆ ట్రేని సంతోషంగా అందుకున్నాను. ప్రకృతి బ్రెడ్‌నీ, పళ్ళని గబగబా తినేసి, పాలను గటగటా తాగేసింది.

కొన్ని క్షణాల తర్వాత.. "హనీ! నేను కూడా నీలాగే విశ్వశక్తి ప్రయోగంలో నైపుణ్యం సాధించగలనా? నేను పుట్టుకతోనే మంత్రగత్తెనా? లేదా ఇదంతా

నా జన్యువుల కారణంగా జరుగుతోందా?'' అని అడిగింది.

నేను చిన్నగా నవ్వాను.

''నీ ప్రశ్నలకి నేను సమాధానాలు చెప్పలేను. నేనూ ఇలాంటి సందిగ్ధావస్థలోనే ఉన్నాను. మనం పెద్ద ఘనకార్యాలు చేయాలని, భూగ్రహాన్ని రక్షించాలని రాసిపెట్టి ఉందేమో... అందుకే ఎర్త్ కౌన్సిల్ వాళ్ళు మనల్ని ఎంచుకున్నారు...'' అన్నాను.

''ఈ కబుర్లే వద్దనేది... మనం సముద్రంలో నీటి బొట్టులాంటి వాళ్ళం. ఎర్త్ కౌన్సిల్ శక్తిసామర్థ్యాల ముందు మనం ఏపాటి?'' అంది.

''నిజమే.. ఎర్త్ కౌన్సిల్, కుజ గ్రహపు దుష్టమాంత్రికులు ఆడుకునే ఆటలో మనం పావులం...''

''చదరంగంలో పావులను సులువుగా వదులుకోవచ్చు...'' అంటూ నవ్వింది ప్రకృతి.

మా ఉపాహారం ముగించి డెక్ మీద ఉన్న కుర్చీలలో విశ్రాంతిగా కూర్చున్నాం. పడవ ముందుకు దూసుకుపోతోంది. సూర్యుడు నడినెత్తి మీదకి వచ్చాడు. మధ్యాహ్నమైంది. సూర్యకిరణాలు ప్రకాశవంతంగా ఉన్నాయి. అవి సముద్రం నీటిమీద పరావర్తనం చెందడంతో సముద్రం ఓ వెండి పళ్లెంలా కనబడుతోంది. ఆ మెరుపు కళ్ళకి ఇబ్బంది కలిగిస్తోంది.

నేను ఆలోచిస్తున్నాను. వెండి కొవ్వొత్తిని సంపాదించి, పోయిన తన శక్తులలో కొన్నైనా తిరిగి పొందేందుకు సమూరా నన్ను వాడుకున్నాడనేది సుస్పష్టం. ప్రకృతిని చంపేస్తామని బెదిరిస్తే నేనా పని చేస్తానని వాళ్ళకి బాగా తెలుసు. భూమి మీద వాళ్ళకి సాయం చేసే మిత్రులు, అనుచరులు ఉంటారనేదీ నిజం. భూమి మీద మాములు మానవుల్లా ప్రవర్తిస్తూ, సమూరా ఆజ్ఞలను పాటించే దుష్ట మాంత్రికులు ఉండే ఉంటారు. అయితే నేను మాత్రమే నిజాయితీ, స్వచ్ఛత ఉండి విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తిని. నాకు మాత్రమే వెండి కొవ్వొత్తి భౌతికంగా కనబడుతుంది.

అంటే దీనర్థం - ఈ దుష్ట మాంత్రికులు విశ్వాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోడానికి ఇక్కడ భూమి మీద తొత్తులని నియమించుకోడం కోసం తరచూ రాకపోకలు జరుపుతూనే ఉన్నారని. తన నల్లటి ముక్కులాంటి ముందు ఇంజన్‌తో నీటిని చీల్చుకుంటూ వేగంగా ప్రయాణిస్తోంది మా పడవ. వెండి

అలలు వేలాదిగా విడిపోతూ, వేల సూర్యబింబాలను దర్శింపజేస్తున్నాయి.

అప్పుడు నాకు తట్టిందో విషయం - మా అమ్మానాన్నలను చంపింది లేదా చంపించింది వీళ్ళేనని! అందులో ఏ మాత్రం సందేహం లేదు. నాన్న తన మంత్రశక్తులని జనాల మేలుకోసమే వాడేవాడు, దుష్ట మాంత్రికులకి నాన్న ఎన్నడూ సహకరించలేదు. కంప్యూటర్ వాడడం, పలు గ్రహాల నుంచి సందేశాలు అందుకోడం... ఇవన్నీ నాన్న నిజాయితీకి ఋజువులు.. ఆమ్రపాలి గ్రామంలోని పొలంలోని మఱ్ఱిచెట్టుకిందకి రమ్మని పిలిచిన ఆ రోజు నిజంగా దురదృష్టమైన రోజు.. నాన్నకి ఖచ్చితంగా బెదిరింపులు వచ్చుంటాయి, అక్కడికి వెళ్ళగానే వాళ్ళే చంపేసుంటారు. నాకు కోపం ఆగడంలేదు. సూర్యరశ్మికి మంచు కరిగినట్లుగా అన్ని విషయాలు స్పష్టమైపోతున్నాయి. తమకున్న అద్భుత శక్తులతో అమ్మానాన్నలను వాళ్ళు చంపేసారు. కాని నన్నెందుకో వదిలేసారు... లేదా ధరణి మావయ్యకి ఇంకా ఎక్కువ శక్తులుండి నన్ను కాపాడి ఉండాలి. ఈ దుష్టులు మళ్ళీ ఇంకోసారి వాడుకున్నారు నన్ను. ఇప్పుడు పారిపోతున్నారు. కుజ గ్రహం మీద నేను భవిష్యవాణి చదివాను. సమూరా శక్తులు పోవడానికి నేను కారణమయ్యాను. కాని అతను అమరుడు. వెండి కొవ్వొత్తికి కూడా అలాంటి షరతులు ఏమైనా ఉంటాయా? లేదా వెండి కొవ్వొత్తిని ఉపయోగించి సమూరా ఇప్పటికే మరిన్ని శక్తులను పొందాడా?

"యురేకస్, అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) గురించి నీ సిస్టమ్‌లో వెతుకు. సౌరవ్యవస్థలో వాళ్ళు దాచిన ఇతర అద్భుత వస్తువులు ఏమిటో కనుక్కో..." అని రోబోకి ఆదేశాలిచ్చాను.

"సరే సరే మాస్టర్..." అంటూ వెతకసాగింది యురేకస్.

"కుజుడి మీది ఒలింపస్ శిఖరంపై అమృత ఔషధం, భూమి మీద భైరవాలయం నేలమాళిగలలో వెండి కొవ్వొత్తి, ఇక చంద్రుడు, గురు, శుక్రుడు, శని గ్రహాలలో చూడాలి, కానీ మాస్టర్, శుక్రుడు, శని గ్రహాలు జీవానికి అనుకూలం కాదు. శని ఉపగ్రహాలలో టైటన్‌లో జనావాసాలు ఉన్నాయి. చంద్రుడిలోనూ జనాలున్నారు. గురుని మీద వాతావరణం చాలా చల్లగా ఉంటుంది, కాని దాని ఉపగ్రహాలైన గ్యానిమేడ్, యూరోపాలలో జనావాసాలు ఉన్నాయి. శుక్రుడి మీద వేలాది కిలోమీటర్ల పొడవునా దట్టమైన మేఘాలున్నాయి. పైగా ఎప్పుడూ నిప్పులు చిమ్మే అగ్ని పర్వతాలున్నాయి. అది ఆవాసయోగ్యం కాదు. కాబట్టి మనం శుక్రుడి కక్ష్య మీదా, దాని లఘుగ్రహాల

వరుసలోనూ వెతకాలి. భూమి కక్ష్యకి సుదూరంలో ఉన్న ప్లూటో, నెప్ట్యూన్‌లు అతి శీతలమైనవి. వాటి చుట్టూ పెద్ద పెద్ద స్పేస్ స్టేషన్స్ పరిభ్రమిస్తున్నాయి. కుజుడి నుంచి అంత దూరంలో ఏదో అద్భుత వస్తువుని ఉంచే అవకాశం లేదు. మనం సమూరాని అనుసరించి అతను ఎక్కడికి వెడుతున్నాడో తెలుసుకోవాలి... అంతకుమించి మనకు మరో మార్గం లేదు... ఎందుకంటే అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం ఆ అద్భుత వస్తువులను దాచిన స్థలాల గురించి వివరంగా చెప్పలేదు..'' అంది యురేకస్.

''కాని సౌరవ్యవస్థని లేదా గ్రహాలను సమూరా తన ఆధీనంలోకి తీసుకోకుండా ఆపడం కాదు... నేను సమూరాని చంపాలి. అతన్ని, అతని సహచరులని నాశనం చేయాలి. అతనో పిచ్చివాడు, మహత్వోన్మాది.. అంతే ఉన్మాదులైన అనుచరులున్నవాడు. అత్యంత శక్తివంతమైన ఇంటర్ గెలాస్టిక్ కౌన్సిల్, ప్లానెటరీ సర్వేయలెన్స్ సిస్టమ్‌ని, వారి అణ్వాయుధాలను, సాంకేతికతని, రాజకీయ వ్యవస్థలని అధిగమించి వివిధ గ్రహాలలో ఉన్న అద్భుత వస్తువులని సాధించగలడా? వాటి సాయంతో నక్షత్ర మండలాన్ని ఏలగలడా? అతనే మా అమ్మానాన్నలని చంపించాడనేది స్పష్టం. ఇక ఇప్పుడిది నాకు వ్యక్తిగత సమస్య. అతన్ని ఎలాగైనా చంపాలి. కుజుడి మీది ఒలంపస్ పర్వతం నుంచి తెచ్చిన అమృత ఔషధం వాడి చేతి తాగించకుండా ఉండి ఉండాల్సింది. పగ... ప్రతీకారం.. మా నాన్నని హత్య చేసినందుకు వాడికి తగిన శాస్తి చేస్తాను....'' అన్నాను కోపంతో.

పడవ నడుపుతున్న డేవిడ్ నా మాటలకి విస్తుబోయినట్లున్నాడు. వెనక్కి తిరిగి నన్నే చూడసాగాడు. ప్రకృతి తన విశాలమైన కళ్ళని మరింత పెద్దవి చేసి నన్నే చూడసాగింది.

''సరే.. సరే... మాస్టర్..'' అంది యురేకస్. బహుశా అది తన ప్రాసెసర్‌లో 'పగ', 'ప్రతీకారం', 'శాస్తి' అనే పదాలకు అర్థాలు వెతుకుతున్నట్లుంది.

''మాస్టర్... అతన్ని నాశనం చేయాలంటే మీరు మంత్రశక్తులను ఉపయోగించక తప్పదు. ఎందుకంటే అతను అమరుడు... పైగా 75 నక్షత్రాల స్థాయి ఉన్న ఎనిమిది మంత్రులు అతని చుట్టూ ఉన్నారు...'' చెప్పింది యురేకస్.

''అవసరమైతే ఓ అణుబాంబు విసిరి వాళ్ళందరిని నాశనం చేసేస్తా..

దాదాపుగా వెయ్యి సంవత్సరాల వయసున్నా, అతని అనుచరులు మాత్రం మర్త్యులే. మంత్రశక్తులతో వాళ్ళని చంపచ్చు. అతని బృందాన్ని చంపేస్తే, అతను ఒంటరి అవుతాడు. వెండి కొవ్వొత్తిని మనం తిరిగి సంపాదించగలిగితే.. అతని శక్తులు నశిస్తాయి. శక్తులు లేని అతను ఓ ఎముకల గూడుతో సమానం. అందుకే మన తక్షణ కర్తవ్యం అతని బృందాన్ని నాశనం చేయడం...'' అన్నాను.

''ఓయ్... చాలా ఎక్కువగా ఆలోచిస్తున్నావు...'' అన్నాడు డేవిడ్ గట్టిగా నవ్వుతూ.. మళ్ళీ తనే మాట్లాడుతూ, ''అయినా ఇదంతా నీ ఒక్కడి వల్లే అయ్యేది కాదు. ఎర్త్ కౌన్సిల్ సాయం తీసుకో. మిస్టర్ శాన్‌ని సంప్రదించు.. భావోద్వేగాలను అదుపులో ఉంచుకో...'' అన్నాడు.

ప్రకృతి నా మనసుని చదువుతోంది.

''హనీ! ఇదంత తేలిక కాదు. ఎందుకంటే భూమి మీద అతని అనుచరులు చాలా మందే ఉన్నారు. వాళ్ళు మనల్ని గమనిస్తూంటారు. సమూరా తప్పించుకుని పారిపోతున్నాడు కాబట్టి తన అనుచరులను మన మీదకి ఉసి గొల్పుతాడు. ఇదేమీ ఊహించలేనిది కాదు. ముందు అతని అనుచరులను ఎదుర్కో...'' అని అంది.

ప్రకృతి గాలికి ఎదురుగా నిలబడింది. ఆమె కేశాలు ఎగురుతున్నాయి. ధ్యానిస్తున్నట్లుగా కాసేపు కళ్ళు మూసుకుంది. ఏకాగ్రతతో నిలబడి ఉన్న ఆమె చుట్టూ ఎర్రని పరివేషం ఆవరించింది.

''ఇప్పుడు నాకు స్పష్టంగా కనబడుతోంది. ఇక్కడి నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఓ పెద్ద హెలికాప్టర్ ఉంది. అది మన వైపే వస్తోంది. అది నల్ల రంగులో ఉంది, దాని మీద ఏ గుర్తులూ లేవు. పోతే 50 కిలోమీటర్ల వెనుకగా చిన్న చిన్న మానవరహిత నిఘా విమానాలు మనల్ని వెంబడిస్తున్నాయి. మన వెనుక 100 కిలోమీటర్ల దూరంలో ఎయిర్‌ఫోర్స్ వారికి విమానం అదృశ్యంగా ఎగురుతూ వస్తోంది. ఇది ఎర్త్ కౌన్సిల్ మన రక్షణ కోసం చేసిన ఏర్పాటు...'' అని చెప్పింది.

నేను ఆశ్చర్యపోయాను. ఆమె దివ్యదృష్టికి, టెలిపతీకి ధన్యవాదాలు చెప్పుకున్నాను.

''ఇంతకీ నువ్వు చెప్పదలచుకున్నది ఏంటి?'' అని అడిగాను.

''ఆ నల్ల రంగు హెలికాప్టర్ సమూరా అనుచరులది అని అనిపిస్తోంది.

వాళ్ళు ఖచ్చితంగా మన మీద దాడి చేయడానికే వస్తున్నారు...'' అంది.

మా మాటలు వింటున్న డేవిడ్ గట్టిగా నవ్వాడు.

''ఏం కబుర్లు చెబుతున్నావమ్మా... నేనేమయినా వెర్రివాడిలా కనిపిస్తున్నానా? రాడార్ సంకేతాలు లేవు... టీవీలో ఉపగ్రహ సంకేతాలు లేవు... అయినా ఆమెకి కనిపిస్తోందట...'' అని వెటకారంగా అంటూ ''దేవుడా? ఏం జరుగుతోంది ఇక్కడ? అయినా అటువంటిదేదయినా ఉంటే ముందుగా ఎయిర్‌ఫోర్స్ కమాండ్ నుంచి నాకు సమాచారం అందుతుంది...'' అని చెప్పాడు.

''డేవిడ్.. ఇదో కొత్త రకం యుద్ధం. నేను కుజ గ్రహం మీద చూసాను. అది ఇప్పుడు ఇక్కడ భూమి మీద, బంగాళాఖాతంలో జరగబోతోంది. నీ హాస్యాలు ఆపి... చూడగలిగితే.. సంప్రదాయిక యుద్ధ యంత్రాలపై విశ్వశక్తి ప్రయోగం ఎలా ఉంటుందో చూడు... పడవని నీటి లోపలికి తీసుకుపో! మనం కనిపించకూడదు. చాలా జాగ్రత్తగా ఉండాలి.. ఏం చేయాలో ఆలోచిద్దాం. ఎయిర్‌ఫోర్స్ కమాండ్‌కి విషయం తెలియజేయ్. హెలికాప్టర్ జాడలు తెలుసుకో...'' అని చెప్పాను.

''సరే... ఈ రోజుకి మీరే నా బాస్ అని చెప్పారు... మీరు చెప్పినట్లే చేస్తాను... ముందు మీరంతా కాబిన్‌లోకి రండి... ఈ పడవ ఇప్పుడు జలాంతర్గామిగా మారుతుంది.. మనం నీటి అడుక్కి వెడదాం...'' అన్నాడు డేవిడ్.

మేము లోపలికి నడిచాం. పడవ వేగం తగ్గించుకుంటూ ఆగింది. కొన్ని క్షణాల పాటు నిశ్చలంగా ఉండిపోయింది. తర్వాత సముద్రపు నీటిలోపలికి దిగసాగింది. భీకరమైన వేగంతో నీటిలోపలికి జారిపోయింది.

❄ ❄ ❄

# 36. అల్లకల్లోలం

నీటిలోపల ఉండడమంటే నాకెప్పుడూ భయమే. పైగా ఆ జలాంతర్గామి అద్దం, నలువైపులా మూసి ఉన్న ఆ చిన్న స్థలం నాలో భీతిని రేకెత్తిస్తున్నాయి.

ఉన్నట్లుండి డేవిడ్ చెప్పాడు: ''చూడండి.. తెర మీద ఏం కనబడుతోందో. దుండగులు మన మీద దాడికి వచ్చేసారు.. అయినా పర్వాలేదు. వాళ్ళ మంత్రాలు నీటి అడుగున పనిచేయవట...''

జలాంతర్గామి గోడకున్న తెర కాంతితో వెలిగిపోతోంది. యురేకస్ యంత్ర స్వరంతో కిచకిచలాడింది.

''ఓహ్..'' అంది ప్రకృతి.

నేను మౌనంగా ఉండిపోయాను.

ఓ పెద్ద నల్ల హెలికాప్టర్, ఫ్లయింగ్ మెషీన్‌లా మా మీద ఎగురుతోంది. నల్లటి ముసుగులు, నల్లటి దుస్తులు ధరించిన మనుషుల్లాంటి ఆకారాలు కనబడుతున్నాయి. హెలీకాప్టర్‌లోంచి లేజర్ కాంతులు సముద్రం మీదకి పంపి మా కోసం వెతుకుతున్నారు.

''వెధవలు... ఇప్పటికి బయటపడ్డారు. వీళ్ళంతా కుజ గ్రహపు దుష్టమాంత్రికుల అనుచరులు. భూగ్రహం మీదే రహస్యంగా ఉంటున్నారు, సమూరాకి విశ్వాసపాత్రులు.... నిన్ను చంపడానికి వచ్చారు...'' చెప్పాడు డేవిడ్ నాతో.

''అమ్మయ్య, దేవుడి దయ వల్ల, నీటిలోపల ఉండడం వల్ల బతికిపోయాను... ఉప్పునీటిలోకి చొచ్చుకురావాలంటే విశ్వశక్తిని రకరకాలుగా వాడాలి...'' అన్నాను.

''నీటి ఉపరితలం మీద ఉండి ఉంటే కాలి బూడిదైపోయుండేవాళ్ళం...

అయినా నాకేం కాదనుకో...'' అంది యురేకస్.

తెర మీద ప్రతిబింబాలు కనబడుతునే ఉన్నాయి. మేం ఇంకా కిందకి దిగాం. క్రమంగా తెర మీద ఆకారాలు మాయమయ్యాయి.

‘‘ఇప్పుడు మనం ఆ నౌకని పట్టుకుందాం. నీటి అడుగునుంచే వెళ్ళి సమూరా వెడుతున్న ఆ నౌకపై దాడి చేయాలి...'' అన్నాడు డేవిడ్.

జలాంతర్గామి ముందుకు సాగుతూనే ఉంది. అద్దంలోంచి చూస్తే నాకు నీళ్ళు తప్ప మరేమీ కనబడడం లేదు.

‘‘నాలుగు కిలోమీటర్ల దూరంలో ఆ నౌక ఉంది..'' ప్రకటించాడు డేవిడ్. మళ్ళీ తనే మాట్లాడుతూ.. ‘‘నౌకకి కిలోమీటరు దూరంలో ఉన్నప్పుడు నేను జలాంతర్గత క్షిపణితో దాని పైభాగాన్ని పాడుచేస్తాను. అది అప్పుడిక కదల్లేదు.. దాన్ని ముంచేసి, సమూరా అతని బృందం స్పేస్ ఎలివేటర్ వైపు పారిపోకుండా ఆపమని నాకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.'' అన్నాడు.

‘‘కాని ఆ ఎలివేటర్ ఎక్కడ...?'' అడిగాను.

‘‘ఆ ఎలివేటర్ ప్రవేశద్వారానికి సుమారుగా 50కిలోమీటర్ల దూరంలో ఉన్నాము. అది నీళ్ళల్లో ఉంటుంది... సముద్రం అడుగునుంచి లిఫ్ట్ మొదటి అంతస్తుకి ఎక్కడానికి మెట్లు ఉంటాయి.. ఆ దుర్మార్గులు ఒకసారి ఎలివేటర్‌లోకి ప్రవేశించగలిగితే... నానో కేబుల్స్ ఉపయోగించి లేదా తమ మంత్రాలను ఉపయోగించి... ఆ పాడుబడిన ఎలివేటర్‌ని పనిచేయిస్తారు, అంతరిక్షంలోకి తప్పించుకుంటారు...'' చెప్పాడు డేవిడ్.

మేము ముందుకు సాగుతున్నాం. ఉన్నట్లుండి విపరీతమైన చలితో నా శరీరం నిలువెల్లా వణికిపోయింది.

‘‘నాకెందుకో కంగారుగా ఉంది.. ఏదో ప్రమాదం కలగబోతోందని అనిపిస్తోంది.. నా ప్రకంపనలు నీకు తెలుస్తున్నాయా..?'' అంది ప్రకృతి.

మా మాటలు వింటునట్లుగా యురేకస్ మౌనంగా ఉండిపోయింది.

‘‘తెలుస్తున్నాయి ప్రకృతీ! నాక్కూడా అలానే ఉంది.. ఏదో తెలియని ప్రమాదం ముంచుకొస్తోందన్న భయం... తెలీదు కాని తెలిసినట్లే అనిపిస్తుంది... మునుపెన్నడో అనుభవంలోకి వచ్చిన భయానుభూతి..'' చెప్పాను.

ఉన్నట్లుండి అల్లకల్లోలం రేగింది.. జలాంతర్గామి తీవ్ర ఒడిదుడుకులకు

గురవసాగింది. నాలో కంగారు, భయం తీవ్రమయ్యాయి. నా బాల్యంలోని ఆ దుర్ఘటనని జ్ఞాపకం చేస్తున్నాయి. ఎప్పుడో కొన్నేళ్ళ క్రితం ఓ వాన కురిసిన రోజున జరిగిన ఘటన... ఆమ్రపాలి గ్రామంలో దక్షిణ దిశలో ఉన్న పొలంలోని మఱ్ఱిచెట్టు ఆకుల పందిరి క్రింద జరిగిన ఘటన....

“ఈసారి కూడా మఱ్ఱిచెట్టును చూడలేకపోయాను...” అనుకున్నాను.

“మీ అమ్మానాన్నల హత్య వెనుక రహస్యాన్ని తెలుసుకోడానికి - ఏదో ఒక రోజు నువ్వా మఱ్ఱిచెట్టు దగ్గరికి వెడతావు...” అని ధరణి మావయ్య చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

మరిప్పుడు ఈ జలాంతర్గామిలో సముద్రం అడుగున ప్రయాణిస్తూ, కుజగ్రహపు దుష్ట మాంత్రికులను వెంటాడుతున్నప్పుడు ఆ మాటలు ఎందుకు గుర్తొచ్చాయి?

“నాకిప్పుడు తెలుస్తోంది... వాళ్ళొచ్చేసారు. దుష్టులు... దుర్మార్గులు... హంతకులు...” చెప్పింది ప్రకృతి ఏదో అచేతనావస్థలో ఉన్నట్లుగా.

డేవిడ్ మాకేసి వింతగా చూసాడు. “హే, ఏమయింది, ఎందుకంత కంగారు...” అన్నాడు.

ఉన్నట్లుండి ఎవరో చేత్తో పైకి లేపి విసిరేస్తునట్లుగా, జలాంతర్గామి పైకి లేచింది, పైకి... ఇంకా పైకి...! మమ్మల్నందరిని కుదిపేస్తూ.. అటూ ఇటూ ఒరిగిపోసాగింది. మాకు తలతిరుగుతోంది, వాంతులవుతున్నాయి. క్షణాల్లో మేము నీటి ఉపరితలంపైకి వచ్చేసాం. సూర్యుడి తీక్షణమైన కిరణాలు మా కళ్ళని మండించాయి. కాని అంతకంటే ఇబ్బందిని కలిగించిన అంశం ఏంటంటే... మా చుట్టూ... గాల్లో ఎగురుతున్న నల్లటి ఆకారాలు.. మొత్తం పన్నెండు... దూరంగా ఆకాశంలో హెలీకాప్టర్...

❉ ❉ ❉

# 37. భయంకర జల రాక్షసులు

**కి**టికీ అద్దాల్లోంచి చూసాను. చీకట్లో దాక్కున్న కీటకంలా ఉన్న హెలికాప్టర్ ఇప్పుడు క్రమంగా పెద్దదవుతూ, మాకు దగ్గరవుతోంది. మళ్ళీ పడవగా మారిన మా జలాంతర్గామి మీదకి వస్తోంది. ఇంతలో నాలుగు వింత జీవులు సముద్రంలోంచి బయటకి వచ్చాయి. ఒళ్ళంతా బొచ్చుతో, వేళ్ళకి పదునైన గోళ్ళతో నల్లగా గొరిల్లాలా ఉన్నాయవి. కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. బహుశా ఇవే మా జలాంతర్గామి మీద దాడి చేసి, పైకి విసిరేసి ఉంటాయి. నమ్మశక్యం కాకున్నా, ఇవి భయంకర జల రాక్షసుల్లానే ఉన్నాయి. ఒక జలాంతర్గామిని ఎత్తి పడేయాలంటే ఎంత శక్తి కావాలి? హెలీకాప్టర్ ఇప్పుడు మా పడవ మీద ఎగురుతూ, గుండ్రంగా తిరుగుతోంది. జల రాక్షసులు 15నుంచి 20 అడుగుల పొడవున్నారు. హెలీకాప్టర్ కేసి చేతులు ఊపి, బాతునడకలాంటి నడకతో మా పడవ వైపు వచ్చారు.

ఇదంతా నాకు ముందే తెలుసనే భావన కలుగుతోంది. నాకిప్పుడు అర్థమైంది. నా బాల్యంలో ఆ మఱ్ఱిచెట్టు కింద నేను చూసిన హంతకులు వీళ్ళే. వీళ్ళు మానవులు కాదు, క్షుద్ర జీవులు. వీళ్ళు విశ్వశక్తితో సృష్టించబడ్డ జీవులన్నా అయ్యుండాలి లేదా నిజంగానే జల రాక్షసులై ఉండాలి. చెప్పడం కష్టం. ‘‘ఇంతకుముందెప్పుడూ సముద్రంలో ఇటువంటి జీవులను చూడనేలేదు... ఎప్పుడో పాత కాలపు జపనీస్ సినిమాలలో తప్ప...’’ అంటూ గొణిగాడు డేవిడ్.

వాతావరణంలో ఉన్నట్లుండి విపరీతమైన చలి... భయం గొలుపుతోంది. హెలీకాప్టర్ చప్పుడూ, అలల సవ్వడి తప్ప మరేమీ వినిపించడం లేదు. క్షుద్రవిద్యలు లేదా మంత్రాలు లేదా విశ్వశక్తి ప్రయోగానికి ఇది నిదర్శనమని నాకు తెలుసు. కుజగ్రహం మీద పోసయిడన్ తుఫానుని సృష్టించడం

గుర్తొచ్చింది. అంతే కాదు... అతను 20 అడుగుల ఎత్తుకు పెరగడమూ జ్ఞాపకం వచ్చింది. అరుణ భూముల మాంత్రికులు ధ్యానం చేసి, తమ మీదకు పంపబడ్డ క్షిపణులను తిరగగొట్టిన పద్ధతి, ఆమ్లవర్షాలు కురిపించడం... గుర్తొచ్చాయి.

బహుశా మమ్మల్ని వెంబడిస్తున్న సమూరా అనుచరులు కూడా మంత్రగాళ్ళే అయ్యుంటారు. మమ్మల్ని ఆపడం లేదా చంపడం వారి ఉద్దేశం కావచ్చు..

"హనీ! ఎవరీ వింతజీవులు? వాళ్ళని అడ్డుకోవాలి.." అంది ప్రకృతి.

"విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తులు సృష్టించిన ఛాయారూపాలు వీళ్ళు లేదా భూమి మీద ఇప్పటిదాక దాక్కుని ఉన్న దుష్ట మాంత్రికులైనా అయ్యుండాలని ఎన్‌సైక్లోపీడియా గెలాక్టికా చెబుతోంది. ఇప్పుడిక్కడ విద్యుదయస్కాంత తరంగాలు భారీ స్థాయిలో వెలువడతాయి కాబట్టి వీరి గుట్టు బయటపడుతుంది. ఎర్త్ కౌన్సిల్ వాళ్ళ నిఘా బృందం త్వరలోనే ఇక్కడికి వచ్చేస్తుంది..." అంది యురేకస్ తన లోహ స్వరంతో.

"అంటే, వీళ్ళు తొందరపడుతున్నారని అర్థం. మన అంతు చూసి, త్వరగా ఆ హెలీకాప్టర్‌లో తప్పించుకోవాలనేది వీళ్ళ పన్నాగం. తమ జాడ తెలియకుండా జాగ్రత్తపడాలన్నది వాళ్ళ ఉద్దేశం." అన్నాను.

"మనకి మద్దతుగా రక్షణ బృందాలు వచ్చేవరకు మనల్ని మనమే రక్షించుకోవాలి. మనం కూడా విశ్వశక్తిని ప్రయోగించాలి. నిప్పులు కురిపించాలి. ప్రకృతీ! ఏకాగ్రత చూపించు.. ధ్యానం చేసి నీ కళ్ళనుంచి నిప్పులు కురిపించు.... నేను కూడా..." అంటూ పడవ డెక్ మీద నిలుచుని నా శక్తులని ధ్యానించాను. ప్రకృతి కూడా డెక్ మీదకి వచ్చి ధ్యానం చేసింది. కానీ ఏమీ జరగలేదు... మాలోంచి ఏ శక్తి బయల్పడలేదు. కోపం, ప్రమాదం, పగ! నేను కోపం తెచ్చుకోవాలనుకున్నాను. కొన్నేళ్ళ క్రితం ఆమ్రపాలి గ్రామంలో మా అమ్మానాన్నలను చంపిన దుష్టులు వీళ్ళే! వీళ్ళని ఎదుర్కోడానికే మా అమ్మానాన్నలు తమ జీవితాన్ని పణంగా పెట్టారు.

"వీళ్ళని చంపెయ్.." అని నాకు నేను చెప్పుకున్నాను.

ఉన్నట్లుండి వాళ్ళ చేతుల్లో దుడ్డుకర్రలాంటి ఆయుధం ప్రత్యక్షమైంది. దానికి పెద్ద పెద్ద ముళ్ళున్నాయి. మాకేసి వాటిని విసిరేసారు. అంతేకాదు,

వాళ్ళ కళ్ళు నిప్పులు కురిపించాయి. మా చర్మం మండిపోయింది. పడవ అంటుకుంది. ఇంతలో పెద్ద శబ్దమైంది. పడవ వెనుకవైపు నుంచి మునగడం ప్రారంభించింది. తర్వాత పక్కకి ఒరగసాగింది. ముందు వైపు మునగసాగింది. ఉన్నట్లుండి మళ్ళీ పైకి లేచింది.

"ఏదో ఒక రోజున నువ్వా దక్షిణదిశలో ఉన్న పొలంలోని మఱ్ఱిచెట్టు దగ్గరికి వెడతావు, అన్నీ తెలుసుకుంటావు..." అన్న ధరణి మావయ్య మాటలే గుర్తొస్తున్నాయి. అప్పట్లో అర్థం కాకపోయినా, ఇప్పుడు తెలుస్తోంది. మా అమ్మానాన్నలని చంపడానికి పంపబడ్డవి ఈ వింత జీవులే. ఇన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడు మళ్ళీ నామీదకి ఉసిగొల్పబడ్డాయి. వాళ్ళ దుష్ట పథకాల అమలుకి నన్ను వాడుకుని, వెండి కొవ్వొత్తిని సాధించుకుని పారిపోతున్నారు, పైగా నన్ను అంతం చేయాలనుకుంటున్నారు.

నేను కోపోద్రిక్తుడనయ్యాను. నన్ను వాడుకొని వదిలేసినందుకు, తమ అవసరాలకు నన్ను ఉపయోగించుకున్నందుకు వాళ్ళకి గుణపాఠం చెప్పాలనుకున్నాను.

మొత్తానికి ఏకాగ్రత కుదిరి కుజుడి మీద నేర్చుకున్న మంత్రాలు చదవగలిగాను "ఎక్స్‌టెర్మినేటమ్ మోర్టాలిస్..." అంటూ గట్టిగా స్పష్టంగా జపించాను.

"దుష్టులారా, చావండి.." అంటూ ప్రకృతి కూడా తన భాషలో మంత్రాలు ఉచ్చరించసాగింది.

ఇదిలా ఉంటే ఆ దుష్ట జీవులు నెమ్మదిగా మా పడవ వైపు కదలసాగారు. ఇంజన్ ఆగిపోయి పడవ నిశ్చలంగా ఉంది.

"ఓ దేవుడా? రక్షించు. ఏవీ డ్రోన్‌లు? ఏరీ రక్షణ సిబ్బంది? కాపాడండి..." అంటూ భయంతో అరిచాడు డేవిడ్.

ఉన్నట్లుండి నా కళ్ళలోంచి అగ్ని పుట్టింది. బుసలు కొడుతున్న పాములాగా ఆ ధూర్తుల వైపు దూసుకుపోయింది. ఒకదాని తర్వాత మరొకటి నిప్పుబంతులు దూసుకుపోయాయి. పెద్ద విస్ఫోటనం. నిప్పుబంతులు ఒక్కో జలరాక్షసుడికి తగిలి వాళ్ళు హాహాకారాలు చేసారు. వెనక్కి పరిగెత్తారు. అలా వెనక్కి తిరిగినప్పుడు తమని చుట్టుముట్టిన పెద్ద పెద్ద అలలను వాళ్ళు చూడలేదు. నీటికి, నిప్పుకు మధ్య బందీలై తప్పించుకోలేకపోయారు. అక్కడి

వాతావరణమంతా వాళ్ళ అరుపులు, కేకలతో నిండిపోయింది. నేనింకా విశ్వశక్తిని ప్రయోగిస్తూనే ఉన్నాను. మరిన్ని జ్వాలలని సృష్టించాను. ఈ క్రమంలో నాలో శక్తి క్షీణిస్తోంది.. నన్ను నిస్సత్తువ అవరిస్తోంది.

ప్రకృతి గమనించింది.

"హనీ! వాళ్ళపై నేను కూడా విశ్వశక్తిని ప్రయోగిస్తున్నాను..." అంటూ సంతోషంతో చప్పట్లు కొట్టింది.

"చావండి... బూడిదైపొండి..." అంటూ అరిచింది.

బాగా శిథిలమైన మా పడవ ఒక్కసారిగా అటు ఇటూ ఊగి, నీట మునిగిపోసాగింది. తీవ్రంగా గాయపడిన జల రాక్షసులు పారిపోయారు. అక్కడంతా నిశ్శబ్దం. పొగ, చర్మం కాలిన వాసన!

"మాస్టర్ జాగ్రత్త! మీరు మునిగిపోతున్నారు.. ప్రకృతి మునిగిపోతోంది... ఇదిగో నేను అందరికీ ప్రమాద సందేశం పంపిస్తున్నాను. కాస్త తట్టుకుని ఈదడానికి ప్రయత్నించండి.. " అంటూ హెచ్చరించింది యురేకస్.

అతి చల్లటి నీళ్ళు నన్ను మంచు కత్తితో కోసినట్లు బాధించాయి. నా విశ్వశక్తి అదృశ్యమైంది. నేనిప్పుడు మాములు మనిషిని. ప్రకృతి నన్ను పట్టుకుని, "రక్షించండి... రక్షించండి..." అని అరుస్తోంది. మేము మునిగిపోతున్నాం. ప్రకృతితో సహా ఈదడానికి ప్రయత్నించాను. డేవిడ్ ఏమయ్యాడో తెలియడం లేదు. యురేకస్ నీటి మీద తేలుతోంది. అలల చప్పుడు తప్ప మరేమి వినబడడం లేదు. అతి శీతలమైన నీరు నన్ను మూగబోయేలా చేస్తోంది. నాకు స్పృహ తప్పింది.

❄ ❄ ❄

# 38. పరివేషం

**అ**లల తాకిడి భీకరంగా ఉందక్కడ.. చుట్టూ చిమ్మచీకటిలా ఉంది. సముద్ర గర్జనలు వినబడుతున్నాయి. మొత్తం శరీరమంతా సూదులతో పొడిచినంత బాధగా ఉంది. వేలాది సుత్తులతో శరీరాన్ని బాదుతున్న భావన. ఎవరో స్త్రీ ములుగు వినబడుతోంది.. ఆ గొంతు బలహీనంగా ఉన్నా, అది ప్రకృతిది అని గుర్తించాను. ఇంతలో నా కుడి పిరుదు మీద ఏదో ఇంజక్షన్ ఇవ్వడం కోసం సూది గుచ్చినట్లు అర్థమైంది. ఉన్నట్లుండి నొప్పి మటుమాయం! ప్రాణం లేచొచ్చినట్లయింది. "హ...నీ.." అని దూరంగా ఎవరో పిలుస్తున్నట్లనిపించింది. క్రమంగా ఆ పిలుపు దగ్గరగా మరింత దగ్గరగా గట్టిగా వినిపించసాగింది. మెల్లిగా కళ్ళు తెరిచాను. ప్రకాశవంతమైన వెలుగుని భరించలేకపోయాను. ముఖాలు అస్పష్టంగా కనబడుతున్నాయి. కాసేపటికి మసక సర్దుకుని అంతా స్పష్టంగా కనపడసాగింది.

నా ఎదురుగా ఉన్నది మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ శాన్.

"హనీ! ఇప్పుడెలా ఉంది?" అని అడిగాడు. ఆ గొంతులో ఆప్యాయత, ఆపేక్ష ఉన్నాయి.

ఆయన ఇక్కడికి ఎలా వచ్చాడు? తర్వాత ఎర్రటి ముఖం, గోధుమ రంగు మీసాలతో, తల మీద ముదురాకుపచ్చ రంగు టోపీ ధరించిన వ్యక్తి కనబడ్డాడు. బహుశా సైన్యంలోని అధికారేమో.

"నేనెక్కడ ఉన్నాను..." అని మాత్రం అనగలిగాను.

"ప్రకృతి ఎలా ఉంది?" అని అడిగాను.

"తను బాగానే ఉంది. నీ అదృష్టం బావుంది... నీ శరీరం ముక్కలవకుండా ఒకటిగానే ఉంది.. పోతే నీ బొమ్మ... అదే నీ రోబో నీళ్ళల్లో హాయిగా తేలుతూ

బయటపడింది..'' చెప్పాడు శాన్.

"మరి జల-రాక్షసులో...?''

"వాళ్ళు నాశనమైపోయారు. నువ్వు వాళ్ళని చంపగలిగావు... అయితే... ఏం విద్యుదయస్కంత శక్తిని సృష్టించావు... ప్రపంచ వార్త అయిపోయింది ఈ ఘటన.. జనాల దృష్టి మళ్ళించడానికి నానా తిప్పలు పడ్డాం. కుజ గ్రహపు దుష్టమాంత్రికుల గురించి, భూమి మీద రహస్యంగా నివాసముంటున్న మాంత్రికుల గురించి బహిరంగంగా ప్రకటించడం సాధ్యం కాదు. ఇక, ఇక్కడ నువ్వు పూర్తిగా సురక్షితం. ఇది ఎర్త్ కౌన్సిల్ వారి అంబులెన్స్ విమానం. హనీ! నువ్వు చరిత్ర సృష్టించావు. నీ సొంత శక్తితోనే నువ్వు నలుగురు శక్తివంతమైన జల రాక్షసులను చంపావు. విశ్వశక్తిని మంచికి ఉపయోగించేవాళ్ళకి ప్రోత్సాహాన్నిచ్చావు... నీ మీద దాడికి వచ్చిన వాళ్ళు కుజగ్రహపు దుష్ట మాంత్రికులకు సహకరిస్తున్నవారేనని నిరూపితమైంది...'' చెప్పాడు సైనికాధికారి.

అది చాలా పెద్ద విమానం. లోపలంతా ఆసుపత్రి వార్డులాగా ఉంది. నన్ను సముద్రం నుంచి రక్షించి, చికిత్స చేసినట్లున్నారు.. విమానం ఇంకా ప్రయాణిస్తూనే ఉంది. సమయం ఎంత గడిచిందో నాకు తెలియలేదు.

"ప్రొఫెసర్ శాన్! సమూరా, అతని బృందం తప్పించుకున్నారు. నేను వాళ్ళని ఆపలేకపోయాను. పైగా సమూరా దగ్గర ఇప్పుడు శక్తిమంతమైన వెండి కొవ్వొత్తి కూడా ఉంది. " అన్నాను.

"కంగారు పడకు హనీ! ఇవన్నీ మాకు తెలుసు. తన శక్తులలో ఐదో వంతు తిరిగి పొందాడని, అమరుడని కూడా తెలుసు. అయినా సౌరవ్యవస్థ మాట అటుంచు, సమూరా మళ్ళీ కుజుడిని జయించాలంటే... చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. అతడిని నిరోధించడానికి మనవద్ద బోలెడు సమయం ఉంది...'' అన్నాడు శాన్.

"కాని అతడు ఆగడు. అతని ఆశయం నాకు తెలుసు. అతనికి మరణం లేదు. పైగా సౌరవ్యవస్థలోని అన్ని గ్రహాలలోనూ అనుచరులని ఏర్పాటు చేసుకుని అన్ని గ్రహాలను జయించాలని కోరుకుంటున్నాడు....'' చెప్పాను.

"అవును. మాకు తెలుసు. భూమి మీద మేం బెంగపడేది ఈ విషయానికే. కానీ మనమేమీ చేయలేం. గెలాక్టిక్ కౌన్సిల్‌కీ, పిసియుఎఫ్ మానిటరింగ్ సెల్‌కీ, ఇంటర్ గెలాక్టిక్ పోలీసులకి ఫిర్యాదు చేయడం తప్ప మనం చేయగలిగిందేమీ

లేదు. మన ప్రయత్నం మనం చేద్దాం...'' అన్నాడు శాన్.

ఇంతలో యురేకస్ వచ్చింది. తన లోహ స్వరంతో నన్ను పలకరించింది.

''మాస్టర్.. ఎలా ఉన్నారు?''

దాని ఇనుప కవచంమీద కొద్దిగా బురద మరకలు పడ్డాయి. తల భాగంలో అక్కడక్కడా గీతలు పడ్డాయి. జరిగిన బీభత్సమేదీ తనకు పట్టనట్లు ఉంది యురేకస్.

''మీకు తెలుసుగదా మాస్టర్.. నేను అదృశ్యంగా ఉండి నీళ్ళలో తేలగలను. సహాయం కోసం సంకేతాలు పంపగలను. సముద్రంలో ప్రయాణిస్తున్న ఏదైనా నౌకకి లేదా పడవకి నన్ను నేను తగిలించుకుని ప్రయాణించగలను. లేదా నా బాటరీ పవర్ ఆపుచేసుకుని, ఏదైనా మార్గం కనబడేవరకూ నీటిలో తేలుతూ ఉండగలను... ఇది నా మొదటి జల అత్యవసర పరిస్థితి. నేను ఈ పరీక్షలో విజయవంతమయ్యాను...'' చెప్పింది.

దాని పనితీరు పట్ల దానికి గర్వంగా ఉంది.

విమానం సాఫీగా ప్రయాణిస్తోంది. నాకిప్పుడు పూర్తిగా నయమైంది. పక్క మంచం మీద కళ్ళు తెరుచుకుని విశ్రాంతిగా వాలి ఉన్న ప్రకృతి కేసి చూసాను.

''సర్, సమూరాని, సయోనీని పట్టుకోడానికి నాకు ఇంకో అవకాశం ఇవ్వండి. లేదా మీరే దాడి చేసి వాళ్ళని స్పేస్ ఎలివేటర్ సమీపంలోనే పట్టుకోండి... వాళ్ళని వదలద్దు...'' అన్నాను.

''మిస్టర్ హనీ ఆమ్రపాలి! ఇది సైనిక వ్యవహారమని ఎర్త్ కౌన్సిల్ నిర్ణయించింది. పైగా ఇది రహస్యమైన కార్యక్రమం. దీనికి ప్రచారం ఏ మాత్రం పనికిరాదు. ఎక్కడో దూరగ్రహానికి చెందిన ఓ ముసలాడు అతని కూతురు ఓ వెండి కొవ్వొత్తితో పారిపోతే ఏంటంట? దాని వల్ల సౌరవ్యవస్థకి ఏం ప్రమాదం? ఈ సంగతులన్నీ రహస్యంగా ఉంచమని మాకు ఆదేశాలున్నాయి...'' చెప్పాడు సైనికాధికారి.

''కానీ... మీరు వాళ్ళపై ఖచ్చితంగా దాడి చేయచ్చు... వాళ్ళు పదిమందే పైగా ముసలివారు. వాళ్ళని పట్టుకుని, జైల్లో పెట్టి న్యాయస్థానంలో తగిన శిక్ష వేయించవచ్చుగా? వాళ్ళు నేరస్తులని తెలిసి కూడా వాళ్ళని ఎందుకు వదిలేయాలి? మీ దగ్గర అత్యాధునిక ఆయుధాలు కూడా ఉన్నాయి.... వ్యూహాలు ఉన్నాయి...'' అన్నాను.

సైనికాధికారికి నా ప్రశ్నలు నచ్చినట్లు లేవు. శాన్ కేసి అసహనంగా చూసాడు.

ఇంజన్ల శబ్దానికి విమానం లోపలి భాగాలు కూడా నెమ్మదిగా కంపిస్తున్నాయి.

''ఇవన్నీ పై నుంచి వచ్చిన ఆదేశాలు. మీరు మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని మీ ఉద్యోగం చూసుకోడం మంచిది.. అంతే!'' అన్నాడా అధికారి.

ప్రకృతికి ఇదేమీ నచ్చలేదు.

''సర్, మేమింత కష్టపడ్డాక కూడా వాళ్ళని పట్టుకోడానికి మీకు వచ్చిన ఇబ్బందేంటి? వాళ్ళు మా భైరవాలయంలోని వస్తువుని పట్టుకుపోతున్నారు. మా గ్రామం మునిగిపోయింది.. వాళ్ళేమో హాయిగా తప్పించుకుంటున్నారు...'' అంది.

''హనీ, ప్రకృతి..! శాంతించండి. మీ భావాలను అర్థం చేసుకోగలను. కాని ఎప్పుడేం చేయాలో వీళ్ళకి బాగా తెలుసు.. అర్థం చేసుకోండి...'' చెప్పాడు శాన్.

నాకేమీ అర్థం కావడం లేదు. విశ్వశక్తిని నియంత్రించేందుకు అవసరమైన క్షుద్రవిద్యలు తెలిసిన ఓ ముసలి, దుర్బలుడైన గ్రహాంతరవాసిని ఆపడం భూగ్రహం వల్ల కాదా? నిజానికిది అసాధ్యమేమీ కాదు... కాకపోతే...

ఎర్త్ కౌన్సిల్‌లో అధికారక్రమం ఎలా ఉంటుందో నాకు తెలియదు. ప్రస్తుత సహస్రాబ్దిలో దేశాలు లేవు, కేవలం జోన్లే ఉన్నాయి. భూమికి విశ్వాసంగా ఉండే అన్ని జాతుల వాళ్ళు వివిధ హోదాలలో ఎర్త్ కౌన్సిల్‌లో పనిచేస్తున్నారు. ఒకప్పటి అమెరికా దేశంలోని ఉత్తర అమెరికా నుంచి ఎర్త్ కౌన్సిల్ పనిచేస్తుంది. మిస్టర్ నెల్సన్ చైర్మన్, నలుగురు వైస్ చైర్మన్లు ఉంటారు. వారిలో మిస్టర్ హు ఒకప్పటి చైనాకి, మిస్టర్ ముఖర్జీ ఆసియాకి, మిస్టర్ ఒడుంబా ఆఫ్రికాకి, మిస్టర్ నయీమ్ మధ్య ఆసియాకి చెందినవారు. భూమి మీద ఇప్పటికీ ఉన్న ఖండాలు - దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా, ఐరోపా, ఆఫ్రికా, దక్షిణ ఆసియా, ఇంకా ఆస్ట్రేలియాలోని కొన్ని ప్రాంతాలు... ద్వీపదేశాలైన జపాన్, ఆగ్నేయాసియా దేశాలు అదృశ్యమైపోయాయి. కాబట్టి ఎర్త్ కౌన్సిల్‌ని పరిపాలించేవారిలో మిగతా ప్రాంతపు రాజకీయ నేతలు కూడా ఉంటారు.

పరిపాలన అంతా ఏకాభిప్రాయం, చర్చలు, ప్రాంతీయ మండలుల కూటమి ఆమోదంతోనూ జరుగుతుంది. క్షీణిస్తున్న భూమి ఆర్థికాభివృద్ధిని మెరుగు పర్చడం, ఇతర గ్రహాల దాడుల నుంచి భూమిని రక్షించడం వీరి ప్రధాన కర్తవ్యాలు. భూగ్రహం మీద చాలా భాగం క్రితం సహస్రాబ్దిలో అణుయుద్ధాల వల్ల నశించిపోయింది. ద్వీప దేశాలైన న్యూజీలాండ్, జపాన్, ఆగ్నేయాసియా దేశాలు మాత్రం సునామీలకీ, భూకంపాలకీ గురై నశించిపోయాయి.

మరిప్పుడు దుష్ట గ్రహాంతర వాసుల్ని పట్టుకోడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? కారణం ఏమిటి? అంటే సైన్యంలో కూడా సమూరా తొత్తులు ఉండి ఉండాలి... లేదా ఎర్త్ కౌన్సిల్‌లోకి కూడా సమూరా అనుచరులు చొచ్చుకు వచ్చి ఉండచ్చు... సహేతుకమైనా, నిర్హేతుకమైనా నా అనుమానం బలపడింది. కొన్ని లేజర్ బాంబులు వేస్తే సమూరా, అతని మాంత్రికుల బృందం వెళ్ళే నౌక బూడిద అయిపోతుంది... కమాండోలూ, నౌకాదళ సిబ్బంది కలిస్తే... స్పేస్ ఎలివేటర్ దగ్గరకి చేరే మార్గాన్ని మూసేయచ్చు.. వాళ్ళని ఆపచ్చు... కాని అలా జరగడం లేదు.. ఎందుకని?

ఇంతలో నా సెల్ ఫోన్ మోగింది. నాకిష్టమైన సన్‌రైజ్ రింగ్ టోన్ అది. ఫోన్‌ని జాగ్రత్తగా నా జేబుకి టేప్ వేసి ఉంచారు. సముద్రంలో తడిసినా కూడా నా ఫోన్ ఇంకా పనిచేస్తూనే ఉంది. దాన్ని జేబులోంచి తీయడానికి అవస్థ పడుతుంటే, విమాన సిబ్బందిలో ఒకతను వచ్చి టేప్ విప్పి, ఫోన్‌ని నా చేతిలో ఉంచాడు. ఎర్ర ముఖం సైనికాధికారి, శాన్ నాకేసే చూస్తున్నారు. నేను ఫోన్ స్క్రీన్‌ని చూస్తున్నాను. అదొక సందేశం.

"మాస్టర్.. మరీ ఆశ్చర్యంగా చూడకండి. నేనే యురేకస్‌ని.." అని ఉంది అందులో.

తరువాత వచ్చిన మరో సందేశం ఇలా ఉంది:

"ఈ సైనికాధికారి మనిషి కాదు. దుష్ట గ్రహాంతరవాసి లేదా దుష్ట మాంత్రికుడయి ఉంటాడు. అతని శరీరం విద్యుదయస్కాంత తరంగాలను తక్కువ స్థాయిలో ప్రసారం చేస్తోంది. కాని నేను కనుక్కోగలిగాను. అతన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండండి.. సమూరా తాలూకు వ్యక్తి అయ్యుంటాడు..."

ఈ రోబోలకి మెమొరీ ఉండడం మాత్రమే కాదు, యజమానులనుంచి ఆదేశాలను స్వీకరించడమే కాదు.. వాటికి స్వతంత్రంగా అమలుజేసుకునే

లాజిక్ ప్రోగ్రామ్ ఉంటుంది. సమాచారాన్ని విశ్లేషించి తర్కబద్ధమైన నిర్ధారణలను తమ యజమానులకి అందిస్తాయి. ఈ రోబో కూడా గ్రహాంతరవాసులు తయారు చేసినదే.

పైగా అదే అనుమానం కొన్ని క్షణాల క్రితం నాక్కూడా కలిగింది.

''జనరల్ జుకోవ్... మీరేమీ కంగారు పడద్దు. హనీ అన్నీ అర్థం చేసుకుంటాడు. అతను నా ఫాకల్టీ. అతని గురించి నాకు బాగా తెలుసు. మీ మాట వింటాడు. అతన్ని ఇండికా సెంట్రల్‌కి తీసుకువెడతాను. పైగా మీడియాకీ, జనాలకి ఆమ్రపాలి గురించి, ఆకస్మిక వరదల గురించి చెప్పాలి. పైగా భూమి మీద పలుచోట్ల ఔత్సాహికులు ఈ విద్యుదయస్కాంత తరంగాలు గుర్తించారు.. వాళ్ళకి ఏదో ఒకటి చెప్పాలి...'' అన్నాడు శాన్.

నేను నా మొబైల్‌లోని సందేశాన్ని చెరిపేసాను. ఎర్రముఖం సైనికాధికారి కళ్ళెగరేశాడు.

నేను చిన్నగా నవ్వి... ''ఏం లేదు.. నా విద్యార్థి నుంచి సందేశం... ఆమ్రపాలిలో జరిగిన దుర్ఘటన గురించి విందట.. నా క్షేమ సమాచారాలు అడుగుతోంది..'' అన్నాను.

''క్షేమంగా ఉన్నానని, త్వరలోనే వచ్చి కలుస్తానని ఆమెకి జవాబివ్వండి...'' అన్నాడు సైనికాధికారి. అతని పేరు జుకోవ్ అని నాకు ఇందాకే తెలిసింది.

ఈ ఎర్ర ముఖం సైనికాధికారి తల చుట్టూ మాంత్రికుడి పరివేషం ఉంది. మరి ఎర్త్ కౌన్సిల్ దీన్ని ఎందుకు గుర్తించలేదు? లేదా ఉద్విగ్నతకు గురయ్యాడు కాబట్టి విద్యుదయస్కాంత తరంగాల పరివేషం ఇప్పుడు బహిర్గతమైందా? నాకేమీ అర్థం కాలేదు.

విమానం తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. నా మనసు బోలెడు ప్రణాళికలు రచిస్తోంది. తన అనుచరులలో ఒకడైన సైనికాధికారి పన్నాగం వల్ల సమూరా సురక్షితంగా తప్పించుకోడం నేను భరించలేను. యురేకస్ చిన్న చిన్న చప్పుళ్ళు చేస్తోంది. దాని దీపాలు వెలుగుతున్నాయి. నా ఆదేశాలను పాటించడానికి సంసిద్ధంగా ఉంది.

❈ ❈ ❈

# 39. రోబో- జాక్

**ల**క్ష్యం సులువుగానే ఉంది, కాని ప్రణాళికే కఠినం. ప్రణాళిక అమలు జటిలం.

తప్పించుకోవాలి. విమానం నుంచి దూకేయాలి. ఎక్కడోక్కడ పారాచూట్లు ఉంటాయిగా.. తర్వాత స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వద్దకి చేరి, కుజగ్రహ మాంత్రికులని పట్టుకోవాలి, వాళ్ళు పారిపోకుండా ఆపాలి. ఊహూఀ, ఈ ప్రణాళికని అమలు చేయడం దాదాపుగా అసాధ్యం. సముద్రంలో ఈదడం ఎలా? ఆ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారాన్ని కనుక్కోవడం ఎలా? తెలివితక్కువ పని!

తర్వాతి ప్రణాళిక... విమానాన్ని హైజాక్ చేయడం! పైలట్‌ని భయ పెట్టడం! స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వరకూ మమ్మల్ని తీసుకువెళ్ళమని, అక్కడ దించమని బెదిరించడం. ఆ తర్వాత దుష్టశక్తులతో మా పోరాటాన్ని మేము కొనసాగించడం! లేదా... మమ్మల్ని అడ్డుకునే వారందరినీ విశ్వశక్తి ప్రయోగంతో చంపేయడం.. అంటే మంత్రశక్తులని చెడు కోసం ఉపయోగించడం.. తర్వాత విమానాన్ని చేజిక్కించుకుని మేము వెళ్ళాల్సిన చోటుకి వెళ్ళడం... కాని వాళ్ళని చంపడం తప్పు.. అందునా శాన్ నా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్.

ఇలా నా మనసు రకరకాల ప్రణాళికలు రూపొందిస్తూ గజిబిజిగా ఉంది. ఓ ఖచ్చితమైన నిర్ణయానికి రాలేకపోతున్నాను. సమయం గడిచిపోతోంది.. ఇంకో అరగంటలో మేము నేల మీదకి దిగుతాం.

నేను నా మొబైల్ ఫోన్ తీసి - జుకోవ్, శాన్ ఇంకా ఇతర అధికారులెవరూ చూడకుండా ఓ సందేశం టైప్ చేసి యురేకస్‌కి పంపాను.

“ఐదు నిమిషాల్లో ప్రణాళిక సిద్ధం చెయ్! జుకోవ్‌నీ, శాన్‌నీ లొంగదీసుకో! పైలట్‌కి లేజర్ గన్ గురిపెట్టి విమానాన్ని హైజాక్ చేస్తున్నామని చెప్పు.. బాంబు పెట్టామని చెప్పు. స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వద్దకి విమానాన్ని తీసుకెళ్ళమని చెప్పు. అన్నిటికన్నా ముఖ్యం... పారాచూట్లు ఎక్కడ ఉన్నాయో చూడు. త్వరగా, ఓ చక్కని ప్రణాళిక రూపొందించి, మన అవకాశాలెలా ఉంటాయో చెప్పు...”

యురేకస్‌లో ఉన్న ఆటోమేటిక్ ఇన్‌ఫ్రా రెడ్ ఫోటోగ్రాఫిక్ సిస్టమ్ వల్ల, ఎక్కడికి వెడితే, అక్కడి ఫోటోలు తీసుకుని భద్రపరుచుకుంటుంది.

కాబిన్ అంతా ఖాళీగా ఉంది. నన్ను నమ్మి జుకోవ్, శాన్ వెళ్ళిపోయారు. నేనేమీ చేయలేననుకున్నారు.

సాయుధులైన జవాన్లు ఉండచ్చు కానీ, ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు.

“ఇప్పుడేం చేద్దాం హనీ!” అడిగింది ప్రకృతి. మంచం మీద కూర్చుని ఉంది తను. ఆమె జుట్టు గాలికి ఎగురుతోంది. కళ్ళు అలసటగా ఉన్నాయి.

“కాస్త ఆగు! ఏం చేయాలో సమయం వచ్చినప్పుడు నేనే చెబుతాను..”

ఇంతలో నా సెల్‌ఫోన్‌లో సందేశం.. పాసెంజర్ రూమ్‌కీ, పైలట్ కాబిన్‌కీ మధ్య నిలుచుని ఉంది యురేకస్.

“విమానాన్ని హైజాక్ చేయడమే ఉత్తమమైన మార్గం. జనరల్ జుకోవ్‌నీ, ఇద్దరు జవానులనీ మీరు నిరోధించండి. ఇతర సిబ్బందిని ప్రకృతి అడ్డుకుంటారు. పైలట్ సంగతి నేను చూసుకుంటాను.. వివరణలన్నీ మీరే ఇచ్చుకోవాలి... పారాచూట్లు విమానం వెనుకవైపు ఉన్నాయి. అక్కడున్న ఎర్ర మీట నొక్కితే అత్యవసర ద్వారం తెరుచుకుంటుంది... ఈ ప్రణాళిక విజయవంతం అయ్యే అవకాశాలు 50-50శాతం. మాంటేగోమరీ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వద్ద క్రిందకి దూకాక మన విజయావకాశలు వందకి రెండు మాత్రమే. ఈ ప్రణాళిక అమలు చేయడానికి అనుమతి కోరుతున్నా. సమయం ఒక్క నిమిషం....”

ఎక్కువగా అలోచించలేదు.

“ప్రకృతీ, నువ్వు బలహీనుల పైనా, సిబ్బందిపైనా విశ్వశక్తి ప్రయోగించు. జనరల్ జుకోవ్, శాన్‌ని నేను చూసుకుంటాను. పైలట్‌ని బెదిరించి, యురేకస్ విమానాన్ని హైజాక్ చేస్తోంది. మొదలుపెట్టు.. వెంటనే...” అన్నాను.

ఆమె ఆశ్చర్యపోయింది.

నేను ఒక గెంతు గెంతి... "మొదలుపెట్టు.. పైలట్ కాబిన్‌కి వెళ్ళు" అని అరుస్తూ యురేకస్‌కి చెప్పాను. జుకోవ్, శాన్ కూర్చున్న గదిలోకి ప్రవేశించాను. వాళ్ళిద్దరూ విశ్రాంతిగా కూర్చుని టీ తాగుతున్నారు. నేను వాళ్ళమీదే దృష్టి నిలిపి... మంత్రాలుచ్ఛరిస్తూ... "నిశ్చలోభవ... నిశ్చలోభవ" అన్నాను. వాళ్ళిద్దరూ వింతజీవుల్లా కదలకుండా ఉండిపోయారు. జుకోవ్ ఎర్రముఖం తెల్లగా పాలరాయిలా మారిపోయింది. నాకెంతో ఉద్వేగ్నంగా ఉంది. నా నరాలన్నీ విద్యుదయస్కాంత శక్తితో ఉత్తేజితమయ్యాయిలా ఉంది. జుకోవ్ మాంత్రికుడో కాదో కొద్ది సేపట్లో తేలిపోతుంది. తేరుకున్నాక, నా మీద తన మంత్రశక్తుల్ని తప్పకుండా ప్రయోగిస్తాడు. వెనుక నుంచి "నిశ్చలోభవ... నిశ్చలోభవ" అంటూ ప్రకృతి గొంతు వినిపిస్తోంది. మేమిద్దరం విమానం వెనుక భాగానికి పరిగెత్తాం.

ఇంతలో యురేకస్ లోహ స్వరం గట్టిగా వినిపించింది.

"పైలట్! ఈ విమానం హైజాక్ అయింది. నా ఆజ్ఞలని పాటించు. నేను ఇంటర్ గెలాక్టిక్ రోబోని. నాకెన్నో వినాశకర శక్తులున్నాయి. నిన్ను చంపి, విమానాన్ని నాశనం చేసే సామర్థ్యం నాకుంది. నా ఆదేశాలను పాటిస్తే నువ్వు క్షేమంగా ఉంటావు. ప్రయాణదిశని మార్చు. మాంటేగోమరీ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వైపు నడుపు. ఆగ్నేయ దిక్కులో 1600కిలోమీటర్ల దూరంలో ఉందది.. ఊఁ, త్వరగా పోనీ!" అంది యురేకస్.

ఉన్నట్లుండి అక్కడో మెరుపు మెరిసినట్లయింది. చర్మం కాలిన వాసన వస్తోంది. బహుశా తమ శక్తిని కొద్దిగా పైలట్‌కి రుచి చూపినట్లుంది యురేకస్.

"కానీ మన వద్ద అంత ఇంధనం లేదు..." అని మరో గొంతు వినిపించింది. బహుశా కో-పైలట్ కావచ్చు.

"ఉన్న ఇంధనం గంటన్నర ప్రయాణానికే సరిపోతుంది. మాంటేగోమరీ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం రెండున్నర గంటల దూరంలో ఉంది..." చెప్పాడతను.

మళ్ళీ మెరుపు... ఓ మూలుగు..

"దారి మధ్యలో ఆకాశంలో ఇంధనం నింపే ఏర్పాట్లు చెయ్యమని ఎయిర్‌ఫోర్స్ అధికారులకి చెప్పు.. అత్యవసరం అని చెప్పు..." దృఢంగా ఉంది యురేకస్ గొంతు.

మళ్ళీ హై ఫ్రీక్వెన్సీ ధ్వని.. కీచుమన్న అరుపు.

"లేకపోతే చస్తావు..." అంటోంది యురేకస్.

నేను పైలట్ కాబిన్‌లోకి ప్రవేశించాను. అక్కడి వాతావరణం గమ్మత్తుగా ఉంది. తన యాంటీనాని పైలట్లకి గురి పెట్టి ఉంది యురేకస్. పైలట్లు చేష్టలుడిగి విమానం మీటల కేసి చూస్తున్నారు. వాళ్ళు ఈ హైజాక్ నిజమో కాదో కూడా తేల్చుకోలేకపోతున్నారు.

"నా పేరు హనీ ఆమ్రపాలి. నా ఆదేశాల మేరకే ఈ విమానం హైజాక్ చేయబడింది. మేమో మంచి పని చేస్తున్నాం. గ్రహాంతర దుష్ట మాంత్రికులు పారిపోకుండా ఆపడం కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ విమానంలో ఓ డబుల్ ఏజంట్ ఉన్నాడు. గ్రహాంతర దుష్ట మాంత్రికుల కోసం పనిచేస్తున్న ఓ తొత్తు ఉన్నాడు. అతనే జనరల్ జుకోవ్. అతను చెడ్డవాడు. అందుకే అతన్ని నిర్బంధించాం. మనం ఎలా అయినా ఆ దుష్టులు పారిపోకుండా ఆపాలి. అర్థమైందా.." అన్నాను.

ప్రకృతి కూడా కాబిన్‌లోకి వచ్చింది.

"మీరు చెబుతున్నది మాకేం అర్థం కావడం లేదు. అయినా, విమానాన్ని కాపాడుకోవాలంటే మీకు సహకరించడం తప్ప మాకు మరో మార్గం లేదని తెలుస్తోంది. ఆకాశంలోనే ఇంధనం నింపమని అడుగుతాను..." చెప్పాడు పైలట్.

"నువ్వు చెప్పేదంతా నిజమేననుకుంటాను. లేకపోతే, ఈ హైజాక్ ముగిసాకా, నీకు మరణశిక్ష విధిస్తారు లేదా అరిజోనాలో జీవితఖైదు చేస్తారు..." అన్నాడు.

"మేము చేసేది సరైనదే. మేము మంచి కోసమే ఈ పని చేస్తున్నాం..." అంది ప్రకృతి.

ఆమె శరీరం మొత్తం ఎర్రటి కాంతితో వెలిగిపోతోంది. పైలట్ కాబిన్‌ని కూడా ప్రకాశవంతం చేసింది.

"ఈ రోబో ప్రమాదకరమైనది. దాని ఆజ్ఞలని పాటించండి. మేము పారాచూట్ల దగ్గరికి వెడుతున్నాం. వాటిని ఉపయోగించి మాంటేగోమరీ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం దగ్గర ఎలా దూకాలో మీలో ఒకరు వచ్చి చూపిస్తారా?" అంది.

“తప్పకుండా. మీరు సురక్షితంగా దూకేయచ్చు. విమానాన్ని చాలా తక్కువ ఎత్తులో నడుపుతాం. పైగా ఇవి అత్యాధునికమైన ఆటోమేటిక్ పారాచూట్‌లు. వీటిని ఉపయోగించి, మీరు ఎక్కడ దిగాలనుకుంటే ఖచ్చితంగా అక్కడే దిగచ్చు. అవసరమైతే కాసేపు నీళ్ళల్లో కూడా తేలుతూ ఉండచ్చు..” చెప్పాడో పైలట్.

“సరే. మంచిది. తొందరగా ఇంధనం నింపించండి. కుతంత్రాలేవీ పన్నద్దు. ఎవరినీ అప్రమత్తం చేయద్దు. ఎవర్కైనా ఎస్.ఓ.ఎస్. పంపిస్తే... మీరు బూడిదైపోతారు....” అంటూ హెచ్చరించి మధ్య కాబిన్‌లోకి వచ్చాను. జనరల్ జుకోవ్ కళ్ళు తెరిచాడు. నన్నే చూడసాగాడు. శాన్ మాత్రం ఇంకా స్పృహలోకి రాలేదు. నన్ను చూడగానే కోపం పట్టలేక లేచి నిలుచున్నాడు జుకోవ్. అతని శరీరమంతా ఎర్రగా మారింది. కళ్ళలోని రక్తనాళాలు ఉబికి ఎర్రగా మారాయి. ఒకప్పటి రష్యాకో, లేదా సెర్బియాకో చెందిన భాషలో మంత్రాలు చదువుతూ నాపై శాపనార్థాలు కురిపించసాగాడు. అతని మంత్రాల నుంచి ఉద్భవించిన శక్తిని అతని చూపుడు వేలి ద్వారా నా ఛాతి ఎడమవైపుకి పంపడానికి ప్రయత్నిస్తున్నాడు. నేను అప్రయత్నంగా కుడి వైపుకి జరిగి, నన్ను నేను కాపాడుకునేలా విరుగుడు మంత్రం చదవసాగాను.

“ఆవృతం... విద్యుత్ ఆవృతం..” అని కుజగ్రహం మీద లాగోస్ నేర్పిన స్వీయరక్షణ మంత్రాలు చదివాను. దీనివల్ల నా శరీరం చుట్టూ రక్షణ వలయం ఏర్పడి నా మీద ప్రయోగించబడ్డ శక్తులు ప్రయోగించిన వారిపైనే దాడి చేస్తాయి. జుకోవ్ నుంచి వెలువడిన మెరుపు నా శరీరాన్ని తాకకుండానే నా రక్షణ కవచం వలన వెనుతిరిగి లేజర్ కిరణంలా అతడి ఛాతీని తాకింది. ఈ పరిణామం అతను ఏ మాత్రం ఊహించలేదు. నొప్పితోనూ, బాధతోనూ విలవిలలాడుతూ కింద పడ్డాడు. నోట్లోంచి చొంగకారుస్తూ స్పృహ తప్పాడు. బహుశా చచ్చిపోడు. అయితే అతనో మాంత్రికుడనేది రూఢీ అయింది. రహస్యంగా దుష్టశక్తుల కోసం పనిచేస్తున్నాడనీ ఋజువైంది.

భూగ్రహం సైన్యం ఉన్నతాధికారుల శ్రేణిలోకి కూడా సమూరా అనుచరులు చొచ్చుకురావడం విస్మయం కలిగించింది. అదృష్టవశాత్తు, శాన్ సాధారణంగానే ఉన్నాడు, మంత్రశక్తుల ప్రభావం వలన గాఢనిద్రలో ఉన్నాడు.

ప్రకృతి కూడా అక్కడికి వచ్చింది.

“ఇంక ఆలస్యం చేయద్దు ప్రకృతీ. అవసరమైతే మళ్ళీ విశ్వశక్తి ప్రయోగం చెయ్. వాళ్ళని నిశ్చలంగా ఉంచు..” అంటూ నేను పైలట్ కాబిన్‌లోకి వెళ్ళాను. పైలట్లపై యురేకస్ ఇంకా తన యాంటీనాని గురిపెట్టే ఉంచింది.

“ఏమైంది? ఇంధనం నింపుతున్నారా? తొందరగా... మమ్మల్ని నమ్మండి. ఇదంతా మేము మంచికోసమే చేస్తున్నాం. చూడండి.. మీ సొంత జనరలే దుష్టమాంత్రికుల తొత్తు! ధూర్తుడు.. రహస్యంగా చెడ్డ పనులు చేస్తున్నాడు... ఇప్పుడే తన మంత్రశక్తులతో నన్ను చంపాలని చూసాడు..” చెప్పాను.

“దేవుడా...” అనడం తప్ప మరేం మాట్లాడలేదు కో-పైలట్.

“మాంటేగోమరీ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వైపు తిప్పుతున్నాను. ఎయిర్‌ఫోర్స్ వాళ్ళు దారిలో మనకు ఆకాశంలోనే ఇంధనం నింపుతారు. అక్కడికి వెళ్ళడానికి మనకి కనీసం రెండు గంటలు పడుతుంది.. ఇక మంత్రశక్తుల ప్రయోగం చేయద్దు. ఇవన్నీ మా అవగాహనా పరిధికి మించినవి..” అన్నాడు పైలట్.

విమానం దిశ మార్చుకుని ఆగ్నేయ దిశగా ప్రయాణించసాగింది. కిటికిలోంచి చూస్తే, క్రమక్రమంగా ఆకుపచ్చని తీరభూములు దూరమై నీలి సముద్రం ప్రకాశవంతమైన సూర్యకాంతిలో మెరుస్తూ కనపడింది.

❄ ❄ ❄

# 40. నౌకాదళం

**'స్కై** టన్నెల్ ఆఫ్ మాంటేగోమరీ' అని పిలవబడ్డ స్పేస్ ఎలివేటర్ ప్రవేశద్వారం వద్దకు చేరేసరికి సూర్యాస్తమయం కావచ్చింది. ఇనుము, గాజులతో రూపొందించిన భారీ కట్టడం అది. ప్రకృతీ, నేనూ విమానంలో లభించే తేలికపాటి, పోషకాహారాన్ని తీసుకున్నాం. తూర్పు భారతదేశం దిక్కు నుంచి ఓ భారీ కార్గో విమానం వచ్చి ఆకాశంలోనే మా విమానానికి ఇంధనం నింపింది.

జనరల్ జుకోవ్ ఇప్పుడు సురక్షితంగా బందీ అయ్యాడు. జవాన్లు అతడి చేతులకు సంకెళ్ళు, నోటికి పట్టీ వేసారు. శాన్‌కి స్పృహ రాగానే జరిగినదంతా చెప్పాను. నేను చెబుతున్నది వెంటనే అర్థం చేసుకున్నాడు.

"దేవుడా! శత్రువు తొత్తు మన సైన్యంలోనా! అదీ జనరల్‌గా! పైగా అతను నా పై అధికారా? అస్సలు గ్రహించలేకపోయాను..." అన్నాడు శాన్. ఈ సమాచారాన్నంతా ఉత్తర అమెరికాలోని సెంట్రల్ మానిటరింగ్ కౌన్సిల్‌కి వివరించాడు.

సుప్త చేతనావస్థలో ఉన్నప్పుడు జనరల్ జుకోవ్ శరీరం తక్కువ స్థాయిలో తరంగాలను వెలువరిస్తోందన్న విషయాన్ని నిర్ధారించాడు శాన్. జుకోవ్ రక్తం నమూనాలను తీసుకున్నారు. డి.ఎన్.ఎ పరీక్ష ద్వారా అతను మాంత్రికుడో కాదో (భూమి పరిభాషలో విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తి) తెలుసుకుంటారు. విమానంలో జరిగే ప్రతీ సంఘటన చిత్రీకరించే కెమెరాలు - జుకోవ్ నా మీద మంత్రశక్తులని ప్రయోగించబోవడం, నేను వాటిని తిప్పి కొట్టడం అన్నీ చిత్రీకరించాయి. ఈ వీడియోలని సెంట్రల్ మానిటరింగ్ కౌన్సిల్‌కి చూపించాము.

కాసేపటి తర్వాత శాన్ చెప్పాడు:

“నువ్వు చెప్పింది వాళ్ళు నమ్ముతున్నారు హనీ! ఇప్పుడే నాకు ఓ సందేశం అందింది. దుష్ట గ్రహాంతరవాసులను నిలువరించడంలో మనకు సాయం చేయడానికి రెండు విమానాల్లో నౌకాదళం సిబ్బందిని పంపుతున్నారు. మనం స్పేస్ ఎలివేటర్ దగ్గరికి వెళ్ళిపోదాం. ఒకగంటలో నౌకాదళం వాళ్ళు కూడా అక్కడికి చేరుకుంటారు. గ్రహాంతరవాసులు ఎలివేటర్‌ని పనిచేయించక ముందే మనం వాళ్ళని ఆపాలి. అది ఒకసారి పని చేయడం ప్రారంభిస్తే, ఇక ఆగదు...”

“ఎందుకని? ఇక్కడి బేస్ రూమ్ నుంచి మోటార్‌ని ఆపేయచ్చుగా?” అడిగాను.

“అసలు విషయం అదే! ఆ ఎలివేటర్ సుమారుగా పదేళ్ళ నుంచీ పనిచేయడం లేదు. అది సంప్రదాయిక ఎలివేటర్ లాంటిది, ఒకసారి 15 మందిని ఎక్కించుకోగలదు. ఓ అద్దాల గదికి కార్బన్ నానోట్యూబ్ కేబుల్ బిగించబడి ఉంది. అది అంతరిక్షంలో సుమారు 1000 వరకూ వెళ్ళగలదు. పై భాగంలో అది, పరాయి గ్రహాలకు ప్రయాణించేందుకు - వ్యోమ నౌకల నిగమాగమన స్థానమైన లా టెర్‌కి చేరుకునేందుకు లంకె వేస్తుంది. జనాలంటున్నారు - ఎలివేటర్ పై భాగం ధ్వంసమైపోయిందని. అయితే క్రింద భాగం బానే ఉందట. కానీ లిఫ్ట్‌ని పైకి కిందకి పంపే మోటార్ మాత్రం పనిచేయడం లేదట. న్యూక్లియర్ రియాక్టర్ పనిచేయకపోవడం వల్ల దానికి అణు ఇంధనం లభించడం లేదు. మరి వాళ్ళెలా తప్పించుకుంటారు? అంతా అయోమయంగా ఉంది..” అన్నాడు శాన్.

“ప్రొఫెసర్, లిఫ్ట్ ఖచ్చితంగా పనిచేస్తోంది... లేకపోతే వాళ్ళు లా టెర్ నుంచి భూమికి రాలేరు. లిఫ్ట్‌ని కిందకీ పైకి కదిలించడానికి వారి మంత్రశక్తులు సరిపోవు... భుమి మీద ఉన్న విశ్వాసపాత్రులైన అనుచరులెవరో ఎలివేటర్‌ని పనిచేయించి ఉంటారు...” అన్నాను.

“అవును. ఇది సాధ్యమే..” అంగీకరించాడు శాన్.

“సర్, నౌకాదళంతో పాటు నేను కూడా కిందకి వెళ్ళేందుకు అనుమతించండి. ఆ దుష్ట గ్రహాంతరవాసులతో పోరాడాలనుకుంటున్నాను.” అన్నాను.

“వద్దు హనీ! నువ్వు ఇప్పటికే చాలా చేశావు. పైనుంచి అనుమతి లేదు.

నౌకదళంలో శిక్షణ పొందిన కమాండోలు ఉన్నారు. వాళ్ళల్లో ఇద్దరు గెలాక్టిక్ కౌన్సిల్ నుంచి విశ్వశక్తి ప్రయోగంలో శిక్షణ పొందారు. వాళ్ళు మంత్రశక్తులను కూడా ఎదుర్కోగలరు...''

''కాదు సర్! ఇది నా వ్యక్తిగతం. నేను పగదీర్చుకోవాలి... మీరు ఒప్పుకుంటే... ఒకప్పుడు వీళ్ళూ మా అమ్మానాన్నలని చంపారు. ఇంకోసారి నా మనసుతో ఆడుకుని నన్ను కుజగ్రహానికి రప్పించుకున్నారు. నా గ్రామం నీట మునిగేలా చేసారు.. ఇప్పుడు నన్ను ప్రకృతినీ దెబ్బతీయాలని చూస్తున్నారు.. వాళ్ళని నిలువరించి శిక్షించే బృందంలో నేనూ ఉండాలి.. నా బాల్యమూ, జీవితం వీళ్ళ వల్ల సర్వనాశనం అయ్యింది... ఆ వర్షం కురిసే రోజున మా అమ్మానాన్నలని చంపినందుకు నేను వీళ్ళపై ప్రతీకారం తీర్చుకోవాలి... దయచేసి కాదనకండి...''

శాన్ మౌనంగా ఉండిపోయాడు. కాసేపటి తర్వాత మాట్లాడుతూ.. ''సరే, ఇదంతా అనధికారికంగా జరుగుతుంది. ఈ పోరాటంలో నీకేం జరిగినా నాకు సంబంధం లేదు..'' అన్నాడు.

''సర్, హనీతో పాటు నేనూ ఉంటాను. నాకు తెలిసిన కొద్దిపాటి మంత్రశక్తులను వాళ్ళపై ప్రయోగిస్తాను. ఇదంతా భూగ్రహంపై ఉన్న భక్తితో మాత్రమే...'' అంది ప్రకృతి.

''అంటే నౌకాదళంలోని ఇద్దరూ, మేమిద్దరం కలిస్తే విశ్వశక్తిని ఉపయోగించగలిగే వ్యక్తులం నలుగురు అవుతాం. పన్నెండు మంది కమెండోలు, ఇంకా మూడు నక్షత్రాల స్థాయి పిసియుఎఫ్‌లు నలుగురు ఆ దుర్మార్గులని ఖచ్చితంగా నిలువరించగలం... '' అన్నాను.

''ఈ మిషన్‌కి నేను బాధ్యుడిని కాకుండా ఉంటే బాగుండేది హనీ! నేను ఒప్పుకోవడం లేదని భావించు. నా హెచ్చరికల్ని లెక్కజేయకుండా నువ్వు కిందకి దూకేసావు.. అంతే! నీ దారి నువ్వు చూసుకోవాల్సిందే...'' అన్నాడు శాన్.

యురేకస్ తన యాంటీనా మీద ట్రేలో పెట్టుకుని తెచ్చిన టీ తాగుతూ కిటికీలోంచి చూసాం.

దూరంగా సముద్రంలోంచి ఆకాశంలోకి నిలబడిన స్పేస్ ఎలివేటర్ అస్పష్టంగా కనబడుతోంది. రెండు వైపులా కిటికీలతో 50 అడుగుల పొడవూ,

50 అడుగుల వెడల్పూ ఉంటుంది. దిగువన ద్వారం దగ్గర కొన్ని మెట్లు పైకి కనబడుతూ, మరికొన్ని నీటి లోపల ఉన్నాయి. దిగువ భాగం ఓ వేదికపై ఉంది. దాన్ని సముద్రపుటలలు నిరంతరం ఢీకొడ్తున్నాయి. దాని పైభాగం ఆకాశంలోకి చాలా దూరం చొచ్చుకుపోయింది.

“నాలుగో సహస్రాబ్దిలో ఇదో అద్భుతం” అన్నాను ఆ కట్టడం నిర్మాణాన్ని చూసి.

“అవును. ఇటువంటి అద్భుత నిర్మాణం సౌరవ్యవస్థలోని మరే ఇతర గ్రహంలోనూ లేదు. రాకెట్లతో పని లేకుండా, ఎటువంటి ప్రమాదాలు లేకుండా అంతరిక్షంలోకి వెళ్ళడం నిజంగానే ఓ అద్భుతం. కానీ అది ఓ దశాబ్దం పాటే విజయవంతంగా మనగలిగింది. వాతావరణ సమస్యలు, తుపానులు, తోకచుక్కలు... ఇంకా ఊహించలేని అనేక సమస్యల వల్ల స్పేస్ ఎలివేటర్ వాడకాన్ని నిలిపేసారు. భూమికి 1000 కిలోమీటర్లు ఎగువన ఉన్న లా టెర్ అంతరిక్ష వేదికనే ఉపయోగిస్తున్నారు ఇప్పుడు...” అన్నాడు శాన్.

“అదిగో.. రెండు విమానాలలో నౌకాదళం సిబ్బంది వస్తున్నారు...” అంది ప్రకృతి.

“అవును. ఒక్కో విమానంలో ఎనిమిదిమంది ఉన్నారు.. నేనో సందేశాన్ని చదివానిప్పుడే...” అంది యురేకస్.

శాన్ పైలట్ కాబిన్లోకి వెళ్ళి విషయాన్ని ధృవీకరించుకున్నాడు. కాసేపటికే గద్ద ముక్కు ఆకారంలో కొసతేలిన ముందు భాగాలున్న ముదురాకు పచ్చరంగులో రెండు యుద్ధ విమానాలు మా వెనుకగా దూసుకొచ్చాయి.

“నేను మళ్ళీ తింటాను.. నువ్వు కూడా తిను.. వాళ్ళపై దాడి చేయడానికి మనకి తగినంత శక్తి కావాలి...” అని ప్రకృతితో చెప్పాను.

“యురేకస్, నువ్వూ మాతో రా...” అన్నాను.

❄ ❄ ❄

# 41. స్పేస్ ఎలివేటర్

**మాం**టెగోమెరీ స్పేస్ ఎలివేటర్? దాదాపుగా వందేళ్ళ క్రితం నిర్మించబడింది. నిజానికి అంతరిక్షంలోని ఎలివేటర్ అనే ఆలోచనకి బీజం వేసింది 20వ శతాబ్దపు ప్రముఖ సైన్స్ ఫిక్షన్ రచయిత అర్థర్ క్లార్క్. తరువాత 35వ శతాబ్దంలో నానో మెటల్స్, నానో ఫైబర్లు, కేబుల్స్ రంగంలో విప్లవాత్మకమైన సాంకేతిక మార్పులు చోటు చేసుకున్నాయి.

నిజానికి అంతరిక్షం భూ వాతావరణానికి చాలా దూరంగా ఉంటుంది. దాదాపు శూన్యంగా, భారరహితంగా ఉంటుంది. కాని కాంతి కణాలు, ఇంకా సౌరగాలులు, అతి సూక్ష్మమైన హైడ్రోజన్ అణువులు ఉంటాయి.

భూమికి 20 కిలోమీటర్ల ఎత్తు వరకూ విమానాలు ఎగరగలవు. 50 కిలోమీటర్ల ఎత్తు వరకూ వాతావరణ ఉపగ్రహాలనూ, బెలూన్లనూ పంపవచ్చు. భూమికి 100 కిలోమీటర్ల ఎత్తులో కర్మన్ రేఖ (భూమిని, రోదసిని విడదీసే ఊహాత్మక రేఖ) ఉంటుంది. అసలైన అంతరిక్షం ఇక్కడి నుంచే మొదలవు తుంది, ఉపగ్రహాలను ఇక్కడినుంచే కక్ష్యలోకి ప్రవేశపెడతారు. భారరహిత స్థితి ఇక్కడినుంచే ప్రారంభం అవుతుంది.

ఈ ఎలివేటర్‌ని నిర్మించడానికి ఎంత డబ్బు ఖర్చయిందో, ఏయే ఇంజనీరింగ్ నైపుణ్యాలను ఉపయోగించారో నాకు తెలియదు. భూమి నుంచి 1000 కిలోమీటర్ల పొడవున ఆకాశంలోకి నిటారుగా దూసుకుపోతుందా ఎలివేటర్. దుక్క ఇనుముతోనూ, నానో ఫైబర్స్‌తో నిర్మితమైన కట్టడం అది. క్రిందకి పైకి తిరిగే ఎలివేటర్, ఇంకా మెట్లు ఉన్నాయా నిర్మాణంలో. ఈ ఎలివేటర్‌కి అవసరమైన విద్యుత్ కాస్త దూరంలో ఓ వేదిక మీద ఉన్న పవర్ స్టేషన్ నుంచి లభించేది. ఆ విద్యుత్‌ని జలాంతర్గత న్యూక్లియర్ రియాక్టర్ నుంచి ఉత్పత్తి చేసేవారు. ఇందులోని సిబ్బంది ఆరు నెలలకి ఒకసారి

మారేవారు. ఈ విషయాలన్నీ నాకు చాలా ఆలస్యంగా తెలిసాయి. స్పేస్ టన్నెల్ ఆఫ్ మాంటెగోమెరీ అని పిలవబడే ఆ స్పేస్ ఎలివేటర్ ఇప్పుడు పాడుబడింది, ఏ మాత్రం పనిచేయడంలేదు. అసలు ఇలాంటి లిఫ్ట్ ఒకటుందన్న విషయం కూడా భూమి మీద చాలా మందికి తెలియనే తెలియదు. పైగా ఇప్పుడు అంతరిక్ష ప్రయాణాలకు స్పేస్ షటిల్ ఉపయోగిస్తున్నారు. అవి ప్రయణీకులని లా టెర్ వద్దకు చేరుస్తాయి. రోదసిని భూమిని విడదీసే కాల్పనిక కర్మన్ రేఖకి ఇరువైపులా కాస్త గురుత్వాకర్షణ శక్తి ఉంటుంది. ఈ కారణంగానే చంద్రుడు భూమి చుట్టూ పరిభ్రమించగలుగుతున్నాడు. గుండ్రంగా తిరుగుతూ ఉండే లా టెర్ అంతరిక్ష వేదికని అందుకోడానికి లా టెర్ తిరిగే వేగంతోనే తిరుగుతూ, కేబుల్ కార్ సీట్లని అందుకుంటారు ప్రయాణీకులు. తమ ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసుకున్న సిబ్బంది, ఆ ఎలివేటర్ ద్వారానే భూమి మీదకి వచ్చేస్తారు.

అణుశక్తితో, నానో కేబుల్స్‌తో పైకి కిందకి నడిచే వంద అడుగుల ఇనుప బోనులాంటిదా ఎలివేటర్. నిజానికి భూమికి 100 నుంచి 110 కిలోమీటర్ల ఎత్తులోకి వ్యోమగాములను చేర్చడానికి ఉద్దేశించినదా ఎలివేటర్. యురేకస్ మెమొరీ డిస్క్‌లోని సమాచారం చదివినప్పుడు నాకు తెలిసాయి ఈ విషయాలన్నీ.

“ఎన్నో రకాల సమస్యల వల్ల - వాతావరణ సమస్యలు, వసతుల లోపాల వల్ల... భూమి కదలికలు, వాతావరణం, తుపానులు, తోకచుక్కలు... వంటి ఇబ్బందులతో ఆ ఎలివేటర్ మూలపడింది. తర్వాత కొన్నాళ్ళు రోబోటిక్ అర్మ్స్‌తో నడపాలని చూసారు, ఆ ప్రయత్నం కూడా విఫలమైంది...” చెప్పాడు శాన్.

మేము ఆ ఎలివేటర్ సమీపానికి వెడుతున్నకొద్దీ, నీటిపై తేలే వేదికపైన సముద్రం మధ్యలో ఉన్న స్థావరంనుంచి ఇనుప బోనులాంటి ఎలివేటర్ అస్పష్టంగా కనబడుతోంది.

దాంట్లో దీపాలు వెలగడం లేదు. నడి సంద్రంలో పాడుపడ్డ నగరంలా ఉందా ప్రాంగణం. మా విమానపు హెడ్ లైట్ కాంతిలో దారి కనపడుతుండగా విమానం మెల్లగా కిందకి దిగసాగింది.

“హనీ, ఇంకో ఐదు నిమిషాల్లో మెరైన్స్ వస్తున్నారు. వాళ్ళ వద్ద నీటిలో ఈదడానికి అవసరమైన దుస్తులు, ఆక్సీజన్ ఉన్నాయి. మరి నువ్వెలా కిందకి

దిగుతావు? నువ్వు దిగడం తప్పనిసరా?" అని అడిగాడు శాన్.

"నేనూ, ప్రకృతీ ఆ డైవింగ్ సూట్లు వేసుకోలేం. మమ్మల్ని ఎలివేటర్ వేదిక మీద దింపగలరేమో అడగండి.. మాకు కనీసం వారం రోజులకి సరిపడా ఆహారపదార్థాలు వెచ్చని దుస్తులు ఇవ్వండి..." చెప్పాను. ఏమైనా సరే ఆ దుష్ట మాంత్రికుల అంతు చూడాలనేది మా ఉద్దేశం.

"హాస్యమాడుతున్నావ్ కదూ! అయినా మీరు మళ్ళీ పైకి ఎలా వస్తారు? అయినా, కాసేపు ఆగు. ఈ ఆపరేషన్ ఇన్‌చార్జి అయిన మెరైన్ కమాండర్ ఏం చెబుతాడో విందాం...." అన్నాడు శాన్.

నాకు నిరాశ కలిగింది, కోపం వచ్చింది. ఇదో బలవత్తర కార్యమని నాకు తెలుసు. అంతరిక్షంలోకి దూసుకుపోయిన చీకటి గుయ్యారం లాంటి ఆ కట్టడం.. నిగూఢమైన భీతిని కలిగిస్తోంది. నీటిపై తేలే వేదికపైన సముద్రం మధ్యలో ఉన్న స్థావరం దెయ్యాలకొంపలా ఉంది. అలలు, చలి, గాలులు!

మెరైన్ల నాయకుడితో రేడియోలో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నాడు శాన్. స్పీకర్స్ ఆన్ చేసి ఉండడంతో జరుగుతున్న సంభాషణని మేమందరం వినగలుగుతున్నాం.

"హాయ్. ప్రొఫెసర్ శాన్! నా పేరు ఎడ్వర్డ్స్. ఎడ్డీ అని పిలవచ్చు. ఈ కమెండోలకి నేను ఇన్‌చార్జిని. కొద్ది సేపట్లో కిందకి దిగబోతున్నాం. మాకు అక్కడ ఏం ఎదురవుతుంది? అసలేం జరిగింది, అక్కడున్న వాళ్ళు ఏం చేయాలనుకుంటున్నారో కాస్త వివరించండి..." అన్నాడు ఎడ్డీ.

"ఎడ్డీ! వాళ్ళు గ్రహాంతర దుష్ట మాంత్రికులు. వాళ్ళంతా ముసలాళ్ళు. ఎనిమిది నుంచి పది మంది ఉంటారు. వాళ్ళలో ఓ మహిళ కూడా ఉంది. వాళ్ళకి క్షుద్రశక్తులు ఉన్నాయి. వాళ్ళు ఈ ఎలివేటర్ ద్వారా పారిపోవాలనుకుంటున్నారు. లేదా ఈ పాటికి పారిపోయుంటారు...." చెప్పాడు శాన్.

"హాస్యాస్పదంగా ఉంది. వాళ్ళు సాయుధులా? వాళ్ళ దగ్గర బందీలున్నారా?" అడిగాడు ఎడ్డీ.

"బందీలెవరూ లేరు.. నాకు తెలిసీ వాళ్ళ దగ్గర ఆయుధాలూ లేవు. అయితే వాళ్ళ గురించి బాగా తెలిసిన వాళ్ళిద్దరు నా దగ్గర ఉన్నారు. వాళ్ళు ఈ పోరాటంలో మీతో చేరాలనుకుంటున్నారు." అని చెబుతూ, "మీరు వాళ్ళని పేరాచూట్లలో దింపగలరా? వాళ్ళు రావడం మీకు అంగీకారమేనా?" అని

అడిగాడు శాన్.

"వద్దొద్దు... ఈ మిషన్‌లో సాధారణ పౌరులకు ప్రవేశం లేదు. వాళ్ళు మాలాగా పోరాడలేరు. నీటి అడుగున ఈదలేరు, ఆ బోనులో పైకి ఎక్కలేరు... మేము ఇలాంటి పనులు ఇంతకుముందు మూడు నాలుగు సార్లు చేసాం. నేరస్తులని, నేరగాళ్ళయిన గ్రహాంతరవాసుల్ని తరిమి తరిమి పట్టుకున్నాం.." అని చెబుతూ, "అయినా ఎంత మూర్ఖంగా ఉంది? విద్యుత్ సరఫరా లేని ఈ ఎలివేటర్‌ని  ఒక్క అడుగు కూడా కదపలేరు. దీన్ని ఉపయోగించి వాళ్ళు పారిపోవడమా? అణు రియాక్టర్‌ని పని చేయించలేరు కదా? మేము అక్కడికి చేరి, వాళ్ళని పట్టుకుని మీకు కబురు చేస్తాం... బై.." అన్నాడు ఎడ్డీ.

"బై.. గుడ్ లక్.." అంటూ స్పీకర్ ఆపేసాడు శాన్.

అర్థం చేసుకోమన్నట్లుగా నా వైపు చూశాడు శాన్. ఆ స్పేస్ ఎలివేటర్ చుట్టూ తిరుగుతోంది మా విమానం. ఆ వేదిక మీద అమెరికా మాజీ అధ్యక్షుడు మాంటెగోమరీ భారీ విగ్రహం కనబడుతోంది. చెరిగిన అక్షరాలతో "మాంటెగోమరీ స్పేస్ ఎలివేటర్. స్థాపన క్రీ. శ. 2450. అనుమతి లేకుండా ప్రవేశించినవారు శిక్షార్హులు.." అని రాసున్న ఓ పెద్ద ఇనుప రేకు విమానం సెర్చిలైట్ వెలుతురులో అస్పష్టంగా కనబడుతోంది.

❄ ❄ ❄

# 42. దహనకాండ

**ఆ**కాశంలో పొడవాటి నీడలా ఉన్న స్పేస్ ఎలివేటర్ చుట్టూ తిరుగుతున్న మా విమానం రొద, అడవినక్కల ఊళల్లా చెవులు చిల్లులు పడేలా వినవస్తున్న అలల గర్జనలు కలసి పరిస్థితి భీకరంగా ఉంది. మెరైన్ అధికారుల ఆజ్ఞలని పాటించడం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు.

“జరిగేది చూస్తుండు” అని నాకు నేను చెప్పుకున్నాను. అంతేకాదు, ప్రకృతికీ, యురేకస్?కి వినపడేలా గట్టిగా చెప్పాను.

“నౌకాదళం ఈ పోరాటంలో విజయం సాధిస్తుందేమో. సమూరా, సయోనీ ఇంకా ఎలివేటర్‌లోనే ఉన్నారేమో..”

“అటు చూడండి..” అంటూ ఓ తెర మీదకి వేలు చూపించాడు శాన్.

దూరంగా వాయువ్య దిశలో ఎరుపు, నీలం, తెలుపు రంగుల దీపాల వెలుగుతూ, సముద్రంలో కదుతున్న ఓడ ఒకటి కనిపించింది.

“అది డార్క్ ప్రిన్సెస్. అంటే దుష్ట గ్రహాంతరవాసులెక్కి వచ్చిన ఓడ.. గ్రహాంతరవాసులు నౌక నుంచి దిగి, ఎలివేటర్‌లోకి ప్రవేశించి ఉంటారు, కాబట్టి ఆ నౌక ఖాళీగా ఉండి ఉంటుంది... లిఫ్ట్‌లో పదిహేను మంది ఎక్కచ్చు... వాళ్ళున్నది పదిమందే....” అన్నాడు శాన్.

“దేవుడా...” అన్నాను విచారంగా.

“ప్రొఫెసర్ శాన్! ఎలా అయినా వాళ్ళని ఆపాలి. అవసరమైతే ఎలివేటర్ పీఠం పై బాంబుల వర్షం కురింపించైనా సరే, వాళ్ళు సముద్రంలో పడితే పడతారు... అయినా వాళ్ళని ఆపాల్సిందే...” చెప్పాను దృఢ స్వరంతో.

మౌనం! ఏం చేయాలో నిర్ణయించుకోలేక శాన్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. మిలిటరీ వాడైన జనరల్ జుకోవ్ స్పృహ తప్పి పడి ఉండడం,

పైగా అతను దుష్ట గ్రహాంతరవాసుల తొత్తు అని నిరూపితమవడంతో.. సాధారణ పౌరుడైన శాన్ నిర్ణయం తీసుకోడంలో కొద్దిగా ఆలస్యం చేసాడు. ఇంతలోనే ఫోన్ మోగింది. కమాండర్ ఎడ్డీ లైన్‌లోకి వచ్చాడు.

"ప్రొఫెసర్, ఇంకో నిముషంలో కిందకి దిగబోతున్నాం. విశ్వశక్తిని ఉపయోగించగల ఇద్దరు సైనికులతో సహా మొత్తం పదిమంది దిగుతున్నాం. అవసరమైతే మాకు సాయం చేయడానికి సిద్ధంగా ఉండండి..." అన్నాడు.

"సరే, మేము మీకు రక్షణగా ఉంటాం. వాళ్ళు మీమీద దాడి చేస్తే, మేము వాళ్ళ మీద బాంబులు కురిపిస్తాం. అవసరమైతే ఎలివేటర్‌నీ కూల్చేస్తాం... గుడ్ లక్!" చెప్పాడు శాన్.

తర్వాత నా వైపు తిరిగి, కన్నుగీటాడు.

"మన విమానానికి అడ్వాన్స్‌డ్ ఫైరింగ్ సామర్థ్యం ఉన్న తుపాకులు బిగించబడి ఉన్నాయట. కానీ నేనో సాధారణ పౌరుడిని. అవసరమైతే .. "ఫైర్" అని ఆర్డర్ కూడా ఇవ్వాల్సుంటుంది..." అంటూ నవ్వేసాడు.

"సర్.. జనరల్ జుకోవ్ స్పృహలో ఉంటే మిమ్మల్నీ, నన్ను, ఇంకా ఈ నౌకాదళం వాళ్ళందరిని చంపేసి ఉండేవాడు.. నిజం..." అన్నాను.

"అయ్యుండచ్చు. అవునేమో. రాబోయే రోజులలో ఎర్త్ కౌన్సిల్ జరిపించే విచారణలో ఇవన్నీ వివరించాలి..." అంటూ తలని చేతులలో పట్టుకుని కూర్చున్నాడు శాన్.

విమానాలు నెమ్మదిగా కిందకి దిగుతున్నాయి. ఎత్తు తక్కువయ్యే సరికి పారాచూట్ల అవసరం లేకుండానే నౌకాదళం కమాండర్, సైనికులు నీళ్ళలోను పాడవని దుస్తులు ధరించి, కిందకి ఎలివేటర్ పీఠం మీదకి దూకేసారు. వేదికకి ఉన్న కొన్ని మెట్లు నీళ్ళల్లో ఉన్నాయి. అలల తాకిడికి అవి ఒక్కోసారి కనబడు తున్నాయి, ఒక్కోసారి కనబడడం లేదు. నలుగురు సైనికులు మెట్ల మీద దిగగలిగారు, మరో నలుగురు నీటిలో దూకి ఈదుతూ మెట్లని చేరుకున్నారు. ఉన్నట్లుండి అక్కడో వింతైన, దారుణమైన సంఘటన జరిగిపోయింది. ఎలివేటర్ ఉన్న స్థూపాకారపు నిర్మాణం నుంచి ఎర్రని లేజర్ కిరణాలు దూసుకువచ్చి నౌకాదళం సైనికులను తాకాయి. అవి ఒక్కసారిగా, ఎరుపు నారింజ రంగు మంటలా మారి సైనికులను దహించసాగాయి. లేజర్ కిరణాలు నిశ్శబ్దంగా రావడం, పొగలేని మంట అంటుకోడం చూసి నాకు అర్థమైంది...

అది విశ్వశక్తి ప్రయోగమని. దుష్ట మాంత్రికుల మంత్రవిద్యల ఫలితమేనని!

"ఫైర్.." అని అరిచాడు శాన్.

"ఎలివేటర్ పీఠం మీద దాడి చేయండి. ఆ దుష్టమాంత్రికులు అక్కడే దాక్కున్నారు.." అంటూ నేనూ అరిచాను.

నౌకాదళం సైనికులని తీసుకొచ్చిన విమానం, మా విమానం రెండూ తూటాల వర్షం కురిపించసాగాయి. కాసేపటికే ఆ ఎలివేటర్ పీఠం చుట్టూ నిప్పంటుకుంది. మూడు విమానాలు ఆగకుండా బుల్లెటని పేలుస్తూనే ఉన్నాయి. ఎలివేటర్ పీఠం దగ్ధమవుతోంది. సైనికులు శరీరాలు కాలిపోతున్నా లెక్క చేయకుండా ఎలివేటర్ కిటికీల వైపు గురి చూసి తుపాకులు పేలుస్తున్నారు.

"వాళ్ళు ఫైర్ ప్రూఫ్ దుస్తులు వేసుకున్నారనే భావిస్తున్నా..." అన్నాడు శాన్.

"విశ్వశక్తి దేన్నుంచైనా దూసుకుపోతుంది.. ఆ మాంత్రికులను చంపడం తప్ప మరో మార్గం లేదు. సైనికులు చుట్టూ తూటాలు పేలుస్తున్నారు కానీ దాని వల్ల ఉపయోగం లేదు..." అన్నాను.

ఇంతలో ఎలివేటర్ పీఠం తలుపులు తెరుచుకున్నాయి. ఒకరి తరువాత ఒకరుగా వృద్ధ మంత్రులందరూ బయటకు వచ్చారు. ఏవో మంత్రాలు ఉచ్ఛరిస్తూ సైనికుల మీదకి నిప్పురవ్వలని పంపసాగారు. అంతే ఒక్కసారిగా సైనికులంతా కాగడాల్లా మండిపోసాగారు..

"దేవుడా... అందరూ కాలిపోతున్నారు..." అన్నాను.

వాళ్ళకి వేరే గత్యంతరం లేదు. ధైర్యం కూడగట్టుకుని మాంత్రికులపై దాడి మొదలుపెట్టారు. కాని పాక్షికంగానే విజయం సాధించారు.

"వాళ్ళ మీద దాడి చేయండి... ముఖ్యంగా తల మీద, చేతుల మీద బాంబులు వేయండి..." అంటూ అరిచాను. వెంటనే మా విమానంలోని సిబ్బంది రెండు పెద్ద పెద్ద బాంబులను వృద్ధ మంత్రులపై వేసారు. అవి కింద పడుతూనే భారీ విస్ఫోటనాన్ని సృష్టించాయి. ఆ తాకిడికి వృద్ధమంత్రులందరూ నేలకొరిగారు. వాళ్ళ నల్లని దుస్తులు నిప్పంటుకుని ఎర్రగా మారాయి. సైనికులు, మాంత్రికుల బాధతో కూడిన అరుపులు గట్టిగా వినబడుతున్నాయి.

“వెళ్ళండి... సైనికులని రక్షించండి...” అంటూ అరిచాను.

పది నిముషాలలో మొత్తం పోరాటం ముగిసింది. భారీ స్థాయి దహనకాండ జరిగి, మానవులు, గ్రహాంతరవాసుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

నాకు దుఃఖమూ, కోపమూ ఒకేసారి వచ్చాయి.

“ప్రొఫెసర్ శాన్, కిందకి వెళ్ళడానికి నాకు అనుమతివ్వండి. మిగిలిన ఇద్దరు మాంత్రికులని నేను వెంబడిస్తాను. వాళ్ళే సమూరా, సయోనీలు. కుజ గ్రహపు దుష్టమాంత్రికులకు నేతలు. వాళ్ళు పారిపోకుండా ఆపాలి... వాళ్ళని సజీవంగా పట్టుకోడానికి... లేదా హతమార్చడానికి ప్రయత్నిస్తాను. నాకు పారాచూట్ ఇవ్వండి...” అన్నాను.

కొంత అయిష్టంగానే అంగీకరించాడు శాన్.

తనూ వస్తానంటూ బయల్దేరింది ప్రకృతి. “వాళ్ళని ఎదుర్కోగల సత్తా నాకూ ఉంది” అన్నట్లుగా ఆమె కళ్ళు పలికాయి. కాదనలేకపోయాను.

ఒక చేత్తో పారాచూట్‌నీ, మరో చేత్తో యురేకస్‌నీ పట్టుకుని విమానం దిగడానికి సిద్ధమయ్యాను. ప్రకృతి కూడా పారాచూట్ పట్టుకుని సిద్ధంగా ఉంది..

“ఒకవేళ మీరు నీళ్ళల్లో పడితే, పారాచూట్‌ని వదిలించుకుని ఈదండి... పీఠం మీదే దిగగలిగితే మరీ మంచిది...” చెప్పాడో పైలట్.

విమానం వెనుక తలుపు తెరిచారు. మేము చల్లటిగాలిలో కిందకి దూకేసాం.

❉ ❉ ❉

# 43. పారాచూట్లతో ఎలివేటర్ పైకి...

**భ**యంకరమైన చలి, దట్టమైన చీకటి. మేము దూకిన వెంటనే పారాచూట్లు తెరుచుకోడంతో, మేము కిందకి మెల్లగా జారసాగాం. ఎలివేటర్ చుట్టూ గాలిలో తేలుతూ, నెమ్మదిగా దిగుతున్నాం.

భగభగా మండుతున్న మంటకి కాస్త దూరంలో ప్రకృతి దిగడానికి సన్నద్ధమవుతూ కనబడింది. నేనైతే దాదాపుగా మంటలో దిగబోయాను, కాని కాళ్ళూ చేతులూ ఆడించి ఎలాగోలా మంటకి దూరంగా జరిగాను. కాని నీళ్ళలో పడిపోయాను. మునిగిపోతున్నాను. మంచులాంటి సముద్ర జలాలు, గడ్డకట్టించే చలి నా శరీరంపై వేయికత్తులతో కోసిన ప్రభావాన్ని చూపుతున్నాయి.

సముద్రపుటలల గర్జనలకి మించిన ఉచ్ఛస్వరంలో యురేకస్ చెప్పింది - "మాస్టర్! మునిగిపోతారు, చచ్చిపోతారు.. విశ్వశక్తిని ఉపయోగించండి. నీటి మీద తేలడానికి, నీటి మీద నడవడానికి మంత్రాలు చదవండి. మీకు మూడు నిముషాల సమయమే ఉంది.. లేదంటే అంతే సంగతులు! మీరసలే చాలా బలహీనంగా ఉన్నారు, ఈదలేరు... విశ్వశక్తిని ఉపయోగించకపోతే.. 100% చావు తప్పదు..."

కాస్త దూరంగా ఎలివేటర్ పీఠం వేదిక మీద ప్రకృతి క్షేమంగా దిగడం, పారాచూట్ బరువు వల్ల నేల మీద దొర్లడం చూసాను.

"మాడమ్, పారాచూట్ విప్పేసుకోండి. మీరు క్షేమం..." అని అరిచింది యురేకస్.

ప్రకృతి సునాయాసంగా పారాచూట్ విప్పేసుకుని, లేచి నిలబడింది. పారాచూట్ గాలికి ఎగిరిపోయింది. ప్రకృతి ఇక సురక్షితం.

నేను మాత్రం మునిగిపోతున్నాను. మృత్యువు నా కళ్ళలోకి తొంగి

చూస్తోంది.

దట్టమైన ఆకుపచ్చని పొలాలు, భయంగొలిపే వాతావరణం, పెద్ద వాన, భయంకర ఆకారాలు మా అమ్మానాన్నలని చంపడం... ఇలా నా చిన్నతనపు సంఘటలన్నీ ఒక్కోటిగా నా కళ్ళ ముందు ప్రత్యక్షమవుతున్నాయి.

''నేను చావను. నేను పూర్తి చేయాల్సిన బాధ్యతలున్నాయి. పగ.. ప్రతీకారం.. సమూరానీ, సయోనీని పట్టుకోవాలి. దుష్టశక్తులను వాడేవాళ్ళని నిలువరించాలి. విశ్వాన్ని ఏలాలనే వారి దురాశని పూర్తిగా అణిచేయాలి.'' అని నాకు నేను చెప్పుకుంటూ ఏకాగ్రతగా ధ్యానం చేసాను. కుజగ్రహపు అరుణభూములలో నేను నేర్చుకున్న మంత్రాలను మననం చేసుకోసాగాను. లాటిన్, ఫ్రెంచ్ భాషలలో ఆయా మంత్రాలు నా పెదాలపై కదలాడాయి.

''లఘుత్వ ప్రాప్తిరస్తు, లఘుత్వ ప్రాప్తిరస్తు..'' అనే అర్థం వచ్చేలా ప్రార్థించాను. ''నన్ను తేలికగా చేయ్, దూది కన్నా తేలికగా, కాయితం కన్నా తేలికగా! నీటిపై తేలేలా చేయ్! నా శరీరంలోని అణువణువులోనూ గాలి నిండి నేను తేలికై, నీటిపై తేలియాడేలా చెయ్యి...'' అంటూ విన్నవించుకున్నాను.

నా తల తిరుగుతోంది.

అయితే అద్భుతం జరిగింది. నేను నీటిమీద కాలు మోపగలిగాను. 'అక్షరాలా' నా పాదాలు నీటి ఉపరితలం మీద ఉన్నాయి. వర్షాకాలం రోజులలో నున్నటి రోడ్డు జారుతున్నట్లుగా నేను నీటి మీద నడవసాగాను. భైరవుడి కృప వలన, నేను నిజంగానే నీటిపై నడిచి, ఎలివేటర్ మెట్ల మీదకి అడుగుపెట్టాను. నా వెనుకే యురేకస్ ఈదుకుంటూ వచ్చింది. దాని దీపాలు వెలుగుతున్నాయి. యంత్రానికి కూడా భావోద్వేగాలున్నాయి!

''శభాష్ మాస్టర్! మీరు సాధించారు. ఇప్పుడే నీటిపై నడిచారు. ఇంతకు ముందు నడిచినా, అది వెండి కొవ్వొత్తి సాయంతో! మీకు మీరుగా నడిచింది ఇప్పుడే! అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) ప్రమాణాల ప్రకారం మీరు 25నక్షత్రాల మాంత్రికుడి స్థాయికి చేరారు..'' అంది యురేకస్ ఉత్సాహంగా.

పైగా దానికీ మహా సంతోషంగా ఉంది. ఇంతటి ఘనకార్యంలో తను కూడా భాగం పంచుకునేలా చేసినందుకు తనని ప్రోగ్రామ్ చేసినవాళ్ళకి

ధన్యవాదాలు చెప్పుకుంటున్నట్లుగా కీచుమని శబ్దాలు చేసింది.

మెట్లెక్కి, గబగబా వేదికపైకి దూకాను. కాస్త దూరంలో ప్రకృతి నిలబడి ఉంది.  మా చుట్టూ మంటలూ, కాలిన శరీరాలు.. చర్మం కాలిన వాసన!

"అందరూ చచ్చిపోయారు..." అరిచింది ప్రకృతి..

"దేవుడి దయ! నువ్వు నీటి మీద రెండొందల గజాల దూరం నడిచావు హనీ! అద్భుతం! నువ్వు మునిగిపోయావనే అనుకున్నా..." అంది నన్ను సమీపిస్తూ.

"ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో చూడు, యురేకస్ ద్వారా రక్షణ బృందాలకి సందేశం పంపిద్దాం.." అని చెబుతూ, "ముందు ఎలివేటర్‌లోకి వెడదాం. సమూరా, సయోనీ ఎక్కడ? వాళ్ళని వెతికి పట్టుకోవాలి. లేదంటే ఆ ధూర్తుల్ని చంపేయాలి..." అన్నాను క్రోధంగా. నేనెంత కోపంగా ఉన్నానంటే, నా మాటలు అరుపుల్లా ఉన్నాయి.

ఎలివేటర్‌ని నిలిపి ఉంచిన కటకటాలలోకి ప్రవేశించాం.

❄ ❄ ❄

# 44. పలాయనం

**ఎం**దరెందరో సైన్స్ ఫిక్షన్ రచయితలు ఊహించిన కల్పన.. "స్పేస్ ఎలివేటర్"ని అమెరికా మాజీ అధ్యక్షుడొకరు సాకారం చేసారు. అయితే నిర్మాణం పూర్తయిన కొన్ని దశాబ్దాలకే అది మూతపడింది.

ప్రకృతీ, యురేకస్, నేను దాంట్లోకి ప్రవేశించినప్పుడు... అది పూర్తిగా చీకటిలో ఉంది. మధ్యలో ఇనుప తలుపులు, బయట గాజు తలుపులు ఉన్న ఎలివేటర్‌ని సులువుగానే కనుక్కున్నాం. ఎటువంటి కదలికలూ లేక అది స్థిరంగా ఉంది.

"మిగిలింది ఇద్దరే, కాని చాలా ముఖ్యమైనవాళ్ళు! సమూరా, సయోనీ. ఇక్కడే ఎక్కడో ఉంటారు, తప్పించుకోవాలని చూస్తారు..." అన్నాను.

యురేకస్ తన యాంటినాపై ఉన్న దీపాన్ని చుట్టూ ప్రసరించి చూసింది.

"మాస్టర్, కుజగ్రహపు మాంత్రికులకు ప్రత్యేకమైన విద్యుదయస్కాంత తరంగాల ఉనికి తెలుస్తోంది. ఆ తరంగాలు ఇక్కడి నుంచే వస్తున్నాయి. కాని వాళ్ళు కనబడడం లేదు..." చెప్పింది.

నేను అప్రమత్తమయ్యాను.

"ప్రకృతీ! జాగ్రత్త! వాళ్ళిక్కడే ఉన్నారు.."

దుష్టమాంత్రికులు ఇక్కడే తచ్చాడుతున్నారని నాకు బలంగా అనిపిస్తోంది. నాలో ఏదో ఉద్విగ్నత! ఇదంతా నాకు ముందే తెలుసన్న భావన. అరుణ భూములు, అక్కడి యుద్ధాలు, లేజర్ బుల్లెట్లు, తప్పించుకోడానికి ఆశ్రయం వెతుక్కోడం... అన్నీ కళ్ళ ముందు కదలాడాయి. అరుణ భూములు సైన్యం మంత్రాలు ఉచ్ఛరించడం, ఆకాశం కేసి చూడడం.. తమ మీదకి ప్రయోగించిన క్షిపణులను మంత్రశక్తులతో మళ్ళీ శత్రువులమీదకే పంపడం.. ఇంకా ఎన్నెన్నో జ్ఞాపకం వచ్చాయి.

ఎలివేటర్ ఇంకా నిశ్చలంగానే ఉంది. ఉన్నట్లుండి అది కదలసాగింది. దానికన్నా ముందు అడుగుల చప్పుడు వినబడింది.

"అదృశ్యం!.. " అంటూ తన లోహ స్వరంతో అరిచింది యురేకస్.

"ఏంటీ?" అన్నాను కంగారుగా.

"అవును మాస్టర్! వాళ్ళు అదృశ్యంగా ఉండి పారిపోతున్నారు. నిఘా నుంచి తప్పించుకోడానికి వాళ్ళు అదృశ్యరూపంలో ఉన్నారు. వాళ్ళ శరీరాల నుంచి వెలువడుతున్న వేడిమిని, విద్యుదయస్కాంత తరంగాలను నేను గుర్తించగలుగుతున్నాను. వాళ్ళు ఎలివేటర్‌లోనే ఉన్నారు. పారిపోతున్నారు. ఎలివేటర్‌ని ఆపడానికి విశ్వశక్తిని ప్రయోగించండి. లోపలికి చొచ్చుకుపోయి వాళ్ళని హతమార్చండి... అయినా మీకా అవకాశం తక్కువే... 25:75 మాత్రమే!" అంది యురేకస్.

జీవితంలో ఎన్నడూ అనుభవించనంత ఆందోళనకి గురయ్యాను. ధ్యానమగ్నుడనయ్యాను.

"దాన్ని నేను ఆపుతాను.." అంటూ ప్రకృతి ఎలివేటర్ కేసి ఏకాగ్రతతో చూడసాగింది. ఆమె కంటి నుంచి ఓ లేజర్ కిరణం వెళ్ళి ఎలివేటర్ గాజు తలుపులని తాకింది. నేను కూడా ఎలివేటర్‌ని నిలువరించాలని ఏకాగ్రతతో దానికేసి చూడసాగాను. నా కళ్ళనుంచి కూడా లేజర్ కిరణాలు ఉద్భవించి, ఎలివేటర్ తలుపులని తాకాయి. గాజు పగిలి పెద్ద కన్నం పడింది. ఎలివేటర్ ఆగిపోయింది. ఎలివేటర్ కదులుతున్నప్పుడు మిణుకుమిణుకుమంటూ వెలిగిన లోపలి దీపాలు ఇప్పుడారిపోయాయి.

"నిశ్చలోభవ... స్థంభించిపో!" అంటూ కేకపెట్టాను.

ఉన్నట్లుండి ఎలివేటర్ చల్లగా మారిపోయింది. వివరించలేని నిశ్శబ్దమేదో దాన్ని ఆవరించింది. క్రమంగా అర్థమవుతోంది. అత్యున్నత స్థాయి విశ్వశక్తి ప్రయోగం జరగబోతోంది.. నా అనుభవంతో పసిగట్టగలను..

రెండు నల్లటి పొడుగాటి ఆకారాలు ఎలివేటర్‌లో ప్రత్యక్షమయ్యాయి. ఓ ఆకారం ఎముకల గూడులా ఉంది, కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి.. తలమీద పొడవాటి నల్ల టోపీ. సమూరా... అమరత్వం పొందిన దుష్ట మాంత్రిక చక్రవర్తి. రెండో ఆకారానిది పొడవాటి తెల్ల కేశాలు, ముడతలు పడిన ముఖం, క్రూరమైన కళ్ళు. పొడవాటి కేశాలు, వక్షస్థలం ఆ ఆకారం ఓ స్త్రీ అని

తెలియజేస్తున్నాయి. ఆమే సయోనీ! అత్యంత శక్తిమంతురాలైన యువరాణి, దుష్టమాంత్రికురాలు. ఆమె మనసుల్ని ఏమారుస్తుంది, ఆకారాలను మారుస్తుంది. అతి సులువుగా ప్రాణాలు తీయగలదు. తొంభై నక్షత్రాల స్థాయి ఉన్న గ్రహాంతర మంత్రగత్తె. తన తండ్రిని మోసం చేసి, పరిహసించిన ఓ అర్భక మానవుడినైన నా మీద ప్రతీకారం తీర్చుకునేందుకు ఉవ్విళ్ళూరుతోంది. అనుభవజ్ఞులైన మాంత్రికుల సంఘం (Syndicate of Senior Wizards) ప్రమాణాల ప్రకారం 25 నక్షత్రాల మాంత్రికుడినైన నేను ఆమె ముందు ఎందుకూ పనికిరాను. దుష్టశక్తులు వికటంగా నవ్వుతాయి. సయోనీ నవ్వితే అడవిలో అర్ధరాత్రి గుడ్లగూబ ఊళ పెట్టినట్టుంది. లేదా నిశ్శబ్దంగా ఉన్న రాత్రిలో గండుపిల్లులు పోట్లాడితే వచ్చే యేడ్పులా ఉంటుంది. బలహీనులైతే ఆ శబ్దానికే గుండె ఆగి మరణిస్తారు.

"ఓరీ ధూర్త మానవా! నీవి మూర్ఖపు ఆలోచనలు! నీ ఆటబొమ్మతోనూ, ఒకటిన్నర నక్షత్రాల స్థాయి ఉన్న స్నేహితురాలితోనూ నన్ను ఎదుర్కోవాలని చూస్తున్నావా? ఇవాళ నీ ఆఖరి రోజు.. నీ మోసానికి బదులు చెల్లించే రోజు..." అంటూ అరిచింది సయోనీ.

ఆమె మాటలు పూర్తి చేస్తూండగానే, ఓ ఎరుపురంగు కిరణం మెరుపు వేగంతో వచ్చి నా ఛాతిని తాకింది.

నొప్పితో విలవిలలాడిపోయాను. పదునైన కత్తితో బలంగా నా గుండెలో గుచ్చినట్లనిపిస్తోంది. నొప్పి తట్టుకోలేకపోతున్నాను. శాపనార్థం పెట్టాలనుకున్నాను.

"మరణం సంభవించుగాక!" అని శపించడానికి ప్రయత్నిస్తూ, సయోనీకేసి చూసాను. నా బాధ కొంత తగ్గింది. నాకు స్పృహ తప్పింది. కాని కొన్ని క్షణాల్లోనే నాకు మెలకువ వచ్చింది. నా పక్కనే ప్రకృతి నిలబడి గట్టిగా అరుస్తూ "చచ్చిపో! దుష్టశక్తీ.. నీకు మరణం సంభవించుగాక!" అంటూ సయోనీ మీద మంత్రాలు ప్రయోగిస్తోంది.

ప్రకృతి ఎంతో కోపంగా ఉంది. క్రోధంతో నిలువెల్లా వణుకుతోంది. దట్టమైన అడవిలో మెరిసే పచ్చని కళ్ళతో సంచరించే ఆడపులిలా ఉంది ప్రకృతి.

ఆమె కళ్ళ నుంచి ఓ లేజర్ కిరణం వెళ్ళి సయోనీ గుండెకి తగిలింది, మరో కిరణం వెళ్ళి తలకు తగిలింది.

ఐరోపాలోని చల్లని అడవుల్లో లేదా అలస్కాలోని ఎస్కిమో భూములలో తిరిగే నక్కలు తోడేళ్ళూ పెట్టే కూతల్లా కేకపెట్టింది సయోనీ. సయోనీ మంటల్లో మాడిపోతోంది.

మండుతున్న ఆమె రూపం ఆమె జీవితంలోని అన్ని అవతారాలనూ చూపించసాగింది. రాజ సింహాసనం మీద యువరాణిలా, బంగారు ఆభరణాలను అలంకరించున్న నడి వయసు స్త్రీలా, నీలి కళ్ళతో బంగారు కేశాలతో ఉన్న అందమైన యువతిలా, అమాయకమైన వదనంతో చిరునవ్వు చిందిస్తున బాలికలా... చివరికి మెడకీ, చెవులకీ నగలు తగిలించుకున్న కంకాళంలా గోచరించింది. చివరిగా పూర్తిగా దగ్ధమై, బూడిదగా మారింది. ఆ బూడిదలోంచి నెమ్మదిగా పొగ వెలువడసాగింది. 1000 కిలోమీటర్ల పొడవున్న ఎలివేటర్ ఆసాంతం కదిలిపోయింది. విషాదంతో, గట్టిగా రోదించసాగాడు సమూరా.. కుజగ్రహపు మాజీ చక్రవర్తి.

"ధూర్త మానవా! నువ్వు నా కూతురిని చంపావు. అంగారక దేవా! నాకెందుకీ శోకం? నా కన్న కూతురు ఇకలేదు...." అంటూ ప్రకృతి కేసి తిరిగాడు. "చావు... చావు.." అంటూ శపించడానికి ప్రయత్నించాడు. కానీ ఏమీ జరగలేదు. అతని శక్తులు నశించడం వల్ల ప్రకృతికి ఏమీ కాలేదు.

ఈలోపు నేను అతని మీదకి లేజర్ కిరణాలను పంపాను. అవి అతనిని మూడు సార్లు తాకాయి. అవి తాకిన చోట బూడిద వెలువడినా, అతను చెక్కుచెదరలేదు. అతను అమరుడని నాకు స్ఫురించింది. తన వాళ్ళందరినీ పోగొట్టుకున్న బంధువులా రోదిస్తున్నాడు సమూరా. ఉన్నట్లుండి ఏడుపు ఆపి... తన దుస్తుల్లోంచి వెండి కొవ్వొత్తిని బయటకి తీసాడు. ఏదో చదివాడు. సయోనీ బూడిద కుప్ప ముందు కూలబడి..."అమ్మా... సయోనీ..." అంటూ దుఃఖించసాగాడు. అంతలో వెండి కొవ్వొత్తి మహిమవల్ల ఓ తెల్లని పెద్ద సంచీ ప్రత్యక్షమైంది. జల ప్రవాహంలా సయోనీ బూడిద ఆ సంచీలోకి వెళ్ళిపోయింది.

ఆ సంచీని చేతిలో పట్టుకుని నాకేసి చూసాడు సమూరా.

"ధూర్తుడా! చావు! ఈ వెండి కొవ్వొత్తి నిన్ను చంపుగాక" అన్నాడు. కానీ నాకేమీ అవలేదు.

ఉన్నట్లుండి నేను శక్తిహీనుడయ్యాను.

"వెండి కొవ్వొత్తి ఎవరినీ చంపలేదు... మరణ శాపాలను దాన్నుంచి మినహాయించారు. నేను ఎన్సైక్లోపీడియా గెలాక్టికాలో చదివాను.. అది పవిత్ర

స్థలం నుంచి వచ్చింది కాబట్టి చెడు శాపాలకు సహకరించదు.. కాకపోతే ఏదో ఒక వెలితి కల్పించి, నిస్సహాయుడిలా చేస్తుంది...'' చెప్పింది యురేకస్.

యురేకస్ అన్నట్లే అయ్యింది. పక్షవాతం వచ్చినవాడిలా నేను నేలకూలాను. నా అవయవాలేవీ పని చేయడంలేదు. ప్రకృతి కూడా కిందపడిపోయింది. బాధతో మూల్గుతోంది.

తర్వాత, ఉచ్ఛస్వరంలో సమూరా గొంతు వినిపించింది.

``వెళ్ళు! పైకెళ్ళు... త్వరగా... పైకి...'' అంటూ వెండి కొవ్వొత్తిని ఊపుతూ అన్నాడు. ఎలివేటర్‌లో కదలిక వచ్చింది. నెమ్మదిగా పైకి కదలసాగింది. క్రమేపీ వేగం అందుకుంది.

ఇంతలో బయట తూటాల చప్పుడు వినబడింది.

``ఆపండి. కాల్చద్దు... లోపల మనుషులున్నారు... వాళ్ళకి గాయాలయ్యే ప్రమాదం ఉంది `` అంటూ ఎవరో గట్టిగా చెబుతున్నారు.

``మా మీద కాదు... ఎలివేటర్ మీద బాంబులు వేయండి. పారిపోతున్న సమూరాని కాల్చండి... `` అని అనాలనుకున్నాను.

కాని నా నోట మాట రాలేదు. ప్రకృతి విషయంలోనూ అంతే.

రోబో యురేకస్ కూడా నిశ్చేతనంగా ఉండిపోయింది, బహుశా దాని చార్జింగ్ అయిపోయినట్లుంది.

ఎలివేటర్ పైపైకి వెళ్ళిపోడం, ఒక చేతిలో కూతురు బూడిద సంచీతోనూ, మరో చేతిలో మెరుస్తున్న వెండి కొవ్వొత్తితోనూ ఎముకల గూడు లాంటి సమూరా పలాయనం చిత్తగించడం కళ్ళారా చూస్తున్నాను. అతను నిలుచున్న ఎలివేటర్ పీఠం నెమ్మదిగా కదిలి వేగం పుంజుకుని చీకట్లో కలిసిపోడం స్పష్టంగా కనబడుతోంది.

పెద్ద చప్పుడు.. అరడజను మంది నౌకాదళం సిబ్బంది లోపలికి వచ్చారు. ఓ డజను చేతులు నన్నెత్తి పట్టుకున్నాయి. నన్ను పైకి లేపడం నాకు తెలుస్తోంది. కాని నాలో కదలికలు లేవు. నా అంతరాత్మకి తెలుసు.. ఇదే ముగింపు అని, సమూరా తప్పించుకుపోయాడని. ``అతనికి చావు లేదు... వెండి కొవ్వొత్తి అతని దగ్గరే ఉండిపోయింది... సయోనీ చచ్చిపోయింది... దుష్ట మాంత్రిక చక్రవర్తి తప్పించుకున్నాడు...'' అని నాకు నేనే చెప్పుకున్నాను.

❄ ❄ ❄

# 45. చికిత్స - కోలుకోవడం

**"డె**క్స్ట్రో కార్డియా.... అదే ఇతన్ని కాపాడింది...." అన్న మాటలు వినబడ్డాయి నాకు స్పృహ రాగానే.

ఎయిర్‌ఫోర్స్ సర్జన్ ఎవరితోనో చెబుతున్నాడు.

"ఇతని గుండె కుడివైపునకు ఉంది. మంత్రశక్తులో, తాంత్రిక శక్తులో... వాటివల్ల వచ్చిన లేజర్ కిరణం ఇతని ఛాతికి ఎడమవైపు తాకింది. గుండె ఎడమవైపు కాకుండా, కుడి వైపు ఉండడంతో ఆ లేజర్ కిరణం గుండెకేమీ గాయం చేయలేకపోయింది.. అందువల్లే ఇతను బతికున్నాడు. షాక్ పీరియడ్ ముగిసింది. కోలుకుంటాడు..."

నా కాళ్ళూ చేతులు కదిలించగలిగాను. స్త్రీపురుషుల మాటలు వినబడుతున్నాయి. జనాల కదలికలూ కనబడుతున్నాయి, గ్లాసుల గలగలలు వినబడుతున్నాయి. ఎక్కడినుంచో శ్రావ్యమైన సితార్ సంగీతం వినబడుతోంది.

మెల్లగా మాట పెగుల్చుకుని, "థాంక్యూ డాక్టర్.." అన్నాను.

డాక్టర్ నాకేసే చూస్తున్నారు.. ఆ నీలిరంగు కళ్ళలో దయ.. ముఖంలో తేజస్సు.. చేతులకీ, ముఖానికి ఆకుపచ్చ తొడుగులు...

"హనీ! ఇప్పుడెలా ఉంది నీకు?" అడిగారాయన.

నేను వెంటనే చెయ్యి పైకెత్తగలిగాను.

"బాగుంది డాక్టర్.. మాట్లాడగలుగుతున్నాను." అని చెబుతూ "ప్రకృతికి ఎలా ఉంది?" అని అడిగాను.

"తను బాగానే ఉంది. ఇప్పుడు పూర్తిగా కోలుకుంది.. తనకి ఎలెక్ట్రికల్ షాక్ మాత్రమే తగిలింది. ఆఁ, నీ బొమ్మ... రోబో కూడా బానే ఉంది. దాన్ని చార్జి చేస్తున్నారు. నీకు ఛాతిలో ఎడమవైపు గాయమైంది.. అయితే అక్కడ నీ

గుండె లేకపోయేసరికి నీకు గుండెపోటు తప్పింది..''

''ధన్యవాదాలు దేవుడా... భైరవా ధన్యవాదాలు..'' అని అంటూ, ''కాని సమూరా తప్పించుకున్నాడు..'' అన్నాను.

''విన్నాము...'' అన్నాడు శాన్. అతనప్పుడే అక్కడికి వచ్చి డాక్టర్ పక్కన నిలుచున్నాడు.

''మేము ఆ స్పేస్ ఎలివేటర్‌ని ఆపలేకపోయాం.. దాంట్లో ఇంధనం లేదు.. అయినా కదిలి పైకి వెళ్ళిపోయింది. లా టెర్ స్పేస్ ప్లాట్‌ఫాంని అప్రమత్తం చేసాను.. వాళ్ళకీ సమూరా కనబడలేదట...''

''అసాధ్యం.. అతను తప్పించుకోడం అసాధ్యం. ఎందుకంటే అతను అదృశ్య రూపంలో ఉన్నా, అతని దగ్గర ఉన్న వెండి కొవ్వొత్తి కారణంగా విద్యుదయస్కాంత తరంగాలు వెలువడతాయి, పైగా సమూరా శరీరం చుట్టూ పరివేషం ఉంటుంది... అతన్ని సులభంగా గుర్తించచ్చు'' అన్నాను.

''అనుభవజ్ఞులైన పన్నెండు మంది పిసియుఎఫ్‌లు, పర్యవేక్షణాధికారులు ఎలివేటర్ లా టెర్‌ని తాకగానే చుట్టుముట్టారు.. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. సుమారు వెయ్యి కిలోమీటర్ల ప్రయాణాన్ని విశ్వశక్తి ప్రయోగంతో రెండు గంటలలో ముగించడం.. అయితే లోపల ఎవరూ లేరు... పైగా ఎటువంటి విద్యుదయస్కాంత తరంగాలూ లేవట...'' చెప్పాడు శాన్.

ప్రకృతి నా చేతిని తన చేతిలోకి తీసుకుంది. అప్పుడే వచ్చినట్లుంది.

''హనీ, ఎలా ఉన్నావు? దాదాపుగా నాలుగు గంటల నుంచి స్పృహ లేకుండా ఉన్నావు. ఇప్పుడు మనం ఏరియా S888లోని బేస్ హాస్పటల్‌కి వెడుతున్నాం.. అక్కడ నీకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తారు.. ఎర్త్ కౌన్సిల్ అధికారులు నీతో సమావేశమవుతారట...'' చెప్పింది.

''యురేకస్ ఎక్కడ?'' అడిగాను.

ప్రకృతి ఆకుపచ్చని చీర కట్టుకుని ఉంది. నుదుటన తిలకం! పొడవైన కేశాలు గాలికి కదలాడుతున్నాయి.

''యురేకస్‌ని చార్జి చేస్తున్నారు. మరింత సమాచారం కోసం దాని హార్డ్ డిస్క్ కూడా పరీక్షిస్తారట..... మనం ఇప్పుడు క్షేమంగా ఉన్నాం హనీ! ఎనిమిది మంది మాంత్రికులని నాశనం చేసాం. ఎనిమిది మంది సైనికులు వాళ్ళ చేతిలో చనిపోయారు....'' అంది.

నేను నిరాశగా కళ్ళు మూసుకున్నాను. నాలో ఆలోచనలు రేగుతున్నాయి...

"అంతా అయోమయంగా ఉంది... దుష్ట శక్తులకి ఎవరో రహస్యంగా సాయం చేస్తున్నారు.. లా టెర్ స్పేస్ ప్లాట్‌ఫాంలో కూడా... త్వరలోనే సమూరా మిగతా చోట్ల దాచిన ఆ అద్భుత వస్తువులన్నింటిని చేజిక్కించుకుంటాడు... విశ్వాన్ని జయించాలన్న తన కోరికని తీర్చుకోడానికి ప్రయత్నిస్తాడు... మిగతా గ్రహాలలో అతనికి ఎందరు తొత్తులున్నారో దేవుడికే తెలియాలి...." అనుకున్నాను.

నా ఆలోచనల్ని గ్రహించినట్లుగా శాన్ నవ్వాడు.

"హనీ. నువ్వు చెయ్యగలిగినదంతా చేసావు. ఎర్త్ కౌన్సిల్‌లో ఇప్పుడు నీ పేరు మారుమోగిపోతోంది.. నువ్వు అనవసరంగా బెంగపడుతున్నావు. ఓ ఒంటరి ముసలాడు, ఓ వెండి కొవ్వొత్తితో... ఏం చేయగలడు? అత్యంత శక్తివంతమైన గెలాక్టిక్ కౌన్సిళ్ళ ముందు, ఇతర గ్రహాల విశ్వశక్తి ముందు అతనే పాటి? నువ్వు నిజంగానే అతిగా బెంగపడుతున్నావు... అతని అనుచరులని, కూతురిని తుదముట్టించావ్.. అంతకంటే నువ్వు చేయగలిగిందేముంది? హాయిగా విశ్రాంతి తీసుకో. ఎర్త్ కౌన్సిల్‌లో నీకు చక్కని భవిష్యత్తు ఉంది. ఆ దేవుడు, మీ భైరవుడు నిన్ను చల్లగా చూడుగాక!..." అంటూ కదలడానికి సిద్ధమయ్యాడు.

"థాంక్యూ సర్..." అని గొణిగాను, చిన్నగా నవ్వుతూ.

ప్రకృతి కేసి చూస్తూ, "థాంక్యూ ప్రకృతీ! నువ్వు నన్ను కాపాడావు... నీ విశ్వశక్తి ప్రయోగం అద్భుతం...." అన్నాను.

కాని హృదయం లోలోపల... సమూరా తప్పించుకున్నాడనే బాధ నన్ను వదలడం లేదు.

తప్పించుకున్నాడు... తప్పించుకున్నాడు..!

❄ ❄ ❄

# 46. తరువాత...

**చా**లా రోజులు గడిచిపోయాయి. S888నగరంలోని ఆసుపత్రిలో నెల రోజులకి పైగా ఉన్నాను. ఛాతిలో గాయం, ఊపిరితిత్తులు పాడయిపోయాయి, ఎన్నో కుట్లు పడ్డాయి, రక్తమార్పిడి జరిగింది. ప్రకృతి దాదాపుగా, ప్రతీ రోజూ సాయంత్రం పూట నన్ను చూడడానికి వస్తూనే ఉంది పళ్ళూ, పూలు తీసుకుని. ఇప్పుడు తను వాళ్ళ నాన్నతో కలసి ఇక్కడే ఉంటోంది... ఎందుకంటే ఆమ్రపాలి గ్రామం వరదల వల్ల బాగా దెబ్బతింది. గ్రామపెద్ద మహా గారు కూడా నన్ను చూడడానికి వచ్చారు, కానీ ఆయనకి నామీద సదభిప్రాయం లేదు. నేలమాళిగలు తెరవడం ద్వారా ఊరు మునిగిపోడానికి నేనే కారణమని ఆయన భావిస్తున్నాడు. నేను చేసింది తప్పా? ఒప్పా? నాకే తెలియదు. నేలమాళిగలకీ, సముద్రానికి ఏదో లంకె ఉన్నట్లుంది. పైగా ప్రకృతిని చంపేస్తామని బెదిరించారు..

ఎర్త్ కౌన్సిల్ అధికారుల విచారణ కూడా ముగిసింది. ‘‘మీకు అసాధారణమైన శక్తులు ఉన్నాయి. గ్రహాంతర దుష్ట శక్తుల నుంచి భూమిని కాపాడడానికి మీ సాయం మాకు కావాలి. ప్రస్తుతానికి మీరు చేసింది చాలు. మిమ్మల్ని కాపాడుతూంటాం. అవసరమైనప్పుడు మిమ్మల్ని సంప్రదిస్తాం. విశ్రాంతి తీసుకోండి! కోలుకున్నాక మీ ఉద్యోగంలో మళ్ళీ చేరండి.. ‘‘ చెప్పాడు ఎర్త్ కౌన్సిల్ వారి పిసియుఫ్ మానిటరింగ్ కౌన్సిల్ అధికారి ఒకరు.

ఐజి నెట్‌లో సందేశాలు వచ్చాయి. కుజగ్రహం మీద ఒలింపస్ పర్వతానికి వెళ్ళిన బృందంలో నాతో పాటు ఉన్న డిమిట్రీ సందేశం పంపింది. ఆమె శనిగ్రహపు ఉపగ్రహమైన టైటన్‌లో ఉంటుంది.

‘‘మీ ఊర్లో ఏదో వింత ప్రమాదం జరిగిందట, స్పేస్ ఎలివేటర్‌లో పెద్ద గొడవయిందట! మా స్థానిక పత్రికలలో వార్తలు వచ్చాయి. అవి చాలా

అసమగ్రంగా ఉన్నాయి.. బహుశా ఎర్త్ కౌన్సిల్ వారు సెన్సార్ చేసుంటారు.. ఇంతకీ అసలేం జరిగింది? చెప్పవా? స్థానిక రిపోర్టర్ల కథనాల ప్రకారం ఆమ్రపాలి గ్రామం వరదల్లో మునిగిపోయిందట, స్పేస్ ఎలివేటర్ తగలబడిపోయిందట.. నిజమేనా? విచారణకి వెళ్ళిన నువ్వు, శాన్, ఇంకా కొందరు నౌకాదళం సైనికులు గాయపడ్డారట... ఇంతకంటే వివరాలు లేవు....'' అని రాసింది.

''ఈ విషయాలన్నీ గోప్యమైనవి డిమిట్రీ! కాని జరిగినది అదే. నేను క్షేమంగానే ఉన్నాను. ఎప్పుడోప్పుడు టైటాన్‌కి వస్తాను. మీ సోదరుడు, నాన్న ఎలా ఉన్నారు?'' అని జవాబిచ్చాను.

గ్యానిమెడ్ నుంచి ఏనిమాయిడ్ ఏ సందేశమూ పంపలేదు. అతనికి ఐజి నెట్ వాడడం రాదు.

ఓ రోజున గెలాక్టిక్ ట్రంక్ లైన్‌లో ఫోన్ చేసాడు ఏనిమాయిడ్.

''మాస్టర్ హనీ! నేను ఏనిమాయిడ్‌ని. ఎలా ఉన్నారు?'' అని అడిగాడు. అతని స్వరం జంతు స్వరంలానే ఉంది.

''కులాసాగా ఉన్నాను'' అని చెప్పాను.

చివరికి ఓ రోజు నేను ఆసుపత్రినుంచి డిశ్చార్జి అయ్యాను. నాకోసం ఎవరొచ్చారో తెలుసా? నాకు అత్యంత ప్రియమైన వారు.. నా విద్యార్థులు. ఇండికా సెంట్రల్ నుంచి ఇంత దూరం వచ్చారు.. ప్రొఫెసర్ శాన్‌తో కలిసి.. రంగురంగుల పూల గుత్తులతో వీళ్ళందరిని నా దగ్గరికి తీసుకొచ్చింది ప్రకృతి.

వాళ్ళందరూ కలసి నన్ను ఎయిర్‌పోర్ట్‌కి తీసుకెళ్ళారు. అక్కడ్నించి ఓ ప్రత్యేక విమానంలో మేమంతా ఇండికా సెంట్రల్‌కి బయల్దేరాం.

''నాకెంతో సంతోషంగా ఉంది... అయినా ఈ ఏర్పాట్లకి బాగా ఖర్చయి వుంటుంది...'' అన్నాను శాన్‌తో.

''విద్యార్థులు వాళ్ళ ప్రేమాభిమానాల్ని వ్యక్తం చేయాలనుకున్నారు. పైగా ఎర్త్ కౌన్సిల్ కూడా నీకు కృతజ్ఞతలు తెలియజేయాలనుకుంది... నేను సరేనన్నాను...'' చెప్పాడు శాన్ నవ్వుతూ.

కొన్ని వారాలు గడిచాయి. నాలుగు రోజులు సెలవలొచ్చిన ఓ వారాంతంలో నేను ఆమ్రపాలికి బయల్దేరాను. ప్రకృతికి ముందే చెప్పాను. యురేకస్‌తో కలసి S888 నగరం వరకూ విమానంలో, అక్కడ్నించి ఆమ్రపాలికి

టాక్సీలో వచ్చాను. గ్రామస్తులంతా కోపంగా ఉన్నారు, వాళ్ళ మనసులని గాయపరచకూడదని నేను హోటల్‌లో దిగాను.

గ్రామపెద్ద మహా గారింటికి వెళ్ళాను. ప్రకృతి టీ, పళ్ళరసాలు, బిస్కట్లు ట్రే లో తెచ్చింది. నవ్వుతూ పలకరించింది.

మహా గారు చింతాశీలుఁడై ఉన్నారు.

"నా జీవితమంతా నేను మంత్రగాళ్ళనూ, పశువుల రోగాలను నయం చేసే, పంటల తెగుళ్ళను పోగొట్టే శక్తులున్న వాళ్ళని అసహ్యించుకుంటూనే ఉన్నాను. మా తాత ముత్తాతలు మీ తాత ముత్తాతలను తరిమేసారు. నేను మీ అమ్మానాన్నల పట్ల అమర్యాదగా ప్రవర్తించాను, గ్రామం బయటకి పంపేసాను..." అంటూ ఉబికి వస్తున్న కన్నీళ్ళు తుడుచుకోడానికి కళ్ళజోడు తీసారు.

"ఇందాకే నేను నా కూతురితో... నా రక్తం పంచుకున్న కూతురితో చాలా సేపు మాట్లాడాను.. తనే నా హృదయస్పందన, తనే నా జీవితం! తనకున్న శక్తుల గురించి ప్రకృతి నాకు చెప్పినప్పుడు విస్తుపోయాను. ఏదో తప్పు చేసిన భావన నాలో తలెత్తింది. నాకళ్ళ ముందే ఓ మామిడిపండుని సృష్టించి ఇచ్చింది..." అంటూ మళ్ళీ కళ్ళు తుడుచుకున్నాడాయన.

"ప్రకృతికి అమ్మ లేదు. చాలా ఏళ్ళ క్రితమే అంతుచిక్కని వ్యాధితో మరణించింది. ఇక ఈ పిల్లని ఎవరు పెళ్ళి చేసుకుంటారు? మంత్రగత్తె... అదే విశ్వశక్తిని ఉపయోగించగల వ్యక్తి అని ముద్ర పడింది కదా? పైగా గ్రహాంతర దుష్టశక్తులు తన మీద ఎప్పుడు దాడి చేస్తాయో కూడా తెలియదాయే..." అంటూ వాపోయాడు.

నేను లేచి నిల్చున్నాను. వంగి ఆయనకి అభివాదం చేసాను.

"బహుశా ఏ మంత్రశక్తులున్న వ్యక్తో చేసుకుంటాడులెండి.. మీ ఊరి వాడే చేసుకోవచ్చు..." అని నాటకీయంగా అంటూ "మీకిష్టమైతే నేను ప్రకృతిని పెళ్ళి చేసుకుంటాను.. తను తప్ప నాకీ ప్రపంచంలో ఎవరూ లేరు...." అన్నాను.

నిశ్శబ్దం...

ప్రకృతి నవ్వింది.  వేసవికాలం సాయంత్రం పూట.. ఆమ్రపాలి గ్రామంలోని మామిడితోటలోని వెన్నెలలా ఉందా నవ్వు.

మహాగారు మౌనంగా ఉండిపోయారు. కాసేపటికి తేరుకుని, ఆయనా నవ్వేసారు.

ఆ రోజు సాయంత్రం, యురేకస్, ప్రకృతిలతో కలసి ఆమ్రపాలికి దక్షిణంగా ఉన్న మా నాన్న ఎస్టేట్‌కి వెళ్ళాను. మేము ముగ్గురం... స్త్రీ, పురుషుడు, యంత్రం... మా నడుముల వరకు పెరిగిన గడ్డి మధ్యగా, బండబారిన నేలపై నడిచాం. అతి విశాలమైన ఆ మఱ్ఱిచెట్టు దగ్గరికి చేరేసరికి నా హృదయాంతరాలలో ఏదో అలజడి. ముందే తెలిసిన భావన! ఆ వర్షంరోజు సాయంత్రం. గ్రహాంతర దుష్ట జీవులు మా అమ్మానాన్నలని చంపేయడం, ధరణి మావయ్య నన్ను వెనక్కి లాగడం.. అన్నీ గుర్తొచ్చాయి. అక్కడే నిలబడి చుట్టూ చూడసాగాను.

ఆ మఱ్ఱిచెట్టు అతి ప్రాచీనమైనది. అది, దాని ఊడలూ కలసి సుమారుగా 50 ఎకరాలలో వ్యాపించి ఉన్నాయి. దాని కొమ్మల మీద నుంచి వేలాది పక్షులు.. గద్దలు, కొంగలు, కాకులు ఉన్నట్లుండి రెక్కలను తాటించుకొంటూ ఎగిరిపోయాయి.. ఆకులు గలగలలాడుతున్నాయి. ఏవో తెలియని పక్షుల జంతువుల అరుపులు భీతిగొల్పుతున్నాయి. అయితే భయపడాల్సిందేమీ లేదు. పక్షులు చెట్ల మీద ఉంటాయి.. పాములు పుట్టల్లో ఉంటాయి. ఆకులు గలగల లాడుతాయి. అయితే దెయ్యాలు కూడా ఉండొచ్చు.. ఈ చెట్టు కొమ్మలలో భూతాలూ ఉండచ్చు... ఆకాశమార్గంనుంచి వచ్చి గ్రహాంతర వాసులు ఈ చెట్టు మీద దాక్కోవచ్చు... తేలికగా లొంగిపోయే అమాయకులకు వల వేసి, చంపేయచ్చు.. ఈ నిగూఢమైన విశ్వంలో ఏదైనా జరగవచ్చు.

మా అమ్మానాన్నలను ప్రలోభపెట్టాలని ప్రయత్నించి విఫలమై వాళ్ళని చంపేసారు దుష్టులు. వాళ్ళే మళ్ళీ నన్ను బెదిరించి, నాపై దాడి చేసి నన్ను చంపాలని చూసారు. నేను కూడా వాళ్ళల్లో చాలామందిని చంపాను... ప్రతీకారం కోసం కాదు. న్యాయం కోసం... భూమి మీద శాంతి కోసం. పగ ఎప్పుడూ చెడ్డదే. ప్రేమ ఎల్లప్పుడూ మంచిది. చెడుకి చెడే జరుగుతుంది.

"ఒక్కడే మిగిలాడు..." అన్నాను.

"వదిలేస్తే, ఆ ఒక్కడే మిగతా వాళ్ళని పోగేసుకుని, దుష్టశక్తుల సైన్యాన్ని తయారు చేసుకుంటాడు..." చెప్పాను.

"అవును మాస్టర్..." అంది యురేకస్ తన లోహ స్వరంతో. దాని తల

మీద ఉన్న యాంటెనాలు కదులుతున్నాయి. పానెల్‌లోని ఎరుపు, ఆకుపచ్చ దీపాలు వెలుగుతున్నాయి.

"అబ్బా, మళ్ళీ మొదలుపెట్టావా? పీడకలలూ, దాడుల గురించి ఇక మర్చిపో హనీ.. చంద్రుడి మీద మన హనీమూన్ ముగిసిన తర్వాతే వాటి గురించి ఆలోచించు...." అంది ప్రకృతి.

ఆకాశం నీలంగా ఉంది... అద్భుతమైన... ఆశావహమైన నీలం... పొలాలు పచ్చగా ఉండి పత్రహరితంతో పైరుకి జీవాన్నిస్తున్నాయి. పడమర వైపు సూర్యుడు ఎరుపురంగు పులుముతున్నాడు. మఱ్ఱిచెట్టు మీద నుంచి వేలాది పక్షులు ఒక్కసారిగా ఎగిరి, ఆకాశంలో విన్యాసాలు చేసాయి.

"అవును.. ఇది నా భూమి. నీలి.. ఆకుపచ్చ! జీవమూ, ప్రేమ నిండినది..." అని నాలో నేను అనుకున్నాను.

పైకి మాత్రం.. "దేవుడూ, ఆ భైరవుడు చల్లగా చూడాలే గాని... అదెంత పని! భూమి మీద వివాహం... చంద్రుడి మీద హనీమూన్... త్వరలో..." అన్నాను.

## సమాప్తం

"Science Fiction(Space Opera) novel"



దాక్టర్ చిత్తర్వు మధు వృత్తిరీత్యా వైద్యులు. గత మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో కన్సల్టెంట్ ఫిజీషియన్‌గా ప్రాక్టీసు చేస్తున్నారు. విద్యార్థి దశ నుంచి రచనా వ్యాసంగంలో ఉన్నారు. అప్పటి నుంచి కథలు నవలలు వివిధ పత్రికలలో ప్రచురించబడుతూనే ఉన్నాయి. మెడికల్ సైన్స్ నేపథ్యంలో సైన్స్ ఫిక్షన్ నవలలు ఐసిసియు, బై బై పోలోనియా, ఎపిడెమిక్ నవలలు ఒక నవలాత్రయంగా రాసారు. స్పేస్ ఓపెరా అనబడే ఒక సైన్స్ ఫిక్షన్ ప్రక్రియలో 'కుజుడి కోసం' అనే నవల రచన మాసపత్రికలో సీరియల్‌గా ప్రచురితం అయింది. దానికి కొనసాగింపు 'నీలీ ఆకుపచ్చ' కినిగే జాల పత్రికలో సీరియల్‌గా వచ్చింది. గ్రహాంతర ప్రయాణాలు, సామ్రాజ్యాల మధ్య యుద్ధాలు, ప్రేమలు భవిష్యత్‌లో జరిగినట్లు కథనం స్పేస్ ఒపేరా లక్షణాలు. ఈ రెండు నవలలు ఆంగ్లంలో మొదటగా ప్రచురించబడ్డాయి. వీటిని రచయిత స్వంతంగా తెలుగులోకి అనువాదం చేసారు .

భవిష్యత్ నాలుగో సహస్రాబ్దిలో సాగే కథనం జరగబోయే శాస్త్రీయ పురోగతిని వివరిస్తూ హనీ ఆమ్రపాలి అనే హీరో భూమికి కుజుడి నుంచి తిరిగి వచ్చినాక జరిగిన కథ ఇది. కుజుడి వర్ణం అరుణం అయితే ప్రాణవాయువు పత్రహరితం నిండిన భూమి వర్ణాలు నీలీ ఆకుపచ్చ. అంతరిక్షం నుంచి చూస్తే కన్పించే రంగులు అవే. ఉత్కంఠ కలిగించే ఈ నవల మిమ్మల్ని మరో భవిష్యత్ ప్రపంచంలోకి తీసుకుని వెళుతుంది.

J.V.Publications